# ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యకలాపాలు

# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

OFFICIAL REPORT

మంగళవారం, మార్చి 15, 2016.

**TUESDAY, 15th MARCH, 2016**

14వ శాసన సభ 7 వ సమావేశం, వాల్యూం-11 నంబరు-6

**14TH L.A. 7 – SESSION, VOL— 11 NO.-6**

శక సంవత్సరం-1937, ఫాల్గుణ -7

**7-**Phalguna**, 1937 – S.E.**

**శాసన సభ సచివాలయం**

**పబ్లిక్ గార్డెన్స్**

**హైదరాబాదు- 500 004.**

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS, NAMPALLY**
**HYDERABAD - 500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | ః | డా. కోడెల శివప్రసాదరావు |
| ఉప సభాపతి | ః | శ్రీ మండలి బుద్ధప్రసాద్ |
| కార్యదర్శి(ఇంచార్జ్) | ః | శ్రీ కె.సత్యనారాయణ రావు |
| ఉప కారదర్శులు | ః | శ్రీ పి.బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎం. విజయరాజు |
| సహాయ కార్యదర్శులు | ః | శ్రీ పి.వి.సుబ్బారెడ్డి<br>శ్రీ కె.రాజకుమార్<br>శ్రీమతి ఆర్.వనితారాణి<br>శ్రీ పి.నరసింహ<br>శ్రీ బి.కమలాకర్<br>శ్రీమతి డా. వై.కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె.వెంకటేశ్వరరావు<br>శ్రీ డి.జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి.ప్రభాకర్‌రావు |
| చీఫ్ రిపోర్టర్ | ః | శ్రీ శ్రీనివాస్ అల్లాడి |

---

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు

## అధికార నివేదిక

**(14వ శాసన సభ)**
**(ఏడవ సమావేశము : ఐదవ రోజు)**

**మంగళవారం, మార్చి 15, 2016**
**సభ ఉ.గం.9.00 ని. లకు ప్రారంభమైనది**
**(గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)**

--------------

## విషయ సూచిక


| | | | పుట సంఖ్య |
|---|---|---|---|
| 1. | సభ సమావేశం (ఉ.గం.9.00 ని.) | ..... | 5 |
| 2. | వాగ్రూప ప్రశ్నలు – సమాధానాలు | ..... | 5–53 |
| 3. | శూన్య గంట (జీరో అవర్) | ..... | 53–60 |
| 4. | సభ సమక్షంలో ఉంచబడిన పత్రాలు | ..... | 60–61 |
| 5. | అనౌన్స్‌మెంట్ (ప్యానల్ ఛైర్మన్ల పేర్లు) | ..... | 61 |
| 6. | గౌరవ సభాపతిపై అవిశ్వాస తీర్మాన ప్రతిపాదన మరియు చర్చ | ...... | 61–126 |
| 7. | సభ వాయిదా (సా. గం.4.39 ని.) | ...... | 126 |

**ఆంధ్రప్రదేశ్ శాసనసభ**

**మంగళవారం, 15వ తేది మార్చి 2016.**

* * *

**(సభ ఉదయం 9.00 గంటలకు సమావేశమైనది.**
**గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)**

**- - -**

**MR SPEAKER: Now Question Hour, Question No.2031, Minister for Water Resources.**

**ప్రశ్న నెం.2031 (41)** **హెచ్ఎల్సి కాలువ ఆధునికీకరణ**

**శ్రీ వి. ప్రభాకర చౌదరి – ఎమ్మెల్యే.**

**గౌరవనీయులైన జల వనరుల శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?**

అ) అనంతపురం నగరం చుట్టుప్రక్కల ప్రవహిస్తున్నట్టి హెచ్ఎల్సి కాలువ శిథిలావస్థలో ఉన్న విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తేవడమయిందా?

ఆ) అయితే, సదరు కాలువ ఆధునికీకరణలో భాగంగా చేపట్టిన పనుల వివరాలు తెలపండి?

**గౌరవనీయులైన జల వనరుల శాఖ మంత్రి (శ్రీ దేవినేని ఉమా మహేశ్వరరావు):**

అ) అవునండీ.

ఆ) రూ.226.56 కోట్లకు సంబంధించిన సవరించిన అంచనాలను ప్రభుత్వం ప్రాసెస్ చేస్తున్నది.

మిస్టర్ స్పీకర్: ప్రభాకర చౌదరిగారు.

శ్రీ వి. ప్రభాకర చౌదరి (అనంతపురం –అర్బన్): అధ్యక్షా, ధన్యవాదాలు. మాది జిల్లా ముఖ్య కేంద్రం. రోజురోజుకీ జనాభా పెరుగుతున్న సందర్భంలో మాకు అనంతపురం నడిబొడ్డున MPR South Canal అని పులివెందుల, మైలవరం,

తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ పోతూ ఉంది. పురాతన కట్టడంతో అంటే stone masonry తో కట్టిన ఆ కాలువ 7 కిలోమీటర్ల మేర మా నగరంలో పోతుంది, అది శిథిలావస్థకు చేరుకుంది. చాలామంది అక్కడికి బట్టలు ఉతుక్కోడానికో, లేదా ఇతరత్రా ప్రయోజనాలకోసమో అక్కడికి పోయినప్పుడు, ఆ పిల్లలు కూడా కెనాల్‌లో పడి చనిపోయే పరిస్థితి వస్తుంది. ప్రతీ సంవత్సరం కనీసం నలుగురు, ఐదుగురు చనిపోయే పరిస్థితి వచ్చింది. దీని మూలాన గతంలో 2007-08 వ సంవత్సరంలో ECL Company వాళ్లు రూ.66 కోట్లతో లైనింగ్, ప్యాకింగ్ వంటివి అన్నీ చేయడానికి ఆ పనులు తీసుకున్నారు. వాళ్లు మరి ఎందుకు డిలే చేశారో తెలియదు గానీ, దానిమూలాన ప్రభుత్వం దానిని మళ్లీ టెర్మినేట్ చేసింది. రూ.49 కోట్లతో 43,44 రెండు ప్యాకేజీలను నిర్మాణం మరియు మరమ్మతుల కోసం పిలవడం జరిగింది. ఇది కొంత ఆధునిక పద్ధతుల్లో చేయాల్సిన అవసరముంది. అంటే ఇంకా ఏదైనా ఆధునిక సాంకేతికపరమైన పద్ధతుల్లో ఇతరత్రా నగరాలలో మాదిరిగా ముఖ్యంగా కర్నూలులో స్విమ్మింగ్‌పూల్ లాగ, బ్రాంచ్ కెనాల్స్, లైనింగ్ పనులు మొదలైనవి మా నగరంలో కూడా చేపట్టి, ప్రాణ నష్టాన్ని నివారించవలసిందిగా మంత్రిగారిని మీద్వారా కోరుతున్నాను. సింగిల్ బ్రిడ్జి, డబుల్ బ్రిడ్జి, సిసి రోడ్లు ఇవన్నీ కూడా ఉన్నాయి. ఎవరైనా ఆ కెనాల్‌ని దాటడానికి కూడా అది ఉపయోగపడుతుంది. ఈవిధమైన పనులు సత్వరం చేపట్టవలసిందిగా మీద్వారా గౌరవ మంత్రిగారిని నేను అభ్యర్థిస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ః జయరామ్‌గారు.

శ్రీ గుమ్మనూరు జయరామ్ (ఆలూరు)ః అధ్యక్షా, నమస్కారం. ఆలూరు నియోజకవర్గం, చిప్పగిరి మండలం, జిబిసి నుంచి ఎబిసి కెనాల్‌కు తుంగభద్ర నీళ్లు ప్రవహిస్తాయి. దాదాపుగా మా నియోజకవర్గంలో మూడు మండలాలున్నాయి. మూడు మండలాలకు గాను 15,000 ఎకరాల ఆయుకట్టు ఉంది. దాదాపుగా రెండు సంవత్సరాలు అయినా కూడా, తుంగభద్ర నీళ్లు మాకు రావల్సింది 2.35 టిఎంసీలు. మొన్న ఐఏపి సమావేశంలో 0.6 టిఎంసీల నీళ్లు ఇస్తామని చెప్పారు. కానీ 0.6 టిఎంసీ నీళ్లు కాదు గదా ఆ నీళ్లు కూడా మా ఎబిసి కెనాల్‌కు రాలేదు.

అదేవిధంగా మా నియోజకవర్గం మీదుగా హంద్రీనీవా ప్రవహిస్తోంది. రెండు సంవత్సరాలనుంచీ ఆ నీళ్లనే వాడుకొంటున్నాము. కాబట్టి 15,000 ఎకరాల ఆయుకట్టుకు హెచ్‌ఎల్‌సి నీళ్లు మాకు ఏమాత్రం రావడం లేదు. ఉరవకొండ నుంచి అక్కడ జల చౌర్యం జరుగుతోంది కాబట్టి మాకు ఏమాత్రం నీళ్లు రావు. కాబట్టి, హంద్రీనీవా నుంచి మాకు 0.6

టిఎంసీ నీళ్ల తూము ఏర్పాటు చేస్తే, కచ్చితంగా 15,000 ఎకరాల ఆయుకట్టు వస్తుందని మీద్వారా గౌరవ మంత్రిగారికి తెలియజేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ః అప్పలనాయుడుగారు.

డా.కె.అప్పలనాయుడుః అధ్యక్షా, ధన్యవాదాలు. మా గజపతినగరం నియోజకవర్గంలో మెంటాడ, నెరువాడ చానల్ సిస్టం ఉంది. ఈ చానల్ 1998వ సంవత్సరంలో ...

MR SPEAKER: The question is Tunngabhadra HLC. అది మీకు వర్తించదు, కాబట్టి బ్రీఫ్‌గా చెప్పండి అప్పలనాయుడుగారు.

డా.కె.అప్పలనాయుడు (గజపతినగరం)ః మెంటాడ, నెరువాడ చానల్ సిస్టం కట్టి సుమారు 18 సంవత్సరాలు అవ్వడం వల్ల, ఆ చానల్ తాలూకు బ్యాంక్ అంతా కూడా ఎరోడ్ అయిపోయి, ఆ చానల్‌లో ఆయకట్టు 2,120 ఎకరాలుంటే, ఈరోజు 1,500 ఎకరాలకి కూడా నీళ్లు వెళ్లే స్థితిలో లేదు కాబట్టి, మీద్వారా మంత్రిగారిని అభ్యర్థిస్తున్నాం. ఎందుకని అంటే ఈరోజు మన రాష్ట్రంలో, గత ప్రభుత్వంలో, పెండింగ్‌లో ఉండిపోయిన ఎన్నో ప్రాజెక్టులను మన ఇరిగేషన్ మంత్రిగారు ప్రభుత్వం ఏర్పడిన దగ్గర్నుంచీ అహర్నిశలూ పనిచేసి ఎన్నో ప్రాజెక్టులను పూర్తిచేసి, ఎన్నో ప్రాజెక్టులను పూర్తిచేయడానికి చర్యలు తీసుకొంటున్నారు. కాబట్టి, మా MN channel కూడా modernization కు అవకాశం వస్తే tail end Villages కు కూడా వాటర్ వెళ్లినట్లయితే అక్కడ రైతాంగం వాడుకోవడానికి అవకాశం ఉంటుందని మీద్వారా ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాను. ధన్యవాదాలు.

మిస్టర్ స్పీకర్ః ఐజయ్యగారు.

శ్రీ ఎక్కలదేవి ఐజయ్య (నంది కొట్కూరు)ః అధ్యక్షా, మాది నందికొట్కూరు నియోజకవర్గం. శ్రీశైలం జలాశయం నుంచి ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ప్రవేశపెట్టారు. సుమారుగా 90 శాతం పూర్తయింది. మాకు ఇంతకుముందు భారీ నీటిపారుదల శాఖా మంత్రిగారు వచ్చినప్పుడు ఏప్రిల్ నెలలో గానీ, మే నెలలో గానీ నీరు కచ్చితంగా ఇస్తామని చెప్పారు. ఎత్తిపోతల ప్రారంభోత్సవం చేస్తామన్నారు. కానీ చివరి దశలో ఫండ్స్ లేక ఇప్పుడు ఆగిపోయింది. ఆ ఎత్తిపోతల పథకం పూర్తయినట్లయితే సుమారుగా కెసి కెనాల్‌కు నీరు అందుతాది. మా నందికొట్కూరు నియోజకవర్గ ప్రజలు కేవలం అగ్రికల్చర్ మీదనే ఆధారపడి ఉన్నారు. దానిద్వారా సుమారు లక్ష ఎకరాల వరకూ సాగు చేసుకోవచ్చు. కాబట్టి దయచేసి.. గుత్తేదారులను అడుగుతూ ఉంటే మాకు ఫండ్స్ రాలేదని అంటున్నారు. మంత్రిగారు శ్రీ దేవినేని ఉమా మహేశ్వరరావుగారు ప్రామిస్ చేశారు. దానికొరకు ఎంత నిధులు

అవసరమౌతాయో చూసి.. సార్, మీరు ఉండడం మాకు చాలా అదృష్టం. కొంచెం దయచేసి అది కంప్లీట్ చేయాలని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ః యామిని బాల గారు.

డా. బి.యామిని బాల (శింగనమల)ః అధ్యక్షా, ధన్యవాదాలు. హెచ్ఎల్సి కాలువ ఆధునికీకరణ చాలా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. దాదాపు 6 మండలాలు ఉన్న నా నియోజకవర్గంలో 5 మండలాల గుండా 80 కిలోమీటర్ల మేరకు ఈ హెచ్ఎల్సి కాలువ ఉంది. ఈ కాలువ నిర్మించిన సమయం నుంచి ఇప్పటివరకూ కూడా ఆధునికీకరణ చర్యలు అనేవి చేపట్టలేదు. గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు భూమి పని మాత్రమే చేసి, మట్టి పనితోనే వాళ్లు డబ్బులు తీసుకుని వెళ్లిపోవడం జరిగింది. గౌరవనీయులు, పెద్దలు, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారి సుదీర్ఘ పాదయాత్రలో రైతులు ఎదుర్కొనే సమస్యలను దృష్టిలో ఉంచుకొని, ముఖ్యంగా అనంతపురం జిల్లా, నిత్య కరవు జిల్లాలో రైతులు కోరుకునే సాగునీరు, తాగునీరు, నాణ్యమైన విద్యుత్ను ఇస్తామని చెప్పడమే కాకుండా, తగు చర్యలు తీసుకుని ఇప్పుడు కొత్త ప్రభుత్వంలో మనం ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగింది.

**9.10AM (2)**

అందులో భాగంగానే హెచ్.ఎల్.సి. కాలువ ఆధునీకరణ పనులు కూడా చేయడం ద్వారా, బ్రిడ్జెస్ రిపేర్ చేయడం ద్వారా ఎక్కువ సంఖ్యలో, ఎక్కువ మోతాదులో నీటిని అన్ని చెరువులకు అందివ్వడమే కాకుండా, త్వరితగతిన ఈ పనులు చేపట్టాలనీ, రైతులను ఆదుకోవాలనీ, ప్రభుత్వం చేస్తున్నటువంటి ఈ కార్యక్రమాలన్నిటికీ కూడా త్వరితగతిన ముగింపు పలకాలని కోరుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ ః శ్రీనివాసులు గారూ.

శ్రీ కాలవ శ్రీనివాసులు (రాయదుర్గం)ః థ్యాంక్యూ అధ్యక్షా, అనంతపురం జిల్లాకి జీవనాడి లాంటిది తుంగభద్ర ఎగువ కాలువ. దీన్ని గత ప్రభుత్వాలు తీవ్రంగా నిర్లక్ష్యం చేసినప్పటికీ, చంద్రబాబునాయుడుగారు ముఖ్యమంత్రి అయిన తరువాత, కర్నాటక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, అక్కడి ముఖ్యమంత్రి శ్రీ సిద్ధరామయ్య గారితో మాట్లాడి తుంగభద్ర డ్యామ్ నుండి ఆధునీకరణ పనులు చేపట్టడానికి కర్నాటక ప్రభుత్వాన్ని ఒప్పించినందుకు, అనంతపురం జిల్లా రైతుల తరపున ముఖ్యమంత్రి గారికి, గౌరవ మంత్రి శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు గారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. 2005లో హెచ్.ఎల్.సీ.ని

ఆధునీకరించాలని నేనూ, శ్రీ పయ్యావుల కేశవ్‌గారు పాదయాత్ర చేస్తే, తరువాత, అప్పటి ముఖ్యమంత్రి డా. వై.ఎస్.రాజశేఖరరెడ్డి గారు రూ.463 కోట్ల రూపాయలు దానికి కేటాయించినా, 2006-07 ఆర్థిక సంవత్సరం నుంచి పనులు చేపట్టినప్పటికీ ఈరోజుకీ 50 శాతం పనులు కూడా పూర్తిగాని పరిస్థితి ఉంది. నా నియోజకవర్గమైన రాయదుర్గంలో బొమ్మన హాల్, కనేకల్ మండలాల్లో సుమారు 31 వేల ఎకరాల ఆయకట్టు భూమి హెచ్.ఎల్.సి. కింద ఉంది. మొట్టమొదట ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హెచ్.ఎల్.సి. ప్రవహించేది నా నియోజకవర్గం నుంచే. Modernisation పనులు ఆలస్యమవుతున్నాయి. ప్రధానంగా పంట కాలువల నిర్మాణం ఇప్పటికి కూడా ప్రారంభం కాలేదు. దయచేసి మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను, దానిమీద ప్రత్యేక శ్రద్ధ కనబరచి పంట కాలువల పనులను త్వరితగతిన వేగవంతం చేయాలి. అలాగే, కర్ణాటక నీరావరె నిగమం దగ్గర డి.పి.ఆర్. పరిశీలనలో ఉంది. తుంగభద్ర రిజర్వాయర్ నుంచి modernisation పనులు ప్రారంభమయ్యేందుకు ఈ ఏడాది నుంచైనా చర్యలు తీసుకోవాలని మీ ద్వారా అభ్యర్థిస్తున్నాం. కష్టకాలంలో ఆదుకోవలసిన అవసరముంది. ఈ సంవత్సరమైతే నీళ్ళు లేవు. చాలా ఇబ్బంది. 40 సంవత్సరాల తుంగభద్ర చరిత్రలో అతి తక్కువగా, కేవలం 14, 15 టీ.ఎం.సీ.ల నీళ్ళు వచ్చిన ఈ సందర్భంలో కూడా మంత్రి గారు, ముఖ్యమంత్రిగారు ప్రత్యేక చొరవ తీసుకొని, మా నియోజకవర్గంలో పంటలకు నీళ్ళు ఇచ్చినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. త్వరితగతిన ఈ ఆధునీకరణ కార్యక్రమాలు కూడా పూర్తి చేయమని మంత్రి గారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ : మినిస్టర్ గారూ

శ్రీ దేవినేని ఉమా మహేశ్వర రావు (మైలవరం): అధ్యక్షా, గౌరవ సభ్యులు ప్రభాకర చౌదరి గారు చెప్పిన కెనాల్‌కు సంబంధించిన ప్యాకేజీ మొత్తం ఫైనల్ చేసి టెండరు ప్రాసెస్ చేస్తాం. ఎట్టి పరిస్థితుల్లో ఏప్రిల్‌లో పనులు ప్రారంభం చేయాలి. ఈ కాలువ పులివెందుల, మైలవరం, అనంతపురం గుండా చక్కగా ముందుకు వెళ్ళే అవకాశముంది. ఎట్టి పరిస్థితుల్లో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో సాధ్యమైనంత వరకు పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వం ముందుకు వెళుతోంది.

అదేవిధంగా, కాలవ శ్రీనివాసులు గారు చెప్పిన విషయం మీద కర్నాటక ముఖ్యమంత్రి శ్రీ సిద్ధరామయ్యగారిని ఒప్పించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు, అదేవిధంగా శాసనసభ్యులు, ఎం.పీ.లు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కూడా మాతో బెంగళూరు వచ్చారు. కర్నాటక ముఖ్యమంత్రి గారిని ఒప్పించి, దానికి సంబంధించిన మెయిన్ కెనాల్ డి.పి.ఆర్. తయారు చేయడంలో తుంగభద్ర బోర్డు ముందుకు వెళ్తోంది. మొన్న జరిగిన బోర్డు సమావేశంలో కూడా మెయిన్ కెనాల్ ఆధునీకరించుకున్నట్లైతే, హెచ్.ఎల్.సి. ద్వారా నీరు వస్తుందనే ఉద్దేశంతో తుంగభద్ర బోర్డు అధికారులు మూడు రాష్ట్రాల అధికారులతో మాట్లాడి,

దానికి సంబంధించిన డి.పి.ఆర్. లో మోడల్ స్టడీ చేయాలని కర్నాటక ప్రభుత్వం అడిగింది. దానిమీద సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకొని, కర్నాటకలో గానీ, మన ప్రాంతాల్లోని మూడు జిల్లాల్లో కాని  హెచ్.ఎల్.సి. కింద మరింత ఎక్కువ నీరు తెచ్చుకునే అవకాశముంది. ఈ సంవత్సరం కూడా తుంగభద్రలో అతితక్కువ నీరు వచ్చినప్పటికీ, ఆ ప్రాంత అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఎక్కడిక్కడ పంటల్ని కాపాడుకోవడం కోసమూ, మంచినీళ్ళకీ తెచ్చుకోవడం జరిగింది.

అదేవిధంగా 'ఆలూరు'లో ఉన్న సమస్యల్ని గౌరవ సభ్యులు చెప్పారు. కచ్చితంగా ఈ సంవత్సరం కూడా పట్టిసీమ ద్వారా 8.8 టి.ఎం.సీ.లు కృష్ణ డెల్టా రైతాంగానికి ఇచ్చి, ఆ మేరకు ఆ నీళ్ళను శ్రీశైలం దగ్గరి నుండి, కర్నూలు, అనంతపురం... ఎక్కడైతే పంటలు ఎండిపోతున్నాయో, ఎక్కడైతే మంచినీళ్ళు కావాలో అక్కడ ఆ 8 టి.ఎం.సీ.లు ఇచ్చి, అక్కడ పంటలను కాపాడడం, అదేవిధంగా చెరువులకు నీళ్ళు తీసుకెళ్ళడం జరిగింది. ఈ సంవత్సరం హెచ్.ఎన్.ఎస్.ఎస్. కింద చెరువులన్నీ కూడా లింక్ చేయమని ముఖ్యమంత్రిగారు ఆదేశాలిచ్చారు. అందుకనే కర్నూలు, అనంతపురం ప్రాంతాల్లో  ఎక్కడ ఏ విధంగా చెరువులను లింక్అప్ చేయాలన్నది పరిశీలిస్తున్నాం.   'నీరు-చెట్టు' కార్యక్రమంలో గానీ, లేకపోతే ఉన్న నిధుల్ని ఎక్కడికక్కడ సమన్వయం చేసుకుని, ఈ సంవత్సరం ఎర్లీ మాన్సూన్స్ రావాలని అందరం కోరుకుంటున్నాం. ఎంత త్వరితగతిన నీళ్ళు వస్తే, అంత త్వరితగతంగా చెరువులన్నీ కూడా నీళ్ళు నింపే కార్యక్రమం తీసుకుంటాం. అలాగే శ్రీనివాసులు గారు చెప్పినట్లుగా డి.పి.ఆర్. ఫాలో అప్ చేసి, పనులను స్పీడ్అప్ చేసి ఆ పనులు చేస్తాం.

అలాగే డా. యామిని బాల గారు మాట్లాడుతూ, వాళ్ల నియోజకవర్గంలో 'నీరు-చెట్టు' కార్యక్రమం చేసుకోవడం వల్ల ఎప్పుడూ నీరు రాని చెరువులు కూడా మొన్న కురిసిన వర్షాల వల్ల బ్రహ్మాండంగా ఈ చెరువులన్నీ కూడా, కడప, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో భూగర్భ జలాలు పెరిగాయన్నారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని, ఇంకా జాగ్రత్తలు తీసుకుని ఈ కార్యక్రమానికి సహకరించాలని  ప్రజా ప్రతినిధులని అందరినీ కూడా కోరుతున్నాను. నీటిసంఘ అధ్యక్షులు కానీయండి, జన్మభూమి గ్రామ కమిటీ సభ్యులు కానీయండి, ప్రతీ ఒక్కళ్ళూ కూడా భాగస్వాములై పెద్ద ఎత్తున ఎంత వీలైతే అంతగా పనులను చేసుకోవాల్సిందిగా మీద్వారా అందరినీ కోరుతున్నాను.

అధ్యక్షా, ముచ్చుమర్రి కూడా చాలా అవసరమైన ప్రాజెక్టు. కె.సి.కెనాల్ సప్లిమెంటేషన్‌కు గానీ, హెచ్.ఎన్.ఎస్.ఎస్. సప్లిమెంటేషన్‌కి ఈ ప్రాజెక్టు బ్రహ్మాండంగా ఉపయోగపడుతుంది. స్వయంగా నేను కూడా రెండు, మూడు సార్లు ఈ ప్రాజెక్టుకు వెళ్ళి, దానికి సంబంధించిన డిజైన్‌లను కూడా ఫైనల్ చేయడం జరిగింది. నిధుల కొరత లేదు. ప్రభుత్వం కూడా పూర్తి స్థాయిలో నిధులివ్వడానికి సిద్ధంగా ఉంది. ఎట్టి పరిస్థితుల్లో కృష్ణా నదికి వరద వచ్చేలోపల గ్రౌండ్

లెవల్ వర్క్స్ చేసుకొని పైకి రావాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఖచ్చితంగా ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని కూడా పూర్తి చేస్తాం.

**MR. SPEAKER : Q.No.2231 (42) is postponed at the request of the member. Q.No.2050. Minister for Rural Development.**

ప్రశ్న నెం. 2050

సర్వశ్రీ / శ్రీమతి
గోరంట్ల బుచ్చయ్య చౌదరి,
ఎం. సుగుణమ్మ,
బొండా ఉమామహేశ్వర రావు,
రామకృష్ణ బాబు వెలగపూడి,
వాసుపల్లి గణేష్ కుమార్,
ఎం.ఎల్.ఏ.లు,

గౌరవనీయులైన గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణ & పారిశుద్ధ్య శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా ;

ఎ) "అందరికీ గృహాల పథకం" క్రింద కేంద్ర ప్రభుత్వం పట్టణ పేదలకు కేటాయించిన గృహాల వివరాలు, రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలు చేయనున్న పట్టణాలు, నగరాల వివరాలు ఏమిటి ;

బి) స్వంత గృహాలను నిర్మించేందుకు పట్టణ ప్రాంతాలలోని లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన సహాయమెంత ?

**గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు (శ్రీమతి కిమిడి మృణాళిని) :**

అధ్యక్షా, మొదటి ప్రశ్నకు సమాధానం, 1,93,147 ఇళ్ళను 13 జిల్లాల్లో Housing for All అనే పథకం ద్వారా శాంక్షన్ చేయడం జరిగింది. ఇందులో 59 Urban Local Bodies కి శాంక్షన్ ఇవ్వడం జరిగింది. 78 లేఅవుట్స్‌లో చేయడం జరుగుతుంది.

రెండవ ప్రశ్నకు సమాధానం ఒక లక్ష యాభై వేల రూపాయలు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుండి గ్రాంట్ క్రింద డబ్బు రావడం జరిగింది. దీనికి గాను 2897 కోట్ల రూపాయలను గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఇవ్వడం జరుగుతుంది. ఈ విధంగా 1,93,147 ఇళ్ళకు స్టేట్ గవర్నమెంట్ అసిస్టెన్స్ కూడా తీసుకోవడం జరుగుతుంది.

## 2050 శాసనసభ ప్రశ్నలోని (ఏ) ఖండానికి అనుబంధం

## అందరికి గృహాలు I వ దశ క్రింద ప్రతిపాదించిన ప్రాజెక్టుల సంక్షిప్తి వివరాలు

| వరుస సంఖ్య | జిల్లా పేరు | పట్టణ స్థానిక సంస్థల పేరు | ఎహెచ్ పి (7బి) క్రింద ఉన్న ప్రాజెక్టులు | | | లబ్ధిదారు ఆధారిత నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు (7సి) | | | మొత్తం ప్రాజెక్టులు | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | ప్రాజెక్టుల సంఖ్య | గృహాలు | కేంద్ర ప్రభుత్వ సహాయం రూ. లక్షలలో | ప్రాజెక్టుల సంఖ్య | గృహాలు | కేంద్ర ప్రభుత్వ సహాయం రూ. లక్షలలో | ప్రాజెక్టుల సంఖ్య | గృహాలు | కేంద్ర ప్రభుత్వ సహాయం రూ. లక్షలలో |
| 1 | శ్రీకాకుళం | శ్రీకాకుళం | 2 | 1472 | 2208.000 | | | | 2 | 1472 | ,2208.000 |
| | | పలాస | 1 | 192 | 288.000 | | | | 1 | 192 | 288.000 |
| | | ఆముదాలవలస | 1 | 512 | 768.000 | | | | 1 | 512 | 768.000 |
| | | **మొత్తం** | **4** | **2176** | **3264.000** | | | | **4** | **2176** | **3264.000** |
| 2 | విజయనగరం | విజయనగరం | 2 | 4712 | 7068.000 | 1 | 4510 | 6765.000 | 3 | 9222 | 13833.000 |
| | | సాలూరు | | | | 1 | 588 | 882.000 | 1 | 588 | 882.000 |
| | | బొబ్బిలి | | | | 1 | 382 | 573.000 | 1 | 382 | 573.000 |
| | | పార్వతీపురం | | | | 1 | 836 | 1254.000 | 1 | 836 | 1254.000 |
| | | నెల్లిమర్ల | | | | 1 | 325 | 487.500 | 1 | 325 | 487.500 |
| | | **మొత్తం** | **2** | **4712** | **7068.000** | **5** | **6641** | **9961.500** | **7** | **11353** | **17029.500** |
| **3.** | విశాఖపట్టణం | జివిఎంసి | **26** | **9118** | **13677.000** | **1** | **10912** | **16368.000** | **27** | **20030** | **30045.000** |
| 4. | తూర్పు గోదావరి | కాకినాడ | 5 | 4608 | 6912.000 | | | | 5 | 4608 | 6912.000 |
| | | రాజమండ్రి | 3 | 4200 | 6300.000 | | | | 3 | 4200 | 6300.000 |
| | | పెద్దాపురం | 2 | 1724 | 2586.000 | | | | 2 | 1724 | 2586.000 |
| | | సామర్లకోట | 2 | 1048 | 1572.000 | | | | 2 | 1048 | 1572.000 |
| | | రామచంద్రాపురం | 1 | 1088 | 1632.000 | | | | 1 | 1088 | 1632.000 |
| | | మండపేట | 1 | 4064 | 6096.000 | | | | 1 | 4064 | 6096.000 |
| | | తుని | | | | 2 | 5098 | 7647.000 | 2 | 5098 | 7647.000 |
| | | పిఠాపురం | 2 | 874 | 1311.000 | | | | 2 | 874 | 1311.000 |
| | | అమలాపురం | 1 | 1636 | 2454.000 | | | | 1 | 1636 | 2454.000 |
| | | **మొత్తం** | **17** | **19242** | **28863.000** | **2** | **5098** | **7647.000** | **19** | **24340** | **36510.000** |
| 5. | పశ్చిమ గోదావరి | ఏలూరు | 1 | 360 | 540.000 | 1 | 1190 | 1785.000 | 2 | 1550 | 2325.000 |
| | | భీమవరం | 1 | 9500 | 14250.000 | | | | 1 | 9500 | 14250.000 |
| | | తాడేపల్లిగూడెం | 1 | 5376 | 8064.000 | 1 | 410 | 615.000 | 2 | 5786 | 8679.000 |
| | | పాలకొల్లు | 1 | 7159 | 10738.500 | 1 | 310 | 465.000 | 2 | 7469 | 11203.500 |
| | | **మొత్తం** | **4** | **22395** | **33592.500** | **3** | **1910** | **2865.000** | **7** | **24305** | **36457.500** |

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 6 | కృష్ణా | విజయవాడ | | | | 1 | 10000 | 15000.000 | 1 | 10000 | 15000.000 |
| | | మచిలీపట్నం | | | | 1 | 1850 | 2775.000 | 1 | 1850 | 2775.000 |
| | | గుడివాడ | 1 | 3312 | 4968.000 | | | | 1 | 3312 | 4968.000 |
| | | **మొత్తం** | **1** | **3312** | **4968.000** | **2** | **11850** | **17775.000** | **3** | **15162** | **22743.000** |
| 7 | గుంటూరు | గుంటూరు | | | | 1 | 11808 | 17712.000 | 1 | 11808 | 17712.000 |
| | | నరసారావుపేట | 1 | 1504 | 2256.000 | | | | 1 | 1504 | 2256.000 |
| | | తెనాలి | 1 | 1152 | 1728.000 | | | | 1 | 1152 | 1728.000 |
| | | చిలకలూరిపేట | 1 | 4512 | 6768.000 | | | | 1 | 4512 | 6768.000 |
| | | మంగళగిరి | 1 | 2592 | 3888.000 | | | | 1 | 2592 | 3888.000 |
| | | పొన్నూరు | 1 | 2368 | 3552.000 | | | | 1 | 2368 | 3552.000 |
| | | సత్తెనపల్లి | 1 | 640 | 960.000 | | | | 1 | 640 | 960.000 |
| | | **మొత్తం** | **6** | **12768** | **19152.000** | **1** | **11808** | **17712.000** | **7** | **24576** | **36864.000** |
| 8 | ప్రకాశం | ఒంగోలు | 1 | 1500 | 2250.000 | 1 | 500 | 750.000 | 2 | 2000 | 3000.000 |
| | | చీరాల | | | | 1 | 612 | 918.000 | 1 | 612 | 918.000 |
| | | కందుకూరు | 1 | 1437 | 2155.500 | | | | 1 | 1437 | 2155.500 |
| | | మార్కాపూర్ | 1 | 1020 | 1530.000 | | | | 1 | 1020 | 1530.000 |
| | | **మొత్తం** | **3** | **3957** | **5935.500** | **2** | **1112** | **1668.000** | **5** | **5069** | **7603.500** |
| 9 | నెల్లూరు | నెల్లూరు | 1 | 4800 | 7200.000 | 1 | 5240 | 7860.000 | 2 | 10040 | 15060.000 |
| | | కావలి | 4 | 3510 | 5265.000 | 1 | 1000 | 1500.000 | 5 | 4510 | 6765.000 |
| | | గుడూరు | 1 | 5103 | 7654.500 | | | | 1 | 5103 | 7654.500 |
| | | ఆత్మకూరు | 1 | 1028 | 1542.000 | | | | 1 | 1028 | 1542.000 |
| | | **మొత్తం** | **7** | **14441** | **21661.500** | **2** | **6240** | **9360.000** | **9** | **20681** | **31021.500** |
| 10 | చిత్తూరు | చిత్తూరు | | | | 1 | 1453 | 2179.500 | 1 | 1453 | 2179.500 |
| | | తిరుపతి | | | | 1 | 2250 | 3375.000 | 1 | 2250 | 3375.000 |
| | | శ్రీకాళహస్తి | 1 | 2916 | 4374.000 | 1 | 517 | 775.500 | 2 | 3433 | 5149.500 |
| | | మదనపల్లి | | | | 1 | 1020 | 1530.000 | 1 | 1020 | 1530.000 |
| | | **మొత్తం** | **1** | **2916** | **4374.000** | **4** | **5240** | **7860.000** | **5** | **8156** | **12234.000** |
| 11 | కడప | కడప | 1 | 2092 | 3138.000 | 1 | 2234 | 3351.000 | 2 | 4326 | 6489.000 |
| | | ప్రొద్దుటూరు | 2 | 2000 | 3000.000 | | | | 2 | 2000 | 3000.000 |
| | | రాయచోటి | | | | 1 | 639 | 958.500 | 1 | 639 | 958.500 |
| | | మైదుకూరు | | | | 1 | 500 | 750.000 | 1 | 500 | 750.000 |
| | | **మొత్తం** | **3** | **4092** | **6138.000** | **3** | **3373** | **5059.500** | **6** | **7465** | **11197.500** |

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 12 | అనంతపురము | అనంతపురము | | | | 1 | 2000 | 3000.000 | 1 | 2000 | 3000.000 |
| | | గుంతకల్లు | | | | 1 | 2000 | 3000.000 | 1 | 2000 | 3000.000 |
| | | తాడిపత్రి | 1 | 3009 | 4513.500 | | | | 1 | 3009 | 4513.500 |
| | | ధర్మవరం | | | | 1 | 1400 | 2100.000 | 1 | 1400 | 2100.000 |
| | | హిందూపురం | | | | 1 | 500 | 750.000 | 1 | 500 | 750.000 |
| | | కదిరి | | | | 1 | 1000 | 1500.000 | 1 | 1000 | 1500.000 |
| | | రాయదుర్గం | | | | 1 | 1307 | 1960.500 | 1 | 1307 | 1960.500 |
| | | మొత్తం | 1 | 3009 | 4513.500 | 6 | 8207 | 12310.500 | 7 | 11216 | 16824.000 |
| 13 | కర్నూలు | కర్నూలు | 1 | 10000 | 15000.000 | | | | 1 | 10000 | 15000.000 |
| | | నంద్యాల | | | | 1 | 650 | 975.000 | 1 | 650 | 975.000 |
| | | ఆదోని | 1 | 4704 | 7056.000 | | | | 1 | 4704 | 7056.000 |
| | | ఎమ్మిగనూరు | 1 | 3264 | 4896.000 | | | | 1 | 3264 | 4896.000 |
| | | మొత్తం | 3 | 17968 | 26952.000 | 1 | 650 | 975.000 | 4 | 18618 | 27927.000 |
| | | పెరశి మొత్తం | 78 | 120106 | 180159.000 | 32 | 73041 | 109561.50 | 110 | 193147 | 289720.50 |

మిస్టర్ స్పీకర్: బొండా ఉమామహేశ్వర రావు గారు.

శ్రీ బొండా ఉమామహేశ్వర రావు (విజయవాడ సెంట్రల్): అధ్యక్షా, మంత్రిగారుచెప్పినటువంటి సమాధానానికి చాలా సంతోషం. ఇవాళ పట్టణ ప్రాంతాల్లో ఇల్లు అనేది చాలా ఇంపార్టెంట్. అలాగే కేంద్ర ప్రభుత్వం హౌసింగ్ ఫర్ ఆల్ అనే స్కీమ్ ఇవ్వడం జరిగింది. ఈ స్కీముకు సంబంధించి చిన్న చిన్న విషయాలు మంత్రిగారి దృష్టికి తీసుకువస్తే, వారు వాటిని సరిదిద్ది సక్రమంగా అమలు చేయడానికి బాగుంటుందని నా అభిప్రాయం. విజయవాడకు 10,000 ఇళ్ళు శాంక్షన్ చేశారు. ఈ 'Housing for All Scheme' లో Central Government, State Government & beneficiary నుంచి కూడా కాస్తో కూస్తో తీసుకుంటున్నాం. విజయవాడలోని ప్రధానమైన కాలవ గట్ల మీద, గవర్నమెంట్ పోరంబోకులు, ఇరిగేషన్ పోరంబోకుల మీద ఉన్నటువంటి స్థలాల మీద, G+1, G+2 ఇళ్ళు కట్టిస్తే బాగుంటుంది. 'Housing for All Scheme' క్రింద వచ్చినటువంటి ఇళ్ళని త్వరితగతిన మొదలు పెట్టి, వెంటనే కనుక take up చేస్తే బాగుంటుంది. దానికి గాను అన్నిచోట్ల ఎన్యుమరేషన్ జరుగుతోంది. ఈ ఎన్యుమరేషన్‌ను త్వరితగతిన మొదలుపెట్టి, కంప్లీట్ చేస్తే, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు మేలు జరుగుతుంది కాబట్టి, వెంటనే దీనిని ఇంప్లిమెంట్ చేసేవిధంగా చర్యలు తీసుకోవలసిందిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్: ప్రసాద్ గారూ... చాలా మంది సిగ్నిటరీస్ ఉన్నారు. సిగ్నిటరీస్ కానివాళ్ళున్నారు. బ్రీఫ్‌గా మెన్షన్ చేస్తే అందరికీ అవకాశం వస్తుంది.

శ్రీ బోడె ప్రసాద్ (పెనమలూరు): అధ్యక్షా, మీ ద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను. మా నియోజకవర్గంలో ఉయ్యూరు నగర పంచాయతీగా కొత్తగా ఏర్పడింది. దానిలో సుమారు 15 గృహాలు 1982లో నిర్మించినవి. అవి పూర్తిగా ధ్వంసం అయిపోయి, స్లాబ్‌లు ఊడి మీద పడుతున్నాయి.

**9.20 PM (3)**

ఫోటోగ్రాఫ్స్ కూడా గౌరవ మంత్రి గారికి నేను చూపించాను. వర్షాకాలం వస్తే ఎటువంటి ప్రమాదాలైనా జరిగే అవకాశాలున్నాయి కాబట్టి ఎమర్జెన్సీ క్రింద తీసుకొని ఆ 15 గృహాలను మంజూరు చేస్తే, వాళ్లకు ఎటువంటి ప్రమాదం రాకుండా ఉంటుందని నేను ఆశిస్తున్నాను. అలాగే, పది ఎకరాల ప్రభుత్వ భూమి  గత ప్రభుత్వ హయాంలో అక్వైర్ చేసిన భూమి ఉన్నది. అందులో high-rise building గా ఇస్తే, అక్కడ ఉన్న encroachers అందరికి కూడా గృహాలను ఇచ్చిన వాళ్లమవుతామని మీ ద్వారా  మంత్రి గారిని అడుగుతున్నాను.

మిస్టర్ స్పీకర్:  ఓ.కె. సుగుణమ్మ గారూ,.......... సభలో లేరా?.........   సుజయ్ కృష్ణ రంగారావు గారు.......

(ఈ సందర్భంలో గౌరవసభ్యులు శ్రీమతి సుగుణమ్మ గారు అందుబాటులో లేనందున తదుపరి సభ్యులను పిలిచారు)

శ్రీ రావు వెంకట సుజయ్ కృష్ణ రంగారావు (బొబ్బిలి): అధ్యక్షా, మంత్రి గారి సమాధానంలో సుమారు 1,93,147 గృహాలను అర్బన్‌కు మంజూరు చేశామని చెప్పారు. దీంట్లో ముఖ్యంగా ఏదైతే మీరు నిబంధనల్లోని site specification విషయంలో ఇంత మొత్తంలో సైట్ ఉండాలనే నిబంధనను ఏదైతే  ప్రభుత్వం చెప్పిందో, అంత మొత్తం విస్తీర్ణంలో నిరుపేదలకు సైట్ ఉండే అవకాశాలు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. middle class, above middle class వాళ్లకు అంత పెద్ద సైట్ ఉండటం వల్ల నిరుపేదలకు హౌసింగ్ ఉపయోగించుకునే పరిస్థితి ఉండదు. అందు నిమిత్తం కొంత relaxation ఇవ్వమని మంత్రి గారిని కోరుతున్నాను.

అదేవిధంగా మంత్రి గారేదైతే 1,93,147 గృహాలని అన్నారో, అందులో administrative sanction ఇచ్చింది మాత్రం "జీరో".  మరి వారి వెబ్‌సైట్ నుంచి తీసుకున్న ఇన్ఫర్మేషన్ ప్రకారం అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఒక్కదానికి కూడా ఎందుకు ఇంతవరకు ప్రభుత్వం ఇవ్వలేకపోయింది? అదే విధంగా 1,93,147 ఇండ్లు అనుకుంటే, దానికి సంబంధించి State Government ఇచ్చే సబ్సిడీ ప్రకారం  సుమారు రూ.3 వేల కోట్లు అర్బన్ హౌసింగ్‌కే ఖర్చు అవుతుంది. అదే కాకుండా రూరల్ హౌసింగ్‌కు గాను ఏ మేరకు సబ్సిడీని అందిస్తారు?  అదే విధంగా పాత శాంక్షన్స్‌కు, ప్రోగ్రెస్‌లో ఉన్న గృహాల నిర్మాణం తదితర వాటికి  గాను బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు బాగా కొరతగా ఉన్నట్టుగా మేం భావిస్తున్నాం. అందు నిమిత్తం

ప్రభుత్వం ఎలా  నిధులను కేటాయించి నిర్మాణాలను చేపడుతుందో మంత్రి గారు తెలియజేయాలని మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) (విశాఖపట్నం-వెస్ట్)ః అధ్యక్షా, విశాఖపట్టణం నగరానికి 20 వేల ఇండ్లు మంజూరైనాయి. గౌరవ ముఖ్యమంత్రి గారు మరియు కేంద్ర మంత్రివర్యులు శ్రీ ఎం. వెంకయ్యనాయుడుగారి దూరదృష్టితో పెద్ద ఎత్తున హౌసింగ్ పరంగా శాంక్షన్స్ జరిగాయి. అందుకుగాను ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ప్రధానంగా గతంలో కూడా JNNURM క్రింద విశాఖకు 14 వేల ఇండ్లు శాంక్షన్స్ కాగా, చాలా మందికి ఆ హౌసింగ్‌కు సంబంధించిన అలాట్‌మెంట్స్ కాగితాల్లో  ఇచ్చినప్పటికి కూడా, ఇంతవరకు కూడా మంజూరైన ఇళ్లలో చేరలేనటువంటి వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. ఎందుకంటే, ఇది చాలా ప్రధానమైన అంశం. విశాఖ నగర శివారులో అంటే పాతిక, ముప్పై కిలోమీటర్ల దూరంలో ఈ హౌసింగ్ ప్రాజెక్టుల నిర్మాణం చేయడం వల్ల నగరంలో ఉన్నటువంటి స్లమ్స్‌ను క్లియర్ చేసి, వీళ్లను అక్కడకు తీసుకువెళ్లేటటువంటి ప్రతిపాదనను గత ప్రభుత్వాలు చేయడం వల్ల ఆ హౌసింగ్ స్కీమ్ ఇప్పటికి కూడా పూర్తి స్థాయిలో కార్యాచరణకు రాలేదు. ఇప్పుడు మళ్లీ మనకు చాలా పెద్దయెత్తున గౌరవ ముఖ్యమంత్రిగారి చొరవతో విశాఖపట్టణానికి 20 వేల ఇండ్లు మంజూరైనాయి. ఇప్పుడు ఇవ్వబోయే ఇండ్లు  అధికారుల ఆలోచనల్లో నగరంలోనే చాలా వరకు ప్రభుత్వ భూములున్నాయి కాబట్టి అక్కడ  ఇవ్వాలన్న ఆలోచనలున్నాయి. ఇప్పుడే సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు గారు చెప్పినట్టు  అనేక ప్రభుత్వ భూములున్నాయి. వాటిని అధికారుల దృష్టిలో కొంత ఖరీదైన భూములుగా ఉండే వాటిని పేద వాళ్లకు ఇండ్ల నిర్మాణం నిమిత్తం ఎందుకు ఇవ్వాలనే ఆలోచనతో అందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రక్కకు పెడుతున్నారు. కానీ, నిజంగా హౌసింగ్ పరంగా సక్సెస్‌ఫుల్‌గా మంజూరైన 20 వేల ఇండ్లు ఈ సంవత్సర కాలంలో నిర్మాణం కావించి నిరుపేదలకు ఇవ్వాలనుకున్నప్పుడు గతంలో నిర్మాణం చేసుకున్న ఇండ్లకే ప్రస్తుతం ఎవరు కూడా తరలి వెళ్లలేని పరిస్థితి ఉంది. ఇప్పుడు విశాఖపట్టణాన్ని స్మార్ట్ సిటీగా కేంద్ర ప్రభుత్వం ప్రపోజ్ చేసిన తరువాత existing houses, మొన్న హుదూద్ తుపాన్ సంభవించినప్పుడు కూడా విశాఖ నగరంలోని కొండ వాలు ప్రాంతానికంతా కూడా, ఎవరైతే dilapidated conditions లో ఉన్న ఇండ్ల యజమానులందరికి కూడా, ఇండ్లు కూలిన కారణంగా నష్టపోయిన వారికి సుమారు 80 వేల ఇండ్లకు నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వడం జరిగింది.

అధ్యక్షా, చాలా ఇంపార్టెంట్ సబ్జెక్ట్.  దయచేసి కొంత సమయం ఇవ్వండి. హుద్ హుద్ తుపానువల్ల  నష్టపోయిన  existing colonies వాళ్లందరికి కూడా పది వేల  ఇండ్లు నిర్మించి, మిగిలిన పది వేల ఇండ్లను కూడా ప్రాజెక్టు రూపంలో నిర్మాణం చేపట్టాలనే  ప్రతిపాదన తీసుకువస్తే definite గా బాగుంటుంది.  ఆ విషయానికి సంబంధించి గౌరవ ముఖ్యమంత్రి గారు  కూడా ఆ రకమైన ఆలోచన చేశారు.

ఇంకో విషయం, అర్బన్ ఏరియాల్లో ముఖ్యంగా మంత్రిగారు చెప్పాలి. పది వేల రూపాయలని ఏదైతే రూరల్ ఏరియాల్లో నిర్మాణం చేసుకునేటటువంటి హౌసింగ్‌స్కు రిపేర్ల కొరకు ప్రభుత్వం ఇచ్చింది. అర్బన్ ఏరియాల్లో గతంలో మన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన వాంబే స్కీమ్ గానీ, అర్బన్ హౌసింగ్ స్కీమ్ తదితర స్కీమ్స్ క్రింద కట్టిన ఇండ్లు దేదీప్యమానంగా ఉన్నాయి. తలుపులు లేవు, పెచ్చులు ఊడిపోయినటువంటి పరిస్థితి ఉంది. మీరేదైనా ఈ బడ్జెట్‌లో అర్బన్ ఏరియాల్లో ఉన్నటువంటి, గతంలో కట్టినటువంటి ఇండ్లకు గాను రిపేర్ల నిమిత్తం పది వేల రూపాయలను రూరల్ ఏరియాల్లో ఇచ్చినట్టుగానే ఇస్తారా అనే విషయాన్ని నేను మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ : శ్రీ ఆకుల సత్యనారాయణ గారూ,

శ్రీ ఆకుల సత్యనారాయణ (రాజమండ్రి సిటి): అధ్యక్షా, ఏదైతే ఇవాళ పట్టణ ప్రాంతంలో ఉన్న ఇళ్ల కొరత తీర్చి, పట్టణ ప్రాంతంలో ఉన్న పేదలు, అలాగే అల్పాదాయ వర్గాల వారికి ఇండ్లు సమకూర్చే విధంగా "ప్రధాన మంత్రి ఆవాస్ యోజన" క్రింద మన రాష్ట్రానికి 1,93,147 ఇండ్లు కేటాయించడం జరిగింది. అందుకు గల ముఖ్య కారణం ఒకటి కేంద్ర మంత్రివర్యులు శ్రీ ఎం. వెంకయ్యనాయుడుగారైతే మరొకటి ఇక్కడున్న అధికార బృందం. ముందుగా అందరు కలిసి ఒక DPR (Detailed Project Report) ను తయారుచేసి దిల్లీలోని కేంద్ర ప్రభుత్వానికి పంపించి, మంజూరు తీసుకువచ్చిన అంశంలో అధికారుల పాత్ర కూడా చాలా గణనీయంగా ఉంది. ఏదైతే ఇవాళ కేంద్ర ప్రభుత్వం "ప్రధాన మంత్రి ఆవాస్ యోజన" క్రింద మంజూరైన ఇండ్లకు సంబంధించి four verticals లో చూస్తే, ఇంతకు ముందెప్పుడు కూడా ఈ JNNURM నందు గానీ, అప్పట్లో ఉన్న పద్ధతి కంటే కూడా పూర్తిగా భిన్నంగా ఈసారి అల్పాదాయ వర్గాల వారికి, Below Poverty Line వాళ్లకందరికి కూడా పక్కా ఇండ్లను నిర్మించి ఇవ్వాలని సంకల్పించడం జరిగింది. ఇందాక గణబాబు గారు చెప్పినట్టుగా ఊరికి దూరంగా కాకుండా with all the social infrastructure and physical infrastructure అన్నీ ఉండేట్టుగా కూడా ఇండ్లను తీర్చిదిద్దేందుకు అవకాశం ఉన్న స్కీమ్ ఇది. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా pro active గానే రియాక్ట్ అవుతోంది. తప్పకుండా ఈ స్కీమ్ efficient గా, appropriate గా మనం ఇంప్లిమెంట్ చేయగల్గితే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. ప్రజలకు కూడా మంచి జరుగుతుందనే ఉద్దేశం. ధన్యవాదాలు.

శ్రీమతి ఎం.సుగుణమ్మ (తిరుపతి): అధ్యక్షా, ఎన్.టి.ఆర్. హౌసింగ్ స్కీమ్ క్రింద తిరుపతి రూరల్‌కు 500 ఇండ్లు శాంక్షన్ అయినాయి. అందుకు గాను తిరుపతి నందలి పాడిపేట దగ్గర తిరుపతి రూరల్‌లో స్థలాన్ని ఇస్తే అది త్వరితగతిన ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి అర్హులైన వారందరికి కూడా ఇండ్లను మంజూరు చేయడానికి అవకాశం ఉంటుంది. అదే విధంగా ఉదుత్ మహల్ దగ్గర దాదాపుగా పది ఎకరాల భూమిని ప్రభుత్వం ఇచ్చినట్లైతే అక్కడ

1800 ఇండ్లను అర్బన్ హౌసింగ్ స్కీమ్ క్రింద నిర్మించాలని ప్లాన్ చేయడం జరిగింది. దాంట్లో ఇప్పటి వరకు వెయ్యి ఇండ్లను పూర్తిచేశారు. ఇంకా 800 ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన పది ఎకరాల స్థలం ఒకే లేఔట్లో ఉంది. ఆ పది ఎకరాల స్థలాన్ని త్వరితగతిన ప్రభుత్వం ఇచ్చినట్లైతే ఆ స్థలంలో కూడా 800 ఇండ్లను సత్వరమే నిర్మించి పేద, బడుగు, బలహీన వర్గాల వారందరికి, అర్హులైన వారందరికి ఆశ్రయం కల్పించడానికి అవకాశం ఉంటుందని తెలియజేస్తూ అందుకు సంబంధించిన చర్యలను ప్రభుత్వం చేపట్టవల్సిందిగా మీ ద్వారా నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ధన్యవాదాలు.

మిస్టర్ స్పీకర్: అంజత్ బాష.......

శ్రీ అమ్జత్ బాషా షేక్ బేపారి (కడప)ః థ్యాంక్యూ అధ్యక్షా, ఈరోజు "హౌసింగ్ ఫర్ ఆల్" అనే స్కీమ్ క్రింద కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి 1,93,000 చిల్లర హౌసెస్ అర్బన్ క్రింద మంజూరైనాయని మంత్రి గారు చెబుతున్నారు. చాలా సంతోషం. అందులో భాగంగానే నా నియోజకవర్గమైన కడప అర్బన్‌లో 4,326 ఇండ్లు మంజూరు కావడం జరిగింది. కానీ, మేమైతే మొన్న కడప పట్టణంలో హౌసింగ్ అధికారులందరితో, ప్రజా ప్రతినిధులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఆ సమావేశంలో అధికారులేమని చెప్పారంటే, Central assistance క్రింద ఇంటికి రూ.1,50,000/- లు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అదే విధంగా State Government నుండి రూ. 80,000/- ల contribution ఉంటుందని కూడా అధికారులు చెప్పడం జరిగింది. కానీ, ఒక చిన్న సమస్య ఏమిటంటే, బ్యాంక్ నుంచి రూ. 2 లక్షలు లోన్ రూపంలో తీసుకోవాల్సి వస్తుందని అధికారులు చెప్పడం జరిగింది. అధికారులను అడిగితే, బ్యాంక్ ఇచ్చే లోన్‌కు తప్పనిసరిగా collateral security పెట్టాలని కూడా చెప్పడం జరిగింది. ఎందుకంటే, పేద ప్రజలు బ్యాంక్ వద్దకు వెళ్లి collateral security ఇచ్చి లోన్ పొందే అవకాశం ఉండదు కాబట్టి పేద ప్రజలకు వెసులుబాటు కల్గించాలని కోరుతున్నాను. అదే విధంగా ఎవరైతే లబ్ధిదారులుంటారో, వాళ్లు రూ. 50,000/- లు వారి వారి వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్లో జమ చేయాల్సినటువంటి పరిస్థితి ఉందని కూడా సమావేశంలో అధికారులు చెప్పడం జరిగింది. పేద ప్రజలకు రూ.50,000/- లు బ్యాంక్‌లో జమ చేసే స్తోమత నిజంగానే ఉండదు. గతంలో కూడా రాజశేఖరరెడ్డి గారి హయాంలో హౌసింగ్ స్కీమ్ క్రింద ఇండ్లను నిర్మించి పేద ప్రజలకు ఇచ్చారు. ఆ తరువాత ఆ స్కీమ్ క్రింద కూడా డబ్బు లేనందున ఇండ్ల నిర్మాణం పూర్తిగా ఆగిపోయింది. పేద ప్రజలకు ఇండ్లు మంజూరు చేసే విషయంలో కొద్దిగా నిబంధనలను సడలించాల్సిన అవసరముంది. పేద ప్రజలు రూ. 50,000/- లు బ్యాంక్‌లో జమ చేయలేని పరిస్థితి నేడు రాష్ట్రంలో ఉంది. ప్రభుత్వమే చొరవ చూపి కచ్చితంగా పేద ప్రజలకు న్యాయం చేకూర్చే విధంగా బ్యాంక్‌లకు ఆదేశాలు జారీ చేసి, బ్యాంక్‌ల ద్వారా పేద ప్రజానీకానికి ఋణాలిప్పించాల్సిన అవసరం ప్రభుత్వానికి ఎంతైనా ఉందని చెప్పి మీ ద్వారా నేను ప్రభుత్వానికి తెలియజేసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్: మినిస్టర్ గారు............ Please answer the Question.

(ఈ సందర్భంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు శ్రీమతి వంతల రాజేశ్వరి తన సీట్లో నుంచి లేచి మాట్లాడడానికి తనకు అవకాశం ఇవ్వాలని గౌరవ సభాపతి గారిని కోరసాగింది. మైక్ లేకుండా మాట్లాడుతూ 'అధ్యక్షా, ఇది మా గిరిజన ప్రాంతానికి సంబంధించిన అంశం, మాకు ఇళ్లు పోయే పరిస్థితి ఉంది, మాట్లాడడానికి మైక్ ఇవ్వండి' అని అన్నారు.)

(ఈ దశలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది సభ్యులు తమ సీట్లో నుంచి లేచి తమ సభ్యులు శ్రీమతి వంతల రాజేశ్వరి మాట్లాడడానికి అవకాశం ఇవ్వాలని గౌరవ సభాపతి గారిని కోరసారారు)

శ్రీమతి కిమిడి మృణాళిని (చీపురుపల్లి): అధ్యక్షా, గౌరవ సభ్యులు చాలా ప్రశ్నలు అడగడం జరిగింది. అయితే గత 20 నెలలుగా ఈ సభలో Housing Department గురించి ప్రశ్నోత్తరాల సమయంలో సమాధానం చెప్పడం జరుగుతోంది. అయితే ఇది దురదృష్టకరమైన పరిస్థితి. గత ప్రభుత్వం saturation mode లో వెళ్లి చాలా అవకతవకలు, చాలా అవినీతి ఆరోపణలు ఎదుర్కోంది.

(ఈ దశలో ప్రతిపక్ష నాయకుడు తన సీట్లో నుంచి లేచి తాను మాట్లాడడానికి అవకాశం ఇవ్వాలని గౌరవ సభాపతి గారిని కోరసాగారు)

మిస్టర్ స్పీకర్ : ఒక్క నిమిషం ఆగండి మినిస్టర్ గారు. జగన్మోహన్ రెడ్డి గారూ.

**09.30AM (4)**

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి (పులివెందుల): అధ్యక్షా, మా గౌరవసభ్యురాలు అడుగుతున్నది చాలా జెన్యూన్ క్వశ్చన్. తెలంగాణా నుంచి ఏవైతే మండలాలు ఆ నియోజకవర్గానికి జాయిన్ అయ్యాయో ఆ మండలాల్లో బిల్లుల చెల్లింపులు జరగడం లేదని చెప్పి అడుగుతున్నది.

మిస్టర్ స్పీకర్: ఓ.కె.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి: దయచేసి దానికి సమాధానం వెంటనే ఇవ్వలేకపోయినా కనీసం వచ్చేట్టుగా చర్యలు తీసుకోండని అడుగుతున్నాం.

మిస్టర్ స్పీకర్: ఓ.కె.. మినిష్టరు గారూ.

(ప్రతిపక్షసభ్యులచే అభ్యంతరం)

నో. ప్లీజ్, ప్లీజ్...

(శ్రీమతి వంతల రాజేశ్వరిచే అభ్యంతరం)

శ్రీమతి కిమిడి మృణాళిని: గౌరవ ప్రతిపక్షనాయకులు మీ తరపున చెప్పడం జరిగింది. నోట్ చేసుకున్నానమ్మా, సమాధానం చెబుతాను. దురదృష్టకరమైనటువంటి పరిస్థితి. గత 20 నెలలుగా ఈ హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌కి సంబంధించినటువంటి ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో చాలా బాధపడుతూ సమాధానాలు చెప్పాల్సినటువంటి పరిస్థితి వస్తోంది. ఎందుకంటే గత ప్రభుత్వంలో హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో, హౌసింగ్ అనేటటువంటిది ఒక saturation modeలో తీసుకుంటామనే ఉద్దేశంతో చాలా అవకతవకలు, చాలా అవినీతి, ఆరోపణలు గత ప్రభుత్వం ఎదుర్కోవడం జరిగింది. చెప్పాల్సినటువంటి పరిస్థితి ఉంది. ఎందుకంటే గత ప్రభుత్వంలో అర్బన్ హౌసింగ్ 2004-05లో రూ.40,000 ఇళ్లు ప్రారంభించి రూ.3,000 లు సబ్సిడీ అయితే 2013-14 వచ్చేటప్పటికీ రూ.80,000లతో రూ.99,000 లు సబ్సిడీ. యూనిట్ కాస్ట్ రూ.80,000 అయితే ఎన్ని చదరపు అడుగులు ఆ డబ్బుతో కట్టడానికి అవకాశం ఉంటుంది. పేరుకి మాత్రమే అర్బన్ హౌసింగ్, గవర్నమెంటు స్కీమ్. గవర్నమెంటు సబ్సిడీ రూపంలో ఇచ్చింది రూ.9,000. మిగతాది అంతా బెనిఫిషియరీ కంట్రిబ్యూట్ చేసుకుని తనకు తానుగానే కట్టుకోవడం వల్ల ఇన్ని ఇబ్బందులు. గత ప్రభుత్వం ఇచ్చిన డబ్బుతో కేవలం 80 నుంచి 100 sftతో ఇల్లు కట్టడానికి అవకాశం ఉంటుంది. కనుక ఇలాంటి ఇబ్బందులకు ప్రజలను గురిచెయ్యడం వల్లే ఇంత irregularities, ఇంత incomplete houses గత ప్రభుత్వంలో ఉండడం జరిగింది. ఉదాహరణకు తీసుకుంటే మొన్ననే గౌరవసభ్యులు ఒకరు అడగడం జరిగింది. రాజీవ్ గృహకల్ప కోసం 2006వ సంవత్సరంలో 16,000 ఇళ్లు టేకప్ చేస్తే, 15,000 ఇళ్లు **incompleted గా పూర్తి చేయగా** ఇంకా 1100 ఇళ్లు టేకప్ చెయ్యవలసిన అవసరం ఉంది. ఇప్పటికే ఇళ్లు కంప్లీట్ చెయ్యడానికే మేము రూ.10కోట్లు సాంక్షన్ చెయ్యడం జరిగింది. అదేవిధంగా unoccupied houses తీసుకుంటే, ఈ unoccupied houses ఎందుకు జరుగుతుంది అంటే ప్రోపర్ ప్లానింగ్ లేకపోవడం వల్ల, ప్రోపర్ ఫైనాన్షియల్ టయ్యప్ లేకపోవడం వల్ల, ఈవిధమైనటువంటి ప్రోపర్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ లేకపోవడం వల్ల, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేదు, రోడ్లు లేవు, డ్రైనేజిలు లేవు, కరెంటు లేదు, తాగునీరు లేదు ఈ విధమైనటువంటి ఇబ్బందులు. కేవలం ఇళ్లు కట్టి, వాటిని స్లమ్స్‌గా తయారు చేసారే తప్ప ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇవ్వలేకపోవడం వల్ల, కనీస అవసరాలు లేకపోవడం వల్ల ప్రజలు ఎవరూ కూడా ఆక్యుపేషన్‌లోకి వెళ్లలేనటువంటి పరిస్థితులు గత ప్రభుత్వం కల్పించింది. ఆ విధంగా రాజీవ్ స్వగృహ చూసుకుంటే గౌరవసభ్యులు నాలుగురోజుల క్రితమే ఒక ప్రశ్న అడిగారు. మరి అక్కడ

కూడా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏమీ లేదు. అంత పెద్ద ప్రాజెక్టుని 2006వ సంవత్సరంలో ప్రారంభించి కేవలం రూ.107కోట్లు మాత్రమే సాంక్షన్ చేసి ఆ ఇళ్లు అన్నీ incompleted houses గా ఉండి ఈరోజు రూ.900కోట్లు దానిని పూర్తి చెయ్యడానికి liabilities కింద అవసరమైన పరిస్థితి ఉంది. ఈవిధంగా గవర్నమెంట్ సబ్సిడీ తక్కువ, గవర్నమెంటు ఇచ్చినటువంటి కంట్రిబ్యూషన్ తక్కువ, ఇచ్చినటువంటి బెనిఫీషియరీ సెలక్షన్ తప్పు, ineligible beneficiaries కి ఇవ్వడం, లేని వాళ్లకి ఇవ్వడం ఈ విధమైనటువంటి ప్రాపర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేకపోవడం, ప్రోపర్ ప్లానింగ్ లేకపోవడం, ఫైనాన్షియల్ ప్లానింగ్ లేకపోవడం వల్ల గత ప్రభుత్వంలో హౌసింగ్ అనే కార్యక్రమం పూర్తిగా ఫెయిల్యూర్ అయ్యింది. దానికిగాను మనం ఈరోజు ఏదైతే క్లాస్‌రూమ్‌లో ఒక బ్లాక్‌బోర్డ్ అస్తవ్యస్తంగా ఉంటే దానిని ఎలా క్లీన్ చేసుకుంటామో, గత 18 నెలలుగా ఏదైతే అస్తవ్యస్తంగా, అవినీతితో, ఆరోపణలతో ఉన్నటువంటి ఈ హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌ని క్లీన్ చెయ్యడానికే మాకు టైమ్ సరిపోతున్నది. ఈరోజు మా ప్రభుత్వం 1,93,000 అర్బన్ హౌసింగ్ ఇస్తుంది. ఈ అర్బన్ హౌసింగ్‌కిగాను రూ.10వేలకోట్లు అవుతాయనే అంచనాలు ఉన్నాయి. దీనికిగాను బెనిఫిషియరీస్ సెలక్షన్ కాలేదు అని గౌరవసభ్యులు చెబుతున్నారు. ఇప్పటికి 1,20,000 బెనిఫీషియరీస్ సెలక్షన్ జరిగింది. ఫీల్డ్ లెవెల్‌లో బెనిఫీషియరీస్ సెలక్షన్ చేస్తున్నాం. ఆధార్‌తో లింక్ చేసి అదేవిధంగా existing data with Governmentతో దానిని కూడా six steps valuation చేస్తున్నాం.

అదేవిధంగా అధికారులందరికీ కూడా ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుంది. ప్రోపర్ డిజైనింగ్ కూడా చెయ్యడం జరుగుతుంది. ఏదైతే సాంపిల్ హౌసెస్ కడుతున్నామో ఆ సాంపిల్ హౌసెస్‌ని కూడా బెనిఫీషియర్స్‌కి చూపించడం జరుగుతుంది. ఇంకా బడ్జెట్లో కావలసినటువంటి నిధులు కూడా మేము ఎలొకేట్ చేసుకుంటున్నాము. దానిని ఇంకా ఎక్స్‌ట్రాగా ఏవిధంగా చెయ్యాలని ప్రభుత్వం ఆలోచించుకుని ఒక పెద్ద mammoth programme కింద తీసుకోవడం జరుగుతుంది. ఈవిధంగా హౌసింగ్ ప్రోగ్రామ్ అనేది ఒక మంచి ఎకనామిక్ ప్రోగ్రామ్‌గా చెయ్యాలని మా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారి ఉద్దేశం. ఆ విధంగా మేము అన్ని విధాలా మేము ప్రోగ్రామ్ టేకప్ చేస్తున్నాం.

అదేవిధంగా మరికొన్ని ప్రశ్నలు అడగడం జరిగింది. కొత్తగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కలిసిన తెలంగాణా ప్రాంతంలో కొన్ని ఇబ్బందులున్నాయి, వాటిని ఏవిధంగా చేస్తారని అడిగారు. తప్పకుండా వాటిని అక్కడున్నటువంటి కలెక్టర్‌గారు, ఆర్.డి.ఓ లతో వెరిఫై చేయించి ఏవిధంగా చెయ్యాలనేది ప్రభుత్వ పరంగా అన్నిరకాలైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అదేవిధంగా ముందుగా ఈ కాలువ గట్లు మీద ఏవిధంగా చేస్తారనేది బోండా ఉమామహేశ్వరరావు గారు అడిగారు. తప్పకుండా, అది సి.ఎం.గారే మాట ఇవ్వడం జరిగింది. కలెక్టరుతో వెరిఫై చేయించి గృహ నిర్మాణం చేపట్టడం జరుగుతుంది. అదేవిధంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏవిధంగా చేస్తారు, అది పూర్తి చెయ్యాలని కూడా గౌరవ సభ్యులు అడిగారు. అది కూడా మేము పూర్తి చేస్తామనే

విషయాన్ని తెలియజేస్తూ ఈరోజు " housing for all " అనే యాక్షన్ ప్లాన్ అర్బన్ హౌసింగ్, అర్బన్ ఏరియాలో తీసుకుంటున్నాము. అది తప్పకుండా వెరిఫికేషన్ చేయించి ఎవరైతే రియల్ బెనిఫీషియరీస్ ఉన్నారో, ఎవరైతే అర్హత ఉందో వాళ్లందరినీ కూడా తీసుకోవడం జరుగుతుంది అనేటటువంటి విషయాన్ని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అదేవిధంగా ఏవైతే రూరల్ ఏరియాలో రీప్లేస్ టేకప్ చేసామో, అదేవిధంగా అర్బన్ ఏరియాస్‌లో కూడా రీప్లేస్ చేయించాల్సిన అవసరం ఉందని గౌరవ ఎంఎల్ఏ శ్రీ గణబాబు గారు చెప్పారు. దానిని కూడా మేము ముఖ్యమంత్రిగారి దృష్టిలో పెట్టి ఏవిధంగా చెయ్యాలనే విధానంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందనే విషయాన్ని ఈ సందర్భంగా మీద్వారా వారికి తెలియజేస్తున్నాను.

**మిస్టర్ స్పీకర్: క్వశ్చన్ నెం.2091 (44) మినిష్టర్ ఫర్ సోషల్ వెల్ఫేర్.**

సర్వశ్రీ
**కోరముట్ల శ్రీనివాసులు,**
**పాసిం సునీల్‌కుమార్,**
**కంబల జోగులు,**

**గౌరవనీయులైన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;**

అ) సాంఘిక సంక్షేమ శాఖకు 2014-15, 2015-16 సంవత్సరాలకు కేటాయించిన, విడుదల చేసిన, ఖర్చు చేసిన నిధుల మొత్తం ఎంత?

**శ్రీ రావెల కిషోర్‌బాబు (సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి):**

అధ్యక్షా, ఈ ప్రశ్నకు జవాబులో పొరపాటున సొసైటీకి, ఏ.పి.రెసిడెన్షియల్ స్కూల్స్‌కి సంబంధించినటువంటి బడ్జెట్ కేటాయించిన, విడుదల చేసిన, ఖర్చు అయిన మొత్తం నమోదు చెయ్యలేదు. తరువాత ఇంక్లూడ్ చేశాం. దయచేసి సభ్యులు గమనించవలసిందిగా నేను కోరుతున్నాను.

అ) 2014-15 సంవత్సరానికి సాంఘిక సంక్షేమ శాఖకి కేటాయించిన మొత్తం రూ.3,281.30 కోట్లు. దాంట్లో విడుదల చేసిన మొత్తం రూ.2,531.02కోట్లు. ఖర్చు పెట్టినవి 1,238.45కోట్లు.

2015-16 సంవత్సరానికి కేటాయించిన మొత్తం రూ. 2,687.73కోట్లు. విడుదల చేసిన మొత్తం రూ.2,268.66 కోట్లు. ఖర్చు పెట్టిన మొత్తం.రూ.1,537.02 కోట్లు. ఇప్పుడు చెప్పిన అంకెలు రెసిడెన్షియల్ స్కూల్స్ సొసైటీకి సంబంధించి కేటాయించిన, విడుదల చేసిన, ఖర్చు అయిన మొత్తం.

మిస్టర్ స్పీకర్: కొరముట్ల శ్రీనివాసులు గారూ..

శ్రీ కొరముట్ల శ్రీనివాసులు (కోడూరు): అధ్యక్షా, నిజంగా సాంఘిక సంక్షేమ శాఖ ఎంత దీనావస్థలో ఉందో మినిష్టరు గారి సమాధానంతో తెలుస్తుంది. 2014-15 సంవత్సరంలో ఇక్కడ మీరు ఇచ్చిన సమాధానం రూ.2,673.78 కోట్లు ఉంటే ఇప్పుడు కేటాయించలేదని చెప్పేసి మళ్లీ కొత్తగా రూ.3,200 అని చేశారు. అదేవిధంగా మనం తీసుకుంటాం కానీ ఖర్చు పెట్టింది కేవలం రూ. 1200కోట్లు.

**9.40am (5)**

మిగతావి ఎందుకు ఖర్చు పెట్టలేదు? 2015-16వ సంవత్సరానికి సంబంధించి దాదాపు రూ.2600కోట్లరూపాయలు కేటాయించామని అన్నారు. కేవలం ఇక్కడ ఇచ్చిన సమాధానం ప్రకారం వెయ్యి కోట్ల రూపాయలు ఖర్చు పెట్టామని చెప్పారు. సోషల్ వెల్ఫేర్‌కి, రెసిడెన్షియల్ సొసైటీకి సంబంధించినది మళ్లీ ఒక 500కోట్ల రూపాయలు add చేశామని అంటున్నారు. ఈరోజు సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ పరిస్థితి ఎలా ఉంది? కనీసం రెసిడెన్షియల్స్ స్కూల్స్‌కు సంబంధించి, హాస్టల్స్‌కు సంబంధించి ఎక్కడ కూడా మౌలిక సదుపాయాలు లేవు. అదేవిధంగా గ్రామాల్లో చూస్తే, మాలపల్లిలో గానీ, మాదిగపల్లిలో గానీ కనీసం రోడ్ల సౌకర్యం లేని పరిస్థితి ఉంది. కానీ, బడ్జెట్‌లో వేల కోట్లు కేటాయించినట్లు చెబుతున్నారు. కానీ, ఏవిధంగానూ, ఎక్కడా మౌలిక సదుపాయాలు లేని పరిస్థితి ఉంది. కేవలం అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈరోజు ఎస్సీ కార్పొరేషన్ చూస్తే, ఇంత బడ్జెట్ కేటాయిస్తున్నామని చెబుతున్నారు. కానీ, లోన్‌పెడితే మంజూరయ్యే పరిస్థితి లేదు. జన్మభూమి కమిటీ అని చెప్పి చట్టబద్ధత లేని కమిటీ ఒకటి పెట్టి, దానిని ఇన్‌క్లూడ్ చేసి ఈరోజు ఎస్సీ, ఎస్టీలు అక్కడకు పోతే ఈ చట్టబద్ధత కాని జన్మభూమి కమిటీ సభ్యులు allow చేస్తేనే వాళ్లు చేస్తున్నారు. ఒకవేళ, కేసు ఏమైన రికమెండ్ చేయించుకొని పోతే బ్యాంకులో షూరిటీ దొరికే పరిస్థితి లేదు. ఈవిధంగా పోతే దాదాపు ఐదు కోట్లు జనాభా ఉన్న ఈ ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు రెండు కోట్లు ఉన్న ఎస్సీ ప్రజలు ఏవిధంగానూ అభివృద్ధికి నోచుకొని పరిస్థితి ఈరోజు ఉంది.

అదేవిధంగా, మీద్వారా మంత్రి గారిని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇంకొక క్వశ్చన్ అడుగుతున్నాను. ఈరోజు ఎస్సీ కార్పొరేషన్ ఒక విధంగా మౌలిక సదుపాయాలు లేక వెనుకబడి

ఉంది. గ్రామాల్లో బడ్జెట్‌లో, సబ్ ప్లాన్‌లో కూడా సక్రమంగా utilization లేక దారిమళ్లించే పరిస్థితి. డా.బి.ఆర్.అబేండ్కర్ గారు ఎస్సీల గురించి, రాజ్యాంగాన్ని రచించారు. ఆ రాజ్యాంగం ద్వారా పార్లమెంటు, అసెంబ్లీ నడుస్తున్నాయి. దీంట్లో అనేక అధికారాలు గానీ, ఆర్టికల్స్ గానీ, కానిస్టిట్యూషన్ ఆఫ్ ఇండియా అన్నింటికీ కూడా అదే ఆధారం. ఈరోజు అబేండ్కర్ విగ్రహాలు ఎక్కడా పెట్టే పరిస్థితులు లేవా? పైగా పెట్టినవి కూడా తీసేసే పరిస్థితులున్నాయి. ఉదాహరణకు వైఎస్సార్ జిల్లా కడపలో కలెక్టరేటు ఆఫీసులో అబేండ్కర్ విగ్రహం పెడితే దానిని కూడా కలెక్టరు గారు తీయడం జరిగింది. ఎంత దారుణం?

మిస్టర్ స్పీకర్ ః మీ ప్రశ్నకు మీరు పరిమితమవ్వండి. ప్లీజ్

శ్రీ కోరముట్ల శ్రీనివాసులు (కోడూరు)ః అధ్యక్షా,ఈరోజు మీ ఛాంబర్‌కు వేము వస్తే చాలా సంతోషంగా ఉంటుంది. ఎందుకంటే, ఒక దిక్కున మహాత్మగాంధీ, మరొక దిక్కున అబేండ్కర్‌గారి ఫొటోలు ఉంటాయి. మేము చూసి సంతోషం పడతాం. కనీసం ఇటువంటి ఉదార స్వభావం ఈ ప్రభుత్వానికి లేదా అని అడుగుతున్నాను. ఈరోజు ఎస్సీ కమీషన్‌ను మీరు ఎందుకు reconstitute చేయలేదు? ఎస్సీ కమీషన్ reforms ని ఎందుకు Implement చేయలేదు? మండల స్థాయిలోగానీ, జిల్లా స్థాయిలో గానీ, స్టేట్ లెవల్‌లో ఎందుకు నోడల్ ఏజెన్సి పెట్టలేదు? మీరు ఎందుకు మీటింగ్ పెట్టలేదు? కేవలం మంత్రిగారు అంకెల గారడీ తప్ప ఎక్కడా సాంఘిక సంక్షేమం గురించి చర్య తీసుకోలేదు. స్వయంగా మేము అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తున్నాం... (మైకు కట్ చేయబడింది).

మిస్టర్ స్పీకర్ః సామ్యూల్ జవహర్ గారూ, (సభ్యులు శ్రీ కొరముట్ల శ్రీనివాసుల గారినుద్దేశించి) మీరు కంప్లీట్ చేయండి.

శ్రీ కొరముట్ల శ్రీనివాసులుః( మైకు లేకుండా) గ్రామాల్లో గానీ, let me complete sir.

శ్రీ కొత్తపల్లి సామ్యూల్ జవహర్ః అధ్యక్షా, గత పది సంవత్సరాల్లో ఎవరూ చేయని విధంగా.. (మైకు కట్ చేయబడింది)

మిస్టర్ స్పీకర్ః ప్లీజు కన్‌క్లూడ్. ఎవరి విశ్వాసం వాళ్లది.

శ్రీ కొరముట్ల శ్రీనివాసులుః అధ్యక్షా, నిజంగా 2014-15వ సంవత్సరానికి పెట్టిన బడ్జెట్ మరి ఇంత తక్కువ ఖర్చు పెట్టారు. ఈరోజు 15తారీఖు. ఇంకొక పదిహేను రోజుల్లో బడ్జెట్ అయిపోతుంది. కేవలం వెయ్యి కోట్లు పెట్టి, కేటాయించినది 3వేల కోట్ల రూపాయలు,

మిగతావి ఎక్కడకు పోయిన్నాయి? మీకు ఎస్సీల మీద ఉన్న ప్రేమ ఇదేనా అని మీ ద్వారా ప్రభుత్వాన్ని సూటిగా అడుగుతున్నాను.

మిస్టర్ స్పీకర్ః జవహర్‌గారు ప్లీజ్..

శ్రీ కొత్తపల్లి సామ్యూల్ జవహర్ (కొవ్వూరు)ః అధ్యక్షా, ధన్యవాదాలు. గత పాలకుల నిర్లక్ష్యంతో మాదిగపల్లెలు, మాలపల్లెల్లో కనీస సౌకర్యాలకు నోచుకోకుండా ఉన్న పరిస్థితుల్లో గతంలో ఎస్సీ సబ్ ప్లాన్‌లో రావల్సిన నిధులు కూడా మూసీ ప్రక్షాళనకు, ఔటర్‌రింగు రోడ్లకు ఖర్చు పెట్టిన గత ప్రభుత్వాల వైఫల్యాల నుంచి ఈ ప్రభుత్వం పూర్తి స్థాయిలో అన్ని గ్రామాలకు ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా నిధులు కేటాయిస్తూ చక్కగా చేస్తూ ఉంది. కానీ, చిన్న సవరణలు ఉన్నాయి. 40శాతం పైగా ఉన్న పల్లెలకు ఇస్తున్న పరిస్థితుల్లో అన్ని గ్రామాల్లో కూడా ఎస్సీలు ఉన్నారు. అన్ని గ్రామాలకు కూడా ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించి అందరికీ మౌలిక సదుపాయాలు కల్పించవలసిందిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

డా. గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి (నరసరావుపేట)ః అధ్యక్షా, ఎస్సీ హాస్టల్స్‌ని రెసిడెన్షియల్ స్కూల్స్‌గా మార్చడానికి ప్రతిపాదన ఉందని చెప్పి మంత్రిగారు చాలా సందర్భాల్లో చెప్పారు. అది ఎంతవరకు వచ్చింది? దాని మీద ఏమైనా ప్రతిపాదనలు ఉన్నాయా అని మంత్రిగారు దయచేసి తెలుపవలసిందిగా కోరుతున్నాను. తెలంగాణా ప్రభుత్వం నిన్న బడ్జెట్‌లో ఎస్సీ హాస్టల్స్‌ను రెసిడెన్షియల్ స్కూల్స్‌గా మార్చడానికి ప్రతిపాదన చేశారు. వాళ్లు ఈ కార్యక్రమాన్ని ఈ సంవత్సరంలో చేపట్టడం జరిగింది కాబట్టి అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ హాస్టల్స్‌ను రెసిడెన్షియల్ స్కూల్స్‌గా మార్చలని నేను డిమాండ్ చేస్తున్నాను.

(ఆ సందర్భంలో కంబాల జోగులు లేచి మాట్లాడటానికి అవకాశం ఇవ్వమని గౌరవ సభాపతిని కోరారు)

మిస్టర్ స్పీకర్ః మీ పేరు మెన్షన్ చేశాను. Only two people are there.

శ్రీ రావెల కిశోర్ బాబు (ప్రత్తిపాడు)ః అధ్యక్షా, గౌరవ శాసనసభ్యులు అలోకేషన్స్ కంటే ఖర్చులు ఎందుకు తక్కువ పెట్టారని అడిగారు. Central Assistanceకు సంబంధించినంతవరకు మనం ఇచ్చిన మ్యాచింగ్ గ్రాంట్ ఏదైతే ఉందో ఆ గ్రాంట్ సకాలంలో రాకపోవడం వలన ఎక్కువ ఖర్చు పెట్టలేకపోయాం. ఇది ఒక కారణం. అదేవిధంగా బిల్డింగులకు కేటాయించినటువంటి అలోకేషన్స్ ఏవైతే ఉన్నాయో అవి కంటిన్యూస్ ప్రాసెస్. ఆ అకౌంట్‌లో కొంత తక్కువ ఖర్చు పెట్టడం జరిగింది. అదేవిధంగా స్కాలర్ షిప్‌లు కూడా కంటిన్యూస్ ప్రాసెస్. కానీ, గౌరవ ముఖ్యమంత్రిగారు గతంలో ఉన్న ప్రాక్టీసు ఏదైతే ఉందో ఆ ప్రాక్టీసు తప్పు అంటే ఒక సంవత్సరం ఇవ్వవలసిన స్కాలర్ షిప్ ఒకేసారి ఇవ్వడం, అది సంవత్సరం చివర ఇవ్వడం అనేది మంచి విధానం కాదని, ఏ నెలకు ఆ నెల రిలీజు చేయాలని ముఖ్యమంత్రిగారు

చరిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం వలన నూతన విధానాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది. ఈ నూతన విధానం వలన కొంత ఆలస్యం జరుగుతుంది. తరువాత, గౌరవ సభ్యులు శ్రీనివాసులు గారు హాస్టల్స్ విషయం మాట్లాడారు. హాస్టల్స్ అన్నింటిని కూడా రెసిడెన్షియల్ స్కూల్స్‌గా మార్చాలని గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఆనాడు స్వర్గీయ ఎన్టీ రామారావుగారు తెలుగుదేశం పార్టీ స్థాపించిన కొత్తలో గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తున్నప్పుడు కొండల్లో , గుహల్లో, వాగుల్లో, వంకల్లో, సుదూర ప్రాంతాల్లో, అడవుల్లో ఉన్న గిరిజన ప్రాంత ప్రజల పేదరికం, వెనుకబాటుతనం చూసి, విద్య ద్వారా తప్ప, గిరిజన ప్రజలను, దళిత గిరిజనులను అభివృద్ధి చేయడం కష్టమని చెప్పి, కేవలం విద్య మాత్రమే వారిని అభివృద్ధి పథంలోకి, సంక్షేమ బాటలో ముందుకు తీసుకువెళ్లడానికి ఒక సాధనం అని చెప్పి ఆనాటి స్వర్గీయ ఎన్టీ రామారావు గారు రెసిడెన్షియల్ స్కూల్ విధానాన్ని తీసుకువచ్చి ఇవాళ భారతదేశంలోనే రెసిడెన్షియల్ స్కూల్ విధానం అంటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అని, తెలుగుదేశం పార్టీ అని చెప్పి ఒక చరిత్రాత్మక విధి విధానం అని చెప్పి అన్ని రాష్ట్రాలు చెప్పుకునేటటువంటి పరిస్థితి వచ్చింది. (చప్పట్లు) ఆవిధంగా హాస్టల్స్‌ను రెసిడెన్షియల్ స్కూల్స్‌గా మార్చడం అనేది ఒక చరిత్రాత్మక నిర్ణయం. ఇది కొద్దిగా complex issue. ఎప్పుడైతే ఒక హాస్టల్‌ని ఒక రెసిడెన్షియల్ స్కూల్‌గా మారుస్తామో, ఆ హాస్టల్ విద్యార్థులు మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్‌కి, గవర్నమెంట్ స్కూల్‌కి వెళతారు. ఆ స్కూల్‌లో సంఖ్య తగ్గుతుంది, అక్కడున్న ఉపాధ్యాయులకు పనిభారం తగ్గుతుంది. అందువలన గవర్నమెంట్ మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్స్‌తో అనుసంధానం చేసి, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌తో ఉన్న వాటితో అనుసంధానం చేసి, జిల్లా పరిషత్తు హైస్కూల్స్‌తో అనుసంధానం చేసి, ఒక నూతన విధి విధానం రూపొందించడానికి కమిటీ ఆఫ్ సెక్రటరీలను వేశాం. ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్, ఎస్టీ డిపార్ట్‌మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీలతో ఒక కమిటీ వేయడం జరిగింది. ఆ కమిటీ రికమెండేషన్ ప్రకారం ఈ చరిత్రాత్మక నిర్ణయం గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు తీసుకున్నారు. మన దళిత, గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన, కంప్యూటర్ విద్యను అందించాలి, డిజిటల్ ఎడ్యుకేషన్‌ను ఇవ్వాలని, సమాజంలో వాళ్లను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలనే భావన, డా.బి.ఆర్. అబేండ్కర్ కలలు ఏవైతే ఉన్నాయో, వాటిని సాకారం చేసి సమ సమాజం వైపు అడుగులు వేయాలనే ఒక గొప్ప ఉద్దేశ్యంతో ఈ గొప్ప నిర్ణయం తీసుకోవడం జరిగింది.

(ఆ సందర్భంలో వైఎస్సార్ సీపీ సభ్యులు శ్రీ కంబాల జోగులు, శ్రీ కె. శ్రీనివాసులు తదితరులు లేచి నిలబడి వారి అభ్యంతరాలు తెలియజేశారు.)

**ఉ. 9.50 (6)**

దానిని దశలవారీగా ముందుకు తీసుకెళ్తున్నాము. గతంలో రాజశేఖరరెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2008లో ఎస్సీ కార్పోరేషన్‌ను, ఎన్ఎస్సిఎఫ్‌డీసీని మూసివేశారు. దళితులకు, గిరిజనులకు లోన్లిచ్చే సంస్థలను మూసివేసి, వారిని దగా చేసి, నిరుద్యోగాన్ని పెంచి పోషించిన ఘనత ఆనాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి గారిదే. మా ముఖ్యమంత్రిగారు వచ్చిన తరువాత ఎస్సీ కార్పోరేషన్‌ను, నేషనల్ సఫాయికర్మచారి ఆర్థిక సహకార సంస్థను (ఎన్ఎస్సిఎఫ్‌డీసీ)ని రివైవ్ చేయడం జరిగింది. 2015-16 సంవత్సరానికి వెయ్యి కోట్ల రూపాయల సబ్సిడీ రుణాలను మంజూరు చేసిన ఘనత మా తెలుగుదేశం ప్రభుత్వానిది, మా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారిదని తెలియజేస్తున్నాను. ఇది ఒక చరిత్ర. రాజశేఖర రెడ్డి గారున్నప్పుడు గుండు సున్నా గీసి ఒక్క లోనూ శాంక్షన్ చేయలేదు. ఎస్సీ కార్పోరేషన్ స్థాపించిన 1978 నుంచి 2014 వరకు యావరేజ్ చూసుకుంటే సంవత్సరానికి రూ.60 కోట్లు మాత్రమే ఇవ్వగా మా ప్రభుత్వం వచ్చిన తరువాత 2015-16 సంవత్సరానికి వెయ్యి కోట్ల రూపాయల సబ్సిడీ రుణాలను 83 వేల మంది లబ్దిదారులకు మంజూరు చేశామంటే ఇది ఒక చరిత్ర. దళితుల పట్ల మా ప్రభుత్వానికున్న చిత్తశుద్ధి ఇది. మీరు దళిత వ్యతిరేకులు. ఆ విషయాన్ని మీరు ఎప్పుడో రుజువు చేసుకున్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ గారి పేరు ఉచ్చరించటానికి కూడా మీకు అర్హత లేదని తెలియజేస్తున్నాను. వారిపై చర్చ వచ్చినప్పుడు మీరు వాకౌట్ చేసి, వారిపై జరిగిన చర్చలో పాల్గొనకుండా వెళ్లిపోయిన మీకు రాజ్యాంగమంటే గౌరవం లేదు. చట్టాలంటే లెక్క లేదు. శాసనాలంటే నమ్మకం లేదు, దళితులంటే చిత్తశుద్ధి లేదు. మీరు అంబేడ్కర్ గారి గురించి మాట్లాడుతున్నారంటే అంతకన్నా సిగ్గుచేటైన విషయం మరొకటిలేదని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, జన్మభూమి కమిటీల గురించి మాట్లాడారు. జన్మభూమి కమిటీలను అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్థానిక సభ్యులతో కమిటీ వేసి లబ్దిదారులను ఎంపిక చేయడం కోసం జీవో తీసుకురావడం జరిగింది తప్ప, మేం వచ్చి కొత్తగా వేసింది కాదు. వాళ్ల ఎమ్మెల్యే దానిపై కోర్టుకు వెళ్లడం వలన లబ్దిదారుల ఎంపిక విషయంలో ఒక సంవత్సరం ఆలస్యమైందంటే దానికి కారణం వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేనే. ఎస్సీలకిచ్చే రుణాలను కూడా వాళ్లు కోర్టులకెళ్లి అడ్డుకుంటున్నారంటే ఎస్సీల పట్ల వీళ్లకెంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చు అధ్యక్షా. దళితుల గురించి మాట్లాడే నైతిక హక్కు వాళ్లకు లేదు. వాళ్లు దళిత వ్యతిరేకశక్తులు. దళితులను దగా చేసిన వాళ్లు, దళితులను దోపిడీ చేసిన వాళ్లు. ఎస్సీఎస్టీ ఉప ప్రణాళిక నిధులను దారి మళ్లించి వాళ్లను దోపిడీ చేసి, దగా చేసి, కుంభకోణాలు చేసి వాళ్ల జేబులు నింపుకున్న వాళ్లు. అలాంటి వాళ్లు ఎస్సీల గురించి మాట్లాడుతున్నారంటే అంత కంటే సిగ్గుచేటైన విషయం, నీచమైన విషయం లేదని నేను తెలియజేస్తున్నాను. ( ఆ సందర్భంగా వైసీపీ సభ్యులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు.)

మిస్టర్ స్పీకర్‌: క్వశ్చన్ నెంబర్ 2044.... ప్లీజ్ దయచేసి కూర్చోండి... మినిస్టర్ గారు మీరు అడిగినవీ, అడగబోయేవీ, అడగనివీ అన్నింటికీ జవాబు చెప్పారు. మీరు అడగటానికింకేముందండీ... దయచేసి కూర్చోండి.... ( ఆ సందర్భంగా ప్రతిపక్షనాయకుడు మైకు కోసం లేచి నిలబడ్డారు.) ఎస్..... జగన్మోహన్‌రెడ్డి గారూ..

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి: అధ్యక్షా , ఎస్సీ, ఎస్టీలకు ఎంత కోత పెట్టిందన్నది నిన్న చాలా సుదీర్ఘంగా చెప్పాను. ఇప్పుడు మళ్లీ దాని గురించి చెప్పడం ఎందుకులే అధ్యక్షా? ఇప్పుడు మంత్రి గారు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానాల మీదనే మాట్లాడతాను. సాంఘిక సంక్షేమ శాఖకు 2014-15, 2015-16 సంవత్సరాలకు కేటాయించిన, విడుదల చేసిన, ఖర్చు చేసిన నిధులెంత అని ప్రశ్న అడగడం జరిగింది. 2014-15వ సంవత్సరం అయిపోయింది. 2015-16వ సంవత్సరం కూడా ఇంకొక 15 రోజుల్లో పూర్తవుతుంది. 2014-15వ సంవత్సరంలో సాంఘిక సంక్షేమ శాఖకు రూ.2673 కోట్లుకేటాయించడం జరిగితే ఖర్చు చేసింది మాత్రం కేవలం రు.1600 కోట్లు. అంటే వెయ్యి కోట్లరూపాయలు పంగనామం పెట్టారు. అలాగే 2015-16 సంవత్సరానికి రూ.2124 కోట్లు కేటాయిస్తే ఈ సంవత్సరం పూర్తి కావటానికి ఇంకా 15 రోజులుండగా ఈ మార్చి 15 నాటికి ఖర్చు చేసింది రూ.1090 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు మంత్రి గారు లిఖితపూర్వకంగా తెలియజేశారు. అంటే ఈ సంవత్సరం కూడా దాదాపుగా మరో రూ.1100 కోట్లు పంగనామం పెట్టినట్లు తెలుస్తుంది. దీనినిబట్టే ఎస్సీల మీద వీళ్లు చూపిస్తున్న చిత్తశుద్ధి అర్థమవుతుంది. అటువంటి విషయాలు మాట్లాడకుండా రాజశేఖరరెడ్డిగారి గురించి ఏమేమో మాట్లాడతారు. ఆయన సభలో లేకపోయినా రాజశేఖర రెడ్డి గారు చనిపోయి ఏడు సంవత్సరాలైనా ఇంకా ఆయన గురించి మాట్లాడతారు.(మైకు ఆగిపోయింది.)

శ్రీ రావెల కిశోర్ బాబు: అధ్యక్షా, రాజశేఖరరెడ్డిగారు చనిపోయినా ఆయన ఆత్మ ఇక్కడే తిరుగుతున్నది. అందుకే, మాట్లాడితే దివంగతనేత అని మీరంటున్నారు మేం కాదు. ఆయన 'దిగమింగిన' మహానేత అని మేమంటున్నాం. గౌరవ ప్రతిపక్షనాయకులు వెయ్యి కోట్ల రూపాయలు పంగనామం పెట్టామంటున్నారు. అది చాలా దారుణమైన కామెంట్. అధ్యక్షా, ఏవైతే కేటాయింపులు జరిగాయో సంవత్సరాంతానికి వాటిని ఖర్చుపెట్టి దళితుల సంక్షేమానికి, అభివృద్ధికి, ఈ భారతదేశంలోనే కృషిచేసే రాష్ట్రం మా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రమని, మా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారేనని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. కేంద్రం నుంచి రావలసిన రూ.350 కోట్ల మ్యాచింగ్ గ్రాంట్ రానందువల్ల ఈ సంవత్సరం వెయ్యి కోట్లలో ఆ మేరకు ఖర్చు పెట్టలేకపోయాము. తప్పకుండా కేంద్రం నుంచి నిధులు రాగానే ఖర్చు పెడతాము. ఈ సంవత్సరం మేం బహుశా భారతదేశంలోనే ఎక్కడా లేనివిధంగా ఎస్సీఎస్టీ కాలనీలలో అంతర్గత రోడ్ల ఏర్పాటు కోసం రెండువేల కోట్ల రూపాయలు పంచాయతిరాజ్ డిపార్ట్‌మెంటుకు మంజూరు చేసిన ఘనత మా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారిది. అంతేకాకుండా ఎస్సీ

కార్పోరేషన్‌కు వెయ్యి కోట్ల రూపాయలు మంజూరు చేశాము. అది ప్రాసెస్‌లో ఉంది. సాంకేతిక కారణాల వల్ల కొద్దిగా డిలే అయినప్పటికీ మొత్తం నిధులను నూటికి నూరు శాతం ఖర్చు పెట్టి దళితులకు తప్పకుండా న్యాయం చేసి దళితుల అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తాం. ఇవాళ భారతదేశంలో ఎస్సీఎస్టీ సబ్‌ప్లాన్‌ని చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారంటే అది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమని గౌరవ కేంద్ర మంత్రి ప్రభాత్ సింగ్ గెహ్లోట్ గారు ఒక మీటింగులో చెప్పడం, ఆ పద్ధతిని భారతదేశమంతా అమలు చేయడం కోసం ఒక పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ఏర్పాటు చేయమని చెప్పడం జరిగింది. తప్పకుండా నిధులను నూటికి నూరు శాతం ఖర్చు చేసి దళితులకు న్యాయం చేస్తామని, దళితుల అభివృద్ధి సంక్షేమానికి పెద్ద పేట వేస్తామని తెలియజేస్తున్నాను.

MR SPEAKER: Question No.2044 (45) is postponed at the request of the Member. Question No. 2351 (46), Minister for Irrigation..

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డిః అధ్యక్షా, we stage a walkout on this Question..... అధ్యక్షా, మంత్రి గారు చెప్పింది ఎంత సత్యదూరంగా ఉందంటే ఒకవైపున కేటాయింపులు చేయడం లేదు. ఒకవైపున ఆయన స్వయానా రాసిన లేఖలను ఆధారంగా చూపిస్తున్నాం. అయినా బుల్‌డోజ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. వాళ్ల పాపులేషన్ ప్రకారం వాళ్లకు నిధులను ప్లాన్ బడ్జెట్ కింద పెట్టి వాటిని ఖర్చు చేయాల్సివుండగా వాళ్లు చేసిన కేటాయింపులు, ఖర్చు చేసిన నిధుల గురించి నిన్ననే నేను ఆధారాలతో సహా చెప్పాను. అయినా వీళ్లలో చలనం రావడం లేదు, అబద్దాలు చెబుతూనే ఉన్నారు. చివరికి ఎన్ఆర్ఈజీఏ నిధులను డైవర్ట్ చేసి వాటితో రోడ్లు వేస్తున్నామని సిగ్గులేకుండా చెబుతున్నారు. ఉపాధి హామీ పథకం అన్నది పేదవాడికి కడుపు నింపే పథకం.

ఉ.10.00 (7)

100 రోజులు కూలీలకు పని కల్పిస్తే పేదవారు బతకగలుగుతారు. అటువంటి పథకాన్ని నీరుగారుస్తూ కూలీలకు ఇవ్వవలసిన డబ్బులు వారికి అందించకుండా ఆ నిధులను మళ్లించి సిమెంట్ రోడ్లు వేస్తామంటే ఇంతకంటె దారుణం ఏమైనా ఉందా? మీరంతా ఆ విషయంలో ఆలోచించండి. మీరు సిమెంట్ రోడ్లు వేయవద్దని నేను అనడంలేదు. వాటికి నిధులు కేటాయించుకొని చేయండి. కానీ ఉపాధి నిధులతో సిమెంట్ రోడ్లు వేస్తామని చెప్పి జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను మళ్లించడం ఎంతవరకు ధర్మమని అడుగుతున్నాను. We are staging a walk out on this issue.

(వైఎస్సార్‌సీపీ సభ్యులు సభనుంచి వాకౌట్ చేశారు)

శ్రీమతి కె.మృణాళిని (చీపురుపల్లి): అధ్యక్షా, ఈ రోజు జగన్మోహన్‌రెడ్డిగారు ఉపాధి హామీ నిధుల గురించి మాట్లాడం చాలా దురదృష్టకరం. వారు తెలియక మాట్లాడుతున్నారు. ఉపాధి హామీ పథకంలో 60శాతం కూలీ ఉంటుంది కాబట్టి ఎవరు పనిచేస్తే వారికి వేతనం చెల్లించాలి. 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్ ఉంది. ఆ విధంగా 60శాతం కూలీ, 40శాతం మెటీరియల్ కాంపోనెంట్ ఇస్తారు. ఆ నిధులను గ్రామాలలో సిమెంట్ రోడ్లకు ముఖ్యమంత్రిగారు వినియోగిస్తున్నారు. అంతే తప్ప వేజ్ కాంపోనెంట్ కాదు. దానిని గౌరవ ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్‌రెడ్డిగారు గ్రహించాలి. గత ప్రభుత్వంలో రూ.5వేల కోట్లు వేజ్ కాంపోనెంట్ ల్యాప్స్ అయి తిరిగి కేంద్ర ప్రభుత్వానికి వెళ్లడం జరిగింది. నిజంగా సబ్జెక్ట్ తెలియకుండా మాట్లాడడం చాలా దురదృష్టకరం.

**MR.SPEAKER**: **Question No.2351 (46) From now onwards, single supplementaries.**

**ప్రశ్న నెం.2351 (46)** **గాలేరు – నగరి ప్రాజెక్టు కోసం నిధుల కేటాయింపు**

**సర్వశ్రీ/శ్రీమతి/కుమారి**
**గడికోట శ్రీకాంత్ రెడ్డి,**
**బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి,**
**ఐనయ్య ఎక్కలదేవి,**
**భూమా అఖిలప్రియ – ఎమ్మెల్యేలు.**

**గౌరవనీయులైన జలవనరుల శాఖ మంత్రి గారు దయచేసి ఈ కింది సమాచారం తెలియజేస్తారా:-**

అ) 2014-15 మరియు 2105-16 సంవత్సరాలలో గాలేరు-నగరి ప్రాజెక్టు నిర్మాణానికై రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధుల వివరాలేమిటి;

ఆ) సదరు ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయన్న విషయం ప్రభుత్వానికి తెలుసా;

ఇ) అయితే, ఈ విషయంలో ప్రభుత్వం తీసుకున్నట్టి చర్యలేమిటి;

ఈ) సదరు ప్రాజెక్టు పనులను ఎప్పటిలోగా పూర్తి చేయడమవుతుంది మరియు రైతాంగానికి సాగునీటిని మరియు తాగునీటిని ఎప్పటిలోగా అందించడమవుతుంది?

**గౌ.జలవనరుల శాఖ మంత్రి (శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు):**

అ) కేటాయించిన నిధులు

2014-15 ఆర్థిక సంవత్సర కాలానికి గాను రూ.75.28కోట్లు

2015-16 ఆర్థిక సంవత్సర కాలానికి గాను రూ.483.94కోట్లు

ఆ) పనులు వేగం పుంజుకొని పురోగతిలో ఉన్నాయి.

ఇ) ఒప్పంద అంశాలను పరిష్కరించడం, భూ సమీకరణాన్ని వేగవంతం చేయడం మరియు అటవీ శాఖ అనుమతిని పొందడం మరియు పనులను పూర్తి చేయడానికై సరిపడు బడ్జెట్‌ను కల్పించడంతో సహా ప్రభుత్వం వివిధ చర్యలను తీసుకుంది.

ఈ) 05/2016 నాటికి జిఎన్ఎస్ఎస్ 1వ దశను పూర్తి చేయడమవుతుంది.
03/2018 నాటికి జిఎన్ఎస్ఎస్ 2వ దశను పూర్తి చేయడమవుతుంది.

శ్రీ జి.శ్రీకాంత్‌రెడ్డి (రాయచోటి): అధ్యక్షా, ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న. కొంచెం ఎక్కువ టైం ఇవ్వండి.

MR.SPEAKER: No, only single supplementaries. If you want to talk elaborately, come in a different form. Please co-operate.

శ్రీ జి. శ్రీకాంత్‌రెడ్డి: అధ్యక్షా, ఈ ప్రాజెక్టు రాయలసీమ ప్రాంతానికి ఒక వరం లాంటిది. ఈ ప్రాజెక్టును టేకప్ చేయాలనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు గారు శంకుస్థాపన చేసినా కూడా రాజశేఖరరెడ్డిగారు అధికారంలో ఉన్న 5 సంవత్సరాల కాలంలో ఆ పథకాన్ని పరుగులు తీయించారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో నిధులు కొంచెమే కేటాయించడం తప్ప ఆ ప్రాజెక్టును ఎంత కాలంలో పూర్తి చేస్తారో కూడా అర్థం కాని పరిస్థితి. దానితోబాటు అంచనాలు విపరీతంగా పెంచిన పరిస్థితి. ఉదాహరణకు ఈ ప్రాజెక్టుకు రూ.1800కోట్లతో పరిపాలనా అనుమతి వచ్చింది. కానీ సవరించిన అంచనాల ప్రకారం అవీ ఇవీ పెంచుకుంటూ దానిని రూ.7340కోట్లకు పెంచారు. ఈ ప్రాజెక్టు గురించి బాధపడేది ఏమిటంటే రాయలసీమకు నీరు వస్తాయంటే ఏమి చేయడానికైనా మేం సిద్ధం, ఎటువంటి సహకారం అందించడానికైనా మేం సిద్ధం. కాని ఈ రకంగా తప్పు జరుగుతున్నదని చెబుతుంటే మీరు అభివృద్ధికి ఆటంకాలు కల్పిస్తారనే డైలాగులు మాని అక్కడ జరుగుతున్న అవినీతిపై చర్యలు తీసుకోవాలి. ఒక ప్రాజెక్టు అంచనాలు పెంచడానికి ప్లానింగ్

కమీషన్‌కు లెటర్ పంపించండి. మీరు ఇష్టం వచ్చినట్లు అంచనాలు పెంచినపుడు ప్లానింగ్ కమీషన్‌కు, కేంద్ర జలసంఘానికి లేఖ రాయండి. అంచనాలు పెంచిన విషయంలో కనీసం సిడబ్ల్యూసీకి

కాపీ కూడా పెట్టలేదు, కాబట్టి ఏరకంగా అవినీతి జరుగుతున్నదో అర్థం చేసుకోవాలి. చిన్న ఉదాహరణ చెబుతాను. 61వ క్లాజ్ ప్రకారం కాంట్రాక్టర్లపైన వత్తిడి పెడితే ఆ కాంట్రాక్టర్లు చేసే పరిస్థితి ఉంది. చాలా మంది మరలా జీవో నం.22, 63.........

MR.SPEAKER: Srikanth Reddy garu, I have already told you . Put your supplementaries.

శ్రీ జి.శ్రీకాంత్‌రెడ్డిః అధ్యక్షా, వినండి సార్. జీవో నం.22, 63 ద్వారా ధరలు పెంచడానికి వెసులుబాటు కల్పించారు. ఆ కాంట్రాక్టర్లు మేం పనులు చేస్తామని చెప్పినా కూడా వినకుండా 60సి నిబంధనను చేర్చి వారిని తప్పించి వారికి అనుకూలంగా ఉన్నవారికి టెండర్లు ఇచ్చారు. మొదట్లో అంచనా వ్యయం రూ.10కోట్లు ఉంటే దానిని రూ.150కోట్లకు పెంచారు. దానికి ప్రధాన కార్యదర్శి సంతకం పెట్టడానికి కూడా భయపడ్డారు. (బెల్) అధ్యక్ష, ఒక్క నిమిషం. అదే విధంగా హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-1, ఫేజ్-2లలో కూడా అంచనాలు 5 రెట్లు పెంచారు. హెచ్ఎన్ఎస్ఎస్‌లో 40వ ప్యాకేజ్‌లో రూ.49కోట్లకు కాంట్రాక్టర్లు పూర్తి చేస్తామన్నా కూడా 60సి నిబంధనను తొలగించి దానిని కూడా రూ.180కోట్లకు పెంచారు. అన్నింటికంటె జోక్ ఏమంటే నామినేషన్‌పై హెచ్ఎన్ఎస్ఎస్‌లో ఒక టన్నెల్‌ను ప్యాకేజి నం.20లో కాంట్రాక్టర్లకు అనుభవం లేకపోయినా కూడా రాజకీయ వత్తిడితో ఆ కాంట్రాక్టరును తప్పించి వేరే కాంట్రాక్టర్లను నామినేషన్ మీద ఇచ్చారు. ఒకటి, రెండు కాదు. కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో మొత్తం సుమారు రూ.150కోట్లతో పూర్తి చేయాల్సిన ప్రాజెక్టును (బెల్)...... అధ్యక్షా, ఇది చాలా ముఖ్యమైనది. ఒక్క నిమిషం వినండి. ముగింపుకు వస్తున్నాను. నేను ఎక్కడ కూడా ఆవేశపూరితంగా మగవాళ్లు అనో, దమ్ము, ధైర్యం అనో, సిగ్గు అనో నేను విపరీతమైన భాష మాట్లాడడం లేదు. నీతి, నిజాయతీగా, పారదర్శకంగా ఉండాలని మీరే చెబుతున్నారు కాబట్టి దానికి అర్థం ఉండాలని కోరుతున్నాను. ఇంతకు ముందు విష్ణుకుమార్ రాజు గారు మాట్లాడుతూ ఏదైనా చెబితే ముఖ్యమంత్రిగారు వెంటనే స్పందిస్తారని చెబుతున్నారు కాబట్టి మీద్వారా వారిని కోరుతున్నాను. ముఖ్యమంత్రిగారికి ఈ విషయం తెలుసో, తెలియదో నాకు తెలియదు కానీ, ఒకసారి ఈ ప్యాకేజీలపైన పూర్తి సమాచారం తెప్పించుకోండి. వేల కోట్ల రూపాయల అవినీతి బయటకు వస్తుంది. కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో సింగిల్ టెండరును ఆమోదించారు. ఆ సింగిల్ టెండరర్‌కు అనుభవం లేకపోయినా కూడా ఇచ్చారు. రూ.450కోట్ల రూపాయలు పని. అందులో రూ.300కోట్ల అవినీతి జరిగింది. (మైక్ కట్ చేయబడింది)

మిస్టర్ స్పీకర్ః మీరు ఏమైనా మాట్లాడవచ్చు కానీ I have already told you that from now onwards, only single supplementaries. మీరు చెప్పదలచుకున్న

విషయాలను డిమాండ్లపై, లఘుచర్చలో కూడా మాట్లాడవచ్చు. You come in a different form. Minister Garu.

(INTERRUPTIONS FROM MEMBERS, YSRCP)

You have taken 1hour four minutes for four questions. No.

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావుః అధ్యక్షా, గాలేరు-నగరి ఎత్తిపోతల పథకాన్ని 1988 నవంబర్ 19వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్.టి.రామారావుగారి చేతుల మీదుగా చిత్తూరు జిల్లా రేణిగుంట మండలంలో కరకంబాడి జలాశయం దగ్గర, కడప జిల్లా సిద్ధవటం మండలంలో ముద్దనూరు జలాశయం దగ్గర శంకుస్థాపన చేశారు. 1988లో ప్రారంభమైన ఈ పథకానికి 2007వ సంవత్సరంలో రూ.1080 కోట్లతో పనులు ప్రారంభించి 2012 సంవత్సరానికి రూ.1505కోట్లకు పెంచారు. గత రెండు ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా అంచనాలు పెంచారు. వారి హయాంలో గండికోట జలాశయంద్వారా మైలవరం రిజర్వాయర్‌కు 6టీఎంసీలు, గండికోట జలాశయంకు 26టీఎంసీలు, అవుకు రిజర్వాయర్‌కు 4.2 టీఎంసీలు, గోరకల్లు రిజర్వాయర్‌కు 12టీఎంసీలు, వాగుకుందుకు 1.6టీఎంసీలు, సర్వారాయసాగర్‌కు 3 టీఎంసీలు, చిత్రావతి రిజర్వాయర్‌కు 10టీఎంసీలు, పైడిపాలెం రిజర్వాయర్‌కు 6టీఎంసీలు ఈ విధంగా 68టీఎంసీల నుంచి 70 టీఎంసీలకు పెంచారు. వీరు చెబుతున్న ప్యాకేజీలు కానీ, అవుకు టన్నెల్‌కు కానీ ఈ ప్యాకేజీలలో 2007వ సంవత్సరంలో ప్రారంభమైన పనులు చేసుకోలేని దౌర్భాగ్య పరిస్థితులలో ఉంటే జీవో నం.22, 66 జారీచేసి ఎవరైతే కాంట్రాక్టర్లు కేవలం మట్టిపనులు మాత్రమే చేసుకుంటూ కాంక్రీట్ స్ట్రక్చర్లు వదిలివేస్తే ఆ కాంక్రీట్ స్ట్రక్చర్లను పూర్తి చేసేందుకు మేం చర్యలు తీసుకుంటూ ఎప్పటికప్పుడు పనులు చేయిస్తున్నాం. కాంక్రీట్ స్ట్రక్చర్ డెప్త్ 1.5మీ. ఫౌండేషన్ ఉంటే దానిని 6మీ.ల లోతువరకు వేసి కొండకు ఎఫెక్ట్ చేసి భవిష్యత్తులో 20వేల క్యూసెక్కుల వరద వచ్చినా ఎటువంటి ఇబ్బంది రాకూడదని జాగ్రత్తలు తీసుకొని ఇవాళ 29ఎ ప్యాకేజీ నుంచి 30 ప్యాకేజీలవరకు అవుకు టన్నెల్‌లో జీవో నం.22, 63 జారీ చేసి గౌరవసభ్యులు ఫిర్యాదు చేసినవి గానీ, మిగిలిన అన్నింటినీ పూర్తి చేయడానికి దృష్టి పెట్టాం.

**10.10 (8)**

ఎటువంటి పరిస్థితుల్లోనూ ఏదైతే ఇప్పుడిచ్చిన జీ.ఓ.నెం.2263 తరువాత ప్రైస్ ఎస్కలేషన్ రూ.154 కోట్లు, కంట్రోల్ బ్లాస్టింగ్ పనులు రూ.296 కోట్లు, డీవాటరింగ్ పనులు రూ.26 కోట్లు, abrasive Rock పనులు రూ.33 కోట్లు, రైల్వే క్రాసింగ్‌కు సంబంధించి జాతీయ రహదారి పనులకు రూ.106 కోట్లు, భూసేకరణ, అటవీ భూములు ఖర్చులు పెరిగినందు వలన రూ.27 కోట్లు, మొత్తం రూ.645 కోట్లు పనులు ప్రారంభం చేసినప్పుడు బయటపడ్డాయి.

ఇవన్నీ కేబినెట్‌లో పెట్టి ఒకటి, రెండుసార్లు చర్చించి రూ.2155 కోట్లకు అంచనాలను క్లారిఫై చేసి స్పష్టంగా తెలియచేయడం జరిగింది. 10,000 క్యూసెక్కులతో ఒక టన్నెల్ పూర్తి చేసినట్లైతే గండికోటద్వారా పులివెందుల, కడప జిల్లాలో 60, 70 టిఎంసీల నీళ్లిచ్చే అవకాశం ఉంది. ఆ విధంగా ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు ఎట్టి పరిస్థితుల్లో జూన్‌కు మొదటి టన్నెల్‌ను పూర్తి చేయాలి, బడ్జెట్‌తో సంబంధం లేకుండా పట్టిసీమ కన్నా డబుల్ స్పీడుతో గాలేరు నగరి మొదటి ఫేజు పనులు పూర్తి చేసి కడప జిల్లాకు నీళ్లు తీసుకువెళతామని సభాముఖంగా మీకు తెలియచేస్తున్నాను.

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి (మైకు లేకుండా)ః క్లారిఫికేషన్ సార్.

MR.SPEAKER: Srikanth Reddy garu, please listen. ఈ ప్రశ్నకు సంబంధించి మీ ప్రశ్నే చివరిది కాదు, వారి సమాధానమే చివరిది కాదు. ప్రతీ ప్రశ్నకు ఒక పరిధి ఉందని చెబుతున్నాను. ఇదే అంశం మీద మీరు మాట్లాడటానికి అనేక సందర్భాలు సభలో వస్తాయి. సక్రమంగా ఉపయోగించుకుంటే మీకు మరలా అవకాశాలు వస్తాయి. అంతేగానీ ఇప్పటికే ఒక గంట పదిహేను నిమిషాలు అవుతోంది. ఇప్పటి వరకు 5 ప్రశ్నలు పూర్తి చేయగలిగాం. మిగతా ప్రశ్నలు కూడా ఉన్నాయి కాబట్టి.....

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి (మైకు లేకుండా)ః సార్, ఒక్క నిమిషం ఇవ్వండి.

**MR.SPEAKER: No, Question No.2195 (47) Minister for Backward Classes.**

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి(మైకు లేకుండా)ః సార్, మూడు నిమిషాలు సమయమివ్వండి, పూర్తి చేస్తారు.

(శ్రీ జి.శ్రీకాంత్‌రెడ్డిచే అంతరాయం)

మిస్టర్ స్పీకర్ః శ్రీకాంత్ రెడ్డి గారూ దయచేసి కూర్చోండి.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డిః అధ్యక్షా, ప్రశ్న వేసిన తరువాత, మంత్రి గారు సమాధానం చెప్పిన తరువాత, సప్లిమెంటరీ ఇవ్వడమనేది ధర్మము.

మిస్టర్ స్పీకర్ః ఇచ్చాను కదా.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డిః అధ్యక్షా, ప్రశ్న అడిగింది కూడా శ్రీకాంత్‌రెడ్డిగారే. ప్రశ్న వేసిన తరువాత మంత్రి గారు సమాధానం చెప్పారు, సప్లిమెంటరీకి అవకాశం ఇవ్వండి.

MR.SPEAKER: Jagan Mohan Reddy garu, kindly follow the procedures of the Assembly. Please... నేను చెప్పేది వినండి. ప్లీజ్....

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి (మైకు లేకుండా)ః సార్, మూడు నిమిషాలు మాట్లాడటానికి అవకాశం ఇవ్వండి.

మిస్టర్ స్పీకర్ః మూడు నిమిషాలా, ముప్పై నిమిషాలా ప్రశ్న కాదండీ. ఇప్పటికే గంటా పదిహేను నిమిషాల సమయం అయిపోయింది. 5 ప్రశ్నలు మాత్రమే పూర్తయ్యాయి. సింగిల్ సప్లిమెంటరీస్ మాత్రమే ఉంటాయని నేను ముందే చెప్పాను. సింగిల్ సప్లిమెంటరీ మాట్లాడారు. మంత్రి గారు సమాధానం చెప్పారు. అంతే తప్ప మూడు నిమిషాలా, ముప్పై నిమిషాల అన్న ప్రశ్న కాదు.

(ఈ సందర్భంలో శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి మాట్లాడటానికి అవకాశం ఇవ్వాలని పదే పదే అభ్యర్థించసాగారు – శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డికి మాట్లాడటానికి అవకాశం ఇవ్వాలని శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి కోరసాగారు)

(అంతరాయం)

Jagan Mohan Reddy garu, you also understand the conventions of the House. మీరు సభా సంప్రదాయాలు తెలుసుకోండి. ఒకే ప్రశ్నను సాగదీస్తే మిగతా ప్రశ్నలు వేసిన సభ్యులు ఏమవుతారు? దయచేసి అర్థం చేసుకోండి. You can have other opportunity in different time. Yes, Minister for Backward Classes.....
As a Leader of the Opposition you want to add anything.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డిః అధ్యక్షా, ఈ ప్రశ్న వేసిన వాళ్లలో మిగిలిన సభ్యులు రాజేంద్రనాథ్‌రెడ్డి మరియు ఐజయ్య ఇద్దరూ మాపార్టీ సభ్యులే. వాళ్లు ప్రశ్నలోకే వెళ్లలేదు.

మిస్టర్ స్పీకర్ః రాదండీ. సింగిల్ సప్లిమెంటరీ మాత్రమే వస్తుంది.

శ్రీ వై.ఎస్.జగనోహ్మన్ రెడ్డిః ఈ ప్రశ్నలో వాళ్ల పేర్లున్నాయి. కనీసం ఆయన ఏమి చెబుతారో వినే పరిస్థితి కూడా లేదు.

మిస్టర్ స్పీకర్‌: మీరు అసెంబ్లీ ప్రొసీజర్ తెలుసుకోండి. Kindly understand.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి: సింగిల్ సప్లిమెంటరీ అంటున్నారు. అందుకు శ్రీకాంత్‌రెడ్డి గారికి అవకాశం ఇవ్వాలి కదా? శ్రీకాంత్‌రెడ్డి అనే వ్యక్తి ప్రశ్న వేసిన తరువాత సింగిల్ సప్లిమెంటరీకి అనుమతించాలి కదా? మూడు నిమిషాలు పడుతుంది.

మిస్టర్ స్పీకర్‌: నో.. మినిస్టర్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్.... (ప్రతిపక్ష నాయకుడు శ్రీ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిగారినుద్దేశించి) ప్లీజ్... అర్థం చేసుకోండి. దయచేసి కూర్చోండి.

**ప్రశ్న నెం.2195 (47)** **చేనేత పరిశ్రమకు రక్షణ**

**శ్రీ మోదుగుల వేణుగోపాల రెడ్డి, ఎం.ఎల్.ఎ.,**

**గౌరవనీయులైన వెనుకబడిన తరగతుల సంక్షేమం, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా ;**

అ) జౌళి ఉత్పత్తుల దేశీయ డిమాండులో తగ్గుదల, దారం యొక్క అధిక ధర మరియు ప్రపంచ ఆర్థిక మాంద్యం వంటి కారణాల వల్ల చేనేత పరిశ్రమ ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయం మరియు కార్మికులు నిరుద్యోగులవుతున్న విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, కార్మికులతో సహా చేనేత పరిశ్రమను సంరక్షించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతోపాటు ఆ వివరాలేమిటి ;

ఇ) చేనేత రంగ కార్మికులను ప్రోత్సహించడానికి నిధులను సమకూర్చడమయిందా ;

ఈ) అయితే, ఆ వివరాలేమిటి?

**వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఆబ్కారీ మరియు చేనేత పరిశ్రమ శాఖ మంత్రి (శ్రీ కొల్లు రవీంద్ర):**

అ) అవునండీ.

ఆ) చేనేత పరిశ్రమ ఈ క్రింది కారణాల వల్ల ఇబ్బందులను ఎదుర్కొంటున్నది :

1) చేనేత పరిశ్రమ మరమగ్గం రంగం మరియు సమిష్టి మిల్లు రంగాల నుండి గట్టి పోటీని ఎదుర్కొంటున్నది.

2) చేనేత ఉత్పత్తులకు కొంత మంది ప్రజలు మాత్రమే ఆకర్షితులవుతున్నారు.

3) చేనేత రంగంలో వేతనాలు తక్కువగా ఉన్న కారణంగా చాలామంది చేనేత కార్మికులు ముఖ్యంగా యువతరం ఇతర వృత్తులలోకి వలసపోతున్నారు.

**చేనేత ఉత్పత్తుల విక్రయాలను పెంచడానికి మరియు ఉపాధి కల్పనకు ప్రభుత్వం ఈక్రింది చర్యలను చేపడుతున్నది ః**

1) నేత బజార్లను ఏర్పాటు చేయడమయింది.

2) చేనేత ప్రదర్శలను నిర్వహించడమవుతున్నది.

**చేనేతకారులకు సంక్షేమ పథకాలు ః**

ఎ) మహాత్మాగాంధీ బంకర్ బీమా యోజన (ఎంజిబిబివై)

బి) నేతకారులకు అంత్యోదయ కార్డులు.

సి) సహకార నేతకార సభ్యుల కోసం పొదుపు నిధి పథకం

డి) ఎన్‌టిఆర్ ఆరోగ్య సేవ క్రింద ఆరోగ్య కార్డులు

ఇ) ఎన్‌టిఆర్ భరోసా (పింఛను) పథకం

ఎఫ్) నేతకారులకు రూ.110.96 కోట్ల రుణ విమోచనం

జి) 20 శాతం ఏక పర్యాయ రిబేటు

హెచ్) 20 శాతం నూలు సబ్సిడీ

ఇ) అవునండీ.

ఈ) వివరాలు ః

1. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2015–16లో వివిధ పథకాల క్రింద రూ.135.27 కోట్ల మొత్తాన్ని మంజూరు చేసింది.

2. కేంద్ర ప్రభుత్వం 2015–16 లో రూ.15.72 కోట్ల మొత్తాన్ని విడుదల చేసింది.

3. 2015–16లో చేనేతకారులకు రూ.11.40 కోట్ల మొత్తంతో 2,735 క్రెడిట్ కార్డులను జారీ చేయడమయింది.

శ్రీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి (గుంటూరు వెస్ట్)ః అధ్యక్షా, చాలా దయనీయ స్థితిలో ఉన్నటు వంటి హ్యాండ్‌లూమ్ గురించి మాట్లాడటానికి అవకాశం ఇచ్చినందుకు ముందుగా మీకు ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాను. చాలా బాధాకరం. 175 మంది సభ్యులున్న ఈ అసెంబ్లీలో చేనేతకు సంబంధించి పద్మశాలీలు గానీ, దేవాంగ కమ్యూనిటీలో ఒక్కరు కూడా సభ్యులుగా లేకపోవడం బాధాకరం. రాబోయే రోజుల్లో చట్టపరమైన రిజర్వేషన్లు కాకుండా ఇద్దరు శాసనసభ్యులనైనా ఈ సభలోకి ప్రవేశింపచేసే కార్యక్రమం చేపడితే బాగుంటుందని నేను ఇక్కడున్న పొలిటికల్ పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నాను.

ముఖ్యంగా పవర్‌లూమ్స్ వర్సెస్ హ్యాండ్‌లూమ్స్ చూసినప్పుడు పూర్తిగా హ్యాండ్‌లూమ్స్ అనేది ఓడిపోతున్నది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు చేనేత కార్మికుల పాలిట శాపాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా నేను మంత్రిగారిని నేరుగా అడుగుతున్నాను. హ్యాండ్‌లూమ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ నుంచి చేనేత వరకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయిస్తున్నారా లేదా అని అడుగుతున్నాను. ఎందుకంటే టెక్స్‌టైల్ మినిస్ట్రీలో చేనేత కార్మికులకు ఇచ్చే నిధులు చాలా తక్కువగా ఉంటున్నాయి. 2016–17 సంవత్సరంలో చేనేత కార్మికులకు ప్రత్యేకంగా బడ్జెట్ ఇస్తున్నారా, లేదా అని అడుగుతున్నాను. రెండవది కేంద్ర ప్రభుత్వం 1985 లో 11 ఉత్పత్తులు తప్పనిసరిగా పవర్‌లూమ్స్ కాకుండా హ్యాండ్‌లూమ్స్ ద్వారానే ఉత్పత్తి చేయాలన్నప్పుడు అవి ఈరోజున పవర్‌లూమ్స్ తయారు చేస్తుంటే చోద్యం చూస్తున్నారా అని మంత్రి గారిని అడుగుతున్నాను. ఎందుకంటే చీరలు గానీ, ధోవతులు గానీ, టవల్స్ గానీ, లుంగీలు గానీ 11 రకాల ఉత్పత్తులు చేతులతో తయారు చేయాలని కేంద్ర ప్రభుత్వం నార్మ్స్ ఉన్నా కూడా వాటిని మానిటరింగ్ చేయడానికి మీరు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకుని పవర్‌లూమ్స్ మీద చర్యలు తీసుకుంటున్నారా? దీనిని హ్యాండ్‌లూమ్స్‌కు పరిమితం చేయడానికి మీ దగ్గర ఉన్న చర్యలేమిటని మంత్రి గారిని అడుగుతున్నాను.

పట్టు పరిశ్రమ మీద ఆధారపడుతున్న వారికి 4 కేజీల పట్టుని రూ.150/– సబ్సిడీతో ఇస్తున్నారు. నేను మంత్రి గారిని అడిగేదేమంటే నాకొచ్చిన విజ్ఞాపనల ప్రకారం మీరు ఒక కిలో ముడిపట్టుకి 4 కిలోలకు రూ.1500/– సబ్సిడీ పెంచే అవకాశం ఉందా లేదా అని

అడుగుతున్నాను. ఈరోజు చాలా వేగవంతమైన పవర్‌లూమ్స్ వచ్చాయి. ముఖ్యంగా షెటిల్‌లెస్ ఎయిర్ జెట్‌లూమ్స్ రోజుకి 500 రన్నింగ్ మీటర్ల ఉత్పత్తి చేస్తూ వెయ్యి మంది చేనేత కార్మికుల పొట్టకొట్టే విధంగా ఉన్నాయి. అటువంటి పవర్‌లూమ్స్‌ని మీరు ఆంధ్రప్రదేశ్‌కు ఇంట్రడ్యూస్ చేస్తున్నారా లేకపోతే చేనేత కార్మికుల సంక్షేమమే మాకు ముఖ్యమనే భావనతో ఈ పవర్‌లూమ్స్‌కి ప్రోత్సాహాలు ఇవ్వకుండా వాటిని వెనకపెట్టే కార్యక్రమం ప్రభుత్వం చేస్తున్నదా అని అడుగుతున్నాను. ఈరోజు ప్రైమరీ హ్యాండ్‌లూమ్ కోఆపరేటివ్ సొసైటీలు కార్మిక చట్టాలు వర్తించే దానినిబట్టి దానికి ప్రత్యామ్నాయంగా ఈరోజున ఇండస్ట్రియల్ కోఆపరేటివ్ సొసైటీలు ఏమైనా సెటప్ చేయాలనుకుంటున్నారా? ముఖ్యంగా ఇ.ఎస్.ఐ., పి.ఎఫ్., బోనస్, గ్రాట్యుటీ ఎవైల్ చేయడానికి ఏవైనా ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఉన్నాయా తెలియచేయాలని నేను మంత్రి గారిని నేరుగా అడుగుతున్నాను.

10.20 AM (9)

శ్రీ కొల్లు రవీంద్ర (మచిలీపట్నం): అధ్యక్షా, గౌరవ సభ్యులు వేణుగోపాలరెడ్డిగారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతున్నాను. చేనేత వర్గాలకు రాజకీయంగా గుర్తింపు నిచ్చింది ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమే. ఇవాళ నిమ్మల కిష్టప్పగారు పార్లమెంటు సభ్యుడిగా ఉన్నారు, వారు గతంలో కూడా మంత్రిగా పని చేయడం జరిగింది. అలాగే మంగళగిరి నుంచి ఒక సభ్యుడికి అవకాశమిస్తే అతి తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోవడం జరిగింది. అలాగే కదిరి నుంచి కూడా మరో సభ్యుడు పోటీ చేయడం జరిగింది. అక్కడ కూడా తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోవడం జరిగింది. కానీ రాబోయే రోజుల్లో తప్పకుండా రాజకీయంగా చేనేత వర్గాల వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించేది ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమేనని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈరోజున చేనేతకు సంబంధించిన వారిని ఏ రకంగా ప్రోత్సహించాలనే దాని కోసం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సుదీర్ఘంగా ఆలోచించి అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోంది. ముఖ్యంగా కొన్ని ఉత్పత్తుల మీద ఉన్న బ్యాన్ గురించి గౌరవ సభ్యులు అడగటం జరిగింది. వాటి కోసం ఒక ఎన్‌ఫోర్స్‌మెంటు వింగ్‌ను తిరుపతిలో ఏర్పాటు చేయడం జరిగింది. ఆ ఎన్‌ఫోర్స్‌మెంటు వింగ్ వారు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎక్కడైనా పవర్‌లూమ్స్ వాళ్లు గానీ, వేరే రకంగా ఈ ప్రోడక్ట్స్‌ని ఏమైనా ప్రొడ్యూస్ చేసినట్లయితే వారి మీద చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అలాగే సిల్క్ సబ్సిడీ గురించి అడిగారు. అది సెరీకల్చర్ క్రిందకు వస్తుంది. తప్పకుండా సెరీకల్చర్ వారితో మాట్లాడి అదనంగా వారికి వచ్చే సబ్సిడీ గురించి తప్పకుండా ప్రయత్నం చేయడం జరుగుతుంది. అలాగే పవర్‌లూమ్స్‌ని మేము ఎక్కడా ప్రోత్సహించడం లేదు. హ్యాండ్‌లూమ్స్‌ని మాత్రమే ఎక్కువ శాతం ప్రోత్సహిస్తున్నాం. ముఖ్యంగా, గత 10 సంవత్సరాల కాలంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కేవలం బడ్జెట్లో కేటాయింపులను మాత్రమే చూపించే వారు, ఖర్చు పెట్టేది చాలా తక్కువ ఉండేది. కానీ ఈరోజున మేము 2015-16 సంవత్సరానికి సంబంధించి దాదాపుగా రూ.156.39 కోట్లను ఖర్చు పెట్టడం జరిగింది. చేనేత కార్మికులు పడుతున్న కష్టాలను గమనించి, మొట్టమొదటిసారి గౌరవ

ముఖ్యమంత్రి గారు 25 వేల మంది చేనేత కార్మికులకు రూ.110 కోట్ల మొత్తాన్ని చేనేత ఋణమాఫీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. ఈ రకంగా ఈ ప్రభుత్వం అన్ని కార్యక్రమాలను చేసుకుంటూ ఈ సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్లో రూ.125 కోట్లను కేటాయించడం జరిగింది. ఇదికాకుండా బీసీ సబ్‌ప్లాన్ నుండి కూడా మనకు వచ్చే నిధులను తప్పకుండా చేనేత కార్మికులకు పెద్దఎత్తున ఖర్చు పెట్టడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. అనేక కార్యక్రమాలతో ఈరోజున చేనేత వర్గాల భవిష్యత్తు కోసం ఈ ప్రభుత్వం అన్ని రకాలుగా చిత్తశుద్ధితో పని చేస్తుంది. 50 సంవత్సరాల వయస్సు దాటిన వారికి నెలకు రూ.1000 చొప్పున 86 వేల మందికి పింఛన్లను కూడా ఇవ్వడం జరుగుతోంది. ఇది కాకుండా అంత్యోదయ కార్డులను కూడా ఇస్తున్నాం. ఆప్కోను కూడా బలోపేతం చేసి ఆప్కో ద్వారా పెద్దఎత్తున సొసైటీల నుంచి బట్టలను సేకరించడం జరుగుతోంది. గతంలో 2006-07 సంవత్సరంలో రూ.50 కోట్ల విలువైన బట్టలను తీసుకుంటే ఈరోజు రూ.300 కోట్ల విలువైన సరకును చేనేత కార్మికుల నుండి ప్రభుత్వమే స్వయంగా ఆప్కో ద్వారా సేకరిస్తుంది. ఇది కాకుండా భవిష్యత్తులో కూడా నేత బజార్లను ఏర్పాటు చేసి వాళ్లను ప్రోత్సహించాలని, అలాగే జనతా వస్త్రాలను కూడా ప్రవేశపెట్టాలని గౌరవ ముఖ్యమంత్రి గారు ఆలోచన చేస్తున్నారు. తప్పకుండా చేనేత వర్గాల అభివృద్ధి కోసం ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఈ సందర్భంగా మీకు తెలియజేస్తున్నాను.

**MR.SPEAKER: Question No.2215 (48), Minister for Municipal Administration.**

డా.పి.నారాయణ (పురపాలక పరి పాలన మరియు పట్టణాభివృద్ధి శాఖా మంత్రి) : అధ్యక్షా మొదటి ప్రశ్నకు సమాధానం ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగాన్ని సమకూర్చడం మినహా మిగిలిన రెండింటినీ సమకూర్చడానికి హామీనివ్వడం జరిగింది.

(ఈ దశలో ప్రధాన ప్రతిపక్ష నాయకులు శ్రీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తమకు అవకాశం ఇవ్వాల్సిందిగా గౌరవ సభాపతిని కోరసాగారు)

MR.SPEAKER: One minute. ఎస్.. జగన్మోహన్‌రెడ్డి గారూ..

శ్రీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి : అధ్యక్షా మంత్రిగారు చేనేత కార్మికుల మీద ప్రేమ చూపిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2015-16 సంవత్సరానికి వివిధ పథకాల క్రింద..

MR.SPEAKER: As an Opposition Leader, I have respect for you. కానీ మీరు క్వశ్చన్ అయిపోయి రెండో క్వశ్చన్‌కి వెళ్లిన తర్వాత మళ్లా వెనక ప్రశ్నల గురించి మాట్లాడటం ఎంతవరకు కరెక్టండీ?

శ్రీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి (మైకు లేకుండా): నేను చెయ్యెత్తాను అధ్యక్షా మీరు చూడలేదు.

మిస్టర్ స్పీకర్ : నేను చూడలేదని చెప్పొద్దండీ. నేను అన్ని వైపులా చూస్తుంటాను.

శ్రీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి (మైకు లేకుండా) : నేను చెయ్యెత్తాను సార్.

MR.SPEAKER: No, it is not correct. ఎజెండా ఐటెమ్ మూవ్ అయి పోయిన తర్వాత మళ్లా వెనక్కు వెళతానంటే ఎజెండాను వెనక్కు తీసుకుపోలేరండి**.** Any way, you speak.

శ్రీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి: అధ్యక్షా ఈ విషయం మీద We are staging a walk out కాబట్టి అడుగుతున్నాము.

MR.SPEAKER: Whatever it is, ఎజెండాలో ఉన్నప్పుడే అడగాలి మీరు.

శ్రీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి: అధ్యక్షా 2015-16 ఆర్థిక సంవత్సరంలో చేనేత కార్మికులకు వీళ్లు ఎంత కేటాయించారని అడిగితే రూ.135 కోట్లు అంటారు. కేంద్ర ప్రభుత్వం 2015-16లో రూ.15.72 కోట్ల మొత్తాన్ని విడుదల చేసిందని అంటారు. 2015-16లో చేనేత కార్మికులకు రూ.11.40 కోట్ల మొత్తంలో 2735 క్రెడిట్ కార్డులను జారీ చేయడమైందని అన్నారు. రూ.110 కోట్లను 25 వేల మంది చేనేత కార్మికులకు మాత్రమే ఋణమాఫీ చేశామని చెబుతున్నారు. వ్యవసాయ రంగం తర్వాత రెండవ అతి పెద్ద రంగం ఏదైనా ఉందంటే అది చేనేత రంగం. ధర్మవరంలో చేనేత కార్మికులకు ఋణమాఫీకాక 12 మంది చనిపోతే వాళ్ల ఇళ్లకు వెళ్లి వాళ్ల బాధలు విన్నాం. ఎవరికీ ఋణాలు మాఫీ కాలేదు. పైగా సబ్సిడీలు కూడా రావడం లేదు. అంతటి దారుణమైన పరిస్థితిల్లో చేనేత కార్మికులంతా విలవిల్లాడుతుంటే, ఈయన కేవలం రూ.110 కోట్లను మాత్రమే ఋణమాఫీకి పెట్టాము, ఆ ఋణమాఫీ ద్వారా కేవలం 25 వేల మందికి మాత్రమే ఋణమాఫీ చేశాం, ఇంతటితో అయిపోయిందని చెప్పే పరిస్థితి చూస్తుంటే, నిజంగా బాధాకరమైన అంశం. దీనికి నిరసన తెలుపుతూ మేము సభ నుండి వాకౌట్ చేస్తున్నాం.

(Stating so, YSRCP Members walked out from the House)

శ్రీ కొల్లు రవీంద్ర: అధ్యక్షా ఈరోజున చేనేత కార్మికులకు ఎంతైతే అప్పు ఉందో అంతా కూడా తీర్చాలని మేము ఆదేశించడం జరిగింది. బ్యాంకర్ల దగ్గర నుంచి వచ్చిన వివరాల ప్రకారం ఈ 25 వేల మందికి రూ.110 కోట్లు రావడం జరిగింది. ఎన్ని వందల కోట్లు ఉన్నా సరే

తీర్చడానికి ఈ ప్రభుత్వం ఎప్పుడూ చిత్తశుద్ధితో ముందు ఉందని ఇండివిడ్యువల్ లోన్స్ అన్నీ కూడా మేము మాఫీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేస్తున్నాను.

**మిస్టర్ స్పీకర్: ప్రశ్న నెం.2215 (48)**

**రాజధాని ప్రాంతంలోని రైతు కుటుంబాలకు ఉపాధి అవకాశాలు**

**సర్వశ్రీ**
**ఆళ్ల రామకృష్ణారెడ్డి,**
**శ్రీమతి ఉప్పులేటి కల్పన,**
**శ్రీ కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు -ఎం.ఎల్.ఏలు.**

**గౌరవనీయులైన పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?**

అ) రాజధాని నగర నిర్మాణం కోసం తమ భూములను ఇచ్చినట్టి ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగాన్ని సమకూర్చడంతోబాటుగా రైతుల కుటుంబాలకు వైద్య చికిత్సను, ఉచిత విద్యను అందిస్తామని ప్రభుత్వం హామీనిచ్చిన విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, ఇప్పటి వరకు ఉపాధి అవకాశాలను సమకూర్చినట్టి వారి సంఖ్య ఎంత? ఆ వివరాలేమిటి?

ఇ) లేనట్లయితే, అందుకు గల కారణాలు, తమ భూములను ఇచ్చినట్టి రైతుల కుటుంబాలలోని వారందరికీ ఎప్పటిలోగా ఉపాధి అవకాశాలను సమకూర్చడమవుతుంది?

**పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి (డా.పి.నారాయణ):**

అ) అవునండీ. అట్టి ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగాన్ని సమకూర్చడం మినహా మిగిలిన అన్నింటిని సమకూర్చడానికి హామీ ఇవ్వడమయింది.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

(దశలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు సభలోకి ప్రవేశించారు)

శ్రీ ఆళ్ల రామకృష్ణారెడ్డి (మంగళగిరి) : ధన్యవాదాలు అధ్యక్షా. కాస్త భయమేసింది, ఎందుకంటే మొన్న కూడా నా ప్రశ్న అనగానే అన్యాయంగా నన్ను తొక్కేయడం జరిగింది. అయితే నేను ఒక్కటే ఈ సందర్భంగా మంత్రి గారిని కోరుతున్నాను.

MR.SPEAKER: What do you mean by that? ఆ మాటకు అర్థమేమిటి?

శ్రీ ఆళ్ల రామకృష్ణారెడ్డి : నా ప్రశ్న రాబోయే ముందు..

MR.SPEAKER: You are one of 175 Members. అందరికీ ఎట్లా ఉంటుందో మీకు కూడా అట్లాగే ఉంటుంది. Do not pass unnecessary and derogatory comments.

శ్రీ ఆళ్ల రామకృష్ణారెడ్డి: సరే సార్. ఈ సందర్భంగా నేను ఒక్కటే మంత్రి గారిని కోరుతున్నాను. ఒక్కసారి సీఆర్‌డీఏ చట్టంలో, వైబ్‌సైట్లో ఏమేమి వాగ్ధానాలు చేశారో, రైతులు, పేదవాళ్ల కోసం చూడమని నేను కోరుతున్నాను. ఎన్నో వాగ్దానాలు చేశారు. అన్ని వాగ్దానాల్లో కూడా ఏ ఒక్కటి ఈరోజు వరకు నెరవేర్చలేకపోయారు. అందులో భాగంగా ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగం ఇస్తామని చెప్పి, ఈరోజున ఆ వాగ్దానం లేదని చెప్పడమనేది చాలా అన్యాయం. ఎందుకంటే ముఖ్యమంత్రి గారు నిన్న కూడా సభలో చెప్పారు. ఏం చెప్పారంటే 30 వేల ఎకరాలను ఇచ్చిన రైతులందరికీ నేను శిరస్సు వంచి నమస్కారాలు తెలియజేస్తున్నాను అన్నారు. అలాంటి రైతన్నకు వాళ్ల పొలాలు పోయి, వ్యవసాయం లేక, ఉపాధిలేక ఇబ్బందిపడుతున్న తరుణంలో మీరు చెప్పిన, చేసిన వాగ్దానం ఏదైతే ఇంటికొక ఉద్యోగం ఇస్తామని అన్నారో, ఆ ఉద్యోగం ఇవాళ మేము ఇవ్వలేకపోతున్నామని చెప్పడం అన్యాయం. అంతేకాదు మరొకటి ఏం చేశారంటే తప్పులతడకతోటి ఒక ఇన్యుమరేషన్ చేయడం జరిగింది. ఆ ఎన్యుమరేషన్‌లో 50 వేల మంది పై చిలుకు ఉద్యోగాలకు అర్హులైన యువతీయువకులు ఉంటే, వాళ్లలో కేవలం 26 వేల మంది మాత్రమే అని చెబుతూ, వాళ్లలో ఫేజ్ -1 క్రింద 6000 మందిని ఎంపిక చేసి, దాంట్లో కేవలం 113 మంది యువతీయువకులను మాత్రమే ఎంపిక చేసి, వాళ్లను ఆచార్య నాగార్జునా యునివర్శిటీలో కానివ్వండి, చిలకలూరిపేట దగ్గర ఉన్న స్పిన్నింగ్ జిన్నింగ్ మిల్స్‌లో కానివ్వండి, చివరకు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు కూడా తీసుకెళ్లి ట్రైనింగ్ అని ఇచ్చి, ఆ ట్రైనింగ్‌లో ఒక్క రూపాయి కూడా స్టైపెండ్ ఇవ్వకుండా, కనీసం బస్ ఛార్జీలను కూడా చెల్లించకుండా, వాళ్లు తిరిగి సీఆర్‌డీఏ ఆఫీసుల దగ్గరకు వచ్చి మేము సంవత్సర కాలంగా మీరు చెప్పిన వాగ్దానాలకు కట్టుబడి, బయట చేస్తున్న ఉద్యోగాలను కూడా ఒదిలేసి ఇక్కడికి వచ్చాం,

మాకెందుకు ఉద్యోగాలను ఇవ్వరని ప్రశ్నిస్తున్న తరుణంలో వాళ్లను నిర్దాక్షిణ్యంగా పోలీసులతో కొట్టించిన సంఘటనలు ఉన్నాయి. చివరికి జరిగిన ఈ అన్యాయాన్ని చూడలేక, అక్కడ ఉన్న సోషల్ డైరెక్టర్ ఒక అతను రాజీనామా చేయడం కూడా జరిగింది. ఇంత అన్యాయం జరిగినా కూడా ఈరోజున ప్రభుత్వం మేము ఈ హామీ ఇవ్వడం లేదని చెప్పడం మాత్రం దారుణం, ఇప్పటికైనా మంత్రి గారిని ఒక్కటే అడుగుతున్నాం. ఆయ్యా మంత్రి గారు మీరు అక్కడ చేస్తున్న తాత్కాలిక రాజధాని నిర్మాణంలో, యువతీయువకులకు ఎట్లాగునా ఉద్యోగాలను ఇవ్వడం లేదు కాబట్టి, మేము తప్పు చేశామని చెబుతున్నారు కాబట్టి, కనీసం సిమెంటు బొచ్చులు మోసే పని కూడా వాళ్లకు అక్కడ ఇవ్వలేకపోవడం దారుణం. మీరు ఇప్పటికైనా సరే, మీ కోసం, రాజధాని కోసం, స్థలాలు, పొలాలను ఇచ్చిన రైతన్నల కుటుంబాల్లో ఇంటికొక ఉద్యోగం ఇవ్వాలి. లేని పక్షంలో మీరు చెప్పినట్లుగానే ఆ రూ.2000 నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాల్సిందిగా కోరుతున్నాము.

**ఉ.10.30 (10)**

MR SPEAKER: Yes, Minister for Municipal Administration............

డా.పి. నారాయణః అధ్యక్షా, సభ్యులు సి.ఆర్.డి.ఎ. యాక్ట్ చదివినట్టు లేదు. సి.ఆర్.డి.ఎ. యాక్ట్ లోని షెడ్యూల్ 3 లోని 3rd point లో చాలా క్లియర్‌గా "Skill Development Institution and provide training with stipend to enhance the skills of cultivating tenants, agriculture labours and other needy persons". అంటే, స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఇస్తామని యాక్ట్‌లో చెప్పడం జరిగింది గానీ, ప్రతి ఇంటికి ఉద్యోగం ఇస్తామని షెడ్యూల్ 3లోని మూడవ పాయింట్ నందు చెప్పలేదు. మీరు అక్కడ అందరినీ రెచ్చగొడుతున్నారు. మీరు రెచ్చగొడుతున్నారు. బాధితులను మీరే సి.ఆర్.డి.ఎ. కార్యాలయానికి పంపించి లేని పోని ఇబ్బందులు కల్పిస్తున్నారు.

శ్రీ ఆళ్ల రామకృష్ణారెడ్డి (మంగళగిరి): అధ్యక్షా...........

మిస్టర్ స్పీకర్: మీరు మాట్లాడారు కదా? దయచేసి కూర్చోండి. మినిస్టర్ గారిని సమాధానం చెప్పనీయండి. Yes, Minister garu.............

డా. పి.నారాయణః అధ్యక్షా, సభ్యులు అడిగిన దానికి నేను చెబుతాను. స్కిల్ డెవలప్‌మెంట్‌కు అర్హులైన వారిని గుర్తించడం కోసం అక్కడ క్షేత్ర స్థాయిలో House hold survey చేయిస్తే, 6,500 మందికి స్కిల్ డెవలప్‌మెంట్ అవసరమవుతుందని తెలిసింది. అందులో ఎవరెవరికి స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ కావాలని invite చేస్తే, అందులో 486 మంది ట్రైనింగ్ తీసుకోవడానికి ముందుకు వచ్చారు. వారికి 12 institutions ద్వారా స్కిల్

డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఇప్పించడం జరిగింది. అందులో కూడా 151 మంది వివిధ ఉద్యోగాల్లో చేరటం కూడా జరిగింది.

శ్రీమతి ఉప్పులేటి కల్పన (పామర్రు): అధ్యక్షా........

MR SPEAKER: I have already told, సింగల్ సప్లిమెంటరీ అని చెప్పడం జరిగింది. దయచేసి కూర్చోండి కల్పన గారు.........

**Yes, Question No. (49) 2434 Minister for Irrigation.**

ప్రశ్న నెం**2434 (49)** **రబీ సీజన్‌లో సాగునీటి ఎద్దడి**

**శ్రీ గొల్లపల్లి సూర్యారావు, ఎమ్మెల్యే**

**గౌరవనీయులైన జల వనరుల శాఖామంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:**

అ) తూర్పు గోదావరి జిల్లాలోని డెల్టా ప్రాంతంలో ఈ రబీ సీజన్ (రెండవ పంట) లో సాగునీటి కొరత ఉన్న విషయం వాస్తవమేనా ;

ఆ) నీటి సామర్ధ్యాన్ని పెంచడం కోసం మురుగు మరియు పంట కాలువలపై అడ్డుకట్టలను నిర్మిస్తున్న విషయం వాస్తవమేనా ;

ఇ) గోదావరి నదిలో లభ్యంగా ఉన్న నీటిని తోడి, ఆ నీటిని ఈ డెల్టాలోని ఈ రబీ సీజన్ కాలంలో రైతులకు సమకూర్చడానికి వెలిచెరి, జిట్టుగ, వేమగిరి, వనపల్లి వద్ద భారీగా నీటిని తోడే యంత్రాలను సిద్ధంగా ఉంచే ప్రతిపాదన ఏదైనా ఉందా ;

ఈ) అయితే, ప్రభుత్వం కేటాయించిన నిధులు, సదరు నిధులను దేని ఆధారంగా విడుదల చేస్తారు?

జల వనరుల శాఖా మంత్రి (శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు (మైలవరం):

అ) అవునండి.

ఆ) అవునండి.

ఇ) అవునండి.

ఈ) ఈ పని కోసం ప్రభుత్వం ఎటువంటి ప్రత్యేక నిధులను కేటాయించలేదు. అయితే ఈ ఖర్చును కేటాయించిన ప్రణాళిక / ప్రణాళికేతర / అదనపు నిధుల నుండి భరించడమవుతుంది.

శ్రీ గొల్లపల్లి సూర్యారావు (రాజోలు): స్పీకర్ సార్, మంత్రి గారికి ప్రత్యేకమైనటువంటి ధన్యవాదాలు. నేను అడిగేటటువంటి ప్రతి ప్రశ్న సమంజసమైనటువంటి ప్రశ్న. అక్కడ రైతాంగం యొక్క ప్రయోజనాలను కాపాడే అంశం ఉన్నదనేటటువంటి నమ్మకంతో "అవునండి, అవునండి" అని మంత్రి గారు చెప్పడం జరిగింది. అందుకు గాను మంత్రి గారిని మనస్ఫూర్తిగా అభినందిస్తూ వారికి ధన్యవాదాలు కూడా తెలియజేస్తున్నాను. సహజంగా డెల్టా ప్రాంతంలో ఇవాళే కాదు అనేక సంవత్సరాల నుండి అంటే మాకు తెలిసి గత 35 సంవత్సరాల నుంచి ప్రతి రబీ సీజన్‌లో రెండవ పంటకు అనేక రకాలుగా ఆ ప్రాంత రైతులమైన మేం సాగునీటి కొరకు అనేక ఇబ్బందులు పడుతున్నాం. రైతాంగం అంతా కూడా సాగునీటి కొరకు అనేక ఇబ్బందులను ఎదుర్కోవడం జరుగుతోంది. దీని కోసం మేం ఉమ్మడి రాష్ట్రంలో ప్రత్యామ్నాయంగా ఏమీ చేయలేకపోయాం. ఇప్పుడు కొత్తగా ఏర్పడినటువంటి మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏదైతే ధవళేశ్వరం వద్ద బ్యారేజ్ ఉందో ఆ బ్యారేజ్‌కు పైన మనం సెకండ్ క్రాప్‌కు సాగునీటిని అందించేందుకు గాను మనం నీటిని స్టోరేజ్ చేసుకుంటాం. మనకు రెండు డెల్టా ప్రాంతాలున్నాయి. అందులో ఒకటి Eastern Delta and another one is Central Delta. ఈ రెండు డెల్టా ప్రాంతాలకు కలిపి సుమారు 7 లక్షల ఎకరాల భూమి ఆయకట్టు ఆయా డెల్టాల పరిధిలో ఉంది. ఇప్పుడు నేను మంత్రి గారిని కోరేదేమిటంటే, ఈ రబీ సీజన్‌లో రెండు డెల్టా ప్రాంతాలలోని రైతాంగానికి సాగునీరు అందించడం కోసం ప్రభుత్వం చాలా డబ్బు ఖర్చు చేసింది. భవిష్యత్తులో కూడా మనం ఇదే విధంగా temporary measurements తో వెళ్లి రైతులను ఆదుకునేకన్నా, ఏదైతే మనం ధవళేశ్వరం బ్యారేజ్‌కు పైన నీటిని స్టోరేజ్ చేస్తామో, ఆ నీటిని స్టోర్ చేసే ప్రదేశమంతా ఇసుకతో నిండిపోతోంది. ఇసుకను తీస్తున్నప్పటికి కూడా మళ్లీ రావడం వల్ల ఆ స్టోరేజ్ ప్రాంతమంతా ఇసుకతో నిండిపోతోంది. అందుచేత బ్యారేజ్‌కు దిగువ భాగంలో ఒక స్టోరేజ్ పాయింట్‌ను నిర్మించుకోవాలి. అందుచేత అటు వశిష్ట నది మీద, గౌతమి నది మీద లొల్లలాకులనే ఏదైతే upstream ఉందో, అక్కడి నుంచే ఈ డెల్టా ప్రాంత రైతాంగానికంతా సాగునీటిని సప్లై చేయడం జరుగుతుంటుంది. అదే విధంగా తాగునీటిని కూడా ప్రజానీకానికి సప్లై చేయడం జరుగుతుంది. నేను మంత్రి గారిని మీద్వారా కోరేది, ఈ గౌతమి, వశిష్ట నదుల మీద బ్యారేజ్‌కి దిగువ భాగంలో ప్రత్యేకమైనటువంటి ఆనకట్టలు కట్టే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఏమైనా ఉందా? ఎందుకంటే గత సంవత్సరం కూడా నేను ప్రశ్న రూపంలో ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడం జరిగింది. ఆనాడు దీన్ని పరిశీలిస్తామని మంత్రి గారు అన్నారు. రెండింటికి కలిసి (ఒక్కొక్కదానికి రూ.25.00 కోట్ల చొప్పున రెండింటికి కలిపి) సుమారు రూ.50.00 కోట్లు బహుశా ప్రభుత్వానికి ఖర్చు కావచ్చు. ఆనాడు కాటన్ దొర మహాశయుడు ఏదైతే బ్యారేజ్ నిర్మాణం చేసిన కారణంగా ఇవాళ మాకందరికి మేలు

చేకూర్చారో, వారిని మేమంతా దైవంగా కొలుస్తుంటాం. కాబట్టి బ్యారేజ్‌కి దిగువ భాగంలో ఉన్న వశిష్ట మరియు గౌతమి నదుల మీద రెండు ఆనకట్టలు నిర్మించి శాశ్వతంగా అంటే ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా, వరదలు రాకపోయినా, అలాంటి సమయాల్లో రైతుల ప్రయోజనాలను మరీ ముఖ్యంగా డెల్టా ప్రాంతాన్ని కాపాడే ఉద్దేశం ఏమైనా ప్రభుత్వం వద్ద ఉందా, దానికి కావల్సిన చర్యలేమి తీసుకుంటున్నారో తెలియజేయవల్సిందిగా మీద్వారా గౌరవ మంత్రి గారిని అడుగుతున్నాను.

మిస్టర్ స్పీకర్ః మినిష్టరుగారూ.

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు (మైలవరం): అధ్యక్షా, ఒక నాయకుడి ముందుచూపు వల్ల, ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయకుండా దిల్లీ వెళ్లి పోలవరం ప్రాజెక్టు కల సాకారం కావాలని, గోదావరి నది క్రింద ఉన్న రెండవ రబీ పంటను కాపాడాలంటే తెలంగాణ రాష్ట్ర పరిధిలోని ఖమ్మం జిల్లాలోని ఏడు ముంపు మండలాలను కలిపితేనే ఆ కల సాధ్యమవుతుందనే ముందు చూపుతో ప్రమాణ స్వీకారం చేయకుండానే దిల్లీలో భారత ప్రధానమంత్రి గారైన శ్రీ నరేంద్ర మోది గారిని ఒప్పించి అందుకు గానూ పార్లమెంట్ మరియు రాజ్యసభలో బిల్లు పెట్టించి ఆ ఏడు మండలాలైన సీలేరు, బలిమెల ప్రాంత రైతులను కాపాడటం వల్ల ఇవాళ గోదావరి డెల్టాలో నారా చంద్రబాబునాయుడుగారు రెండవ రబీ పంటను కాపాడటమే గాకుండా పోలవరం ప్రాజెక్టు కల సాకారమైందని చెప్పి కూడా నేను మీ అందరికి తెలియజేస్తున్నాను.

(ఆ సందర్భంలో ట్రెజరీ బెంచెస్ వైపు సభ్యుల నుంచి చప్పట్లు వినిపించాయి)

అధ్యక్షా, ఈ సంవత్సరం గోదావరిలోకి 1600 టి.ఎం.సి.ల నీరు వచ్చింది. రెండు వేల టి.ఎం.సి.ల లోపు నీళ్లు గోదావరికి వస్తే, రెండవ పంటకు ఇబ్బంది ఉండటం సహజం. ఈ కష్టం 2002వ సంవత్సరంలో వచ్చింది. ఆరోజున 5,35,000 ఎకరాల భూమిలో పంట సాగును అక్కడి రైతాంగం వేశారు. ఈ కష్టం 2009వ సంవత్సరంలో కూడా వచ్చింది. ఆ సంవత్సరం కూడా 4,79,000 ఎకరాల భూమిలో పంట సాగు వేశారు. 2011లో కూడా ఈ కష్టం వచ్చింది. ఆ కాలంలో 7,49,000 ఎకరాల భూమిలో పంట సాగు వేశారు. అంటే ప్రతి ఐదు, మూడు, నాలుగు సంవత్సరాల సైకిల్‌లో కష్టం వస్తుంది. అట్లాగే ఈ సంవత్సరం కూడా గోదావరి నుంచి 1600 టి.ఎం.సి.ల నీరు సముద్రంలోకి పోయాయి కాబట్టి రెండవ పంటకు కష్టం వస్తే ప్రభుత్వం ఆదుకోవడం జరిగింది. కానీ, మొదటి పంట తీయలేదు. రెండవ పంటకు సంబంధించిన సాగు మొదలుపెట్టలేదు. "రైమంటూ" బయలుదేరి పోయారు. "దేవినేని ఉమ నీళ్లు ఎత్తుకుపోయాడు, చంద్రబాబునాయుడు నీళ్లు ఎత్తుకుపోయాడు, పట్టిసీమ నీళ్లు ఎత్తుకుపోయారు, రెండవ పంటకు గోదావరిలో నీళ్లు లేవు" అంటూ అసత్యపు ప్రచారాన్ని ప్రతిపక్షనాయకులు చేశారు.

అధ్యక్షా, ఆ అంశాన్ని ఒక ఛాలెంజ్‌గా ప్రభుత్వం తీసుకుని, శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు ముందుచూపుతో గోదావరిలో నీటి ప్రవాహం తక్కువగా ఉన్నప్పటికి కూడా గోదావరి నుంచి, సీలేరు నుంచి 70 టి.ఎం.సి.ల లోపు తీసుకువచ్చిన కారణంగా 8,69,000 ఎకరాల్లో రెండవ పంటకు నీళ్లిచ్చి రూ.4 వేల కోట్ల విలువకల్గిన పంటను కాపాడిన చరిత్ర తెలుగుదేశం పార్టీ ప్రభుత్వానిది, శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిది.

అధ్యక్షా, డిశంబర్ మాసంలో అక్కడ వెళ్తే, మా బొమ్మలను అక్కడి రైతులు పెట్టారు. రెండవ పంట మొదలు పెట్టలేదు. (ఆ సందర్భంలో ప్రతిపక్షనాయకుడిని ఉద్దేశించి) x y z మా జిల్లా నుంచి కొంత మంది నాయకులను, హైదరాబాద్ నుంచి కొంత మంది నాయకులను పంపించాడు. ఎన్నో కార్యక్రమాలను చేశాడు. కానీ, పట్టిసీమ నీళ్లు మేం తీసుకువెళ్లింది 8.8 టి.ఎం.సి. నీళ్లల్లో 4.4 టి.ఎం.సి.ల నీరు గోదావరి నుంచి, పోలవరం Right Canal నుంచి 4.4. టి.ఎం.సి.ల నీళ్లు, మొత్తం ఆ 8.8 టి.ఎం.సి.ల నీటితో కృష్ణా మరియు గుంటూరు జిల్లాల్లో కలిపి మొత్తం రూ.2,400.00 కోట్ల విలువైన పంటను కాపాడితే, ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. ఇవాళ గోదావరి జిల్లాల ప్రజలకు చేతులెత్తి దండం పెట్టాలి. వృథాగా సముద్రంలోకి పోయే వరద జలాలను ఆపి, తద్వారా ఆ నీటితో కృష్ణా మరియు గుంటూరు జిల్లాల్లోని డెల్టా రైతాంగాన్ని కాపాడటం జరిగింది. ఆ మేరకు శ్రీశైలం దగ్గర ఆనకట్ట నిర్మాణాన్ని చేపట్టి తద్వారా రాయలసీమ ప్రాంతాన్ని కూడా కాపాడతాం. జూన్ మాసానికంతా 80 టి.ఎం.సి.ల నీటి ని పట్టిసీమ ద్వారా తెచ్చి కృష్ణా డెల్టాలోని రైతాంగాన్ని కాపాడతాం. తద్వారా 13 లక్షల ఎకరాల్లో పంటను stabilize చేస్తాం. రాయలసీమ రతనాల సీమ ప్రాంతానికి కూడా 80 టి.ఎం.సి.ల నీటిని తీసుకువెళ్లి "నభూతో నభవిష్యత్ - అపర కాటన్" లాగా చరిత్రలో శ్రీకృష్ణ దేవరాయల తరువాత శ్రీ నారా చంద్రబాబునాయుడుగారి పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకోవాలని కూడా తెలియజేస్తున్నాను.

MR SPEAKER: Now, Question No. 2366 (50) is postponed for tomorrow at the request of the Member.

శ్రీ కె.అచ్చెన్నాయుడు (టెక్కలి): అధ్యక్షా..........

MR SPEAKER: You want to answer.................

**Yes, Question No. 2366 ...... Minister for Labour and Employment to answer on behalf of the Minister for Municipal Administration.**

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి (పులివెందుల): అధ్యక్షా............

MR SPEAKER: Yes.......... Jaganmohan Reddy garu...........

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి (పులివెందుల): అధ్యక్షా, మంత్రి గారు మాట్లాడుతూ 1650 టి.ఎం.సి.ల నీరు సముద్రం పాలైనాయి అని ఒకవైపున చెబుతారు. 8 టి.ఎం.సి.ల నీటిని తీసుకుపోయామని మరోవైపున చెబుతారు. ఈ సంవత్సరం 1650 టి.ఎం.సి.ల నీరు సముద్రం పాలైనాయని అంటే, అందుకనే కదయ్యా పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టేది. ఆ స్టోరేజ్‌ని క్రియేట్ చేయడం కోసమే కదయ్యా పోలవరం ప్రాజెక్టును నిర్మించాలనుకునేది. వరదలు వచ్చినప్పుడు ఆ నీటిని స్టోర్ చేసుకుంటే, ఆ తరువాత నీళ్లు లేని సమయంలో సాగునీరు, తాగునీరు ప్రజానీకానికి ఇచ్చేందుకే కదయ్యా ఆ స్టోరేజ్ కెపాసిటి. అందుకే దాన్ని పోలవరం ప్రాజెక్టు అని అంటారు.

**10.40 AM (11)**

అందుకే దానిని పోలవరం అంటారు. ఆపోలవరం అన్నది కడితే వరదలు వచ్చినప్పుడు వరద నీటిని దాచుకుంటే ఆ నీటిని కృష్ణానదికి మళ్లించవచ్చు, నికరంగా శ్రీశైలం నుండి దిగువ ప్రాంతం అయిన రాయలసీమకు అయినా నీళ్లు ఇవ్వవచ్చు. కాని పట్టిసీమలో స్టోరేజ్ అనేది లేదు. స్టోరేజ్ అనేది లేకపోవడమే పట్టిసీమకు మీరు చేస్తున్న అన్యాయానికి నిదర్శనం.

మిస్టర్ స్పీకర్ ః ప్లీజ్ కంక్లూడ్.. ప్లీజ్ కంక్లూడ్..

శ్రీ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ః ఎక్కడైనా పట్టిసీమ కోసం అని చెప్పి మీరు పోలవరం ప్రాజెక్టును కాంప్రమైజ్ చేశారు. E -7 (f) Godavari Water Dispute Tribunal ను compromise చేశాం. మీరు చేసిన అన్యాయానికి చివరకు తెలంగాణా ప్రభుత్వాన్ని Question చెయ్యలేని పరిస్థితుల్లో మీరున్నారంటే కారణం మీరు అక్కడ 7 ( e), 7 (f) ను breach చేశారు కాబట్టే తెలంగాణా ప్రభుత్వాన్ని కనీసం ప్రశ్నించలేకుండా ఉన్నారు.

మిస్టర్ స్పీకర్ ః మినిస్టర్ గారూ..

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావుః అధ్యక్షా, తెలిసిన వాళ్లకు చెప్పొచ్చు, తెలియని వాళ్లకూ చెప్పొచ్చు. ఈరోజు పట్టిసీమ ఎత్తిపోతల పథకం అనేది 28మీటర్లు లిఫ్ట్ చేసి కృష్ణా ప్రవాహం వచ్చినప్పుడు ఆ పంపు, మోటరును ఆపుకునే అవకాశం ఉంది, అదేవిధంగా ఆ నీటిని చింతలపూడి లిఫ్ట్ కింద, అదేవిధంగా నాగార్జునాసాగర్ ఆయకట్టు కింద కృష్ణానది ఎడమ కాలువ ఆయకట్టు ప్రాంతాన్ని కాపాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకున్నాం. జల్లేరు రిజర్వాయర్‌లో 20-25టీఎంసీల నీటిని నిల్వ ఉంచుకునేందుకు చర్యలు తీసుకుంటాం.

పోలవరం ప్రాజెక్టు 2018 నాటికి పూర్తవుతుంది కాబట్టి ఈ సంవత్సరం 2400ఎకరాల్లో పంట కాపాడితే, బాధ్యత కలిగిన ప్రతిపక్ష నాయకునిగా మంచిపని చేశారు ఇంకా త్వరగా చేయండి అని అడగాలి.

పోలవరం ప్రాజెక్టు 1941వ సంవత్సరంలో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఆనాడు ప్రారంభం అయిన ప్రాజెక్టు ఈరోజు diaphragm wall పనులు, అమెరికా నుండి, జర్మనీ నుండి యంత్రాలు తీసుకొచ్చి, Transtroi, Germany, అదేవిధంగా ఎల్అండ్టీలతో పనులు చేపడుతున్నాం. 2018వ సంవత్సం నాటికి 13లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరిస్తాం. రాయలసీమ రతనాలసీమ 80 టీఎంసీల నీరు తీసుకెళ్లి " నభూతో నభవిష్యత్ " అపర కాటన్ లాగా నారా చంద్రబాబు నాయుడు గారి పేరు శ్రీ కృష్ణ దేవరాయులు తరువాత చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించుకోవాలనిచెప్పి కూడా తెలియజేస్తున్నాను.

(ఈ దశలో మైక్ కట్ చేయబడింది. మంత్రి శ్రీ దేవినేని ఉమా మహేశ్వరరావు గారు మైకు లేకుండా మాట్లాడుతూ, 2018 నాటికి పోలవరం ప్రాజెక్టులో నీళ్లు నిలబెట్టి చంద్రబాబు నాయుడు గారు  అపర భగీరథుడుగా ఈదేశ చరిత్రలో నిలబడతారు నీ సాక్షి పత్రికలో రాసిపెట్టుకో అని అన్నారు.)

.

<u>మిస్టర్ స్పీకర్: ప్రశ్న నం.2366 (50)</u>

**శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో విమానాశ్రయ నిర్మాణం**

**సభ్యులు శ్రీ కాకాని  గోవర్ధనరెడ్డి – ఎమ్మెల్యే.**

**గౌరవ నీయులైన ముఖ్యమంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:**

అ) శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో విమానాశ్రయాన్ని నిర్మించడానికి ప్రతిపాదన ఏదైనా ఉన్నదా ?

ఆ)  అయితే సదరు నిర్మాతం కోసం తగిన భూమిని గుర్తించడమయిందా?

ఇ) అయితే భూసేకరణ ప్రక్రియను ప్రారంభించారా ?

ఈ ) ఎప్పటిలోగా పనులు ప్రారంభించి, పూర్తి చేయడమవుతుంది?

**ముఖ్యమంత్రి గారి తరపున కార్మిక, ఉపాధి, ఫ్యాక్టరీ, యువజన వ్యవహారాలు, క్రీడలు, స్కిల్ డెవలప్‌మెంట్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ శాఖా మంత్రి శ్రీ కె.అచ్చెన్నాయుడుః**

అ ) అవునండి,

ఆ ) అవునండి

ఇ) తగిన భూమిని గుర్తించడమయింది. భూమిని కొనుగోలు చేయడానికి భూయజమానులతో సంప్రదించడానికి ప్రభుత్వం సంప్రదింపు కమిటీని ఏర్పాటు చేసింది.

ఈ) చివరి సమర్పణ తేది 13-05-2016గా, 27-01-2016 తేదీన ఆర్ఎఫ్‌సీని జారీ చేయడమయింది. ఎంపిక చేసిన డెవలపరు ఆర్థిక ముగింపును సాధించిన మీదట 2016 డిసెంబరులో తాత్కాలికంగా పనులు ప్రారంభించి, 18 నెలలు కాలపరిమితిలో పూర్తిచేయడమవుతుంది.

మిస్టర్ స్పీకర్ ః గోవర్ధనరెడ్డి గారూ..

శ్రీ కాకాని గోవర్ధనరెడ్డి (సర్వేపల్లి)ః అధ్యక్షా మంత్రిగారు సమాధానం చెబుతూ, జిల్లాలో విమానాశ్రయం నిర్మించడానికి ప్రతిపాదనలు ఉన్నాయని, దానికోసం భూములు గుర్తించడం జరిగిందని, ఆప్రక్రియ ప్రారంభించడం జరిగిందని చెప్పడం జరిగింది. దీంట్లో జరిగినటువంటి స్కాం గురించి చెప్పాలి. అంటే దళితులు పేదవాళ్లకు  భూముల్నిచ్చి వాళ్లకు పట్టాలిస్తే వాళ్లు ఇప్పటికీ సాగుచేసుకుంటుంటే, కనీసం వాళ్లెవరికీ తెలియకుండా వారి పేరుతో ఉన్న భూముల్ని రద్దుచేసినట్లుగా రికార్డులు సృష్టించి, వేరే వాళ్లకు ఆ పట్టాలు ఇచ్చి, ఆ పట్టాల ప్రకారం దీనికి సంబంధించిన వాళ్లందరికీ కాంపెన్‌సేషన్ ఇస్తున్నారని దినపత్రికల్లో పుంఖానుపుంఖాలుగా వార్తలొస్తున్నాయి.

అదేవిధంగా బినామీ పేర్లతో కాజేయడానికి వస్తున్నటువంటి మాట వాస్తవమా కాదా? పత్రికల్లో వచ్చాయి, జిల్లా కలెక్టర్ గారు, జాయింట్ కలెక్టరు గారు స్టేట్‌మెంట్ కూడా ఇచ్చారు. అదేవిధంగా ప్రభుత్వ భూములకు సంబంధించి మాజీ సైనికులకు ఇచ్చినటువంటి పట్టాలకు సంబంధించి కొంతమంది వేరే వ్యక్తుల పేర్లతో పట్టాలు పుట్టించి అక్కడ నుండి వారు కొనుగోలు చేసినట్లుగా రికార్డులు సృష్టించిన మాట వాస్తవమా కాదా ?

గౌరుగుంట, దామవరం గ్రామాల్లో వందలాది ఎకరాలు (ఎక్కడైతే ఈ ప్రాజెక్టు వస్తుందో) తమ కబంధహస్తాల్లోకి తీసుకొని అక్కడున్న వ్యక్తులను బంధించివేయడం జరిగిందా లేదా?

పేదరైతులు కొంతమంది సాగుచేసుకునే భూమికి సంబంధించి, వాళ్లకు పట్టా లేకపోయినా కూడా వారికే ఆ భూమి ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వం సుమారు 2480ఎకరాల భూమి సేకరించాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్న తరవాత, స్థానికంగా ఉండే అధికారపార్టీ నాయకులు 150 ఎకరాలతో ఒక ఫ్యాక్టరీ నిర్మించుకుంటే అది అడ్డు అవుతుందని, 2480ఎకరాలు సేకరించడానికి అని చెప్పి 1390ఎకరాలకు తగ్గించినటువంటి మాట వాస్తవమా కాదా?

మంత్రిగారిని కోరేదేమంటే పత్రికల్లో పుంఖానుపుంఖాలుగా వార్తలొస్తున్నాయి. పేదవాళ్లు అన్యాయం జరుగుతోందంటూ గోడు వెల్లబోసుకొంటూ, జిల్లా కార్యాలయాల చుట్టూ తిరిగారు. దీనికి సంబంధించి అసలేమి జరుగుతుందో విచారణ చేసి, ఎవరైతే అర్హులైనవారున్నారో వారికి న్యాయం చేసే పరిస్థితి ఉందా లేదా అని మంత్రి గారిని అడుగుతున్నాను. అందుకు సూటిగా సమాధానం చెప్పాల్సిందిగా తమ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ : మినిస్టర్ గారూ..

శ్రీ కె. అచ్చెన్నాయుడు (టెక్కలి): అధ్యక్షా రాష్ట్ర అభివృద్ధిలో Air Connectivity అనేది చాలా భూమిక పోషిస్తుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కొత్తగా ఏర్పడింది కాబట్టి మన రాష్ట్రం నుండి ఇతర దేశాలకు, మన దేశంలో వివిధ ప్రాంతాలకు, మన రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు Air Connectivity ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విమానాశ్రయాలను కొత్తగా తీసుకురావడం, దీనితోపాటుగా ఇప్పటికే ఉన్నటువంటి విమానాశ్రయాలను అభివృద్ధి చేయాలని ముందుకు వెళుతున్నది.అందులో భాగంగా మూడు Green field airports ను గుర్తించాం. 1) విజయనగరం జిల్లాలో భోగాపురంలో, 2) నెల్లూరు జిల్లాలో దగదర్తి మండలంలో, 3) కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలో ఏర్పాటు చేయదలిచి ఈ మూడు ఎయిర్ పోర్టులను Green field airport' గా మనం నిర్ణయించాం.

అయితే సభ్యులు నెల్లూరు జిల్లా దగదర్తి మండలంలో ఎయిర్‌పోర్టు గురించి అడిగారు. దీని గురించి 1075ఎకరాల భూమిని విమానాశ్రయ నిర్మాణం కొరకు గుర్తించాం. గుర్తించిన తరువాత Ministry of Civil Aviation కి, భారత ప్రభుత్వానికి పంపించడం జరిగింది. వారు ఈ ప్రతిపాదనను సూత్రప్రాయంగా అంగీకరించారు. తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఎవరైతే 1075ఎకరాల్లో ఇప్పటి వరకు ఉంటున్నారో వారి దగ్గరకు వెళ్లి, సంప్రదించి ఏ విధానం తీసుకుంటే రైతాంగానికి మేలు జరుగుతుందో, భూ సమీకరణ తీసుకోవాలా, భూ సేకరణను తీసుకోవాలా లేదా నేరుగానే ఎయిర్‌పోర్టు వారు రైతుల దగ్గర

కొనుగోలు చేయాలా అనే విషయాలపై, ఏ విధానం బాగుంటే అది, ఏ పద్ధతి అయితే రైతులకు ఇబ్బంది లేకుండా ఉంటుందో ఆ పరిస్థితులపై అవగాహన చేయమని, రైతులతో సంప్రదింపులు చేయమని ఒక కమిటి వేశాం.

కమిటీ పని ప్రారంభించింది. అయితే, సభ్యులు పత్రికల్లో వచ్చిన వార్తలు చెప్పారు. ఇది ఎక్కడో కొంతమంది, ఎవరైతే దళితులున్నారో వారి భూములు క్యాన్సిల్ చేశామని, దళితుల భూములను ఇతరులు తీసుకున్నారనే కొన్ని విషయాలు చెప్పారు. తప్పనిసరిగా ఈ సభ ద్వారా మీకు ఆ ప్రాంతంలో ఉన్న రైతాంగానికి హామీ ఇస్తునాం, మేము గుర్తించిన నాటికి ఎవరి ఆధీనంలో ఈ భూమి ఉందో వారికే ఈ విధానం అమలుపరిచే విధంగా, ప్రభుత్వం నుండి ఏ నిర్ణయం తీసుకున్నా, ఎటువంటి పారితోషికం అందించినా, ప్రభుత్వం ఏకార్యక్రమం చేసినా మంచి విధానంతో ముందుకు వెళతామని తెలియజేసుకుంటున్నాను. ఇది ప్రారంభం మాత్రమే, ఇది ఇంకా ముందుకు వెళుతుంది. అందులో ఎటువంటి ఇబ్బందులు వచ్చినా, అక్కడున్నటువంటి రైతులకు ఎటువంటి నష్టం జరిగినా వెంటనే మీరు సంప్రదించండి. మీద్వారా అక్కడున్న రైతులకు మాటిస్తున్నాం, మీరు ఆనందపడి, మా ప్రాంతంలో ఎయిర్‌పోర్టు వచ్చిందని చెప్పుకునే విధంగా కార్యక్రమాలు చేస్తాం తప్ప ఏఒక్కరినీ ఇబ్బంది పెట్టి ముందుకు వెళ్లే ప్రశ్నే లేదని ఈ సందర్భంగా సభ్యులకు తెలియజేస్తున్నాను.

10.50 am (12)

**MR SPEAKER: Question Hour is over, Now Zero Hour. శివప్రసాద్‌రెడ్డిగారు.**

## <u>Zero Hour</u>

శ్రీ ఆర్. శివప్రసాదరెడ్డి (ప్రొద్దుటూరు): అధ్యక్షా, 4 సస్పెన్షన్లు, 8 వాకౌట్లు తర్వాత అవకాశం ఇచ్చారు. ధన్యవాదాలు. ప్రొద్దుటూరు నియోజకవర్గం, ప్రొద్దుటూరు పట్టణం 2,50,000 మంది జనాభా ఉండే పట్టణం. మంచినీళ్లకు తీవ్రమైన ఇబ్బంది పడే పరిస్థితి. పురపాలక సంఘం నుంచి వారానికి లేదా పది రోజులకొకసారి మంచినీళ్లు ఇస్తున్నారు. ఈ కష్టాలన్నీ గ్రహించిన ఆనాటి ముఖ్యమంత్రి, గౌరవనీయులు డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డిగారు రూ.78 కోట్లతో బురదకాలువను పెన్నా నదికి అనుసంధానం చేసేదానికి శ్రీకారం చుట్టారు. కొంతమంది రైతులు కోర్టులను ఆశ్రయించడం ద్వారా ఇప్పటివరకూ ఆ కార్యక్రమం పూర్తి కాలేదు. ఆ బురద కాలువను పెన్నా నదికి అనుసంధానం చేసినట్లయితే ప్రొద్దుటూరు పట్టణానికి దాహార్తిని తీర్చినట్లు అవుతుంది. ఈమధ్య కాలంలో సంబంధిత మంత్రివర్యులు శ్రీ దేవినేని ఉమా మహేశ్వరరావుగారు కూడా ప్రొద్దుటూరుకు వచ్చారు. ఆ పనులు పూర్తిచేస్తాం, ప్రొద్దుటూరు పట్టణ ప్రజల దాహార్తిని తీరుస్తామని చెప్పి తెలియజేయడం జరిగింది. మీద్వారా ఈ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రొద్దుటూరు పట్టణ ప్రజల దాహార్తిని తీర్చండి, ఆ

పనిని ఎప్పటిలోగా పూర్తిచేస్తారు? బురద కాలువను పెన్నా నదికి అనుసంధానం చేసి, ఆ పెన్నా నది పరీవాహక ప్రాంతంలో ఉండే గ్రామీణ ప్రాంతాలకు కూడా నీళ్లిచ్చేందుకోసం ఎప్పటిలోగా పూర్తి చేయగలుగుతారని చెప్పి మీద్వారా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ః మినిష్టరు గారు.

శ్రీ కె.అచ్చెన్నాయుడుః అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన విషయాన్ని ఇరిగేషన్ మినిష్టరు దృష్టికి, Urban Development Minister గారి దృష్టికి తీసుకెళ్లి, ఈ సమస్య వీలైనంత తొందరగా పరిష్కారం చేయడానికి ప్రయత్నం చేస్తామని చెప్పి గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ః కదిరి బాబూరావుగారు.

శ్రీ కదిరి బాబూరావు (కనిగిరి)ః అధ్యక్షా, కనిగిరి నియోజకవర్గంలోభైరవకోన అనే త్రిముఖ దుర్గాదేవి టెంపుల్ ఉంది సర్. అక్కడ నుండి నారాయణస్వామివారి టెంపుల్, ఆ తర్వాత మాలకొండ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి టెంపుల్ అని, ఇవి మొత్తం కూడా 30 నుంచి 40 కిలోమీటర్లలోనే ఉన్నాయి. లాస్ట్ టైం ముఖ్యమంత్రిగారు " జన్మభూమి– మా ఊరు" కార్యక్రమానికి వచ్చినప్పుడు ఆయన అస్యూరెన్స్‌లో ఆ భైరవకోనను టూరిజం హబ్ కింద చేస్తానని చెప్పారు. అది ఎంతవరకు వచ్చింది, దానికేమైనా నిధులు కేటాయించే అవకాశం ఉందా అని అడుగుతున్నాను.

మిస్టర్ స్పీకర్ః మినిష్టరు గారు.

శ్రీ బొజ్జల గోపాల కృష్ణారెడ్డిః అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పినది నోట్ చేసుకున్నాం. తప్పకుండా చేస్తాం.

మిస్టర్ స్పీకర్ః డా. రామానాయుడుగారు.

డా.నిమ్మల రామా నాయుడు (పాలకొల్లు)ః అధ్యక్షా, ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బేడ, బుడగ జంగాల వారు అత్యంత కడు పేదవారిగా, రెక్కాడితే గానీ డొక్కాడని స్థితిలో ఈరోజు ఈ వర్గాల వారి పరిస్థితిని చూస్తున్నాము. మరి ఈ రకమైన వర్గాల వారు సంచార జాతులుగా బుర్రకథలు చెప్పడం వంటి కార్యక్రమాలు చేసుకుంటూ, గ్రామ గ్రామానికి తిరుగుతూ జీవనం సాగిస్తూ ఉన్నారు. వీరు 1950వ సంవత్సరంలో డా.బి.ఆర్.అంబేడ్కర్ గారు అందించిన రాజ్యాంగం ద్వారా 59 కులాలకు సంబంధించి ఎస్సీ వర్గంగా వీళ్లు గుర్తింపబడి ఉన్నారు.

అదేవిధంగా వీళ్లకి సంబంధించిన ఎస్సీ కుల ధృవీకరణ పత్రం అందించే విషయంలో కూడా జి.ఒ.నెం.84 ద్వారా వీరికి ధృవీకరణ పత్రాలు కూడా ఇస్తున్నారు. అయితే దురదృష్ట వశాత్తూ 2008వ సంవత్సరంలో ఒక జి.ఒ.నెం.144 ను తీసుకురావడం జరిగింది. ఈ 144 జి.ఒ. ప్రకారం కేవలం తెలంగాణ ప్రాంతంలో ఉన్నవారికి మాత్రమే ఈ కులాల వారికి ఎస్సీ సర్టిఫికేట్లు మంజూరు చేస్తున్నారు. దీనివల్ల రాయలసీమ, ఆంధ్రా ప్రాంతంలో ఉన్నటువంటి ఎవరైతే బేడ, బుడగ జంగాల వాళ్లున్నారో వాళ్లకి ఎస్సీ సర్టిఫికేట్లు అందక, ఈ విద్యార్థులకు హాస్టల్లకు గానీ, ఫీజులు గానీ, స్కాలర్‌షిప్స్ గానీ, ఏమీ అందని పరిస్థితుల్లో వీరు విద్యాపరంగా, ఉద్యోగపరంగా, దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అందుచేత మీద్వారా ఈ ప్రభుత్వాన్ని కోరుకునేదేమంటే జి.ఒ.నెం.144 ను రద్దు చేసి వీరికి జి.ఒ.నెం.84 ను పునరుద్ధరించవలసిందిగా మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్: మినిష్టరు గారు.

శ్రీ రావెల కిషోర్ బాబు: అధ్యక్షా, సభ్యులు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకోవడం జరిగింది. తప్పకుండా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాము.

మిస్టర్ స్పీకర్: విష్ణుకుమార్ రాజుగారు.

శ్రీ పి. విష్ణుకుమార్ రాజు (విశాఖపట్నం నార్త్): అధ్యక్షా, గౌరవ మంత్రివర్యులు కూడా సభలో ఉన్నారు. మందల కమ్యూనిటీ వాళ్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 10,000 నుంచి 15,000 మంది ఉన్నారు. వాళ్ల అలవాట్లు కూడా కాకులు, కొంగలు, అన్ని రకములైన పిట్ట జాతులు, పిల్లులు, ముంగీసలు, ఉడుములు, ఉడతలు, నక్కలు, చెవులపిల్లులు అవే తింటారు. వాళ్లని ఎస్టీల్లో పెట్టలేదు. వాళ్లని ఎస్టీల్లో పెట్టాలని చెప్పి గత 30 సంవత్సరాల నుంచి రిక్వస్ట్ చేస్తూ ఉన్నారు. Government of India 3rd May, 2011 వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి క్లారిఫికేషన్ అడిగింది. కానీ ఆ క్లారిఫికేషన్ ఇప్పటివరకూ ఇవ్వలేదు. కారణం ఏమంటే ఆంధ్రప్రదేశ్ TAC Meeting జరగలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గిరిజన సలహా మండలి ఉండాలి. గిరిజన సలహా మండలి నుంచి ఇది వెళ్లాలి. గిరిజన సలహా మండలి ఎందుకు వేయలేదో మా మంత్రివర్యుల్ని కోరుతున్నాము. దయచేసి వీళ్లు బడుగు, బలహీన వర్గాలవారు. ఇంతకంటే ఘోరం ఇంకెవరికీ ఉండదు. పాపం వాళ్లు ఎవరికీ చెప్పుకునేందుకు నాథుడే ఉండరు. ఎందుకంటే వాళ్లకి చదువు ఉండదు, ఏమీ ఉండదు, కాబట్టి, దయచేసి దీనిమీద యాక్షన్ తీసుకోవలసిందిగా, చాలాసార్లు దీనిమీద రిప్రజెంటేషన్ ఇచ్చాము. మా మంత్రివర్యులు ఏమీ తీసుకోలేదు, దయచేసి మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్: మినిష్టరు గారు.

శ్రీ రావెల కిషోర్ బాబుః అధ్యక్షా, సభ్యులు చెప్పిన విషయాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాము.

మిస్టర్ స్పీకర్ః రాజశేఖరరెడ్డిగారు.

శ్రీ బుడ్డా రాజశేఖర్ రెడ్డి (శ్రీశైలం)ః అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు అధ్యక్షా. ఇందాక గౌరవ ఇరిగేషన్ మంత్రిగారు, గౌరవ సభ్యులు డెల్టా గురించి, శ్రీశైలం గురించి కూడా మాట్లాడారు. అప్పుడు మిమ్మల్ని అడిగితే అవకాశం ఇవ్వలేదు. వాస్తవంగా శ్రీశైలం పేరుకు చెప్పుకోవడానికి ఆ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్నాను. పోయిన సంవత్సరంలో వర్షాలు చూసుకుంటే మనకు సక్రమంగా వర్షాలు లేక, ఏ రిజర్వాయర్లు కూడా నిండక అన్ని రకాలుగా కూడా ఇబ్బందులు. కృష్ణా రివర్ బెల్టు మీద రాలేదు గానీ, తుంగభద్ర పరిసర ప్రాంతాల్లో ఈ సంవత్సరం అంతో ఇంతో వర్షాలు పడి, దాదాపు 50 నుంచి 60 టిఎంసీలు శ్రీశైలంలో నీళ్లు చేరాయి. ఆరోజే చెప్పాం. ఆరోజు 848 అడుగుల వరకు శ్రీశైలంలోకి నీళ్లు వచ్చాయి. వచ్చినప్పుడు సంబంధిత అధికారులను, మంత్రిగారికి కూడా రిప్రజెంట్ చేద్దామంటే మంత్రిగారు దొరకలేదు, అందుబాటులోకి రాలేదు. అధికారులందరికీ కూడా చెప్పడం జరిగింది. సి.ఇ.గారికి, ప్రిన్సిపల్ సెక్రటరీగారికి అలాగే అందరికీ చెప్పడం జరిగింది. ఈ లెవెల్స్ ఉన్నంత వరకూ, పడిపోయిన తర్వాత మాకు ఎలాగూ కిందకి నీళ్లు రావు. వెలుగోడు రిజర్వాయరును అంతో ఇంతో నీళ్లు నింపండి. మాకు కొంచెం నీళ్లు ఉంటాయి. కొంచెం తాగడానికి, కొంత సాగుకు కూడా పనికొస్తాయని చెప్పి రిప్రజెంట్ చేస్తే ఒక్కరూ కూడా పట్టించుకున్న పాపాన పోలేదు. ఈరోజు వెలుగోడు రిజర్వాయరుకు సంబంధించి గేట్లు సరిగా లేనందువల్ల కొంత వాటర్ కూడా లీకేజై (బెల్) అధ్యక్షా చాలా ఇంపార్టెంట్. మాకు వచ్చేదే ఇటువంటి సందర్భం.

మిస్టర్ స్పీకర్ః చాలా ఇంపార్టెంట్ అయినా ఇది జీరో అవర్. Please.. జీరో అవర్ అండి ఇది. బ్రీఫ్‌గా చెప్పండి.

శ్రీ బుడ్డా రాజశేఖర్ రెడ్డిః జీరో అవర్లోనే మాకు వచ్చేది. మీరు అవకాశం ఇచ్చారు. కనీసం చెప్పుకోనీయండి. ఎందుకంటే త్రాగడానికి కూడా నీరు లేకుండా, రైతులు కూడా తెలిసో తెలియకో పొరపాటున చెబితే కూడా పంట వేసుకున్నారు. కానీ ఈ టైంలో నీళ్లు ఉండి కూడా, ఈ నెలాఖరు వరకూ ఆగండీ, ఆ నీళ్లు ఉన్నంత కాలం కనీసం ఇవ్వండీ, రైతులు తెలిసో తెలియకో పొరపాటున రబీలో పంటను వేసుకున్నారు, వాస్తవంగా ఆరోజున ఈ లెవెల్స్ పడిపోకుండా మాకు గానీ నీళ్లు ఇచ్చుంటే ఈ సమస్య ఉండేది కాదు. ఈరోజు తాగునీరు పేరు చెప్పి క్రిందికి దాదాపు 30 టిఎంసీల నీళ్లు తీసుకువెళ్లిపోయారు. 836 అడుగులు ఆరోజు

మెయింటెన్ చేసి ఉంటే, 850 అడుగులు నీళ్లు ఎలాగూ మెయింటెన్ చేయడం లేదు, 834 అడుగులు ఉండి ఉంటే ఆ వచ్చిన 40, 50 టింఎంసీలు మాకు వచ్చేవి ఆ విధంగా కొంత నీరైనా మాకు వచ్చేది. మరి అటువంటి పరిస్థితిలో ఇప్పుడు కుడా కిందకి నీళ్లు తీసుకెళ్లిపోతున్నారు. ఈరోజు ఉన్న వాటర్‌ని కొంత... (మైకు నిలిపివేయబడింది)

మిస్టర్ స్పీకర్ః మినిష్టరుగారు.

శ్రీ దేవినేని ఉమా మహేశ్వరరావుః అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పింది నోట్ చేసుకున్నాం. తగు చర్యలు తీసుకుంటాము.

మిస్టర్ స్పీకర్ః జంకె వెంకటరెడ్డిగారు.

శ్రీ జంకె వెంకటరెడ్డి(మార్కాపురం)ః అధ్యక్షా, ధన్యవాదాలు. మా నియోజకవర్గంలో నేషనల్ హైవే 565 వెళ్తుంది. దాంట్లో స్టాండర్డ్స్ కూడా లేవు. అలాగే ఈనాడు ఇరిగేషన్ వారికి తెలియకుండా, ఆ రైతులకు కాంపెన్సేషన్ ఇవ్వకుండా రోడ్డు వేస్తూ, ఈనాడు అక్కడ రేటు కూడా ఫిక్స్ చేయలేదు. మరి అధికారులో, నాయకులో గానీ, ఎకరాకు రూ.50 లక్షలు ఇస్తామూ, ఇచ్చిన తర్వాత రూ.40 లక్షలు రైతులకు ఇచ్చి, రూ.10 లక్షలు మాకు ఇవ్వండీ అని ఖాళీ చెక్కుల మీద సంతకాలు చేయించుకున్న దౌర్భాగ్యం వచ్చింది.

**11.00am (13)**

ఆర్ అండ్ బి మినిస్టర్ గారు ఇప్పుడు ఉండి ఉంటే బాగుండేది. అధ్యక్షా, మీ ద్వారా డిపార్ట్‌మెంట్ వారిని కోరేదేమంటే, రైతులను రక్షించాలి. ఈనాడు కరవు వచ్చి బీదరైతులు ఇబ్బందులు పడుతుంటే, ఖాళీ చెక్కుల మీద సంతకాలు పెట్టించుకుని డబ్బులు తీసుకోవడం ఒక విషయం కాగా, 146 మీటర్ల వెడల్పుతో ఒక అలుగు వుంటే, దాన్ని 5 మీటర్ల వెడల్పుకు ఒక చిన్న చప్టా కట్టేసి, రేపు ఏదైనా వరద వచ్చినప్పుడు ఆ యొక్క రోడ్డు ఉంటుందా, లేదా అనేటువంటి పరిస్థితి. కాబట్టి, నేను మినిస్టర్ గారిని కోరేదేమంటే, ఆ హైవే రోడ్డుపై సరైన, సక్రమమైన చర్యలు తీసుకోవాలనీ, దానికి సంబంధించిన అధికారులు ఎవరైనా, కాంట్రాక్టర్ల పైన చర్యలు తీసుకోవాలని మీద్వారా కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ ః మినిస్టర్ గారూ.

శ్రీ బొజ్జల గోపాలకృష్ణ రెడ్డి ః గౌరవ శాసనసభ్యులు చెప్పింది నోట్ చేసుకున్నాను. సంబంధిత మంత్రిగారికి తెలియపరుస్తాను.

మిస్టర్ స్పీకర్ ః బుచ్చయ్య చౌదరి గారూ.

శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి (రాజమండ్రి రూరల్)ః అధ్యక్షా, ముగ్గురు మంత్రులకు సంబంధించిన ఒక ప్రధానమైన విషయాన్ని మీ దృష్టికి తీసుకువస్తాను. ఈ మధ్య కాలంలో మేము వేసిన క్వశ్చన్స్ కొన్ని అడ్మిట్ అయిన తరువాత, ప్రతిపక్షం వారి అల్లర్లలో అవన్నీ గాలికి కొట్టుకు పోయాయి. మాకు డా.అంబేద్కర్ ఎస్సీ బాయ్స్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కాలేజ్ ఉంది. అది నందమూరి తారక రామారావుగారు మొదట్లో 1984-85 ప్రాంతంలో పెట్టారు. ఆ కాలేజి పరిస్థితి గురించి నేను ప్రశ్న వేస్తే, దానికి జవాబుగా అంతా బాగానే ఉంది, ఏమీ అరైజ్ కాదని సింపుల్‌గా ఆన్సర్ పంపించారు. దానివల్ల ఫలితమేమీ రాలేదు. మొన్న రూ.8 కోట్లతో దానిని రిపేర్ చేయడానికి ప్రపోజల్స్ పంపించారు. ఇవాళ అక్కడికి సంబంధించిందే ఒక విశ్వవిద్యాలయం వచ్చింది.

అధ్యక్షా, అక్కడ మహిళా ప్రగతి ప్రాంగణం ఉంది. దురదృష్టమేమంటే, అవన్నీ మంజూరు చేసి, మొదలు పెట్టిన తరువాత మేము ఓడిపోయాం. కాంగ్రెస్ హయాములో కట్టారు. 25 ఏళ్ళకే మొత్తం కూలిపోతున్నాయి. మహిళా ప్రగతి ప్రాంగణం అధ్వాన్న పరిస్థితుల్లో ఉంది. దాని మరమ్మతులకు ఏమైనా కార్యక్రమాలు చేస్తున్నారా అని Women Welfare Minister గారి దృష్టికి తెస్తున్నాను, అలాగే అచ్చెన్నాయుడు గారి దృష్టికి తెచ్చేదేమంటే, Women's ITI ఉంది. మొన్న కలెక్టరు గారూ, మేమూ వెళ్ళాం. మేము లోపలికి వెళ్ళి చూస్తే, ఏ క్షణాన కూలిపోతుందోనని భయపడి బయటకు వచ్చాం. దయచేసి సత్వరం Women's ITI ని బాగు చేయకపోతే, కొంత మంది మహిళలు, బాలికలు వాళ్ళ ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితి ఉంది. దానిమీద ఏ చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయవలసిందిగా కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ ః మినిస్టర్ గారూ.

శ్రీ కె. అచ్చెన్నాయుడుః ముందుగా సీనియర్ సభ్యులు, పెద్దలు శ్రీ బుచ్చయ్య చౌదరి గారికి జన్మదిన శుభాకాంక్షలు. (పలువురు సభ్యులు బల్లలు చరచడం ద్వారా తమ విషెస్‌ను తెలియపరిచారు) ఆయన చెప్పిన విషయమంతా నోట్ చేసుకున్నాం. నా సబ్జెక్టు గానీ, మిగతా మంత్రుల సబ్జెక్టులు గానీ, వీలైనంత తొందరగా పరిష్కరించి ఆయనకు సమాచారం అందిస్తాం.

మిస్టర్ స్పీకర్ ః శ్రావణ్ కుమార్ గారూ.

శ్రీ తెనాలి శ్రావణ్ కుమార్ (తాడికొండ)ః నమస్కారం అధ్యక్షా, ఈ వేసవి పూర్తిగా రాకముందే నా నియోజకవర్గంలో మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. ముఖ్యంగా మూడు

మండలాల్లో, ఆఖరికి కృష్ణానదిలో కూడా నీరు లేక, ఎత్తిపోతల పథకాల్లో నీరు రానందువలన ఇబ్బందికరంగా మారింది. నాగార్జునసాగర్ టెయిల్ ఎండ్‌లో ఉండడం చేత ఫిరంగి పురం, మేడి కొండూరు మరియు తాడికొండ మండలాల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. గతంలో సమావేశం ఏర్పాటు చేసినప్పుడు మొదటి వారంలో నాగార్జునసాగర్ నుండి నీరు ఇస్తామన్నారు. ఒకవేళ నీరు రానప్పుడు, at least, transportation అయినా అన్ని గ్రామాల్లో చేయడానికి చర్యలు తీసుకోవాలనీ, నాగార్జునసాగర్ నీటితో చెరువులు నింపడానికి చర్యలు తీసుకోవాలని మంత్రిగారిని ఈ సభ ద్వారా కోరుకుంటున్నాను.

MR. SPEAKER : Minister garu.

శ్రీమతి పీతల సుజాత : అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పింది నోట్ చేసుకున్నాం. Definite గా చర్యలు తీసుకుంటాం.

(ఆ సందర్భంలో ప్రతిపక్ష సభ్యులు శ్రీ పి.సునీల్ కుమార్ తమకు మాట్లాడేందుకు అవకాశమివ్వాల్సిందిగా గౌరవ సభాపతిని కోరారు.)

MR. SPEAKER : Yes.

శ్రీ పాశిం సునీల్ కుమార్ (గూడూరు): నమస్కారం అధ్యక్షా. మన అసెంబ్లీలో దాదాపు 175 మంది సభ్యులున్నాం. రెండు సంవత్సరాలు గడచిపోతోంది. ఇంతవరకు అభివృద్ధికి సంబంధించిన నిధులు ఎమ్మెల్యేలకు కేటాయించలేదు. అన్యాయంగా ఉంది. (ప్రతిపక్ష సభ్యులు చప్పట్లు చరిచారు) మేము జిల్లాల్లో తిరగలేకున్నాం. రెండు సంవత్సరాలు పూర్తయ్యింది. కాబట్టి, రాబోయే ఈ బడ్జెట్‌లో అయినా ఎమ్మెల్యేలకు నిధులివ్వాలని కోరుతున్నాము. జీతాలు కూడా, లక్షా ఇరవై వేలు ఇస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మూడు లక్షలు చేశారు. దాని గురించి కూడా ఆలోచించమని మినిస్టర్ గారిని కోరుతున్నాం.

మిస్టర్ స్పీకర్ : మినిస్టర్ గారూ.

శ్రీ బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి : సభ్యులు చెప్పింది నోట్ చేసుకున్నాం. సంబంధిత మంత్రిగారి దృష్టికి తీసుకుపోతాం.

మిస్టర్ స్పీకర్ : రామకృష్ణ బాబు గారూ..

(ఆ సందర్భంలో ఆర్థిక శాఖామాత్యులు శ్రీ యనమల రామకృష్ణుడు గారు తమకు మైకివ్వాల్సిందిగా గౌరవ సభాపతిని కోరారు)

MR. SPEAKER : Yes.

శ్రీ యనమల రామకృష్ణుడు : అధ్యక్షా, జీతాలు పెంచాలంటే దానికి ప్రొసీజర్ ఉంది. మనం చట్టం అమెండ్ చేయాలి. చట్టం అమెండ్ చేసే ముందు, ఎమినిటీస్ కమిటీకి వెళ్ళాలి. ఎమినిటీస్ కమిటీలో డిస్కస్ చేయాలి. తరువాత గవర్నమెంట్ పరిశీలిస్తుంది. As on today there is no thinking of hiking the salaries of the MLAs.

మిస్టర్ స్పీకర్ : రామకృష్ణ బాబు.

శ్రీ వెలగపూడి రామకృష్ణ బాబు (విశాఖపట్నం తూర్పు): అధ్యక్షా, విశాఖ నగరంలో ముఖ్యంగా విశాఖ తూర్పు నియోజకవర్గంలో, సింహాచలం భూముల్లో కొండవాలు ప్రాంతంలో గత పాతిక, ముప్పై సంవత్సరాల నుంచి అనేక మంది పేదవారు పూరిపాకలు వేసుకుని నివాసముంటున్నారు. మన ప్రభుత్వం వచ్చిన వెంటనే, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు వారికి పట్టాలిస్తామని ప్రకటించడం జరిగింది. హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండడం వలన ఆలస్యమవుతోంది. ఈలోగా వచ్చిన హుద్ హుద్ తుపాను వల్ల గానీ, ఆ తరువాత పడిన వర్షాల వలన పూరిపాకలు పడిపోయిన తరువాత, రేకుల షెడ్‌లు వేసుకోవడానికి సింహాచలం దేవస్థానం వారు పర్మిషన్ ఇవ్వకపోవడం వలన పేద ప్రజలు ఇబ్బందులెదుర్కుంటున్నారు. దయచేసి ఆ పేద ప్రజల్ని కాపాడమని మీ ద్వారా మంత్రిగారిని కోరుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ : మినిస్టర్ గారూ.

శ్రీ కె. అచ్చెన్నాయుడు: అధ్యక్షా, గౌరవ సభ్యులు రామకృష్ణ బాబు గారు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకున్నాం. ఎండోమెంట్ మినిస్టర్ దృష్టిలో పెట్టి, సమస్య పరిష్కరిస్తాం.

**MR.SPEAKER Papers including in the agenda are deemed to have been laid on the Table of the House.**

**<u>PAPERS LAID ON THE TABLE</u>.**

1. "A copy of the 56th Annual Report and Accounts of the Andhra Pradesh State Warehousing Corporation for the year 2013-14, as required under Section 31(11) of the Warehousing Corporations Act, 1962 (Central Act No. 58 of 1962)

2. A copy in each of 50th, 51st and 52nd Annual Reports and accounts of Andhra Pradesh Mineral development Corporation Limited for the years

ended 31st March of 2011, 2012 and 2013 as required under Section 619(2) of the Companies Act, 1956.

## ANNOUNCEMENT

"I am to announce to the House that I have nominated the following Members to be on the Panel of Chairmen for the Seventh Session:

1. Sri V. Prabhakara Chowdary
2. Smt. T.Sowmya
3. Sri N.Rama Naidu
4. Sri B.C.Janardhana Reddy
5. Sri K.Appala Naidu
6. Sri A.Chand Basha

MR.SPEAKER: The House adjourned for tea break for 10 minutes.

**(The House then adjourned at 11.08 for tea break for 10 minutes)**

**1.20pm (14)**

**(The House Re-assembled at 1.28 p.m. with Hon'ble Speaker in the Chair)**

* * *

MR.SPEAKER: The Notice of Motion given by Sri. K. Sridhar Reddy and others regarding removal of Speaker will be taken up now.

(శ్రీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ( మైకు లేకుండా) పాయింట్ ఆఫ్ ఆర్డర్ అని అన్నారు)

శ్రీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి (పులివెందుల) : అధ్యక్షా, రూల్ 71లో క్లియర్‌గా కౌల్ అండ్ షక్థర్. రెండు పుస్తకాలను కోట్ చేస్తున్నాను. స్పీకర్ మీద అవిశ్వాసం పెడితే, మేము నోటీసు ఇచ్చిన వెంటనే, 14రోజుల తర్వాతనే మీరు motion for leave గ్రాంట్ చేయాలని ఉంది. నేను ఒకసారి రూల్ చదువుతాను. రూల్ నెం.71.

Notice of resolution for removal of Speaker or Deputy Speaker.

"Under Rule 71(1), A Member intending to give notice of a resolution under Clause (c ) of article 179 of the Constitution for the removal of the Speaker or the Deputy Speaker shall do so in writing to the Secretary."

"On receipt of a notice under Sub-rule (1) a motion for leave to move the resolution shall be entered in the list of business in the name of the Member concerned on a day fixed by the Speaker provided that the day so fixed shall be any day after fourteen days from the date of the receipt of notice of resolution."

అధ్యక్షా, ఈ రూల్‌లో 14రోజుల తరువాతనే మీరు తీసుకోవాలని చాలా క్లియర్‌గా ఉంది. ఇదికాక, not less than 50members rise accordingly, the Speaker or the Deputy Speaker or the person presiding as the case may be. ఈ 14రోజులు ఎందుకు ఇచ్చారు?

(ఆ సందర్భంలో అధికార పక్షం నుంచి అభ్యంతరాలు వ్యక్తం చేయసాగారు)

కారణం ఏమిటంటే సభ్యులకు విప్ జారీ చేయాలి. సభ్యులకు విప్ జారీ చేసే దానికి సమయం ఇవ్వాలి. ఆ విప్ జారీ చేసిన తరువాత ఆ సభ్యులు ఇక్కడకు వచ్చిన తరువాత, సభ్యులు రాకపోయినా విప్ అందుకునే ధైర్యం వాళ్లకుంటుంది. వచ్చిన తరువాత గానీ, రాకపోయిన తరువాత గానీ, ఆ 50మందిలో వాళ్లు చేతులు పైకి ఎత్తకపోతే డిస్క్వాలిఫై చేసే అవకాశం ఉంటుందని చెప్పి, ఏకంగా 14రోజులల్లో కేటాయింపులు చేయాలని రూల్స్ చాలా క్లియర్‌గా చెప్పాయి.

**1.30 PM (15)**

"At least fourteen days notice has to be given of the intention to move such a resolution. In computing the period of fourteen days, both the terminal days are excluded" అంటే ఇచ్చిన రోజు, చివరిరోజు exclude చేసి 14 రోజులు కచ్చితంగా ఉండాలని చెబుతున్నారు.

On receipt of notice, a motion for leave to move the resolution is entered in the list of Business in the name of the Members concerned on a day fixed by the Speaker provided that the day so fixed has to be any day after fourteen days from the date of the receipt of notice of the resolution. Kaul & Shakhder లో case studies కూడా రాశారు.

A notice of a resolution signed by 21 members for the removal of Speaker Mavalankar was received on 3 December, 1951. The resolution was included as the first time item in the List of Business for 18th December, 1954,

which was circulated to members on 14 December, 1954. ఎప్పుడు నోటీస్ ఇవ్వాలి, దాని తరువాత Motion of Leave Grant ఎప్పుడు చేస్తారు అన్నది very clear గా ఉంది.

ఇంకొక ఉదాహరణ అధ్యక్షా, case study:

"A notice of a resolution signed by 23 Members for the removal of Speaker Sardar Hukam Singh was received on 8th November, 1966. Motion for leave to move the resolution was included in the List of Business for 24 November, 1966, The item was included after the items Papers to be laid, in accordance with Direction 2".

ఇంకొక case study:

A notice of motion of No-Confidence in the Deputy Speaker of the Provisional Parliament, which was received on11 October, 1951, was not proceeded with on the ground that the notice was short of the prescribed period of fourteen days, as the Session was scheduled to adjourn Sine die on 16th October, 1951. Very clear గా చెప్పారు. ఎందుకు చెబుతున్నారు, కారణాలు ఏమి, అందరికీ అర్థం అయ్యింది ఏమంటే 14 రోజులన్నది విప్ జారీచేయడానికి, విప్‌ను పార్టీకి సంబంధించిన శాసనసభ్యులు ఉల్లంఘించకుండా ఉండడం కోసం తగు జాగ్రత్తలు, తగు చర్యలు తీసుకొని ఏకంగా Legislation లోనూ, పార్లమెంట్‌లోనూ రూల్స్ ఫ్రేం చేస్తే అటువంటి రూల్స్‌ను breach చేస్తున్నారు. ప్రస్తుతం బడ్జెట్‌పై ప్రసంగాలు జరుగుతున్నాయి. ఈరోజే తీసుకోవాలా, 14 రోజుల తరువాతా అని రూల్స్ చెబుతున్నాయి.

(అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదాలు చోటుచేసుకున్నాయి)

విప్ జారీచేయడానికి అవకాశం ఇస్తున్నాయి. విప్ జారీ చేసిన తరువాత దానిని ఉల్లంఘిస్తే దానిని డిస్క్వాలిఫై చేయడానికి రూల్స్ చెబుతున్నాయి. అటువంటిది కేవలం ఎనిమిది మంది ఎమ్మెల్యేలు డిస్క్వాలిఫై కాకుండా చూసుకొనేందుకు ఏకంగా స్పీకర్ కుర్చీని సైతం వాడుకుంటున్నారంటే ఇంతకన్నా దౌర్భాగ్యమైన పరిస్థితి ఏదీ ఉండదు.

(ఈ సందర్భంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు బల్లలు చరిచారు)

నేను ఒక్కటే అడుగుతున్నాను. మీకు (రూలింగ్ పార్టీ సభ్యులనుద్దేశించి) ప్రజాస్వామ్యంపై గౌరవం ఉన్నా, ఏమాత్రం మీకు సిగ్గు, రోషం ఉన్నాకూడా. . .

(ట్రెజరీ బెంచెస్ సభ్యులు తమ సీట్లలో నుంచి లేచి అభ్యంతరాలు తెలియజేశారు)

ఆ ఎమ్మెల్యేలందరినీ డిస్క్వాలిఫై చేయండి. వారితో resignation చేయించండి.

(అధికారపక్ష సభ్యులచే సభకు అంతరాయం)

ప్రజల దగ్గరకు పోదాం. ప్రజలు ఎవరికి ఓటు వేస్తారో, దేవుడు ఎవరిని ఆశీర్వదిస్తారో ప్రజల దగ్గర తేల్చుకుందాం. మీరు చేస్తున్నదేమంటే, ప్రజల దగ్గరకు పోయే కాన్ఫిడెన్స్ మీకు లేదు. ప్రజలు ఓట్లు వేస్తారనే నమ్మకం మీకు లేదు.

(అంతరాయం కొనసాగింపు)

ప్రజల దగ్గరకు పోయే కాన్ఫిడెన్స్ మీకు లేదు కాబట్టి ప్రజలు మీకు ఓట్లు వేస్తారనే నమ్మకం లేదు కాబట్టి ఈ ఎనిమిది మంది ఎమ్మెల్యేలను ప్రొటెక్ట్ చేసుకొనే దానికోసం, ఆ ఎమ్మెల్యేలు డిస్క్వాలిఫై కాకుండా చూసుకొనేదాని కోసం మీరు నానా అగచాట్లు పడుతున్నారు. చివరకు నిన్న కూడా నో కాన్ఫిడెన్స్ మోషన్ ఇచ్చిన వెంటనే అదే రోజే చర్చకు పెట్టారు.

(అంతరాయం కొనసాగింపు)

చర్చకు అదే రోజు ఎందుకు అనుమతించారో కారణమేమంటే విప్ జారీ చేశాం అని, అందలేదని, సమయం లేదని చెప్పి ఆ ఎమ్మెల్యేలు సాకులు వెతుక్కునేందుకు అవకాశం మీరు కల్పిస్తున్నారు. 14 రోజులు తరువాతనే Motion accept చేయాలని very clear గా రూల్స్ చెబుతుంటే విప్ జారీ చేయడానికి అవకాశం కల్పించకూడదని, విప్ జారీ చేసినా కూడా ఆ ఎమ్మెల్యేలు మాకు అందలేదని చెప్పుకోడానికి వారికి అవకాశం ఇచ్చేందుకు, ఆ ఎమ్మెల్యేలు డిస్క్వాలిఫై కాకుండా వారిని ప్రొటెక్ట్ చేసుకోడానికి ఏకంగా స్పీకర్ గారే, రూల్స్ కాపాడాల్సిన వ్యక్తులే ఈ మాదిరిగా చేస్తుంటే డెమోక్రసీలో ఏమవుతుంది. డెమోక్రసీ ఉందా లేదా అని అడుగుతున్నాను.

MR.SPEAKER: Minister for Legislative Affairs.

శ్రీ యనమల రామకృష్ణుడు (ఆర్థిక మరియు శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి)ః అధ్యక్షా, డెమోక్రసీ మీ (ప్రతిపక్ష నాయకుడిని ఉద్దేశించి) దగ్గర ఉందో లేదో మాకు తెలియదు గానీ మా దగ్గర మాత్రం పూర్తి డెమోక్రసి ఉంది. గౌరవ ప్రతిపక్ష నాయకుడు నిన్న ఒకసారి చేయి కాల్చుకున్నారు. ఈరోజు మరొకసారి చేయి కాల్చుకుంటున్నారు. నోటీస్ ఇవ్వడం, వెనుకకు పారిపోవడం... నోటీస్ ఇవ్వడం, వెనుకకు పారిపోవడం. అసలు మీరు నోటీస్ ఇచ్చిన తరువాత సాధారణంగా ప్రజాస్వామ్యంలో నేను ఒక నోటీస్ ఇచ్చానంటే దానికి కట్టుబడి ఉండాలి. నాకు ఈరోజు వద్దు, రేపు వద్దు, ఎల్లుండి వద్దు అనడం ఇక్కడ మీ ఇష్టం కాదు. సభ

ఇష్టం. మేము ఎప్పుడు టేకప్ చేయాలో అప్పుడే టేకప్ చేస్తాం. మీరు చెప్పిన రూల్స్ మాకు తెలియనివి కాదు. రూల్స్ అన్నీ కూడా తెలుసు. I may be permitted to move the Motion.

That under Rule 358 of the Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Assembly., I beg to move:

"That Rules 71(2) and 71(3) may be suspended"

MR.SPEAKER: Motion moved. The question is

"That Rules 71(2) and 71(3) may be suspended"

(pause)

The Motion was adopted and the Rules 71(2) and 71(3) may be suspended.

1-40 PM (16)

శ్రీ యనమల రామకృష్ణుడుః రూల్స్ ప్రకారం ఈ హౌస్ ఏదైతే చేస్తుందో అదే అథారిటీ. అదే స్పీకర్‌గారికీ వర్తిస్తుంది. ఎందుచేతంటే రూల్‌ని సస్పెండ్ చేసే అధికారం ఉంది. ఆ అధికారం ప్రకారం నేను మూవ్ చేశాను. రూల్ సస్పెండ్ అయ్యింది. రూల్ సస్పెండ్ అయిన తరువాత వాళ్లు ఏది కోట్ చేసినప్పటికీ కూడా దానికి వర్తించదు, అది రూల్ నెం.1. నెం.2 అన్నిటికంటే ముఖ్యం పొలిటికల్‌గా చూసినట్లైతే మీరు నోటీసు ఇచ్చారు. నోటీసు ఇచ్చినపుడు నోటీసుకి కట్టుబడి ఉండాలి. నోటీసుని ఈరోజు హౌస్‌లోకి తీసుకొస్తానంటే వద్దని అనడం ఎందుకు? మీకేంటి బాధ.

(ప్రతిపక్షసభ్యులచే అంతరాయం)

మీరు వద్దు అంటున్నారంటే మీరు పారిపోతున్నారని అర్థం.

(అధికారపక్షసభ్యులు షేమ్‌షేమ్ అని అన్నారు)

మేము రెడీ. నిత్యం కూడా స్పీకర్‌గారి మీద ఎలిగేషన్ పెట్టడం, ఇలా చెయ్యడం సంప్రదాయం కాదు. అయినప్పటికీ కూడా మీరు ఇచ్చారు. మీరు ఇచ్చిన తరువాత స్పీకర్‌గారు మాట్లాడినప్పుడు కూడా ఒకటే చెప్పారు. మేము కూడా ఒకటే చెబుతున్నాం. ఈనాడు బడ్జెట్ అజెండా ఉంది. మీరు నోటీసు ఇచ్చారు. పెండింగ్ ఏదైతే ఉందో, removal notice on

Speaker. నోటీసు పెండింగ్‌లో ఉండగా స్పీకర్‌గారు హౌస్ కండెక్ట్ చెయ్యడానికి ఆయన మనసు ఎలా ఒప్పుతుంది. అదే మాతో చెప్పారు. మేము కూడా అదే చెబుతున్నాం. ఎందుచేతంటే ఆయన హౌస్ అంతా కండెక్ట్ చెయ్యాలి. దాదాపు 30వ తారీఖు వరకూ బిజినెస్ ఉంది. **నోటీసు పెండింగ్‌లో పెట్టుకుని ఆయన హౌస్ కండెక్ట్ చెయ్యడానికి ఆయన మనసు ఒప్పలేదు. మాకు కూడా మనసు ఒప్పలేదు. మీ సంగతి, మా సంగతి హౌస్‌లో తేల్చుకుందామనే ఉద్దేశంతోటే మేము ఈరోజును తీసుకువస్తున్నాం.**

(అధికారపక్షసభ్యులు బల్లలు చరుస్తూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.)

మీరంటారుగా దమ్ము, ధైర్యం ఉంటే ప్రూవ్ చేసుకోండని. మూడవది Anti Defection Law అనేది 1984సంవత్సరంలో రాజీవ్‌గాంధీగారు ఉన్నప్పుడు ఆరోజు ఉన్న పరిస్థితిలో దానిని తీసుకువచ్చారు. Anti Defection Law అని ఈయన అంటున్నాడు. రాజ్యాంగం ఎప్పుడు వచ్చింది? 1951వ సంవత్సరంలో రాజ్యాంగం వచ్చింది. అంటే రాజ్యాంగంలో ఉండేటటువంటి ప్రావిజన్స్‌కి అనుగుణంగా మన అసెంబ్లీ ఎప్పుడు ఏర్పడింది? 1952వ సంవత్సరంలో ఏర్పడింది. 1952 దగ్గర్నుంచి కూడా ఈ రూల్స్ అన్నీ ఉన్నాయి. అందుచేత ఈ రూల్స్‌లో సస్పెన్షన్ రూల్ ఉంది. అదేవిధంగా మీరు చదివినటువంటి రూల్ ఇవన్నీ ఉన్నాయి. అప్పుడు Anti Defection Law లేదు. అందుచేత defection గురించి ఆరోజు ఆలోచించలేదు. ఆరోజు యొక్క సుప్రీం అథారిటీ గురించి, ఈ హౌస్‌కి ఉండే అథారిటీ గురించి ఆలోచించే దీంట్లో పెట్టారు. అందుచేత మీరేదో ఎంఎల్‌ఏలను రక్షించుకోవడానికో, లేకపోతే మరొక విధంగానో మీరు పెడుతున్నది కాదు. మీరు మీ ఎంఎల్‌ఏలను రక్షించుకోలేక మీరు ఈ మోషన్ మూవ్ చేస్తున్నారు తప్ప బహుశా మీ ఎంఎల్‌ఏలు మీ దగ్గర ఉండడానికి ఇష్టపడటం లేనట్టు ఉంది. అందుకనే కాపాడుకోవడానికే మీరంతా చూస్తున్నారు. అంతే. అదేవిధంగా స్పీకర్‌గారిమీద నో కాన్ఫిడెన్స్ మోషన్ మూవ్ చేసినపుడు స్పీకర్ గారు ఆ కుర్చీలో కుర్చోవడానికి ఇష్టపడడం లేదు. ఇష్టపడనప్పుడు.. మాకు బిజినెస్ బడ్జెట్ ఉంది. అది constitutional obligation. మేము బిజినెస్ చేసుకోవాలి. బిజినెస్ చేసుకోవాలనుకున్నప్పుడు స్పీకర్‌గారు ఛైర్‌లో ఉండాలి. మీ నోటీసు పెండింగ్‌లో ఉండి, స్పీకర్‌గారు బిజినెస్ చెయ్యడానికి ఇష్టపడలేదు. పొలిటికల్‌గా ఆలోచించండి. లీగల్‌గా తరువాత చూద్దాం. లీగల్‌గా మీకేమి రైట్ లేదు. పొలిటికల్‌గా ఆలోచిస్తే మీరు నోటీసు ఇస్తే తరువాత తీసుకోవాలని మేము అనాలే తప్ప మీరే నోటీసు ఇచ్చి మీరే వెనక్కి పారిపోవడం ఏమిటి? మీరు చేతులు కాల్చుకుంటున్నారు. నిన్నా చేతులు కాల్చుకున్నారు. నిన్న కూడా నోటీసు డిస్కషన్‌కి రావడానికి ఇష్టపడలేదు. ఈరోజున కూడా నోటీసు ఇచ్చి డిస్కషన్‌కి రావడానికి ఇష్టపడలేదు. అందుచేత ఏది ఏమైనప్పటికీ కూడా మేము అనుకున్న ప్రకారం డిస్కషన్ అయిపోవాలి. ఈనోటీసుకి రెండు గంటల సమయం కేటాయిద్దామనుకున్నాం. కేటాయించిన తరువాత అయిపోవాలి. స్పీకర్ గారిపై నో కాన్ఫిడెన్స్ మోషన్ చర్చను స్పీకర్‌గారు కండక్ట్ చేయరు. అందుచేత నోటీసు మీద చర్చను

డిప్యూటీస్పీకర్‌గారు కండెక్ట్ చేస్తారు. నోటీసుపై చర్చ పూర్తయిన తరువాత మళ్లీ రెగ్యులర్ బిజినెస్ మేము తీసుకుంటాం. అప్పుడు మళ్లీ స్పీకర్ గారు బిజినెస్ కండక్ట్ చేస్తారు. ఎందుచేతంటే మాకు constitutional obligation. మా బిజినెస్ కావాలి. 30వతారీఖు తోటి appropriation bill pass అవ్వాలి. అందుచేత మీకు Anti Defection గురించి, అదేవిధంగా ఈ రూల్స్‌కి ఎక్కడా సంబంధం లేదు. Anti Defection కంటే రాజ్యాంగం ముందు వచ్చింది. అదేవిధంగా ఈ రూల్స్ గానీ.. పార్లమెంటు ఏర్పడినప్పటి నుంచి కౌల్ అండ్ షక్దర్ ఉంది.. అందుచేత మీరు ఏదో రూల్స్ ప్రకారంగా తప్పించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు తప్ప, ఇక్కడ మీరు ఇచ్చినటువంటి నోటీసుకి సమాధానంగా మీరు ఆన్సర్లు చెప్పడానికి, డిస్కషన్లు చెయ్యడానికి ఇష్టపడడం లేదు. అందుచేత దయచేసి ప్రతిపక్షనాయకులను రిక్వెస్ట్ చేస్తున్నాం. మీరు పారిపోకండి. ఇక్కడ కూర్చుని మీరు ఏదైతే నోటీసు ఇచ్చారో, నోటీసు మీద డిస్కస్ చేద్దాం. ఓటింగుకి వెళ్దాం. ఓటింగు అయిన తరువాత ఏంచేస్తారో చూద్దాం.

మిస్టర్ స్పీకర్ః అసెంబ్లీలో...

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డిః అధ్యక్షా, వీళ్లు మాట్లాడే మాటలు నిజంగా ఆశ్చర్యం. వేరే పార్టీ బి-ఫామ్‌ల మీద గెలిచారు. కాస్తన్నా సిగ్గు ఉండాలి.

(అధికారపక్షసభ్యులచే అభ్యంతరం)

మా పార్టీ బి-ఫామ్‌ల మీద గెలిచారు. ప్రజలు మా పార్టీకి ఓట్లు వేశారు. మా పార్టీ బి-ఫామ్‌ల మీద గెలిచిన వ్యక్తులను మీరు ప్రలోభాలు పెట్టి, మీరు మీ అవినీతి సొమ్ముతో కొనుగోలు చేసి, ప్రలోభాలు పెట్టి...

(అధికారపక్షసభ్యులచే అభ్యంతరం)

మీరు చేస్తున్నది ఏమిటంటే...(మైకు కట్ చేయబడింది)

మిస్టర్ స్పీకర్ః యెస్, మినిష్టర్ ఫర్ లెజిస్లేటివ్ అఫైర్స్.

శ్రీ యనమల రామకృష్ణుడుః పాయింట్ ఆఫ్ ఆర్డర్ అధ్యక్షా. ఆయన నోటీసు ఇచ్చింది స్పీకర్‌గారిని రిమూవ్ చెయ్యడానికా, లేకపోతే వాళ్ల దగ్గర్నుంచి పారిపోతున్నటువంటి ఎంఎల్ఏల గురించి డిస్కస్ చెయ్యడానికా ముందు క్లారిఫై చెయ్యాలి.

(అధికారపక్షసభ్యులు బల్లలు చరుస్తూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు)

ఎందుచేతంటే వాళ్ల ఎంఎల్ఏలను కాపాడుకోవడానికి, నోటీసు ఇవ్వడానికి ఇక్కడ ఏ రూల్ కూడా లేదు. ఆయన ఏదైనా ఉంటే బయట చెప్పుకోవాలి. బయట కాపలా కాసుకోవాలి. బయట ఇంటికి తాళం వేసుకోవాలి. ఇంకేదైనా ఉంటే ఉంటుంది తప్ప మరి దానికి ఆ ఎంఎల్ఏలు చెప్పవలసిన బాధ్యత.

(ప్రతిపక్షసభ్యులచే అభ్యంతరం)

ఇక్కడ అది కాదు. ఇక్కడ స్పీకర్ గారిని రిమూవ్ చెయ్యాలని ఒక నోటీసు ఇచ్చారు. దానిగురించి మాట్లాడితే మాట్లాడండి మీరు. అంతేకానీ మిగతావి మాట్లాడడానికి అర్హత కూడా లేదు మీకు. It is so irrelevant. Irrelevant issues ఇక్కడ allow చెయ్యడానికి కుదరదు.

మిస్టర్ స్పీకర్ః యెస్.. ప్లీజ్.

శ్రీ పి.విష్ణుకుమార్ రాజు (విశాఖపట్నం నార్త్)ః అధ్యక్షా, మేము అధికారపక్షంలో ఉన్నాం. వారు ఏదైనా అనుకోవచ్చు. భారతీయ జనతా పార్టీ, తెలుగుదేశం పార్టీ కలిసి మేము పోటీ చేశాం. ప్రజలు మమ్మల్ని ఎన్నుకొన్నారు.

(అధికారపక్షసభ్యులు బల్లలు చరుస్తూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు)

సో నేచురల్‌గా మేము అధికారపక్షంలో ఉంటాం. దాంట్లో ఎప్పుడు విడిపోతారా అని చూస్తున్నారు. కానీ అది జరగడంలేదు. మెయిన్‌గా అది బాధ. ప్రతిపక్షంవారు మీ మీద అవిశ్వాసం ప్రవేశపెట్టారు. మనకి మాట్లాడడానికి దీంట్లో చాలా ఇష్యూస్ ఉన్నాయి. దీంట్లో అమెండ్‌మెంట్స్ కూడా చెయ్యవలసిన అవసరం ఉంది. మీరు రూల్సింగ్స్ ఇచ్చే అవకాశం కూడా ఉంటుంది. అటువంటిది మీ మీద అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన తరువాత, ఎథికల్‌గా కూడా ఈరోజు సబ్జెక్ట్ తీసుకుని కంటిన్యూ చేసేసిన తరువాత, అప్పుడు మిగిలిన కార్యక్రమం చెయ్యడం అనేది సబబు. రూల్స్ గురించి సపరేట్. ఎథికల్ ఇష్యూస్ సపరేట్. సో దయచేసి ఈ తీర్మానం మీద చర్చ ఇప్పుడు కొనసాగించవలసిందిగా మేము కోరుతున్నాం.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డిః అధ్యక్షా, కౌల్ అండ్ షక్దర్, రూల్స్ ఇవన్నీ కూడా నోటీసు ఇచ్చిన 14 రోజుల తరువాత, ఒక డేట్ ఇచ్చి, దానికన్నా నాలుగురోజులు ముందు చెప్పి చెయ్యాలి. ఆ తరువాతనే motion of leave మూవ్ చెయ్యాలని చెప్పి క్లియర్‌గా ఎందుకు చెబుతున్నాయంటే విప్ జారీ చెయ్యడానికి అవకాశం ఇస్తూ, విప్‌ను ఉల్లఘించిన వారిని disqualify అయ్యే పరిస్థితి క్రియేట్ చెయ్యడం కోసం. అలాంటిది ఎనిమిది మంది శాసనసభ్యులను అనైతికంగా ప్రలోభాలు పెట్టి, తీసుకుని, వాళ్లకు విప్ జారీ చెయ్యకుండా

వాళ్లను ప్రొటెక్ట్ చేసుకోవడానికి, ఒకవేళ విప్ జారీ చేసినా మాకు అందుకొని వచ్చే టైమ్ లేదు అని వాళ్లతో చెప్పించే దానికోసం అని చెప్పి ఏకంగా ఈ వ్యవస్థనే ఈ మాదిరిగా భ్రష్టు పట్టిస్తుంటే డెమోక్రసీ అన్న పదానికి అర్థం లేకుండా చేస్తుంటే, విప్ అనేది లేకుండా చేస్తుంటే ఏకంగా ఈరకంగా Rule-358 చదివేసి(పుస్తకం చూపిస్తూ) ఇంకెందుకు రూల్ బుక్‌లోని ప్రతీ రూల్‌ని చదివేసి వాళ్ల దగ్గర సంఖ్యా బలం ఉంది కాబట్టి ప్రతీరూల్‌ని సస్పెండ్ చేసుకుంటూ పోవచ్చు. ఇక అసెంబ్లీలో రూల్స్ ఉండవు, కౌల్ అండ్ షక్దర్ అవసరమూ లేదు. అసెంబ్లీలో ఏ రూల్స్ ఉండవు. ప్రతీ సందర్భంలోనూ Minister of Legislative Affairs, Rule-358 చదువుతాడు. We are suspending this rule అంటాడు, మోషన్ మూవ్డ్ అంటాడు. మీరు అక్కడి నుంచి మెజారిటీ హ్యావిట్ అంటారు. ఇక అయిపోయింది. ఇక ఏ రూల్స్ ఉండవు. (మైకు కట్ చేయబడింది)

మిస్టర్ స్పీకర్ః యెస్, మినిస్టర్ ఫర్ లెజిస్లేటివ్ అఫైర్స్.

శ్రీ యనమల రామకృష్ణుడుః అధ్యక్షా, ఇంత బ్రహ్మాండంగా కబుర్లు చెప్పే ప్రతిపక్షనాయకులు ఈ నోటీసు మీద ఎందుకు సంతకం పెట్టలేదు. (నోటీసుని చూపిస్తూ)

(అధికారపక్షసభ్యులు బల్లలు చరుస్తూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు)

నిన్న నోటీసు మీద సంతకం పెట్టలేదు, ఈరోజు నోటీసు మీద సంతకం పెట్టలేదు. ఈ నోటీసు కూడా నిన్నటి డేట్ వేసి ఈరోజు ఇచ్చారు. పైన నిన్నటి డేట్ ఉంది. ఈరోజు మాత్రం నోటీసు ఇచ్చారు. ఏదేమైనప్పటికీ కూడా మేము ఇవేమి పట్టించుకోలేదు. పొలిటికల్‌గా ఆలోచించిన తరువాత మీరు స్పీకర్ గారి మీద ఎలిగేషన్ పెట్టిన తరువాత అది హౌస్ వెంటనే తేలాలని తెలుగుదేశం పార్టీ (రూలింగ్ పార్టీ) యొక్క కార్యక్రమం. అదేవిధంగా రూలింగ్ పార్టీ యొక్క ఆలోచన. అందుచేత అలా తేల్చుకోవడానికి అభ్యంతరం ఏమిటని అడుగుతున్నాను. రెండవది వచ్చేటప్పటికీ విప్‌కి, నోటీసుకి సంబంధం లేదు. విప్ అనేది పార్టీ బయట ఇచ్చుకుంటారు. మీరు ఇచ్చుకున్నారా లేదా? మీరు విప్‌ని గౌరవిస్తున్నారా లేదా? లేకపోతే ఆ విప్ ఇవ్వచ్చా లేదా అనేటటువంటిది బయట ఉన్నటువంటి ఇష్యూ. ఈ నోటీసుకి, దానికి సంబంధం లేదు. ఈ నోటీసు ఏమిటంటే స్పీకర్ గారిని రిమూవ్ చెయ్యాలా, లేదా, రిమూవ్ చెయ్యడానికి Strength ఉందా లేదా డిసైడ్ చేసే నోటీసు మాత్రమే ఇది. మీరు ఇచ్చుకునే విప్ వలన మీరు మీ సభ్యుల్ని కాపాడుకుంటారో, కాపాడుకోలేరో, లేకపోతే మీయొక్క ప్రవర్తన వల్ల అందరూ బయటికి పోతారో that is a separate issue.

**1.50 pm(17)**

మూడవ ఇస్యూ వచ్చేటప్పటికి.... ఇందాక నేను చెప్పాను. Anti Defection Law 1984 – 1985 మధ్యలో వచ్చిందనుకుంటాను. అంతకంటే ముందు పొలిటికల్ పార్టీకి విప్ ఉంది. Anti Defection Law వచ్చిన తరువాత విప్‌కు ప్రాధాన్యత వచ్చింది. అందుచేత యాంటీ డిఫెక్షన్ లా గురించి కాదు మీరు నోటీసు ఇచ్చింది. స్పీకర్ రిమూవల్ గురించి ఇచ్చారు. స్పీకర్ రిమూవల్ గురించి మీరు మాట్లాడండి. స్పీకర్ గారు మీకు చేసిన అన్యాయమేమిటి, దానిమీద మాట్లాడండి. ఏయే సందర్భాల్లో మీకు అన్యాయం చేశారో మాట్లాడండి. మీరు విప్ ఇచ్చుకున్నారా, లేదా అనేది this House is no way concerned with that. దయచేసి రూలింగ్ ఇచ్చి ఈ కార్యక్రమాన్ని తీసుకోవలసిందిగా స్పీకర్ గారిని కోరుతున్నాను.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డిః అధ్యక్షా, మంత్రి గారికి యాంటీ డిఫెక్షన్ లా ఎప్పుడు వచ్చిందో కూడా తెలియదు. తెలుసుకుంటే మంచిది. 1985 లో 52 వ రాజ్యాంగ సవరణ ద్వారా, మన రాజ్యాంగంలో 10వ షెడ్యూల్‌లో దీనిని పొందుపరిచారు. అప్పుడు అది చేయడానికి స్ఫూర్తి ఏమిటంటే "to curb the evil of political defections motivated by the lure of office or other similar considerations which endangered the foundations of our Democracy" యాంటీ డిఫెక్షన్ లాలో 10వ షెడ్యూల్‌గా చేరుస్తూ 52 వ రాజ్యాంగ సవరణ చేసినప్పుడు ఈ స్ఫూర్తితో చేశారు. ఇవాళ మనం చట్ట సభలో ఉన్నాం. ఆరోజు కాన్‌స్టిట్యూషన్‌లో ఉన్న లూప్‌హోల్స్‌ను కవర్ చేస్తూ మరలా 91వ రాజ్యాంగ సవరణను 2003 లో తీసుకుని రావడం జరిగింది. మనం యాంటీ డిఫెక్షన్ లాను ఎందుకు తీసుకువచ్చామంటే అధికారంలో పార్టీలు ఏవైతే ఉంటాయో వాళ్లు చేస్తున్న అనైతిక ప్రాక్టీసు, అధికార దుర్వినియోగం, డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ ఎంఎల్‌ఏలను, ఎంపీలను కొనుగోలు చేయడం వంటి వాటిని అరికట్టడం కోసమనే స్ఫూర్తితో చేశారు. ఇవాళేమో చట్ట సభలో ఉన్న మనం ఆ స్ఫూర్తిని పక్కనబెట్టి కాపాడవలసిన స్థానంలో ఉన్న మీరే నిస్సిగ్గుగా ఉల్లంఘిస్తుంటే డెమాక్రసీ ఉందా, లేదా అని అందరం సిగ్గుతో తలవంచుకోవాలి.

నేను ఒక్కటే చెబుతున్నాను. రాజకీయాలలో ఉన్నప్పుడు ఎవరికైనా రెండు గుణాలుండాలి. ఒకటి క్యారెక్టర్, రెండు క్రెడిబులిటీ. క్యారెక్టర్ అంటే వ్యక్తిత్వం, క్రెడిబులిటీ అంటే విశ్వసనీయత. చంద్రబాబునాయుడుగారి క్యారెక్టర్ గురించి చెప్పాలంటే అధికారం కోసం, కుర్చీ కోసం సొంత మామ ఎన్‌టి రామారావు గారిని వెన్నుపోటు పొడిచిన క్యారెక్టర్ ఆయనది.

(ఈ సందర్భంలో అధికార పక్ష సభ్యులు తమ స్థానాల ముందు నిలబడి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయసాగారు)

శ్రీ యనమల రామకృష్ణుడుః అధ్యక్షా, గౌరవ సభ్యులు మా పార్టీ గుర్తు మీద ఎన్నుకోబడ్డారు అని చెబుతున్నారు. అయితే వాళ్లెందుకు వెళుతున్నారో మీ గుండెల మీద చేయి వేసుకుని చెప్పండి. వాళ్లు పోవడానికి కారణాలేమిటో చెప్పండి. లేకపోతే వాళ్లు పార్టీ మారడానికి కారణాలేమిటో మీరు చెప్పాలి. అధ్యక్షా, అవన్నీ పక్కన బెడదాం. I want that this notice has to be taken now itself, I want a Ruling on that, I want a decision from the Speaker whether it is going to take up or not? మిగతా విషయాలు తరువాత మాట్లాడుదాం.

(శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి మాట్లాడేందుకు నిలుచున్నారు)

మిస్టర్ స్పీకర్ః దయచేసి వినండి. దయచే సి కూర్చోండి. ప్లీజ్.... మీరు మాట్లాడవలసినవి మాట్లాడారు. దయచేసి అందరూ వినండి. ప్లీజ్.... అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షం నుంచి కొందరు సభ్యులు స్పీకర్ మీద విశ్వాసం లేదని, తొలగించాలని ఒక నోటీసు ఇచ్చారు. Notice is admitted. Motion is moved. ఒక స్పీకర్ మీద అవిశ్వాసం ఉన్నప్పుడు స్పీకర్‌గా హౌస్ ప్రొసీడింగ్స్ చేయడం నాకిష్టం లేదు. I am very clear.

(అధికార పక్ష సభ్యులు బల్లలు చరిచారు)

రాజకీయ కారణాలు ఉండొచ్చు, చట్టపరమైన కారణాలు ఉండొచ్చు. The Minister for Legislative Affairs has moved a resolution, suspending the Rules which are coming in the way to take up the issue immediately. So the Ruling is given. Resolution is adopted through voice vote. Now I request the Deputy Speaker to conduct the House. I cannot sit in this Chair.

(అధికారపక్ష సభ్యులు అభినందిస్తూ బల్లలు చరిచారు)

(ఈ సందర్భంలో గౌరవ సభాపతి అధ్యక్ష స్థానాన్ని వదిలి వెళ్లారు)

(గౌరవ ఉపసభాపతి అధ్యక్ష స్థానంలో కూర్చున్నారు)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ః సభాపతి గారి మీద పెట్టిన అవిశ్వాస తీర్మానం మీద చర్చ చేపట్టడం జరుగుతుంది. దీనిలో తెలుగుదేశం పార్టీకి గంట సమయం, వైఎస్ఆర్‌సీపీకి 40 నిముషాల సమయం, బిజెపికి, ఇతరులకు 20 నిమిషాల సమయం కేటాయించడం జరుగుతుంది. మొత్తం రెండు గంటల్లో మనం చర్చను పూర్తి చేసుకోవలసిన అవసరముంది. ఇప్పుడు శ్రీధర్ రెడ్డి గారిని మాట్లాడవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి (నెల్లూరు రూరల్): ధన్యవాదాలు అధ్యక్షా. నాకు తెలిసి శాసనసభలో సభాపతి గారు ఒక కుటుంబంలోని తండ్రి స్థానంలో ఉంటారు. సభా నాయకుడు అంటే ముఖ్యమంత్రి గారు పెద్దన్న పాత్రలో ఉంటారు. ప్రతిపక్ష నేత చిన్నన్న పాత్రలో ఉంటారు. అనేక సంవత్సరాలుగా పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో చక్కటి నియమాలను, నిబంధనలను మనం ఏర్పాటు చేసుకున్నాం. ఈ శాసనసభలో భిన్న రాజకీయ పార్టీలుంటాయి. సిద్ధాంతపరమైన, పార్టీపరమైన విభేదాలుంటాయి. ఎన్ని విభేదాలున్నా ఈ శాసనసభలో అడుగు పెట్టిన తరువాత శాసనసభ ప్రజా గుండె చప్పుళ్లకు ప్రతి రూపంగా మనం ఏదైతే సత్సంప్రదాయాలను నెలకొల్పామో, ఏదైతే నియమావళిని మనం ఏర్పాటు చేసుకున్నామో, ఆ నియమావళిని తు.చ.తప్పకుండా పాటిస్తూ ముందుకు రావలసిన బాధ్యత అందరి మీదుంది. కానీ దురదృష్టవశాత్తూ ఈ శాసనసభలో గత రెండేళ్లుగా జరిగిన పరిణామాల మీద స్పీకర్ గారి మీద మేము అవిశ్వాసతీర్మానం ప్రవేశపెడితే దానిలో కూడా మనం రాసుకున్న నియమ నిబంధనలను ఉల్లంఘించారు. ఎందుకు ఉల్లంఘించారో ఈ రాష్ట్రంలోని ప్రజలందరూ టివిల ద్వారా చూస్తున్నారు. ఏదైతే ఈ శాసనసభ నియమావళి, కౌల్ అండ్ షక్దర్ ఈ రెండూ మనం రాసుకున్న, మనం పెట్టుకున్న నియమావళిని శాసనసభా సాక్షిగా, మీపైన ఉన్న సత్యమేవ జయతే సాక్షిగా మొత్తం వాటికి పాతరేస్తున్నారు. ఇందాకటి నుంచి చూస్తున్నాను. మాలాంటి కొత్త శాసనసభ్యులు ఉల్లంఘిస్తుంటే శాసనసభా వ్యవహారాల మంత్రిగా మాకు చెప్పాల్సిన మా మంత్రి యనమల రామకృష్ణుడు గారు అడుగడుగునా ఈ శాసనసభ......

(ఈ సందర్భంలో శ్రీ యనమల రామకృష్ణుడు మాట్లాడేందుకు తమ స్థానం ముందు నిలబడ్డారు)

అప్పుడే లేచారా?

శ్రీ యనమల రామకృష్ణుడు: మీరిచ్చిన నోటీసు నామీద కాదు. స్పీకర్ గారి మీద ఇచ్చారు. స్పీకర్ గారి మీద మాట్లాడండి, నామీద కాదు. నామీద మాట్లాడాలంటే మనమందరం కలిపి డిబేట్ చేద్దాం. That is a different matter. స్పీకర్ గారి గురించి మాట్లాడండి. మీరు నోటీస్ ఇచ్చింది ఒకటి, మాట్లాడేది మరొక అంశం మీద.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: మీరు సభాపతి గారి మీద ఇచ్చిన అవిశ్వాసానికి సంబంధించిన అంశం మీద మాత్రమే మాట్లాడండి.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి: అధ్యక్షా, గతం, వర్తమానం, భవిష్యత్తు ఇది ఒక చరిత్ర. ఒక అంశం గురించి మనం మాట్లాడాలంటే గతం గురించి, వర్తమానం గురించి మాట్లాడకుండా భవిష్యత్తు గురించి మాట్లాడలేం. చాలాసార్లు ఈ చట్ట సభలో సీనియర్ అయిన శాసనసభా వ్యవహారాల మంత్రి గారికి ఆ మాత్రం తెలియకుండా పోవడం అత్యంత బాధాకరం. ఏదైనా సరే

ఒక అంశం ప్రస్తావనకు వచ్చేటప్పుడు, ఒక ప్రసంగాన్ని చెప్పేటప్పుడు అన్‌పార్లమెంటరీ పదాలు వాడితే మీరు తప్పనాలి. మేము ఏమి మాట్లాడాలో, ఏమి మాట్లాడకూడదో మీరు చెప్పేలా ఉంటే, మీరే ప్రసంగ పాఠాలు పంపిస్తే ఇష్టముంటే చదువుతాం, లేకపోతే చదవం, లేకపోతే వెళతాం అంటే కరెక్టు కాదు.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ః శ్రీధర్ రెడ్డి గారూ, సబ్జెక్టులోకి రండి.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి : అధ్యక్షా, ఈ శాసనసభలో రెండేళ్లుగా జరుగుతున్న అనేక పరిణామాలు చూసినప్పుడు..., 1967 లోనో, 1968 లోనో ఒక సంవత్సరం అటో, ఇటో గుర్తు లేదు గానీ నా వయస్సు అప్పటికి మూడేళ్లు...., ఈ శాసనసభలోకి నేను సభ్యుడిగా అడుగుపెట్టిన తరువాత లైబ్రరీలో పుస్తకాలు చదువుతున్నప్పుడు, అలనాటి శాసనసభలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు భారతమాత ముద్దుబిడ్డ, తెలుగుతేజం తరిమెల నాగిరెడ్డి గారు ఈ శాసనసభలో తమ శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తూ ఒక మాటన్నారు.

**మ.2.00 (18)**

శాసనసభ, పార్లమెంటులు బాతాఖానీ క్లబ్బులుగా మారిపోయాయి. బాతాఖానీ క్లబ్బులుగా మారిపోయిన తరవాత ప్రజా గుండె చప్పుళ్లను పార్లమెంటులో, శాసనసభలో నివేదించలేనపుడు ఆ పార్లమెంటు, శాసనసభలు దారితప్పినపుడు ఈ దేశంలో ప్రజాస్వామ్య మనుగడకే ప్రశ్నార్థకం అవుతుంది. ప్రజల గుండె చప్పుళ్లు వినిపించలేని ఈ శాసనసభలు బాతాఖానీ క్లబ్బులుగా మారిపోయినపుడు ఈ సభలో ఉండలేకపోతున్నాను. ఈ శాసనసభకు దీర్ఘకాలం రాజీనామా చేసి మరలా చట్టసభలో అడుగుపెట్టనని వెళ్లారు. ఆ పుస్తకాలన్నీ చదువుతున్నప్పుడు నాకేమి అనిపించిందంటే, తరిమెల నాగిరెడ్డిగారు పార్లమెంటరీ ప్రజా వ్యవస్థ గురించి బాధతో వెళ్లారా, లేక శాసనసభలో జరిగిన పరిణామాలతో వెళ్లారా అనే విషయం అర్థం కాని పరిస్థితి. నాకైతే మాత్రం తరిమెల నాగిరెడ్డిగారి ఆలోచనలే పదే పదే మదిలోకి వస్తున్నాయి. రెండేళ్ల నుంచి నేను ఈ శాసనసభలో జరుగుతున్న వ్యవహారాలు చూసినపుడు శాసనసభలో నేను శాసనసభ్యునిగా ఎందుకు ఉన్నానా, ఈ శాసనసభ ప్రజాగుండె చప్పుళ్లకు అనుగుణంగా వ్యవహరిస్తుందా, ఈ శాసనసభలో ప్రజాసమస్యలపై చర్చ సాగుతుందా అనే అనుమానం నాకు వస్తున్నది. ఎందుకంటే ఈ శాసనసభలో మనం మాట్లాడే మాటలను ఈ రాష్ట్రంలోని కోట్లాది మంది ప్రజలు టీవీలలో చూసినపుడు ఈ శాసనసభ గౌరవం గురించి, సభ్యుల గురించి ఏమనుకుంటారో అని ఒకసారి ఆలోచించండి. అయితే దీనికి కారణం నేను చాలా స్పష్టంగా చెబుతున్నాను. అధికారపక్షం అందుకు కారణమని ప్రతిపక్ష పార్టీగా మీరు మమ్మల్ని నిందించవచ్చు. లేదు, దానికి మేం కాదు, మీరే కారణమని నేను చాలా స్పష్టంగా చెబుతున్నాను. అయితే మీ మాటలు నిజాలా, మా మాటలు నిజాలా, వాస్తవాలా అని తెలియాలంటే మన మధ్య వాదనలు వద్దు. ప్రత్యక్ష ప్రసారాలను శాసనసభలో మనం కొత్తగా

ప్రవేశపెట్టింది కాదు. చాలా కాలంగా వస్తున్న సంప్రదాయం. కాబట్టి మనం కూడా టీవీలలో ప్రత్యక్ష ప్రసారాలు చూస్తున్నాం. ఎందుకు ప్రారంభమైనదో, ఎపుడు ప్రారంభమైనదో, ఎవరు ప్రారంభించారో నాకైతే తెలియదు గానీ ఇటీవల ఎడిట్ చేసినవి మాత్రమే ప్రసారం చేస్తున్నారు. ఈ శాసనసభలో ఇలాంటి సన్నివేశాలు పతాకస్థాయికి చేరుతున్నాయి, మాటల తూటాలు పేలుతున్నాయి. ప్రజాసమస్యల మీద పార్లమెంటరీ బాషలో మాట్లాడవలసిన మనం బూతు మాటలు మాట్లాడే పరిస్థితి ఈ శాసనసభలో ఎందుకు వచ్చింది? కాబట్టి ఈ శాసనసభలో ఎవరిది తప్పు, ఎవరిది ఒప్పు అని తెలుసుకోవాలంటే దానికి వాదనలు, విబేధాలు వద్దు. శాసనసభ ప్రత్యక్ష ప్రసారాలను టీవీలలో గానీ, సంఘటన నుంచి సంఘటన వరకు ఎక్కడా ఒక్క పదం కూడా పొల్లు పోకుండా ప్రత్యక్ష ప్రసారం చేసినట్లయితే, మీరు తప్పులు చేశారనుకుంటే, ప్రజలు మీకు శిక్ష వేస్తారు, మేం తప్పులు చేశామనుకుంటే ప్రజలు మాకు శిక్ష వేస్తారని చాలా స్పష్టంగా చెబుతున్నాను. మా బాధ అంతా ఒకటే.

స్పీకర్‌గారు తండ్రి స్థానంలో ఉన్నారు. సభా నాయకుడిగా ముఖ్యమంత్రిగారు పెద్దన్న స్థానంలో ఉన్నారు. ప్రతిపక్ష నాయకుడు చిన్నన్నగా ఉన్నారు. వారి నాయకత్వంలో మేం ఉన్నాం. కానీ పెద్దన్న స్థానంలో ఉన్న సభా నాయకుడు గారు అన్ని రకాలుగా ఈ శాసనసభ నియమాలన్నింటినీ బుల్‌డోజ్ చేసే పద్ధతిలో, స్పీకర్ గారిని సైతం భయభ్రాంతులకు గురిచేసే పద్ధతులలో చేస్తున్నారు. ఈ మాటలు చాలా కచ్చితంగా అంటున్నాను. రికార్డులు చూసే మాట్లాడుతున్నాను. నేను మాట్లాడే మాటలలో ఏ ఒక్క మాట అవాస్తమని అన్నప్పుడు మీరు నాకు శిక్ష వేయవచ్చు. ఈ క్షణమే నేను ఈ శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసి, జీవితంలో మరలా చట్టసభలో అడుగుపెట్టే పరిస్థితి కూడా ఉండదు. నేనెక్కడా కూడా ఒక్క మాట కూడా సత్యదూరమైన మాట, ఒక్క అన్‌పార్లమెంటరీ పదం కూడా మాట్లాడను. మేం కొత్తగా శాసనసభ్యులుగా వచ్చాం. నా వయసు 50 సం.లు. నేనేదో ఆవేశపడితే అర్థం ఉంటుంది కానీ ఈ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉన్నవారు అపారమైన సీనియర్ రాజకీయ నాయకులు. 1978 నుంచి వారు ఈ సభలో సభ్యులుగా ఉన్నారు. నాకు తెలిసి 1983లో ఎన్టీఆర్ గారు తెలుగుదేశం పార్టీ పెట్టినపుడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చంద్రబాబునాయుడు గారు చంద్రగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 1985 నుంచి 1989వరకు మాత్రం వారు సభ్యులుగా లేరు.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: మీరు అంశంపై మాట్లాడండి. ఇది ముఖ్యమంత్రిగారి మీద అవిశ్వాసం కాదు కదా? మీరు అవిశ్వాస తీర్మానం పెట్టింది సభాపతిగారిపైన. మీకున్న 40 నిమిషాలలో ఇప్పటికే 10 నిమిషాలు మాట్లాడారు.

శ్రీ యనమల రామకృష్ణుడు: అధ్యక్షా, ఆయన నోటీసు గురించి ఏదైనా మాట్లాడితే మాట్లాడమనండి కానీ ముఖ్యమంత్రిగారికి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగారికి దీనికి

సంబంధం లేదు. రెండోది ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిని పెద్దన్న అని, జగన్మోహన్‌రెడ్డిగారిని చిన్నన్న అని అన్నారు. వీరిద్దరూ పూర్తి వ్యతిరేకులు, బద్ధ విరోధులు. ఉత్తర దక్షిణ ధ్రువాలు. వీరిద్దరూ ఎలా సోదరులు అవుతారు, ఎలా ఉంటారు? మీ కల్చర్ వేరు, మా కల్చర్ వేరు. మాది అభివృద్ధి, మీది అవినీతి. ఇద్దరూ ఒకటి ఎలా అవుతారు? మీరు సబ్జెక్టుకు రండి, నోటీసు మీద మాట్లాడండి తప్ప ఈ పద్ధతి బాగా లేదు.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ః శ్రీధర్ రెడ్డిగారూ, మీరు సబ్జెక్ట్ మీద మాట్లాడండి. ఇప్పటికే 10 నిమిషాలు మాట్లాడారు. మీకు మొత్తం సమయం 40 నిమిషాలు, ఇంకా నలుగైదుగురు మాట్లాడాలి.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిః అధ్యక్షా, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రిగారు చాలా వినసొంపుగా వినిపించారు. వారు ఏ అంశంపైన అయినా మాట్లాడతారు. అంటే వారు ఏమైనా మాట్లాడవచ్చు, ఏమైనా చేయవచ్చు. మేం ఏమి మాట్లాడాలో, ఏమి మాట్లాడకూడదో వారే నిర్ణయించి చేసే విధం ఉంటే ప్రసంగ పాఠం రాసి పంపించండి. చదివి వినిపిస్తాం. మంత్రిగారూ, ఇది సమంజసం కాదు. ప్రశ్న మీదే, జవాబు మీదే.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ః మీరు సబ్జెక్ట్‌లోకి రండి.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిః అధ్యక్షా, ఏమిటిది? నేను ఇందాకే చెప్పాను. నేను అన్‌పార్లమెంటరీ పదాలు వాడే ప్రశ్నే లేదు., సత్యదూరమైన మాటలు చెప్పే ప్రసక్తే లేదు. కఠోర సత్యాలు మాత్రమే చెబుతాను. ఈ సభలో జరిగిన కొన్ని సంఘటనలు చెబుతాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ః మీరు చెప్పిందే చెప్పి సమయం తగ్గించుకుంటున్నారు. చూసుకోండి కొంచెం.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిః అధ్యక్షా, ఈ సభలో ఈ విధానం రెండేళ్లుగా సాగుతున్నది. ఇటీవల కాలంలో మా సభ్యురాలు శ్రీమతి రోజాగారిని ఏకంగా సంవత్సరంపాటు సభనుంచి సస్పెండ్ చేశారు. సంవత్సరం పాటు రోజాగారిని సస్పెండ్ చేయవచ్చునని అనేక నియమనిబంధనలున్న పుస్తకాలు చదివినా ఎక్కడా కూడా ఈ అధికారం ఎవరికీ లేదు. రోజాగారు పొరపాటు చేశారు కాబట్టి వారిని సస్పెండ్ చేయడం సమంజసమని అధికారపక్షం మాట్లాడే మాటలతో కొంచెం సేపు ఏకీభవిస్తే అంతకంటె పెద్ద మాటలు, పదాలను పెద్దన్నగా ఉన్న ముఖ్యమంత్రిగారు పిచ్చ పిచ్చగా ఉందా, మీ కథ తేలుస్తా, మీ సంగతి తేలుస్తా అని ఈ రాష్ట్ర శాసనసభలో ముఖ్యమంత్రిగారు మాట్లాడిన మాటలు నిజమా, కాదా అని ప్రశ్నిస్తున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ః మీరు విషయానికి రండి. మీరు అవిశ్వాస తీర్మానం ఇచ్చింది ముఖ్యమంత్రిగారి మీద కాదు. మీరు ఇచ్చినది సభాపతిగారి మీద.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిః అధ్యక్షా, ఇది చెప్పాల్సి వచ్చింది కాబట్టే చెబుతున్నాను. సభాపతిగారి మీద ఎందుకు అవిశ్వాస తీర్మానం పెట్టాల్సి వచ్చిందో దానికి కారణమేమిటో చెబుతున్నాను. దాని వలన............( మైక్ కట్ చేయబడింది).

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ః అచ్చెన్నాయుడు గారూ.

శ్రీ కె.అచ్చెన్నాయుడు (టెక్కలి) ః అధ్యక్షా, వారు ఎందుకు అవిశ్వాస తీర్మానం పెట్టారో దాని మీద మాట్లాడాలి. కానీ సరకు లేక, ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకొనే ప్రసక్తి లేదు. ఈ సభలో ఎవరు మాట్లాడినా ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలి. ఈ రోజు మీరు అవిశ్వాస తీర్మానం పెట్టింది స్పీకర్‌గారి మీద. మీరు స్పీకర్‌గారిని ఆ స్థానం నుంచి తొలగించడానికి అవిశ్వాస తీర్మానం పెట్టారు. కానీ, దానిని తప్ప వారు అన్ని విషయాలు మాట్లాడుతున్నారు. మీకు సబ్జెక్ట్ లేకపోతే ఈ అంశంపై చర్చను ముగించండి. మీ ద్వారా వారికి ఒక సలహా ఇస్తున్నాను. ఈ సభకు ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా జగన్మోహన్‌రెడ్డిగారు ఉండడంతో ఈ సభలో వ్యవహారాలు భ్రష్టుపట్టాయి. ప్రతిపక్ష సభ్యులకు నా సలహా ఏమిటంటే............

(వైఎస్సార్‌సీపీ సభ్యుల నుంచి అంతరాయం)

మీ సభ్యులే వినాలి. దీనికి సంబంధించి నిన్న కూడా మీ పార్టీ మా ప్రభుత్వం మీద అవిశ్వాస తీర్మానం పెట్టింది. కానీ చివరికి పారిపోయారు. మరలా ఈరోజు స్పీకర్‌గారి మీద అవిశ్వాస తీర్మానం పెట్టారు. వీటికన్నింటికీ పరిష్కారం ఒకటే. రేపు మరలా ప్రతిపక్ష నాయకుడిమీద మీ సభ్యులే ఆలోచించి అవిశ్వాస తీర్మానం పెడితే ఈ సభకు పట్టిన దరిద్రం అంతా తొలగిపోతుంది. ఇంక సమస్యలే ఉండవు కాబట్టి ఆ ఒక్కటీ చేయమని కోరుతున్నాను.

**మ. 2.10 (19)**

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిః అధ్యక్షా, శాసనసభ చర్చల్లో ఏది మాట్లాడాలో, ఏది మాట్లాడకూడదో అచ్చెన్నాయుడు గారు నాకు చెప్పటం, నేను వినటం దురదృష్టం అచ్చెన్నా. మీరు చెప్పటం నేను వినటం అంతకంటే దురదృష్టం ఏమీ లేదు. స్పీకర్ గారి మీద అవిశ్వాసం పెట్టటానికి కారణాలు చెబుతుంటే కారణాలు కూడా చెప్పనివ్వకుండా ఇప్పటికే ఇద్దరు మంత్రులు లేచారు. ఇంకా ఎంత మంది అడ్డు తగులుతారో తెలియదు. ఒక శాసనసభ్యుడిగా

నాకే ఈవిధంగా అడ్డం తగులుతుంటే ప్రతిపక్షనేత జగన్మోహన్ రెడ్డి గారు మాట్లాడుతుంటే ఎన్నిసార్లు అడ్డంకులు కల్పించారో, ఎంతమంది జోక్యం చేసుకున్నారో, అందరికీ తెలిసిందే.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ః సార్, మీకిచ్చిన సమయాన్ని వృథా చేసుకోకుండా సబ్జెక్ట్ మీద మాట్లాడండి.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిః అధ్యక్షా, ఈ శాసనసభలో గత రెండేళ్లుగా జరిగిన పరిణామాలను గమనిస్తే ముఖ్యమంత్రి గారి దగ్గర్నుంచి తెలుగుదేశం పార్టీ మంత్రుల వరకు నానోటితో ఉచ్చరించటానికి వీలులేనటువంటి అనేక మాటలు మాట్లాడితే వాళ్ల మీద మాత్రం చర్యలు లేవు. ఒక తెలుగుదేశం శాసనసభ్యుడు వైస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుడిని "చంపేసి ఈ అసెంబ్లీలో సమాధి కట్టేస్తా"నని రికార్డుల పూర్వకంగా మాట్లాడితే వారి మీద చర్యలు లేవు. దురదృష్టమేమంటే వారిమీద చర్యలు తీసుకోవాలన్న ఆలోచన కూడా రాకపోవటం బాధాకరం. కాని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల మీద మాత్రం ఎప్పుడు ఎక్కడ ఎంతమందిని సస్పెండ్ చెయ్యాలా, ఏ కారణం చేత సస్పెండ్ చెయ్యాలా, ప్రజాస్వామిక హక్కుల్ని ఏవిధంగా కాల రాయాలా అని వారు కొనసాగిస్తున్న సంఘటనల కారణంగానే మేం ఈ అవిశ్వాసాన్ని ప్రవేశపెట్టటం జరిగింది.

నిన్నటి రోజున ఏం జరిగిందో మీరందరూ స్పష్టంగా చూశారు. ఈ ప్రభుత్వం మీద మేము అవిశ్వాస తీర్మానం నోటీసిచ్చాము. ఎంత బాధాకరమంటే చెప్పలేము. ముఖ్యమంత్రి గారిని చూస్తే నాకు ఒకపక్క చాలా సంతోషంగా ఉంటుంది. మరోపక్క పక్క చాలా బాధగా ఉంటుంది. ముఖ్యమంత్రి గారిని చూస్తే నాకు చాలా సంతోషమెందుకంటే అమలుకు సాధ్యం కాని నాలుగు హామీలిచ్చి వాళ్ల పార్టీని అధికారంలోకి తెచ్చారు. మరోపక్క బాధ ఎందుకంటే....

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ః సార్, మీ పార్టీకి కేటాయించిన 40 నిమిషాల్లో మీ పార్టీ వాళ్లు ఆరేడుగురు మాట్లాడవలసి వుంది. మీరు మాట్లాడబట్టి దాదాపు పది నిమిషాలవుతుంది. మీరు సబ్జెక్ట్ గురించి మాట్లాడండి. త్వరగా ముగించండి.. మిగిలిన వాళ్లకు అవకాశం కల్పించండి...

శ్రీ యనమల రామకృష్ణుడుః డెప్యూటీ స్పీకర్ సర్, సబ్జెక్ట్‌కు కన్‌ఫైన్ అయితేనే టైమ్‌లోపల చర్చ కంప్లీట్ అవుతుందని ఇప్పటికే నాలుగు సార్లు చెప్పాను. అందుచేత సభ్యులు సబ్జెక్ట్‌కు కన్‌ఫైన్ అయి మాట్లాడితే బాగుంటుంది. శ్రీకాంత్ రెడ్డి గారూ, Suspension of a Member is no way connected with the Speaker. The Speaker will suspend on the motion moved by the Treasury Benches. హౌస్ పనిష్ చేసిన దాని గురించి స్పీకర్

గారు అనౌన్స్ చేస్తారు. దానికీ దీనికీ సంబంధం లేదు. ( ఆ మోషన్ మూవ్ చేయడమే తప్పంటున్నాము సార్ అని శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.)

రెండవది అధ్యక్షా, గౌరవ సభ్యులు చెబుతున్నారు చంద్రబాబునాయుడుగారి పక్కనుంటే ఆనందంగా ఉంటుందట. జగన్మోహన్ రెడ్డి గారి పక్కనుంటే బాధగా ఉంటుందట. ఆ బాధెందుకు అధ్యక్షా, ఇటు వైపుకొచ్చి ఆనందంగా ఉండొచ్చు కదా?

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: శ్రీధర్ రెడ్డి గారూ, టైమ్ అయిపోతుంది కాబట్టి సబ్జెక్ట్ గురించి మాట్లాడండి.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి: అధ్యక్షా, యనమల రామకృష్ణుడు గారు ప్రశ్నా వారే, జవాబూ వారే. నిన్న కూడా ఇదే పరిస్థితి జగన్ గారు ఒకటి మాట్లాడితే వారొకటి చెబుతారు. ఏంచేస్తామధ్యక్షా? సాక్షాత్తూ శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి గారు సభలో సభ్యులు మాట్లాడని మాటలను మాట్లాడారని వక్రీకరిస్తుంటే నిజంగా బాధేస్తుంది. నేనేం చెబుతున్నానంటే అంతటి సీనియర్ అయిన ముఖ్యమంత్రి గారికి ఒక జూనియర్ శాసనసభ్యునిగా రెండు చేతులు జోడించి చేస్తున్న ఒక విన్నపం ఏమంటే ముఖ్యమంత్రి గారూ, అక్కడికే వస్తున్నా. ఎనిమిది మంది శాసన సభ్యులు మా పార్టీ నుంచి మీ పార్టీలోకి వచ్చారు. వాళ్లకు ప్రలోభాలు పెట్టారని మేమంటున్నాము. కాదు, మేం చేస్తున్న అభివృద్ధిని చూసే వాళ్లు వచ్చారని మీరంటున్నారు.....

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: స్పీకర్ గారిపై ఇచ్చిన నోటీసుకూ దీనికీ సంబంధం ఉందా? సబ్జెక్ట్ గురించి మాట్లాడండి.

శ్రీ కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి: అధ్యక్షా, నా ప్రసంగం పూర్తిగా వినండి. నేను మాట్లాడే ప్రతీ మాటా సంబంధం ఉండే మాట్లాడుతున్నాను. సంబంధం లేకుండా మాట్లాడడం లేదు. నేను ముఖ్యమంత్రి గారికి మీ ద్వారా చెప్పేదేమంటే ఈ రోజు మేం స్పీకర్ గారి మీద అవిశ్వాసం పెట్టాం. అభివృద్ధి చూసి మీతో వచ్చిన ఆ ఎనిమిది మంది శాసనసభ్యులు ఎక్కడున్నారు? వాళ్ల చేత మీరు అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా స్పీకర్ గారికి మద్దతుగా ఓటు వేయించే అవకాశముందా దయచేసి చెప్పాలని కోరుతున్నాను. ఎందుకడుగుతున్నానంటే స్పీకర్ గారి మీద మేం పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని నియమనిబంధనల ప్రకారం 14రోజుల తరువాత చర్చకు అనుమతించాలని ఉన్నప్పటికీ ఆ ఎనిమిది మంది శాసనసభ్యులను కాపాడుకోవడానికి మీరు ఆ తీర్మానాన్ని సైతం......

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: ముగించండి. మీ పార్టీకిచ్చిన 40 నిమిషాల్లో మీరొక్కరే 20 నిమిషాలు మాట్లాడితే మిగిలిన మీ పార్టీ సభ్యులు ఎప్పుడు మాట్లాడతారు? మీరే మొత్తం 40 నిమిషాలు మాట్లాడతానంటే నాకేమీ అభ్యంతరం లేదు.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి: నన్ను మాట్లాడనివ్వండి అధ్యక్షా....

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: మీ పార్టీకి కేటాయించిన 40 నిమిషాలూ మీరే మాట్లాడతానంటే నాకేమీ అభ్యంతరం? కానీ మీ పార్టీ తరఫున ఆరేడుగురు మాట్లాడతారని పేర్లిచ్చారు కదా, వాళ్లు మాట్లాడాలా వద్దా మీరే చెప్పండి. మిగతా వాళ్లు కూడా మాట్లాడాలంటే మీరు ముగించాలి మరి.

శ్రీ కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి: అధ్యక్షా, నేనా కొత్త సభ్యుణ్ణి. నాకా ప్రసంగాలు చేయటం అలవాటు లేవు. నన్ను చెప్పనివ్వండి సార్.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: మీ పార్టీకిచ్చిన టైమ్ 40 నిమిషాలయితే మీరే 20 నిమిషాల నుంచి మాట్లాడుతున్నారు. 40 నిమిషాలూ మీరే మాట్లాడతానన్నా నాకేమీ అభ్యంతరం లేదు. మీ పార్టీ తరఫున మాట్లాడే వారికి సంబంధించి ఏడు పేర్లిచ్చారు. 20 నిమిషాలుగా మీరే మాట్లాడుతూ ఉంటే ఎట్లా? మిగతా వాళ్లు కూడా మాట్లాడాలి కదా?

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి: మాట్లాడతారు సార్. కచ్చితంగా మాట్లాడతారు. అధ్యక్షా, స్పీకర్‌గా ఉన్న వ్యక్తి ఒక కుటుంబ పెద్దగా తండ్రి పాత్ర పోషించకుండా సభలో ప్రతిపక్షం గొంతు నొక్కేరీతిలో అధికార పార్టీకి పూర్తిస్థాయిలో కొమ్ము కాస్తూ, అధికార పార్టీ రాజకీయాలకు ఒక రక్షణ కవచంగా ఉండకూడదు. స్పీకర్‌గా ఉన్న వ్యక్తి ఒక కుటుంబ పెద్దగా, తండ్రిలా బాధ్యత వహించాల్సిన వ్యక్తి తండ్రిలా వ్యవహరించకుండా పూర్తిగా పెద్దన్నకు మద్దతుగా అధికారపక్షానికి రక్షణ కవచంగా నిలిచి నిరంకుశ చర్యలకు పాల్పడుతూ ప్రతిపక్షం గొంతు నొక్కేస్తున్నారు. ఈరోజు జగన్మోహన్ రెడ్డి గారు అసెంబ్లీలో అనేక సందర్భాలలో మాట్లాడుతూ వుంటే ఒక్కొక్క ప్రసంగానికి ముఖ్యమంత్రి గారి దగ్గర్నుంచి తెలుగుదేశం పార్టీ మంత్రుల దాకా ఎంతమంది అడ్డుపడినా స్పీకర్ గారు అడ్డు చెప్పరు. దురదృష్టం. అదేవిధంగా ఒక మంత్రి ఎన్నిసార్లు మాట్లాడినా వారు అడ్డుచెప్పరు. కాని ప్రతిపక్షనేత మాట్లాడేటప్పుడు అధికార పక్షంవైపు నుంచి ఎన్ని దుర్భాషలాడినా, ఎన్ని తిట్లు తిట్టినా, ఎన్ని అన్‌పార్లమెంటరీ పదాలు వాడినా స్పీకర్ గారు ఆ స్థానంలో కూర్చొని వింటూ, చూస్తూ, వుంటారు కాని ఒక్క మాటా ఖండించరు. అందుచేత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసన సభా పక్షం స్పీకర్ స్థానంలో కూర్చుని, తండ్రి స్థానంలా వ్యవహరించకుండా ఏకపక్షంగా అధికార పక్షానికి కొమ్ముకాస్తూ ఈ రాష్ట్ర ప్రజల మనోభావాలను

మొత్తం కాలరాస్తూ ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిస్తున్న దానికి నిరసనగానే అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ః ముగించండి..

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిః ఏంటధ్యక్షా? సమస్యేమిటో నాకు అర్థం కావటం లేదు. అడుగడుగునా అడ్డుపడుతున్నారు.

మిస్టర్డెప్యూటీ స్పీకర్ః ఇంకా మాట్లాడవలసిన వాళ్లు చాలా మంది ఉన్నారు కాబట్టి త్వరగా ముగించమని కోరుతున్నాను.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిః ఎందుకధ్యక్షా, అడుగడుగునా మీరు సైతం అడ్డుపడుతున్నారు?

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ః అడ్డుపడటం లేదు. మీపార్టీకి కేటాయించిన 40 నిమిషాల సమయం మొత్తం మీతోనే మాట్లాడించటానికి నిర్ణయం తీసుకున్నామని చెబితే నాకేమీ అభ్యంతరం లేదు. 20 నిమిషాల నుంచి మీరు మాట్లాడుతున్నారు. కాబట్టి ఇంకా మాట్లాడవలసిన వాళ్ల గురించి కూడా ఆలోచించాలి కదా?

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిః అధ్యక్షా, నేను ప్రసంగం ప్రారంభించి 20 నిమిషాలయినట్లుంది. ఎందుకో కాని అడుగడుగునా అడ్డుపడుతున్నారు.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ః మీ పార్టీకి కేటాయించిన సమయం 40 నిమిషాలు. మీరు దాదాపు 20 నిమిషాలపైగానే మాట్లాడారు. అందుచేత మీరు ముగిస్తే మీ పార్టీకి చెందిన మిగతా వాళ్లు కూడా మాట్లాడతారు. లేదూ, మొత్తం సమయం మీకే ఇచ్చేశామని మీ పార్టీ చెబితే నాకేమీ అభ్యంతరం లేదు. మీరు ముగించండి సార్.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిః అధ్యక్షా, ఈ రాష్ట్ర శాసనసభ స్పీకర్ స్థానంలో కూర్చున్న వ్యక్తి మొత్తం శాసనసభ నియమావళిని ఉల్లంఘిస్తూ సభ సంప్రదాయాలను మొత్తం కాలరాస్తూ, నిరంకుశంగా పూర్తిగా అధికార పక్ష చర్యలకు వంతపాడుతున్న స్పీకర్ గారి మీద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అవిశ్వాసం ప్రవేశపెట్టడం జరిగింది. ఈ సందర్భంగా మేం స్పీకర్ గారికి, మీకు చాలా స్పష్టంగా మనవిచేసేదేమంటే టీవీలలో మన శాసనసభా చర్చలను, పరిణామాలను ప్రత్యక్షంగా చూస్తున్న రాష్ట్ర ప్రజలు చాలా ఆవేదన చెందుతున్నారు. దానికి కారణం అధికారపక్షమని మేమూ, ప్రతిపక్షం వారని మీరూ మనమధ్య వాదనలొద్దు. ఈ సందర్భంగా

నేను ముఖ్యమంత్రి గారికి, స్పీకర్ గారికి, మొత్తం సభను కోరేది ఒకటే. శాసనసభ ప్రత్యక్ష ప్రసారాలను ఎడిట్ చేయకుండా ప్రసారం చేసినట్లయితే అధికార పక్షం తప్పు చేస్తుందా ప్రతిపక్షం తప్పు చేస్తుందా అన్నది చాలా స్పష్టంగా అర్థమవుతుంది.

అధ్యక్షా, స్పీకర్ల వ్యవస్థ అనేది దారుణంగా నానాటికీ దిగిజారిపోతున్నది. స్పీకర్‌కీ, పార్టీకార్యకర్తకీ తేడా లేకుండా పోతున్నది. ఈ సంగతి చెబుతున్నది నేను కాదు అధ్యక్షా. మీరంతా నా వైపు చూడకండి. సాక్షాత్తూ కోర్టులే చెబుతున్నాయి. ప్రజాస్వామ్యంలో స్పీకర్ల వ్యవస్థ మీద, అత్యంత గౌరవమివ్వాల్సిన మనం స్పీకర్ల గురించి మాట్లాడడం కాదుగాని, గతంలో అత్యంత మేధావులు కూడా చాలా సార్లు చెప్పిందేమిటంటే స్పీకర్ స్థానంలో కూర్చున్న వ్యక్తి అంతకుముందు గంట క్రితం వరకు ఒక పార్టీ కార్యకర్తే కాబట్టి స్పీకర్‌స్థానంలో కూర్చున్న తరువాత కూడా వారు ఆ పార్టీలో కొనసాగడం సమంజసం కాదన్నారు.

**2.20 PM (20)**

కాబట్టి స్పీకర్ స్థానంలో కూర్చున్న వ్యక్తి ఆ పార్టీకి రాజీనామా చేసే విధంగా సంస్కరణలు రావాలి. స్పీకర్ స్థానంలో కూర్చున్న తర్వాత ఎప్పుడైనా సరే ఆ స్పీకర్ స్థానంలో కూర్చున్న వ్యక్తి ఆ స్పీకర్ స్థానం తనకు ఒద్దనుకున్నప్పుడు, ఆ పదవికి రాజీనామా చేసినప్పుడు, తను ఏ పార్టీలోకైనా వెళ్లే హక్కు ఉంటుంది. ఆ తర్వాత జరిగే ఎన్నికల్లో ఆ స్పీకర్ స్థానంలో కూర్చున్న వ్యక్తి ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు, ఏ రాజకీయ పార్టీ కూడా ఆ స్పీకర్‌కి పోటీ పెట్టకూడదు. ఇది మేధావులు చేసే సూచన.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ ః కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గారూ.. ముగించండి.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిః కాబట్టి ఈ యొక్క శాసనసభలో సీనియర్‌గా ఉన్న మన ముఖ్యమంత్రి గారు
ఏదైతే పూర్తి స్థాయిలో.. (మైక్ కట్ అయ్యింది)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ః వర్కింగ్ లంచ్ ఏర్పాటు చేయడం జరిగింది. శాసనసభ్యులు అలాగే ప్రెస్ వారు కూడా వినియోగించుకోవాల్సిందిగా కోరుతున్నాము. బండారు సత్యనారాయణ మూర్తి గారు మాట్లాడండి.

శ్రీ బండారు సత్యనారాయణమూర్తి (పెందుర్తి)ః అధ్యక్షా, స్వతహాగా అవకాశమిస్తే ధన్యవాదాలను తెలుపుతాం. కానీ దురదృష్టం ఈరోజు రాజ్యాంగానికి విరుద్ధంగా నైతికవిలువలకు విరుద్ధంగా, ఏదైతే సభాపతికి మనం గౌరవం ఇవ్వాలో, ఏ అధ్యక్ష స్థానాన్ని

మనం గౌరవిస్తామో, రాజ్యాంగమిచ్చిన ఆర్టికల్–178 ప్రకారం స్పీకర్ ఎన్నిక జరగవలసి ఉన్నప్పటికీ, చాలా కాలంగా పార్లమెంటు గానీ రాష్ట్ర శాసనసభ గానీ స్పీకర్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం, ఆ విధంగా ఒక మంచి సంప్రదాయంతో మనం స్పీకర్‌ని గౌరవిస్తూ ముందుకెళుతున్నాం. భారత రాజ్యాంగంలో ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత ప్రముఖులు, అయ్యదేవర కాళేశ్వరరావు గారు, బి.వి. సుబ్బారెడ్డి గారు, కోన ప్రభాకర్‌రావు గారు, యనమల రామకృష్ణుడు గారు, శ్రీపాదరావు గారు, ఇలాంటి ఎంతో మంది ప్రముఖులు ఆ స్థానంలో ఉండి సభను నడిపించారు. ప్రతిపక్ష నాయకులుగా బాగారెడ్డి గారు, భాట్టం శ్రీరామమూర్తి గారు, స్వర్గీయ ఎన్‌టి రామారావు గారు, మా గౌరవనీయులు చంద్రబాబునాయుడుగారు కూడా ప్రతిపక్ష నాయకులుగా పని చేశారు. ఏనాడు కూడా ప్రతిపక్ష నాయకులుగా ఉన్న వారు స్పీకర్‌ని గౌరవిస్తూ, పాలసీల మీద మాట్లాడుతూ, ఆ స్థానానికి గౌరవమిస్తూనే ఆ పాత్రను పోషించారు. ఈరోజు మనకు సభాపతిగా ఉన్న వారు ఎవరో కొత్త వారు కాదు. వారికి ఒక వృత్తి ఉంది. ఒక డాక్టర్ వృత్తి నుండి ఎన్‌టి రామారావు గారి పిలుపునందుకొని ఆయన రాజకీయాల్లోకి వచ్చి సుదీర్ఘమైన అనుభవంతో అనేక పదవులను చేసిన వ్యక్తి. వైద్య ఆరోగ్య శాఖ, పంచాయితీరాజ్, ఇరిగేషన్, హోం శాఖలకు మంత్రిగా పని చేసి, అనుభవం ఉన్న వ్యక్తిని ఈ శాసనసభకు స్పీకర్‌గా ఎన్నుకోవడం జరిగింది. ఎన్‌టి రామారావు గారి దయ వలన, మా చంద్రబాబు నాయుడు గారి దయ వలన నాకు వ్యక్తిగతంగా కూడా కోడెల శివప్రసాదరావు గారితో కొంత పరిచయం ఉంది. ఒక రోజు ఆయన నియోజకవర్గంలో తిరుగుతూ ఉంటే రాత్రి పదిన్నర గంటలకు ఇంటికి వస్తే తిరిగి తిరిగి వచ్చిన వ్యక్తి స్వతహాగా నిద్రపోయి రెస్ట్‌లో ఉన్నారనుకున్నాం. తెల్లవార్లు ఆపరేషన్లు చేసి రోగులను రక్షించిన వ్యక్తి మన సభాపతి గారు. మన సభాపతి ప్రాణదాత తప్ప ప్రాణాలను తీసే ప్రతిపక్ష నాయకుడి మాదిరిగా లేరు. అలాంటి సభాపతికి ఇవ్వాల్సిన గౌరవం గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతిపక్ష నాయకుడి మీద ఉంది. ఏనాడు కూడా మనం చూస్తున్నాం, ఈ సభలో చాలా విషయాలపైన చర్చ జరగాలని కోరుతున్నారు. సభలో అధికార పక్షానికి ఎటువంటి పాత్ర ఉంటుందో ప్రతిపక్ష నాయకుడికి కూడా అంతే పాత్ర ఉంది. ప్రతిపక్ష నాయకుడు అంటే తమ స్వార్థం కోసమో, తమ స్వలాభం కోసమో ప్రతిపక్ష నాయకుడిగా పాత్ర వహించడు.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : సబ్జెక్ట్ మీద మాట్లాడండి.

శ్రీ బండారు సత్యనారాయణ మూర్తి: నో కాన్ఫిడెన్స్ మోషన్ ఇచ్చిందెవరు? మీరు ఇచ్చారు. మీరిచ్చినప్పుడు ఎవరి మీద ఇచ్చారు? సభాపతి మీద ఇచ్చారు. సభాపతిని ఏ పద్ధతిలో ఇవాళ మీరు తప్పు పడుతున్నారు? సభాపతి మాట్లాడినప్పుడు బిజినెస్ రూల్స్‌కి వ్యతిరేకంగా ఏమైనా మాట్లాడారా? సభాపతి ఏ రోజు కూడా కౌల్ అండ్ షక్దర్ రూల్స్‌కి వ్యతిరేకంగా గానీ, మన శాసనసభ రూల్స్‌కి వ్యతిరేకంగా గానీ ఏ రోజైనా తప్పుగా మాట్లాడారా? కేవలం మీరు మీ వ్యక్తిగత కక్షలతో మాట్లాడుతున్నారు. మీరు ఒక్కటి అర్థం చేసుకోవాలి,

గౌరవించే పద్ధతిని కూడా ప్రతిపక్షాలు నేర్చుకోవాలి. ఈ రాష్ట్రంలో సుదీర్ఘమైన అనుభవం ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడుగారు. వారు కూడా ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. ఈ మాట చెబితే మీరు ఆశ్చర్యపోతారు. చంద్రబాబునాయుడుగారు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు ఒక యువకుడ్ని స్పీకర్‌గా నియమించారు. వాళ్ల నాన్న గారితో సమకాలికులు చంద్రబాబునాయుడుగారు, కిరణ్‌కుమార్‌రెడ్డిగారికి సమకాలికుడు చంద్రబాబునాయుడు గారు, ఒక చిన్న యువకుడ్ని శ్రీ నాదెండ్ల మనోహర్‌గారిని సభాపతిగా ఎంపికచేస్తే ఆ సభాపతిని గౌరవించిన వ్యక్తి ఆనాటి ప్రతిపక్ష నాయకుడు, మా సభానాయకుడు చంద్రబాబునాయుడు గారు. జగన్మోహన్‌రెడ్డిగారిని అడుగుతున్నాం, ఏనాడైనా సభాపతిని గౌరవించే విధంగా మీరు మాట్లాడారా? సభాపతిని గౌరవించే విధంగా మీరు ప్రవర్తించారా? సభాపతి మీద ఒక ఆరోపణ చేశారు, ఏమనంటే ఆయనొక ఫ్యాక్షనిస్ట్ అని, ఈ సభలో ఒక ప్రతిపక్ష నాయకుడిగా ఆయన్ని (గౌరవ సభాపతి గారిని) గౌరవించని జగన్మోహన్‌రెడ్డి గారు...

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: ముఖ్యమంత్రి గారిని, ప్రతిపక్ష నాయకుడు గారిని మినహాయించి సభాపతి మీద మాట్లాడండి.

శ్రీ బండారు సత్యనారాయణ మూర్తి : సభాపతి మీదే మాట్లాడుతున్నాను సార్. ఎవరైతే అవిశ్వాస తీర్మానాన్ని ఇచ్చారో వారి మీదే మాట్లాడుతున్నాను. సభాపతిని గౌరవించలేని ప్రతిపక్ష నాయకుడు ఈయనొక ప్రతిపక్ష నాయకుడేనా? ఆయనొక ఫ్యాక్షనిస్ట్ అని ఈయన మాట్లాడారు. డా. కోడెల శివప్రసాదరావు గారి మీద అనేక ఆరోపణలు చేశారు. ఆయనకు సిబిఐ క్లీన్‌చిట్ ఇచ్చిందని ఈయనకు (శ్రీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గారికి) తెలుసా?.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : సబ్జెక్ట్‌లోకి రండి.

శ్రీ బండారు సత్యనారాయణ మూర్తి : ఫ్యాక్షన్ బుద్ధులు ఎవరికి ఉన్నాయి? ఎవరు ఫ్యాక్షన్ నుంచి వచ్చారు? మనకు భగవంతుడు ఇచ్చిన ఈ వరాన్ని రాజకీయంగా మనం వాడుకోకూడదు. ప్రజల కోసం వాడుకోవాలి. నిన్న ప్రభుత్వం మీద పెట్టిన అవిశ్వాస తీర్మానం పైన చర్చలో ఏం మాట్లాడతారు? ఆయన స్పీచ్‌లో ఒక్క మాటను వంద సార్లు చంద్రబాబునాయుడుగారు, చంద్రబాబునాయుడుగారని చెప్పారు తప్ప, మా ఫెయిల్యూర్స్‌ని, మా తెలుగుదేశం పార్టీ గురించి చెప్పలేదు. అందుచేత ఈ ప్రతిపక్ష నాయకుడు సభలో కొన్ని నైతిక విలువలను తెలుసుకోవాలి. మొన్న ఒక స్కూల్లో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. నేను అడిగాను ఏమయ్యా స్కూల్లో పిల్లలకు అప్పుడే రాజకీయాలను ఎందుకు నేర్పిస్తున్నారని అడిగాను. స్కూల్లో ఎందుకయ్యా అసెంబ్లీ అని అంటే, సార్ మా పిల్లలు మీ అసెంబ్లీ, మీ ప్రతిపక్ష నాయకుడ్ని చూశారు, సిగ్గుపడుతున్నారు సార్ అన్నారు. రూల్స్ కూడా పాటించని ప్రతిపక్ష నాయకుడు ఉండటం ఈ శాసనసభ దురదృష్టంగా నేను భావిస్తున్నాను.

అమెండ్‌మెంట్స్ తెలియవు, బిల్లు అయిపోయిన తర్వాత డివిజన్ అడగడు, బిల్లు అయ్యేంతవరకు కూర్చుంటాడు, తర్వాత వచ్చి స్పీకర్ గారి మీద కామెంట్ చేస్తాడు. నేను అడుగుతున్నాను, రూల్ ప్రకారం, చట్ట ప్రకారం రండి. బిజినెస్ రూల్స్‌ని పాటించకుండా సభాపతి పైన కామెంట్ చేసే దౌర్భాగ్య పరిస్థితి ఇవాళ మన ప్రతిపక్ష నాయకుడికి ఉంది. అందుకే ప్రతిపక్ష నాయకుడు అనే వాడు అనుభవజ్ఞుడై ఉండాలని అంటారు. చట్టాలు తెలిసిన వాడై ఉండాలి, చట్టాలు తెలియకపోతే నేర్చుకోవడానికి ప్రయత్నం చేయాలి. ఈయన ప్రయత్నం చేయడు, చట్టాలు తెలియవు, కనీస గౌరవం కూడా లేకుండా సభాపతిని కించపరిచే విధానం చూస్తున్నాం. ఇంతకు ముందు మా అచ్చెన్నాయుడు గారు చెప్పినట్లు ప్రతిపక్ష నాయకుడి తాలుకు పొరపాట్లను తెచ్చి సభాపతి మీద పెట్టడం ఇది దౌర్భాగ్యమైన పరిస్థితి. చాలా మంది చెబుతున్నారు. చాలా మందితో పోల్చుకుంటున్నారు. మీరు ఎవరితో పోల్చుకుంటున్నారు? బాగారెడ్డి గారిని ఫాలో అయ్యారా? చంద్రబాబునాయుడుగారిని ఫాలో అయ్యారా? భాట్టం శ్రీరామమూర్తి గారిని ఫాలో అయ్యారా? ఎన్‌టి రామారావుగారిని ఫాలో అయ్యారా? కనీసం మీ నాన్న గారిలో ఉన్న కొన్నైనా మీరు ఫాలో అయ్యారా? అంటే ఆయనకు అది అక్కరలేదు. చట్టం అక్కరలేదు, శాసనసభ విధానాలు అక్కరలేదు, కౌల్ అండ్ షక్దర్ అక్కరలేదు, తను రాసుకున్నది తాను చెప్పాలనుకున్నది చెప్పడం తనకు ఉన్న వీక్‌నెస్. తన వీక్‌నెస్‌ను, ఏవైతే సిబిఐ కేసులున్నాయో వాటి మీద ఎక్కడ రిఫ్లెక్ట్ అవుతాయోనని స్పీకర్ మీద అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడం, ఈ రకమైన దౌర్భాగ్యంతో నిన్న గవర్నమెంటు మీద అవిశ్వాస తీర్మానాన్ని పెట్టారు. ఈ రోజు స్పీకర్ గారి మీద అవిశ్వాస తీర్మానమిచ్చారు. ఎందుకు స్పీకర్ గారిమీద అవిశ్వాస తీర్మానం పెట్టారు? మీ పార్టీ నుండి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు వెళ్లిపోయారని మీరు చెబుతున్నారు. మీ పార్టీ ఎమ్మెల్యేలు ఎందుకు మీ పార్టీకి రాజీనామా చేశారు? ఎంతో చక్కగా ఈ రాష్ట్రంలో పరిపాలన చేస్తున్న చంద్రబాబునాయుడుగారి పరిపాలనను ప్రజలు మెచ్చుకుంటూ ఉంటే, చక్కని పరిపాలన జరుగుతూ ఉంటే కష్టాల్లో నుంచి ఒడ్డెక్కిస్తుంటే, నీవు ఎప్పుడైతే చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వాన్ని, తెలుగుదేశంపార్టీ ప్రభుత్వాన్ని దించుతామని చెప్పావో ఆ రోజే నీ పతనం ప్రారంభమైయ్యింది. నీ పతనానికి కారణం నీ శాసనసభ్యులు, ఒక మంచి ప్రభుత్వం నడుస్తు ఉంటే, చంద్రబాబునాయుడు సమర్థుడుగా మంచి పరిపాలన చేస్తుంటే నీవు దించుతామని చెప్పగానే నీ మీద అసమ్మతి ప్రారంభమైయ్యింది. అందుకనే మీ ఎమ్మెల్యేలు ఈ ప్రభుత్వం ఉండాలని, చంద్రబాబునాయుడి నాయకత్వం కావాలని మా పార్టీలో చేరుతుంటే వారిని కాపాడుకోలేని పరిస్థితిల్లో నీవుండి మా పైన నిందలు వేసే దౌర్భాగ్యకరమైన నీలాంటి వ్యక్తి ఈ శాసనసభకు రావడం దురదృష్టంగా భావిస్తున్నాను. చాలా మంది ఎమ్మెల్యేలు కొత్తగా వచ్చారు. నూతనంగా గెలిచారు.

మిస్టర్ స్పీకర్ ః సత్యనారాయణ మూర్తి గారు ముగించండి.

శ్రీ బండారు సత్యనారాయణ మూర్తి : ప్రతిపక్ష నాయకుడిగా ఒక రోల్ మోడల్‌గా ఉండకుండా, కనీసం నైతిక విలువలను పాటించకుండా తన ఎమ్మెల్యేల భవిష్యత్తును నాశనం చేస్తున్న ఈ ప్రతిపక్ష నాయకుడు, ఎంతో ఉన్నతమైన డా. కోడెల శివప్రసాదరావుగారి లాంటి వ్యక్తిని, గౌరవం కలిగిన వ్యక్తిని, సభా సంప్రదాయాలు తెలిసిన వ్యక్తిని, దించాలనే దౌర్భాగ్య పరిస్థితి వచ్చిందంటే అది కేవలం నీ స్వార్థం. నీ అవినీతి, నీతి నిజాయితీ లేని నీ విధానం, నీ వీక్‌నెసెస్, నీ అసమర్థత వల్లనే ఈ అవిశ్వాస తీర్మానం రాగలిగింది.

**2.30 (21)**

నేను ఒకటే ప్రతిపక్షపార్టీ నాయకుడిని కోరుతున్నాను. అయ్యా, ఇప్పటికైనా సరే నీవు కనీసం చట్టాల గురించి తెలుసుకో. మీ సభ్యులకు ట్రైనింగ్ ఇవ్వు. ముందుగా నీవు ట్రైనింగ్ అయితే బాగుంటుంది. శాసనసభ విధానాల గురించి తెలుసుకో మనకు ఒక లైబ్రరీ ఉంది. ఆ లైబ్రరీ దేనికి ఉంది? అసెంబ్లీలో గతంలో జరిగిన ప్రొసీడింగ్స్ గురించి తెలుసుకునేందుకే ఆ లైబ్రరీ ఉంది. సభా సంప్రదాయల గురించి తెలుసుకోమని ఆ లైబ్రరీ ఉంది. ఆ లైబ్రరీ ద్వారా అన్ని విషయాలు తెలుసుకుని ఇక్కడ సభలో మాట్లాడమని ఉంది. కానీ, మన ప్రతిపక్షనాయకుడు కౌల్ అండ్ షక్దర్ పుస్తకాన్ని చూడరు, చదవరు, హౌస్ ప్రొసీడింగ్స్ చూడరు. విధానాలు చూడరు. సభ విధానాలకు ఇదమిత్థంగా, ఆయనకి ఎప్పుడు కావాలంటే అప్పుడు గౌరవ సభాపతి గారు మైక్ ఇవ్వడం జరుగుతోంది.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: సత్యనారాయణ మూర్తి గారు త్వరగా ముగించండి.

శ్రీ బండారు సత్యనారాయణ మూర్తి (పెందుర్తి): అధ్యక్షా, ఇదే గౌరవ ముఖ్యమంత్రి గారు ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న కాలంలో ప్రతిపక్షనాయకుడి తండ్రి గారు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆనాడు ప్రతిపక్షనాయకుడు పదే, పదే కోరినప్పటికి కూడా మైక్ ఇచ్చే పరిస్థితి ఉండేది కాదు. ఇందాక చెప్పినట్టుగా గత శాసనసభలో స్పీకర్‌గా పనిచేసిన శ్రీ నాదెండ్ల మనోహర్ గారు చిన్న పిల్లవాడైనా ఎన్నోసార్లు మా నాయకుడికి మైక్ ఇవ్వకపోతే, మైక్ లేకుండానే గొంతు వినిపించిన రోజులు కూడా ఉన్నాయి. కానీ, ఇవాళ మీరు ప్రతిపక్షనాయకుడు ఎప్పుడు కోరితే అప్పుడు మైక్ ఇవ్వడం జరుగుతోంది. ఎందుకు ప్రతిపక్షనాయకుడికి అన్ని సార్లు మైక్‌ను ఇస్తున్నారని మేం ఆశ్చర్యపోతున్నాం. అదే చంద్రబాబునాయుడుగారు ప్రతిపక్షంలో ఉన్న కాలంలో సభలో ప్రభుత్వంతో పోరాడి, రాష్ట్ర ప్రజల తరపున పోరాడటం వల్లే మళ్లీ ఇవాళ ముఖ్యమంత్రి కాగలిగారు. ఇక్కడ మీరు ప్రతిపక్ష స్థానాన్ని కూడా కోల్పోయారు. ప్రజలకు మీ మీద విశ్వాసం పోయింది. మీ విధానాలు బాగా లేవు. అందుచేతనే ఈ సభ తప్పుదోవన నడుస్తోంది. ఈ తప్పుదోవ నుండి సభను మళ్లించాలంటే ఇలాంటి వాళ్లను సరిదిద్దాలి. చట్టాల్లో ఉన్న రూల్స్ ప్రకారం సభలో సభ్యుల యొక్క ప్రవర్తన ఉండేట్టుగా చూడాలి. అలా ప్రవర్తించని నాయకుడు నాయకుడే కాదని చెప్పి మీ ద్వారా తెలియజేస్తూ, మరొకసారి అనుభవమున్న వ్యక్తి,

సమర్థుడైన వ్యక్తి, సౌమ్యుడు, ఎంతో నెమ్మదిగా మాట్లాడేటటువంటి వ్యక్తి అయినటువంటి మన సభాపతి గారైన డా.కోడెల శివప్రసాద రావు గారి పైన మీరు అవిశ్వాస తీర్మానం పెట్టడం మీరు చేసిన తప్పుడు విధానం. ఇప్పటికైనా సరే, మీరు చెంపల మీద చెల్లు వేసుకుని, తప్పైందని లెంపలేసుకుని ప్రతిపక్షనాయకుడు ఇచ్చిన అవిశ్వాస తీర్మానానికి సంబంధించి విత్‌డ్రా అయి, గౌరవంగా వారి దగ్గరకు వెళ్లి వారిని స్పీకర్ స్థానానికి తీసుకువస్తే ఈ ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఒక గౌరవం ఉంటుంది. ఆ గౌరవాన్ని కాపాడమని మీ ద్వారా వారిని ప్రార్థిస్తూ నేను సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: శివప్రసాద రెడ్డి గారు.........

శ్రీ ఆర్.శివప్రసాద రెడ్డి (ప్రొద్దుటూరు) ః అధ్యక్షా, అవిశ్వాస తీర్మానాన్ని ఎందుకు ప్రవేశపెట్టామని మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. మా సమాధానం కోసం ఎదురుచూస్తున్నారు. ఆనాడు సభాపతిగా డా.కోడెల శివప్రసాద రావు గారిని ఏకగ్రీవంగా ఎన్నికచేయడం మా సంస్కారం. ఈనాడు పక్షపాత ధోరణితో స్పీకర్ గారు వ్యవహరించినప్పుడు బాధ్యతగా ఫీల్ అవుతున్నాం. ఏ స్పీకర్‌కైనా ఉండాల్సిన లక్షణం పక్షపాత దోరణి ఉండకపోవడం. రెండవది అవినీతి కార్యకలాపాల్లో, కార్యక్రమాల్లో స్పీకర్ పాత్ర ఉండకూడదు. పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉండకూడదు. సౌమ్యుడిగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉంది. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతిపక్షపార్టీకి బాధ్యతగా సమయాన్ని కేటాయించి ప్రజా సమస్యల పరిష్కారానికి ఉపయోగపడాలి. కానీ, ఇక్కడ ఇవన్నీ కూడా కొరవడినాయి, కరువైనాయి. స్పీకర్ గారి విషయంలో ఒకే ఒక సామెతను గురించి చెప్పాల్సివస్తే, ఒకే ఒక విషయాన్ని క్రోఢీకరించాల్సి వస్తే, నన్ను నాలుగు సార్లు సభ నుండి సస్పెండ్ చేశారు. మూడు సార్లు నేను సభలో ఏ తప్పు చేయనప్పటికి కూడా సస్పెండ్ చేశారు. మరొకసారి దారుణమేమిటంటే, నేను ఈ సభలో లేని సమయంలో కూడా గౌరవ సభాపతి గారు నన్ను సస్పెండ్ చేస్తున్నట్టుగా ప్రకటించారు. ఆ రోజున నేను సభకే హాజరు కాలేదు. కానీ, స్పీకర్ గారు నన్ను సస్పెండ్ చేసినారు. ఇది ఎంత వరకు సమంజసం? అదే కాదు. ప్రభుత్వాన్ని కాపాడే ప్రయత్నం ప్రతి సందర్భంలోనూ స్పీకర్ గారు చేస్తున్నారు. ప్రభుత్వం యొక్క మాటను ఆయన గొంతు ద్వారా వినిపించే ప్రయత్నం చేస్తున్నారు. నిన్న జరిగిన అవిశ్వాస తీర్మానాన్ని మేం ప్రభుత్వానికి వ్యతిరేకంగా సభలో ప్రవేశపెడితే, చివరిలో డివిజన్ చేయకుండా మూజువాణి ఓటుతో స్పీకర్ గారు "మమ" అనిపిస్తారు. ఇది ఎంతవరకు సమంజసం? ఇంకా అదే కాకుండా అధికార పార్టీ సభ్యులందరూ కలిసి మా పార్టీ అధ్యక్షుల వారి పైన అనేక రకాలుగా వారి మనస్సుపైన దాడి చేసే రీతిలో అవమానకరంగా మాట్లాడితే, ఎన్నో అసభ్యకర పదాలను అధికార పార్టీ సభ్యులు వాడితే, స్పీకర్ గారు చర్యలు తీసుకోలేదు. మాట్లాడినటువంటి ఏ ఒక్క అధికార పార్టీ సభ్యుడి పైన కూడా స్పీకర్ గారు చర్యలు తీసుకోలేదు. పక్షపాత ధోరణితో స్పీకర్ గారు వ్యవహరించినందుకు, ప్రజాస్వామ్యాన్ని అగౌరవ పర్చినందుకు, విరుద్ధంగా ప్రవర్తించిన సభ్యుల పైన క్రమ శిక్షణా

చర్యలు తీసుకోనందుకు, ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ సభను వేదికగా ప్రతిపక్షపార్టీకి అందించనందుకు, ఆయనపైన, ఆయనపట్ల సౌమ్యమైన అభిప్రాయం మాకు లేనందుకు మేం స్పీకర్ గారి పైన అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాం.

అధ్యక్షా, ఆయన గారిపైన నమోదైన కేసుల గురించి మీకు తెలియంది కాదు. నేను చాలా చిన్న పిల్లవాడిని. మీకు అన్ని విషయాలు తెలుసు. ఆయన ఇంట్లోనే బాంబులు పేలాయి. ఆ సందర్భంగా నలుగురు మనుషులు చనిపోతే, కేసు నమోదైంది. ఆ విధంగా వారు పోలీస్ కేసుల్లో ముద్దాయి. గతంలో వారు పౌర సరఫరాల శాఖామాత్యులుగా పనిచేసిన కాలంలో బియ్యాన్ని అక్రమంగా తరలించే ప్రయత్నంలో పోలీసులు పట్టుకుంటే, ఆ సమయంలో వారి అవినీతి బండారం బయటపడింది. అభివృద్ధి కార్యక్రమాల్లో..........

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి (పుట్టపర్తి): అధ్యక్షా...........

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: శివప్రసాద రెడ్డి గారు ఒక నిమిషం కూర్చోండి. రఘునాథ రెడ్డి గారు, మీరు మాట్లాడండి.

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి (పుట్టపర్తి): స్పీకర్ గారిపై ఆయన చేసిన అభియోగాలు పూర్తిగా నిరాధారం. కారణమేమిటంటే, సి.బి.ఐ. ఎంక్వైరీలో డా. కోడెల శివప్రసాద రావు గారికి క్లీన్ చిట్ ఇచ్చారు. బాంబు పేలుళ్లకు సంబంధించిన అభియోగం మీద వారి పైన ఆరోపణలు వచ్చినప్పుడు కూడా సి.బి.ఐ. విచారణ జరిగింది. ఆయన పాత్రపై సి.బి.ఐ. విచారణ సందర్భంగా లీగల్ ఒపినియన్ కోరినప్పుడు కేంద్రంలోని అడిషనల్ అడ్వకేట్ జనరల్ గారు నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి డా. కోడెల శివప్రసాద రావు గారిపైన వచ్చిన ఆరోపణలు నిరాధారమని తేల్చారు. వీళ్లు సమాచారాన్ని చూసుకోలేదు. ఎందుకంటే తెలియకుండా మాట్లాడకూడదు. దీనిపైన ఇటువంటి వాళ్లే మళ్లీ వ్యాజ్యం వేశారు. అక్కడ హైకోర్టు కూడా దాన్ని తోసిపుచ్చింది. అంతటితో కాకుండా మళ్లీ లోయర్ కోర్ట్స్ నందు కూడా వ్యాజ్యం వేయగా అక్కడ కూడా అన్ని కేసులను కొట్టివేశారు. అందుచేత ఎటువంటి కేసులతోనూ డా. కోడెల శివప్రసాద రావు గారికి సంబంధం లేదు. వాళ్ల మాదిరి 11 కేసుల్లో ముద్దాయిగా ఉండి, సి.బి.ఐ. కోర్టు చుట్టూ తిరుగుతూ, లక్షల కోట్ల రూపాయల అవినీతి ఆరోపణను ఎదుర్కొంటూ వారి లాగా డా.కోడెల శివప్రసాద రావు గారు చేయలేదు. డా. శివప్రసాదరావుగారి మీద నమోదైన కేసులన్నింటినీ కోర్టులు కొట్టివేశాయి. ఆయన స్వతహాగా మంచి వైద్యులు. మీరు విచారణ చేయండి. ఎక్కడైనా వారికి చాలా మంచి పేరు ప్రఖ్యాతులున్నాయి. రాజకీయ జీవితంలో ఉంటూ చాలా యేళ్లుగా వారు ప్రజలకు సేవ చేస్తున్నారు. మీ మాదిరిగా లెక్కలేనన్ని కేసులను పెట్టించుకోలేదు. అవినీతి ఆరోపణలు వారి పైన అంతకంటే లేవు. చాలా క్లీన్ పర్సన్. అటువంటి వ్యక్తి ఈ శాసనసభలో ఒక స్పీకర్ స్థానంలో ఉండటం మేం అదృష్టంగా భావిస్తున్నాం.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: శివప్రసాద రెడ్డి గారు మాట్లాడండి......

శ్రీ ఆర్. శివప్రసాద రెడ్డి: అధ్యక్షా, మా నాయకుడు కేసుల్లో ముద్దాయి అయితే జగన్మోహన్‌రెడ్డి గారిని నేరస్థుడైనట్టుగా అధికార పార్టీ సభ్యులు మాట్లాడతారు. వాళ్లపైన కేసులు నమోదై, ముద్దాయిలుగా ఉంటే, ఆ విషయంలో కేవలం కేసులో ముద్దాయి మాత్రమేనని, కేసులకు సంబంధించి క్లీన్ చిట్ అని అంటారు. ఎవరైనా సరే కేసుల్లో ముద్దాయిగా ఉన్నప్పుడు, తప్పక ముద్దాయిగానే పరిగణించాలి. కోర్టు శిక్షల గురించి చెప్పలేదు. కానీ, మేమేమని అంటున్నామంటే, మీరు కూడా కేసుల్లో ముద్దాయిలుగానే ఉన్నారు. కేసుల్లో ముద్దాయిలుగా, నేరం చేసినట్టుగా ఆరోపణలను ఎదుర్కొంటున్న వ్యక్తులను సభాధ్యక్షుడి స్థానంలో కూర్చోవడానికి మీరు ఏ విధంగా ఎంపిక చేస్తారని మేం అధికార తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాం.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: రఘునాథరెడ్డి గారు.....

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి: అధ్యక్షా, స్పష్టంగా సభ్యుడికి చెప్పడం జరిగింది. ఆరోపణలు వచ్చినాయి. విచారణ జరిగింది. హైకోర్టు కొట్టేసింది. లోయర్ కోర్టు కూడా డా.శివ ప్రసాద రావు గారికి ఎటువంటి ప్రమేయం లేదని కూడా చెప్పింది. ఆయన కడిగిన ముత్యం లాగా బయటకు వచ్చారు.కాని, ఆయన గారి నాయకుడి మీద కేసులు నమోదైనాయి. వారి నాయకుడి గురించి కావాలంటే చెప్పుకోమనండి. కానీ ఆయనకు ఈయనకు పోలికలేదు. డా. కోడెల శివప్రసాద రావు గారు కేసుల్లో నుంచి కడిగిన ముత్యం లాగా బయటకు వచ్చారు.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: శివప్రసాద రెడ్డి గారు.......

శ్రీ ఆర్. శివప్రసాద రెడ్డి: అధ్యక్షా, ఆ విషయాన్ని ప్రక్కన పెడదాం. విషయాన్ని ప్రక్క దారి మళ్లించడం నాకు ఇష్టం లేదు. ఎందుకు మేం స్పీకర్ గారి పైన అవిశ్వాసం పెట్టామనేదానికి సూటిగా చెప్పాల్సి వస్తే, ఈ స్పీకర్ గారు ప్రతిపక్షపార్టీకి ఇవ్వాల్సిన గౌరవాన్ని గానీ, ఇవ్వాల్సిన ప్రాముఖ్యతను గానీ ఇవ్వకపోగా ఈ రాష్ట్రంలో ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన ఈ ప్రభుత్వాన్ని ప్రతిపక్షం ఎండగట్టే ప్రయత్నంలో మాకివ్వాల్సిన ప్రాధాన్యతనుకూడా ఇవ్వలేదు. ప్రజలకిచ్చిన అబద్ధపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన ఈ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ప్రజలకిచ్చిన మాట తప్పి ప్రవర్తిస్తుంటే, ఆ పార్టీ ప్రభుత్వాన్ని స్పీకర్ గారు వెనకేసుకొచ్చే ప్రయత్నాన్ని చేస్తున్నారు. నిన్న జరిగిన సమావేశంతో సహా ఈ ప్రభుత్వమొచ్చిన తరువాత గతంలో జరిగిన ఆరు సమావేశాలను గమనించినట్లైతే ఒక విషయం చాలా స్పష్టంగా తెలుస్తుంది. ప్రభుత్వం మాట్లాడాల్సిన మాటను కూడా ఆయన మాట్లాడుతున్నారు. ప్రభుత్వం పైన పెట్టిన అవిశ్వాసానికి సంబంధించి నిన్నటి రోజున డివిజన్‌కు అంగీకరించకుండా మూజువాణి ఓటుతో నిర్ణయాన్ని తీసుకుంటారు. ఈ అన్ని కారణాల చేత మేం స్పీకర్ గారి పట్ల

విశ్వాసాన్ని కోల్పోయాం. అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాం. ఇంకా మిగతా సభ్యులు మాట్లాడతారు. నిన్న సభలో అధికార పక్షం వైపు నుంచి మాట్లాడిన సభ్యులు మా సభ్యులనేకమందిని బాధపట్టే క్రమంలో వారి ప్రసంగాన్ని కొనసాగించారు. మగతనం ఉందా అని, పిచ్చి పట్టిందా అని, కొవ్వెక్కిందా అని, పందికొక్కులాగా భోంచేశారని కూడా మాట్లాడారు. ఆ విధంగా అసభ్యకర పదజాలంతో అమానవీయమైన మాటలతో మమ్మల్ని మాట్లాడి, మా మనస్సును గాయం చేస్తే, ఆ విధంగా మాట్లాడిన సభ్యులపైన మీరు క్రమశిక్షణా చర్యలు తీసుకోరా? ఏ విధంగా ఇది న్యాయం? నేను సభలో లేను, నేను నా ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఉంటే, నన్ను సస్పెండ్ చేస్తారా? నన్ను నా నియోజకవర్గ ప్రజలు అడుగుతున్నారు. మీరు ఇక్కడ ఉన్నారు, ఎందుకు మిమ్మల్ని ప్రభుత్వం అక్కడ సస్పెండ్ చేస్తోందని ప్రజలు అడుగుతున్నారు. ఆరోజు కూడా వాళ్లకు నేను ఒకటే చెప్పాను. ప్రభుత్వం ఏమి ఆదేశిస్తే, స్పీకర్ గారు అవే పనులు చేసే కార్యక్రమంలో ఉన్నారు కాబట్టి నన్ను కామన్‌గా సస్పెన్షన్‌కు రంగం సిద్ధం చేస్తారని కూడా నేను ప్రజలకు చెప్పాను.

అధ్యక్షా, ఆ విధంగానే యనమల రామకృష్ణుడుగారు మాట్లాడుతున్నారు. ఇంతకు ముందు కూడా ఆయన మాట్లాడారు. కొన్ని ఉదాహరణలు చెప్పాల్సివచ్చింది కాబట్టి ఒకట్రెండు విషయాల గురించి మాత్రమే చెప్పదలిచాను. యనమల రామకృష్ణుడుగారు మాట్లాడిన ప్రతి సందర్భంలోనూ మీరు గమనిస్తూనే ఉన్నారు. వెటకారంగా మాట్లాడతారు. ఏమి ఆ వెటకారం మాటలు?

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: త్వరగా ముగించండి.

శ్రీ ఆర్. శివప్రసాద రెడ్డి: అధ్యక్షా, ఏ మనిషి అయినా బాధపడే రీతిలో ఆయన వెటకారంగా మాట్లాడుతున్నారు. మాది అవినీతి, వారిది అభివృద్ధి అంటూ మాట్లాడారు. కానీ అది కాదు. నేను చెప్పేదేమిటంటే, వారిది వెటకారం, మాది వివేకం. ఆయన గురించి ఒక మాటగా చెప్పాల్సి వస్తే, వాయిద్యాలు వాయించే వాళ్లుంటారు. సంగీతంలో ఒకరు బుల్‌బుల్ వాయిస్తుంటే, ఒకరు డోలు వాయిస్తాడు, మరొకరు మేళం వాయిస్తారు. కానీ, యనమల రామకృష్ణుడుగారు మాత్రం అన్ని వాయిద్యాలను ఆయనే వాయించే పరిస్థితికి వచ్చారు.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: ఆ అంశాన్ని వదిలి వేరే అంశం గురించి ప్రస్తావించండి. త్వరగా ప్రసంగాన్ని ముగించండి.

శ్రీ ఆర్.శివప్రసాద రెడ్డి: అధ్యక్షా, ఇటువంటి కార్యక్రమాలను స్పీకర్ గారు ప్రోత్సహిస్తున్నారు కాబట్టి, క్రమ శిక్షణా చర్యలు తీసుకోలేదు కాబట్టి, ప్రతిపక్షానికి సభలో మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదు కాబట్టి, ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన ప్రభుత్వాన్ని

ప్రశ్నించే అవకాశాన్ని మాకు ఇవ్వలేదు కాబట్టి, ఆయన నిష్పక్షపాత ధోరణితో లేడు కాబట్టి, అవినీతి కార్యక్రమాల్లో సమస్యలను ఎదుర్కొంటున్నాడు కాబట్టి, పోలీస్ కేసుల్లో ఉన్నాడు కాబట్టి, సౌమ్యమైన, సరళమైన పద్ధతిలో లేడు కాబట్టి ఆయన పట్ల మేం అవిశ్వాసాన్ని ప్రవేశపెడుతున్నాం. అందుకు గాను నేను ఎక్కడ కూడా బాధ పడటం లేదు. మా బాధ్యతగా మేం భావిస్తున్నాను. థ్యాంక్యూ.

**2.40 PM (22)**

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : శివాజీ గారూ..

శ్రీ గౌతు శ్యాంసుందర శివాజి (పలాస): అధ్యక్షా, చాలా దురదృష్టకరమైన చర్చలో పాల్గొనే అవకాశం వచ్చినందుకు బాధపడుతున్నాను. నేను పద్ధతిగా మాట్లాడతానని తెలుసు, పెద్దగా జోక్యం చేసుకోను. అయితే ఈవిషయంలో నేను మాట్లాడాలని, కొన్ని విషయాలు చెప్పాలని ఈ అవకాశాన్ని తీసుకొంటున్నాను. ఈ శాసనసభా భవనంలో ప్రత్యేకించి మనం ఇప్పుడున్న ఈ శాసనసభా భవనం చూస్తే, సుదీర్ఘమైన సంబంధం ఉంది. శాసనసభ్యునిగానే కాదు. శాసనసభ్యులుగా అంటే ఇప్పటి తెలంగాణా శాసనసభా భవనం నుండి ఈ భవనంలోకి వచ్చాం. 1985వ సంవత్సరంలో శాసనసభ్యులుగా మొదటి సారి ఈ భవనంలోనే ప్రమాణస్వీకారం చేశాను. ఇక్కడకు రాగానే గతం ఒక్కసారి పరిశీలిస్తే, ముఖ్యంగా మీ సీటు గురించి చెప్పాలంటే మీరు కూర్చున్న సీటు చాలా ప్రత్యేకమైన సీటు. ఆ సీటులో ఎవరు కూర్చున్నా ఆ సీటులో ఉన్నవారికి, అలా ఉన్నవారి తాలూకు ప్రవర్తన కూడా తప్పనిసరిగా నిష్పక్షపాతంగా ఉంటుందన్న అంశంలో సందేహం ఎవరికీ ఉండకూడదు. పూర్వం ఒక చక్రవర్తిగారి పరిపాలనలో చాలా నిజాయితీగా, ధర్మంగా ఆయన తీర్పులు చెప్పేవారు. కాలానుగుణంగా ఆ రాజ్యం అంతరించింది. ఆ తరువాత శిథిలమైపొయింది, ఆ సింహాసనం ఏమైపోయిందో తెలియదు. తరువాత అక్కడ ఒక సందర్భంలో ఆ బండరాయిపై ఒక యాదవుల కుర్రవాడు గొర్రెల కాపరిగా కూర్చొని తీర్పుల నిర్వహణ చేస్తూ, చాలాచక్కగా తీర్పులు చెప్పడం మొదలెట్టాడు. ఏమిటా విశేషం అని చూస్తే, ఆయన కింద ఆ మహారాజు తాలూకు సీటు ఉంది. ఆ సీటు మీద కూర్చుని ఆ గొర్రెల కాపరి తీర్పులిస్తున్న పరిస్థితి.అటువంటి సీటు అధ్యక్షా. ఆ సీటులో ఎవరు కూర్చున్నా ఆ సీటు నుండి ఇచ్చే తీర్పులు మాత్రం పూర్తిస్థాయిలో నిష్పక్షపాతంగానే ఉంటాయి. అటువంటి సీటు విషయానికి వస్తే, ఇందాక మా సోదరులు ప్రస్తావించారు. చాలా మంది ముఖ్యులను నేను ప్రత్యక్షంగా అక్కడ కూర్చొని చూశాను. ఎందుకంటే మా తండ్రి గారు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో కూడా శాసనసభ్యునిగా పనిచేయు అవకాశం ఆయనకు కలుగడం, ఆయన కుమారుడుగా జన్మించే అదృష్టం నాకు కలగడం జరిగింది. మానాన్న గారి పేరు సర్దార్ గౌతులచ్చన్న గారు. నేను చిన్నప్పటినుండి మా నాన్నగారితో వచ్చి చూసేవాడిని. అధ్యక్ష స్థానంలో మహామహులు అయ్యదేవర కాళేశ్వరరావు గారు, బీవి.సుబ్బారెడ్డి గారు, పిడతల రంగారెడ్డి గారు,

దశరథరామిరెడ్డి గారు, దివి కొండయ్యచౌదరి గారు, ఇంకా చాలామంది మహామహులను అధ్యక్ష స్థానంలో చూశాను.

ఇప్పుడు ఆసీటు గురించి ప్రస్తావించింది ప్రతిపక్షం కాబట్టి ఆ సీటు గురించి కూడా నేను తలచుకుంటే సుందరయ్య గారు కూర్చున్న సీటు. ఇందాక వారి సభ్యులే చెప్పారు, తరిమెల నాగిరెడ్డి గారు కూర్చున్న సీటు, మా తండ్రి గారు సర్దార్ గౌతులచ్చన్న గారు కూర్చున్న సీటు, రాంచంద్రారెడ్డి గారు, అయ్యపరెడ్డి గారు, మదన్‌మోహన్ గారు సుదీర్ఘకాలం శాసనసభ్యులుగా పనిచేసిన బాగారెడ్డి గారు ఇలా ఎంతోమంది మహానుభావులు ఆఖరుకు వారి తండ్రి గారు కూడా అక్కడ కూర్చున్నారు. చంద్రబాబు నాయుడు గారు ఎలాగూ కూర్చున్నారు మీ అందరికీ తెలుసు, ఆ సీటు తాలూకా ప్రత్యేకత కూడా అలా ఉంటుంది.

అయితే స్పీకరుకూ ఆ సీటుకు ఉన్న సంబంధం ఒక్కసారి ఆలోచిస్తే నేను చూసిన ఆరోజుల్లో నా కళ్లెదుట ఒక సంఘటన జరిగింది. ఏ ప్రతిపక్ష నాయకుడూ మాట్లాడినా ఇరువైపులా నిశ్శబ్దంగా ఉండేవారు, ఆరోపణలు కాదు కేవలం గవర్నమెంట్ పాలసీలమీద మాట్లాడేవారు, స్వీకరించేవారు, కొన్నికొన్ని సార్లు అంగీకరించకపోయేవారు. మీ తండ్రి గారిని బట్టి మీకు కూడా ఆనాటి శాసనసభతోనే సత్సంబంధాలున్నాయి. మీ తండ్రి గారు కూడా మా తండ్రిగారి సమకాలికులని మీకు తెలుసును, ఈ సభకు తెలుసును.

అటువంటిది మా తండ్రిగారు అప్పటి సభాపతి శ్రీ దివికొండయ్య చౌదరి గారిని తొందరపడి ఏదో అనేసరికి ఏమిటిది గౌతులచ్చన్న గారు, నన్ను ఇలా అన్నారని ఆయన సభను వాయిదావేసి లోనికి వెళ్లారు. మా నాన్న గారు ఎప్పుడూ తూలి ఎవరినీ మాట అనరు. ఆయన ఏదో ఆవేశంలో అనేశారు. మళ్లీ మా నాన్నగారు వెళ్లి ఆయన చేతులు పట్టుకొని క్షమాపణ చెప్పి ఆయన్ను తీసుకొచ్చి కూర్చోపెట్టారు. ఒక్కసారి అది ఆలోచించుకోవల్సిందిగా కోరుతున్నాను. ప్రతిపక్ష నాయకులు గారు కనీసం ఆ ఒక్క పని అయినా చేయగలిగితే వారిమీద ఉన్న సమస్యలు కొన్ని అయినా సమసిపోతాయని నా సలహా.

ఇకపోతే సభాపతిగా ఆసీటులో కూర్చుంటే ఎంతో వత్తిడితో ఉంటారు, మీరు కూడా అక్కడ కూర్చున్నారు మీకు తెలుసు. మిమ్మల్ని గురించి బయట మేము అనుకుంటుంటాము. తప్పుగా కాదు, మీరు బుద్ధునితో సమానమని అనుకుంటుంటాము. అయినా సరే ఆ సీటులో కూర్చున్నప్పుడు ఎంతో టెన్షన్ ఉంటుంది. నిజంగా శివప్రసాద్ రావు గారి మీద ఎన్నో ఆరోపణలు చేశారు. నిజంగా ఆ సీటులో ఉన్నారు కాబట్టే ఆసీటు మహత్యమన్నా కానివ్వండి.. చాలాసార్లు అవన్నీ తట్టుకొని చాలాసార్లు చాలా శాంతంగా చెప్పడం జరిగింది. వారితాలూకు సభ్యులే ప్రస్తావించారు. తండ్రిలాంటి సీటు అన్నారు. పెద్దకొడుకు అన్నారు, చిన్నకొడుకు అన్నారు. సరే మా రామకృష్ణుడు గారు దానికి పోలిక లేదన్నారు. సరే నేను దానిని పోలికగా

తీసుకుంటాను. తండ్రి అన్నవాడు పెద్దకొడుకును బాగా చూస్తాడు, చిన్నకొడుకు చెడ్డవాడైతే చీవాట్లు పెడుతుంటాడు, దండిస్తుంటాడు కూడా. అటువంటిది ఆ సీటు. కాబట్టి తండ్రి పాత్ర గురించి ఒకసారి ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది.

ఇక రూల్స్ అమలు కావడం లేదు అమలు కావడం లేదు అంటున్నారు. రూల్స్ అమలు అవుతున్నాయి కాబట్టే అంతటి మహత్తరమైన కుర్చీమీద మీరు ఆరోపణలు చేసినా ఈరోజు ఇక్కడ చర్చ జరుగుతున్నది. ఇక స్పీకరు అధికారాలు అంతులేని అధికారాలు. నేను మొదటిసారి 1985లో శాసనసభ్యులుగా ఎన్నికైనప్పుడు అప్పట్లో ఒక సంఘటన కూడా జరిగింది. స్పీకరు అధికారాలు గురించి ప్రస్తావించినప్పుడు అది కూడా ప్రస్తావించాలి. మా శాసనసభా వ్యవహారాల శాఖా మంత్రి గారికి కూడా తెలుసుంటుంది. అప్పుడు సుధీర్‌కుమార్ అనే వ్యక్తి అశోక్ గజపతిరాజు గారి మీద దాడిచేయడానికి అమాంతంగా దూసుకొని అసెంబ్లీలోకి రావడం జరిగింది. దానికి అప్పటి స్పీకరు నారాయణ రావు గారు వెంటనే స్పందించి ఆయన్ను మార్షల్స్‌తో అరెస్ట్ చేయించి ఇక్కడి నుండి నేరుగా చెంచల్ గూడా జైలుకు పంపించారు. అంతటి అధికారాలున్న కుర్చీ అది.

అవేవైనా ఆ కుర్చీలో ఉన్న శివప్రసాద్ రావు గారు ఉపయోగిస్తున్నారా? ఏదైనా ప్రతిపాదనలు ప్రభుత్వం నుండి ఒక దశ దాటాక... వాదోపవాదాల దశదాటి, శృతిమించి రాగాన పడుతుందనే సమయంలోనే ఏదైతే మూవ్ చేస్తున్నారో మా శాసనసభా వ్యవహారాల శాఖా మంత్రిగారు అప్పుడు మాత్రమే స్పందిస్తున్నారు తప్ప తనంతటతానుగా చర్యలు తీసుకునే అవకాశాలు, అధికారాలు ఉన్నప్పటికీ కూడా ఆయన కోడెల శ్రీ శివప్రసాద రావు గారు ఏనాడూ ఉపయోగించలేదు. ఆయన బయోడాటా చూస్తే, ఆయన పబ్లిక్‌కు ఎంత సర్వీసు చేస్తున్నారు, ఏవిధంగా చేస్తున్నారు అన్న దానిని కూడా మనం ఒక్కసారి ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఆయన ప్రజాసేవలో పూర్తిగా తలమునకలై ఉన్నారు. అటువంటి వ్యక్తిని బాధ కలిగించడం సమంజసం కాదు. బాధ కలిగించడం ఒక ఎత్తు అయితే ఇంకా 14 రోజులు చిత్రహింసలైన మాటలు అంటూ ఉంటాం, నీవు మాత్రం పడూ అన్నట్లుగా కూడా ఒక రూల్ కోట్ చేశారు. నేను కాదనటం లేదు.

**2.50 pm (23)**

రూల్ కోట్ చేసి, అక్కడున్న వ్యక్తికి విశ్వాసం లేదు అని ప్రకటించేశాక ఏవిధంగా నిర్వహిస్తారు? అందుకని తప్పని పరిస్థితిలో ఆయన చర్చకు తీసుకోవడం జరిగింది. ఏదైనా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రత్యేకంగా ఏర్పడిన తర్వాత, రాష్ట్ర విభజన జరిగిన తర్వాత మరి మొట్టమొదటి అసెంబ్లీ ఇది. ఒక విధంగా ఇది. అసెంబ్లీలో అత్యంత దురదృష్టకరమైనం ఇక పెద్ద మాటలు అనటం నాకు రాదు అధ్యక్షా. ఇలాంటి చర్య జరగడం అన్నది మట్టుగా అది ఒకసారి

ఆలోచించుకోవాలి. శాసనసభ చరిత్రలో బహుశా మన ఆంధ్రప్రదేశ్‌దే అనండి, ఇతర రాష్ట్రాలు అనండి, ఒకరోజు తర్వాత ఒకరోజు, ఒకరోజు ప్రభుత్వం మీద, మరుసటిరోజు స్పీకర్‌గారి మీద అవిశ్వాస తీర్మానం పెట్టడమన్నది ఎక్కడా కూడా జరగలేదు. ఒక్కసారి ఆలోచించుకోవాలి. ఇంకా కొన్ని రోజులు ఆగి ఉంటే ఇంకా ఎలాగుండేదో గాని, నిన్నటిది అయిపోయిందీ, మళ్లీ ఇవాళ తీసుకుందాం, దానికి చెప్పే కారణం ఒక రాజకీయ కారణం. సరే, అది ఎంతవరకు సమంజసం? సమంజసం అవునో కాదో దాని వాదనకు వెళ్లటం లేదు గానీ, వాళ్లనేదో కార్నర్ చేయాలి కాబట్టి, స్పీకర్ స్థానాన్ని ఉపయోగించుకుని ఆయన మీద అవిశ్వాస తీర్మానం పెట్టి, 14 రోజుల తర్వాత చర్చ తీసుకోవాలన్న ఆలోచనైతే మాత్రం అది చాలా తప్పు. ఆ విషయాన్ని మాత్రం నేను స్పష్టం చేయదలిచాను.

మీకు ముందే చెప్పాను. అపారమైన గౌరవం, నేనూ సీనియర్ శాసనసభ్యుణ్ణి, నేను కూడా మీ తండ్రిగారికి తెలుసు. మీకు తెలియకపోవచ్చు జగన్మోహన్‌రెడ్డిగారూ. కడప జిల్లాలో రైల్వే కోడూరులో నేను పెండ్లి చేసుకున్నాను. మీ నాన్నగారు మినిష్టరుగారు కాకముందు కూడా ఆయన స్టూడెంట్‌గా ఉన్నప్పుడు కూడా నేను చూశాను. మా మామగారి ఇంటి ఎదుటనే మీ తాతగారైన రాజారెడ్డిగారి ఇల్లు ఉండేది. అక్కడ నుంచి చూస్తే చెప్పేవారు. వారే రాజారెడ్డిగారి అబ్బాయిగారు అని. తర్వాత మీ తండ్రిగారు కూడా ప్రతిపక్ష స్థానం కూడా అలంకరించారు. మర్యాదల గురించి ఒక్క మాట చెప్పి విరమించేస్తాను అధ్యక్షా. మా నాన్నగారు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు మీ నాన్నగారు ఎక్సైజ్ శాఖామంత్రిగారు. తర్వాత శ్రీ కె.ఇ.కృష్ణమూర్తిగారు, శ్రీ నారా చంద్రబాబునాయుడుగారూ మంత్రులే. నాన్నగారు ఏ మంత్రిని కలవాలని కబురు పెట్టినా, ఆ మంత్రులు, నాన్నగారి ఛాంబర్స్ ఆ గేటుకి ఎదుటే ఉండేవి. ఇప్పుడు సెపరేట్ అయిపోయింది కాబట్టి, అది తెలంగాణకు వెళ్లింది. ఇప్పుడు అది క్లోజ్ అయిపోయింది. అక్కడికి వచ్చి మాట్లాడేవారు. అది ఆనాటి మర్యాద. అంటే గౌరవం ఇవ్వడం, పుచ్చుకోవడం. ఇప్పుడు ఇక్కడ మావాళ్లు ఆవేశపడుతున్నారు. నేను కాదనటం లేదు. ఎందుకు ఆవేశపడుతున్నారు? ప్రతిపక్షం నుంచి స్టార్ట్ అయితే అధికార పక్షం నుంచి కూడా స్టార్టయ్యే పరిస్థితి ఉంది. మొదటిసారి ఎన్నికైన వాళ్లు చాలామంది ఉన్నారు.

తర్వాత (ప్రతిపక్ష నాయకుడు శ్రీ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిగారినుద్దేశించి) మీ ప్రత్యేకత. First time MLA, first time ప్రతిపక్ష నాయకుని పాత్ర వచ్చినప్పుడు అది చాలా గొప్ప విషయంగా భావించి, ఆ పాత్రకు ఎంత న్యాయం చేకూరిస్తే అంత గౌరవం ఉంటుంది. కనీసం ఇకనుంచైనా ఆ మర్యాదలు, ఆ గౌరవాలు స్పీకర్‌గారి విషయంలో పాటిస్తారని చెప్పి కోరుకుంటూ, నాకు ఇచ్చిన ఈ సమయం దురదృష్టకర సమయంగానే భావిస్తూ సెలవు తీసుకొంటున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: శ్రీనివాసరెడ్డిగారు. ఇప్పుడు సమయం మ.గం.2.53 నిమిషాలు అయింది. మనం సా. 4 గంటలకు సమావేశం ముగించుకోవాలి.

డా. గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి (నరసరావుపేట): అధ్యక్షా, నేను నరసరావుపేట నియోజకవర్గం నుంచి ఎన్నికైన శాసనసభ్యుణ్ణి. డా. కోడెల శివప్రసాదరావుగారు ఇంతకుముందు నరసరావుపేటకు ప్రాతినిధ్యం వహించి, తర్వాత సత్తెనపల్లి నుంచి గెలవడం జరిగింది. అయినా సరే, నా నరసరావుపేట నియోజకవర్గంలో జరుగుతున్న ప్రతీ కార్యక్రమం కూడా శివప్రసాద్‌గారి ఆధ్వర్యంలో జరగాల్సిందే. ఏది వచ్చినా, ఆయన చేయాల్సిందే. ప్రతీ ప్రభుత్వ కార్యక్రమం, జన్మభూమి కార్యక్రమం గానీ లేదా సమీక్షలు గానీ, అధికారులతో ఏ సమీక్ష అయినా ఆయన నిర్వహించాల్సిందే. చాలాసార్లు నాకు ఇంటిమేషన్ కూడా ఉండదు, నాకు తెలియపర్చడం కూడా లేదు. ఇది వాస్తవం. కావాలంటే మీరు ఎంక్వయిరీ వేయండి, లేదా హౌస్ కమిటీ వేయండి, మీ ఆధీనంలో చేయండి. ఇదంతా ఎందుకు? మొన్న 4వ తేదీన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు కోటప్పకొండకు వచ్చారు. కోటప్పకొండకు వచ్చినప్పుడు కూడా కనీసం oral గా గానీ, written గా గానీ ఒక శాసనసభ్యునిగా, నా నియోజకవర్గంలో పర్యటించేటప్పుడు నాకు కనీసం ఇంటిమేషన్ కూడా లేదు. ఇవన్నీ కూడా ఎందుకు చెబుతున్నానంటే, ప్రతీ సమీక్ష, ప్రతీ హక్కులు శివప్రసాద్‌గారే నిర్వహిస్తున్నారు. (ఈ సందర్భంలో ప్రభుత్వ విప్ శ్రీ కూన రవికుమార్‌గారు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని గౌరవ ఉప సభాపతిని కోరారు) నేడు ఒక శాసనసభ్యుణ్ణి, హక్కులను కాపాడాల్సిన వ్యక్తి సభాపతి. నా హక్కులను ఈరోజు సభాపతి కాపాడటం లేదు అని ఈ శాసనసభలో మీ అందరికీ తెలియజేస్తున్నాను. అట్లానే CBI Enquiry గురించి మంత్రిగారు చెప్పారు. 1999వ సంవత్సరంలో, ఎలక్షన్స్ సమయంలో, ఆయన ఇంట్లో బాంబులు పేలి నలుగురు సభ్యులు చనిపోయారు. ఇందులో సతీష్ అనే ఒక వ్యక్తి ఇండిపెండెంట్ క్యాండిడేట్‌గా ఎలక్షన్‌లో పోటీ చేశారు. అలాంటి వ్యక్తి చనిపోయాడు. అప్పుడు CBI Enquiry వేస్తే, CBI Enquiry లో 'పల్నాడు' అనే ఆసుపత్రిని వేరే వారికి అగ్రిమెంట్ రాశారని చెప్పి పేర్కొంటే..

(ఈ సందర్భంలో శాసనసభ వ్యవహారాల శాఖామంత్రి శ్రీ యనమల రామకృష్ణుడుగారు పాయింట్ ఆఫ్ ఆర్డర్ చెబుతానని మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని గౌరవ ఉప సభాపతిని కోరారు.)

శ్రీ యనమల రామకృష్ణుడు: అధ్యక్షా, వారు చెప్పిన స్టోరీకి సంబంధించిన సంవత్సరం 1999. అప్పుడు స్పీకర్‌గారు శివప్రసాద్‌గారు కాదు. నోటీసు స్పీకర్‌గారి మీద ఉంది. ఆరోజు ఆయన స్పీకర్ కాదు. ఆరోజు ఇన్సిడెంట్స్‌కి, ఇప్పుడు స్పీకర్‌గా ఉండే దానికి హౌస్ కండక్ట్ చేయడానికి సంబంధం లేదు. హౌస్ కండక్ట్ చేసే దానిమీదే మీరు No-confidence move చేశారు. దానిమీద మాట్లాడితే బెటర్.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: శ్రీనివాసరెడ్డిగారూ దానిమీద ఇందాక చర్చ జరిగింది. రఘునాథరెడ్డిగారు మాట్లాడారు.

డా. గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి: క్లీన్‌చిట్ ఇచ్చిందని అప్పుడు రఘునాథరెడ్డిగారు చెప్పారు. అది వాస్తవం కాదు. CBI Enquiry వేసినప్పుడు, ఈయన్ని prosecute చేయాలా లేదా అని CBI, Central Government ను అడిగింది. అప్పుడు Central Government, CBI కి permission ఇవ్వలేదు. అంతేగానీ ఎక్కడా CBI క్లీన్‌చిట్ ఇవ్వలేదు. దయచేసి రికార్డుల్లో కూడా పరిశీలించండి. ఇది వాస్తవం. CBI క్లీన్‌చిట్ ఇవ్వలేదు. అప్పుడు సెంట్రల్‌లో BJP Government ఉంది. ప్రభుత్వం మాకు అనుమతించలేదు కాబట్టే మేము prosecute చేయడంలేదని చెప్పి CBI reply ఇవ్వడం జరిగింది. అది వాస్తవం. అట్లాగే ఇప్పుడు Affidavit కూడా ఫైల్ చేశారు. దాదాపు 18...

(ఈ సందర్భంలో మంత్రి శ్రీ పల్లె రఘునాథరెడ్డిగారు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని గౌరవ ఉప సభాపతిని కోరారు)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: రఘునాథరెడ్డిగారు.

శ్రీ పల్లె రఘునాథరెడ్డి: అధ్యక్షా, చట్ట సభల్లో మాట్లాడేటప్పుడు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే చాలా బాగుంటుంది. ఏదిబడితే అది మాట్లాడటం కరెక్ట్ పద్ధతి కూడా కాదు. CBI, Legal opinion కోరింది. కేంద్రంలోని Additional Solicitor General, అంటే almost Government లో ఉన్నట్లే. ఆ నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి, డా.కోడెల శివప్రసాదరావుగారిపై చేసిన ఆరోపణలు నిరాధారం, ఆరోపణలు సరైనవి కావు అని తేల్చారు. అంతటితో అగకుండా కొంతమంది (ప్రతిపక్ష సభ్యులనుద్దేశించి) మీలాంటి వాళ్లు ఈయనపై కేసు పెట్టాలని హైకోర్టులో వాజ్యం వేశారు. హైకోర్టు తోసిపుచ్చింది. మళ్లీ లోయర్ కోర్టులో కూడా petition వేశారు. అక్కడ కూడా కొట్టివేశారు. ఈ కేసుతో ఆయనకు సంబంధం లేదని చెప్పి, బాగా తేల్చారు, ఎటువంటివీ లేవు. అంతేగాకుండా డా.కోడెల శివప్రసాదరావుగారి గురించి మీకు తక్కువగా తెలిసినట్లుంది. ఆయన ఈమధ్య కాలంలోనే ఎక్కువ మరుగుదొడ్ల నిర్మాణంలో భారతదేశంలో, స్వచ్ఛ భారత్‌లో మొదటి అవార్డు వచ్చింది. ఆయన రాత్రింబవళ్లూ కష్టపడి పనిచేస్తున్నారు. మంచి పరిపాలనా దక్షుడు. చాలా ఏండ్లు మంత్రిగా పని చేశారు, చాలా మంచి పేరు ఉంది, ప్రజల్లో డాక్టర్‌గా మంచి పేరుంది, ఆయనమీద ఆరోపణలు చేయడానికి వీళ్లకి నోరు ఎలా వచ్చిందో నాకైతే అర్థం కావడం లేదు. ఆయన ఇక్కడ శాసనసభాపతిగా ఉండడం మా అందరి అదృష్టంగా భావించవచ్చు. నిష్పక్షపాతంగా, నిజాయితీగా, పారదర్శకంగా, ఎఫెక్టివ్‌గా పోతున్నారు.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: శ్రీనివాసరెడ్డిగారూ, మిగతా విషయాలలోకి వెళ్లండి మీరు.

డా. గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డిః అధ్యక్షా, నేను కూడా చెప్పింది, ప్రభుత్వం...

(ఈ సందర్భంలో మంత్రి డా. కామినేని శ్రీనివాసరావుగారు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని గౌరవ ఉప సభాపతిని కోరారు)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః కామినేని శ్రీనివాసరావుగారు.

డా. కామినేని శ్రీనివాసరావుః అధ్యక్షా, దయచేసి మీద్వారా సభ్యులు శ్రీనివాసరెడ్డిగారికి, అందరికీ నేను చెప్పేది, మనం ఒక వ్యవస్థ. ఇప్పుడేం జరిగింది. వాళ్లు అవిశ్వాస తీర్మానం పెట్టింది అసలు స్పీకర్‌గారి మీద కాదూ అన్నట్టు, మేమేదో మా సభ్యులికి, మా వాళ్లకి విప్ ఇచ్చుకోవడానికి అన్నట్టు అనుకోకుండా ఇలా అన్నారు. శ్రీనివాసరెడ్డిగారికి నేను చెప్పేదేమంటే డెవలప్‌మెంట్ యాక్టివిటీ గురించి చూడాలి. నేనున్నాను కాబట్టి నేనే చేయాలని కాదు, ఎక్కడ ఏ రకంగా మన నియోజకవర్గం అభివృద్ధి అయినా మనం సంతోషించాలి.

**3.00pm (24)**

(ప్రతిపక్ష సభ్యులచే సభకు తీవ్ర అంతరాయం కలుగసాగింది)

దయచేసి వినండి. ఇదే శివప్రసాద్ గారిని ఎన్నుకున్న రోజున ఏమని పొగిడారో ఒకసారి రికార్డుల్లో చూడండి. మీరు చెప్పే కేసులన్నీ ఆయన్ను ఎన్నుకున్నప్పుడు లేవా?

(ప్రతిపక్ష సభ్యులచే సభకు తీవ్ర అంతరాయం కొనసాగింపు)

ఎప్పుడో జరిగినవి చెబుతున్నారు. ఆయన 2014లో స్పీకర్ అయ్యారు అధ్యక్షా. 15 ఏళ్ళకు ముందు 1999లో విషయాలు చెప్పి, మన వ్యవస్థల్ని మనం నిర్వీర్యం చేసుకుంటున్నాం. దయచేసి, నేను చెబుతున్నాను.

(ప్రతిపక్ష సభ్యులచే సభకు తీవ్ర అంతరాయం కొనసాగింపు)

ఇవన్నీ ముందు మీకు తెలియవా? మీరు ఒక్కసారి రికార్డుల్లో చూడండి, ఆయన్ను ఏమని పొగిడారో! మా అదృష్టం అని పొగిడారు, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇవాళ ఈ రకంగా ఆ వ్యవస్థను దిగజార్చ వద్దని నేను ప్రతిపక్ష నాయకుడిని, అలాగే సభ్యులందరినీ కోరుతున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: శ్రీనివాస రెడ్డి గారూ.

డా. గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి: సార్, మంత్రిగారు చెప్పినట్లు గతంలో వ్యవస్థల గురించి వదిలేసేయండి. నా హక్కుల్ని కాలరాయడం న్యాయమేనా చెప్పండి. శాసనసభ్యుడిగా నా హక్కుల్ని కాలరాయడం, నేను మాట్లాడక పోవడం కరెక్టా? కాదా? చెప్పండి. ఎన్నికైన తరువాత నుండి చెప్తాను.

సత్తెనపల్లి నియోజకవర్గంలో ముప్పాళ్ళ మండలం ఎం.పి.టి.సి.ల ఎన్నికల్లో, ఎం.పి.టి.సి.లను కిడ్నాప్ చేసి, ఒక ఎమ్మెల్యే ముస్తఫా గారిని గాయపరిచి ఎన్నికలు జరిగాయి. దీనిమీద ఏదైనా ఎంక్వైరీ వేశారా? పోలీసు ఎంక్వైరీ జరిగిందా? దీనికి ప్రత్యక్ష సాక్షులెవరో, కారకులెవరో కూడా మీకందరికీ తెలుసు. నేను చెప్పాల్సిన అవసరం లేదు. సర్, ఇవాళ నేను వ్యక్తిగతంగా కాదు. (మైకు కట్ చేయబడింది)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ : పుల్లారావు గారూ..

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు (చిలకలూరిపేట) : అధ్యక్షా, గౌరవ సభ్యులు డా.శ్రీనివాస రెడ్డి గారు అవాస్తవాల్ని సభ దృష్టికి తీసుకురావడంతోపాటు స్పీకర్‌గారిని అప్రతిష్టపాలు చేసేటువంటి దానికి మాట్లాడుతున్నట్లు స్పష్టంగా కనబడుతోంది. ఎందుకంటే, డా.కోడెల శివప్రసాద్ గారిపై వారు ఏదైతే ఆరోపణలు చేస్తున్నారో, వాటన్నిటిలో కూడా నిర్దోషిగా నిరూపించుకోవడం కూడా జరిగింది.

ఈరోజు డా. శ్రీనివాస రెడ్డి గారు మాట్లాడుతున్నారు, నన్ను పిలవలేదు అని. పిలిచిన వాటికి మీరు రావడం లేదు. అన్నిటికీ మిమ్మల్ని పిలుస్తూనే ఉన్నారు. మీ పేరు ఎక్కడా కూడా violate చేయడం లేదు. అన్ని స్టోన్స్ (ఫౌండేషన్ స్టోన్స్) మీద సభాధ్యక్షులుగా మీ పేరు పెట్టడం జరుగుతోంది. మీరు పిలిచిన వాటికి రారు. పిలవడం లేదని మాత్రం సభ దృష్టికి తీసుకువస్తూ ఉన్నారు. ఎంతమటికి న్యాయం శ్రీనివాస రెడ్డి గారూ మీరు చెప్పండి? కోటప్పకొండకు పిలవక పోవడమేమిటి? పిలుస్తూనే ఉన్నారు. మీరు రావడం లేదు. వంద సంవత్సరాల పండగ జరిగింది. మిమ్మల్ని పిలవలేదా డాక్టరు గారూ. మిమ్మల్నే కాదు, కాసు కృష్ణారెడ్డి గారిని కూడా పిలిచారు. మీరు ఎక్కడ వచ్చారు? మిమ్మల్నే కాదు, కాసు కృష్ణారెడ్డి గారింటికి కూడా వెళ్ళి పిలవడం జరిగింది. కానీ మీరు వచ్చారా? ఎందుకండీ శ్రీనివాస రెడ్డి గారూ ఈవిధంగా ఆరోపణలు చేయడం, అప్రతిష్టపాలు చేయడం. డా. కోడెల శివప్రసాద రావు గారి మీద ఏవిధంగా మచ్చ వేయాలని చూస్తున్నారు. ఈరోజు కోటప్పకొండ అభివృద్ధి చేసినా, నరసరావు పేట అభివృద్ధి చేసినా, సత్తెనపల్లి అభివృద్ధి చేసినా ఆయనే చేస్తున్నారు. మీకన్నా కూడా ఎక్కువ శ్రద్ధ పెట్టి నరసరావుపేటను అభివృద్ధి చేస్తున్నారు. మీరు ఒప్పుకుంటున్నారా? మీరు వాస్తవాల్ని

ఒప్పుకోరు. ఈరోజు వంద సంవత్సరాల పండుగని బ్రహ్మాండంగా చేశారు. బ్రహ్మాండంగా 'కోటప్పకొండ'ని చేశారు. మీ నియోజకవర్గంలో డా. కోడెల శివ ప్రసాద రావు గారు ఎన్ని వందల కోట్ల రూపాయల అభివృద్ధి చేశారో ఒక్కసారి గుండె మీద చేయి వేసుకుని చెప్పండి. మీరు ఎన్ని పనులకు, ఎన్ని ఏళ్ళుగా సాధించుకొచ్చారో చెప్పండి. ఇప్పుడు అభివృద్ధి జరుగుతోంది. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి జరుగుతోంది. సత్తెనపల్లిలో అభివృద్ధి చేసినా, నరసరావుపేటలో అభివృద్ధి చేసినా, ఈరోజు ప్రజల కోసం చేస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా స్పీకర్ గారు చేస్తున్నారు. మీరు కావాలని స్పీకర్ గారి మీద బురదజల్లేటువంటి కార్యక్రమం ఇది. ఈరోజు అవిశ్వాస తీర్మానం కూడా దానిలో ఒక భాగం. మీరు ఇచ్చిన స్లోగన్స్ అన్నీ చదివితే.... ఇవి వాస్తవమా! మీరు ఇచ్చిన స్లోగన్స్ ఏమిటి? వారు స్పీకర్ స్థానాన్ని ఏరోజైతే తీసుకున్నారో, ఆరోజు నుండి మీ స్లోగన్స్..; 'స్పీకర్-జోకర్', 'స్పీకర్-బ్రోకర్', 'రౌడీ స్పీకర్ డౌన్ డౌన్', 'స్పీకర్ స్థానంలో ఫ్యాక్షనిస్టా', 'అసెంబ్లీలో ఫ్యాక్షన్ రాజకీయాలా?', అదేవిధంగా, 'అధ్యక్షా, ఈ మైకు వాళ్ళకే ఇచ్చేయండి, నాకు...' ఏంటి అధ్యక్షా ఈ కామెంట్స్ స్పీకర్ గారి మీద. నిష్పక్షపాతంగా సభను నిర్వహిస్తున్నటువంటి స్పీకర్ గారు, ఆరవసారి శాసనసభకు వచ్చారు. ఒక ఇమేజ్ ఉంది. ఏ మంత్రి పదవి తీసుకున్నా, ఆ మంత్రి పదవికి వన్నె తీసుకువచ్చినటువంటి నాయకులు. అటువంటి స్పీకర్ గారిని 'రౌడీ స్పీకర్' అంటారు, 'బాంబులు' అంటారు. ఏంటి అధ్యక్షా ఇదంతా? ఆరుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. ఈరోజు డెవలప్‌మెంట్‌లో పెట్టింది పేరు. అటువంటిది, వారి మీద బురద జల్లేటువంటి కార్యక్రమం మానుకొండి.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ : మీర త్వరగా ముగించండి.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు : ఇప్పుడైనా ఒకసారి మీరు ఆత్మవిమర్శ చేసుకొని, ఇప్పటికైనా మీరు పెట్టిన అవిశ్వాస తీర్మానం వెనక్కి తీసుకోండి. లెంపలేసుకొని వెనక్కి తీసుకోండి. అటువంటి వ్యక్తుల మీద, అటువంటి నిజాయితీపరుల మీద మీరు అవిశ్వాసం పెట్టడమనేటువంటిది పునరాలోచించుకోవాలని నేను కోరుతున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ : శ్రీనివాస రెడ్డి గారూ మీరు మాట్లాడండి. సంక్షిప్తంగా మాట్లాడండి. ఇంకా మాట్లాడాల్సిన వాళ్ళున్నారు.

డా. గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి : అధ్యక్షా, నేనెలాంటి వ్యక్తినో మినిస్టర్ పుల్లారావు గారికి కూడా తెలుసు. పుల్లారావు గారికి కూడా వాస్తవాలు తెలుసు. నా నియోజక వర్గంలో జరుగుతున్న దానిని చెప్తున్నాను. నేను 10 టన్నుల రేషన్ (పి.డి.ఎస్.) బియ్యాన్ని, నేరుగా గోడౌన్‌కు వెళ్ళి పట్టించాను.

(ఆ సందర్భంలో కార్మిక ఉపాధి శాఖామాత్యులు శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు తమకు మైకు ఇవ్వాల్సిందిగా గౌరవ సభాపతిని కోరసాగారు)

ఆర్డీవో గారు, కలెక్టరు గారూ అందరూ వచ్చి ఎంక్వైరీ చేశారు. అందులో ముఖ్య భూమిక స్పీకర్ గారి కుమారుడు శ్రీ కోడెల శివ రామకృష్ణ చేస్తున్న అవినీతి గురించి ఈరోజు మాట్లాడాలి.

(ఆ సందర్భంలో కార్మిక ఉపాధి శాఖామాత్యులు శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు గారు తాము స్పందించేందుకై తమకు మైకు ఇవ్వాల్సిందిగా గౌరవ సభాపతిని కోరసాగారు)

ఎందుకంటే, ఈ కుర్చీని, ఈ యొక్క (మైకు కట్ చేయబడింది)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ ః అచ్చెన్నాయుడు గారూ.

శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు (టెక్కలి)ః అధ్యక్షా, దయవుంచి నియోజకవర్గంలో జరుగుతున్నటువంటి విషయాలు, ఒక శాసనసభలో, ఒక శాసనసభ్యుడు, వారికి జరుగుతున్నటువంటి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకునే ఈరోజు అవిశ్వాస తీర్మానం ఇచ్చారా అని చెప్పవలసిన అవసరముంది. ఈరోజు ఒక పవిత్రమైనటువంటి స్థానంలో ఉన్నటువంటి ఒక వ్యవస్థ మీద అవిశ్వాస తీర్మానం ఇచ్చేటప్పుడు బలమైనటువంటి కారణాలుండాలి. నేను కూడా నాలుగు పర్యాయాలుగా సభలో ఉన్నాను. శ్రీ కోడెల శివప్రసాద రావు గారు, ఈరోజు ప్రతిపక్షానికి ఇస్తున్నటువంటి గౌరవం, నేను నాలుగు సభల్లో ఎప్పుడూ కూడా చూడలేదు. ఇప్పుడు కూడా చూడలేదు. ఈరోజు Adjournment Motion లో ప్రతిపక్ష నాయకుడికి మైకు ఇచ్చిన సభాపతి ఎవరైనా ఉన్నారంటే, గౌరవనీయులైన డా. కోడెల శివప్రసాదరావు గారే. ఒక్కసారి మీరు గుర్తు పెట్టుకోవాలి. మాకు అన్యాయం జరిగింది. మా గొంతులన్నీ నొక్కుతున్నారు. మాకు అవకాశమే రావడం లేదు. ఈరోజు అందుకే మేము అవిశ్వాస తీర్మానం పెడుతున్నామని చెప్పి, నలుగురైదుగురు సభ్యులు మాట్లాడారు. మీరు అవిశ్వాస తీర్మానం దేని మీద పెట్టారు? బలమైనటువంటి ఒక్క కారణంలేదు. అవిశ్వాస తీర్మానమంటే బలమైనటువంటి కారణాలు ఏమైనా ఉంటే, అవిశ్వాస తీర్మానం పెట్టాలి. చాలా సిల్లీగా... నియోజక వర్గంలో నన్ను పిలవలేదని; మా సభ్యురాలు రోజా గారిని ఒక సంవత్సరం సస్పెండ్ చేశారని. రోజా గారి సస్పెన్షన్‌కీ, సభాపతికీ ఏమి సంబంధం?

అధ్యక్షా, ఇప్పుడే నేను వివరాలన్నీ తెచ్చాను. ఇప్పటికి మనకి 7 సార్లు అసెంబ్లీ సమావేశాలు జరిగాయి. మన నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటికి 7 సార్లు అసెంబ్లీ సమావేశాలు జరిగితే, 25 గంటలు మాట్లాడే అవకాశం అధికార పార్టీకి దొరికింది, మేము ఎంత మందిమి ఉన్నామనేది ఒకసారి మీరు చూసుకోవాలి. అదే, ప్రతిపక్ష నాయకుడికి గానీ, ప్రతిపక్ష

పార్టీకి గానీ 20 గంటలు మాట్లాడించిన అవకాశం మీకు ఉందంటే, ఎక్కడ మీపట్ల పక్షపాతం వహిస్తున్నారో, స్పీకర్ గారు మీకు ఎక్కడ సమయమివ్వడం లేదోచెప్పండి. ఇది రికార్డు అధ్యక్షా. ఇదేదో అచ్చెన్నాయుడు గారో, లేక అధికార పార్టీనో తయారు చేసింది కాదు. మనం ఎవరెవరం ఎన్ని నిమిషాలు మాట్లాడుతున్నాం, ఏం మాట్లాడుతున్నాం, ఎంత సమయం మాట్లాడుతున్నాం అని ప్రతి నిమిషం కూడా రికార్డు అవుతుంది. అధికార పార్టీకి 25 గంటలు ఇస్తే, ప్రతిపక్ష పార్టీకి 20 గంటలు ఇచ్చారు. దయవుంచి గౌరవనీయులైన ప్రతిపక్ష పార్టీకీ, ప్రతిపక్ష నాయకుడికి ఒక విషయాన్ని నేను ఒక సభ్యుడిగా కాకుండా, ఒక పౌరుడిగా నేను సూచన చేస్తున్నాను. ఈరోజు ఎవరమున్నా, లేకపోయినా సరే, వ్యవస్థలనేవి ప్రజాస్వామ్యంలో చాలా బలమైనవి. వ్యవస్థలు బలంగా ఉండేటప్పుడే, ప్రజాస్వామ్యం బాగుంటుంది. ప్రజాస్వామ్యం బాగుంటేనే ఫలితాలు ప్రజలకి చక్కగా అందడానికి అవకాశం ఉంటుంది. మన వ్యవస్థల్ని ఎప్పుడూ కూడా కించపరచకూడదు. మీరు చూస్తున్నారు. ఏ వ్యవస్థ మీదా మీకు నమ్మకం లేదు.

**3.10 PM (25)**

ఏ ఒక్క వ్యవస్థ మీద మీకు నమ్మకం లేదు. మీరు చూసుకోండి. 20, 21 నెలల నుంచి మనం చూస్తున్నాం. ఒక్క వ్యవస్థపై నమ్మకం లేకుండా అన్ని వ్యవస్థలపై ఈరోజు కామెంట్ చేసి మొత్తం వ్యవస్థలన్నింటిని కూడా చిన్నాభిన్నం చేస్తున్నారు. నిన్న ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టి ఎటువంటి విషయం లేకుండా. . .

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు అభ్యంతరాలు తెలియజేశారు)

వినాలి, వినాలి.

మిస్టర్ డెప్యూటి స్పీకర్ : కూర్చోండి, తరవాత మాట్లాడుదురు. మీకు మరలా మైక్ ఇస్తాను. శ్రీనివాస రెడ్డి గారూ మాట్లాడండి.

డా. గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి : అధ్యక్షా, స్పీకర్ కుర్చీని అడ్డం పెట్టుకొని తన కుమారుడు, కుమార్తె చేస్తున్న అవినీతి గురించి చెప్పడంలో తప్పు ఏమైనా ఉంటే చెప్పండి సార్. నేను చెప్పిన దానిలో ఏదైనా అబద్ధం ఉంటే నేను రాజీనామ చేయడానికి సిద్ధంగా ఉన్నాను. నేను రాజీనామ చేసి వెళ్ళిపోతాను. ఇందులో ఒక్క అంశమైనా తప్పు ఉంటే నేను రిజైన్ చేసి వెళ్లిపోతాను. నేను ఈ చాలెంజ్‌ను అంగీకరిస్తున్నాను.

మిస్టర్ డెప్యూటి స్పీకర్: శ్రీనివాస రెడ్డి గారు డా.కోడెల శివప్రసాద రావు గారు సభలో లేనపుడు ఆయనపై ఆరోపణలు చేయడం సబబు కాదు. కొంచెం ఆలోచించండి.

డా. గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డిః ఇప్పుడు నేను చెప్పవలసింది చాలా ఉంది.

మిస్టర్ డెప్యూటి స్పీకర్ః వ్యక్తిగతమైన విషయాలు ఆయన లేనపుడు చెబితే ఆయన సమాధానం చెప్పే అవకాశం కూడా లేదు కదా?

డా. గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి : ఒక స్పీకర్‌గా పార్టీ కార్యకర్తల సమావేశానికి అటెండ్ కావచ్చా చెప్పండి సార్? స్పీకర్ స్థానంలో ఉండి, పార్టీలోకి ఆహ్వానించి పచ్చ కండువాను కప్పడం చేశారు.

(ఈ సందర్భంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు 'షేం..., షేం...' అని అన్నారు)

ఇద్దరు MPP లను పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇంకొక ముఖ్యమైన విషయం ఒక శంకుస్థాపన చేసినపుడు శిలాఫలకంపై తన కుమారుడి పేరు వేసుకున్నారు.

(అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదాలు చోటుచేసుకున్నాయి)

జొన్నలగడ్డ గ్రామంలో, నరసరావు పేట. . .

(మైక్ కట్ చేయబడింది)

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావుః అధ్యక్షా, స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టారా, ఇతర విషయాలన్నీ దీనిలో ప్రస్తావించడానికి అవిశ్వాస తీర్మానం పెట్టారా అని ప్రతిపక్ష నాయకుడిని గానీ, వారి సభ్యులను గానీ నేను అడుగుతున్నాను. స్పీకర్ మీద అవిశ్వాస తీర్మానం పెట్టారు. కుమారుడినీ, కూతురునీ సభలో ఎందుకు ప్రస్తావనకు తీసుకొస్తారు? దీనితో సంబంధం లేని వారిని దీనిలో తీసుకురావడం ఏమిటి అధ్యక్షా? సభలో లేనివారి మీద ఆరోపణలు చేయడం వాస్తవమేనా అని గౌరవసభ్యులను నేను అడుగుతున్నాను. సభలో లేని వారి గురించి ప్రస్తావించవచ్చునా?

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు అభ్యంతరాలు తెలియజేశారు)

స్పీకర్ గారిపై అవిశ్వాస తీర్మానం పెట్టి కుమారున్ని, కూతురిని సంబంధం లేని వ్యక్తులను, స్పీకర్ గారిపై బురద చల్లడమే కాకుండా కుటుంబ సభ్యులపై కూడా బురద జల్లే కార్యక్రమం చేస్తున్నారు. ఎంతవరకు న్యాయం అధ్యక్షా?

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులచే సభకు అంతరాయం)

స్పీకర్ గారి చర్యలు మాత్రమే అవిశ్వాసానికి వస్తాయి. వ్యక్తిగత హోదాలో ఆయనపై విమర్శలు అవిశ్వాసం పరిధిలోకి రావని గౌరవసభ్యులు గుర్తించుకోవాలి.

(అంతరాయం కొనసాగింపు)

రెండవది అధ్యక్షా, ఒక ఆరోపణ చేసేటప్పుడు మూడు దశాబ్దాల చరిత్ర కలిగిన నాయకుడు డా. కోడెల శివప్రసాద రావు గారు అధ్యక్షా. ఆయన అనుభవం గానీ చూస్తే నరసరావుపేటలో ప్రముఖ వైద్యుడు ఆయన వైద్యానికి పెట్టింది పేరు.

(అంతరాయం కొనసాగింపు)

ఆయన చేయి పట్టుకుంటే వ్యాధి నయమవుతుందని ఒక సెంటిమెంట్ కలిగిన డాక్టర్. నిష్పక్షపాతంగా, రాగద్వేషాలకు అతీతంగా శాసనసభను నిర్వహిస్తున్నారు. మీరు (ప్రతిపక్షాన్ని ఉద్దేశించి) చేసే అప్రజాస్వామిక ప్రవర్తనకు. .

(ఈ దశలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు అభ్యంతరాలు తెలియజేశారు)

స్పీకర్ కాబట్టి ఇన్ని గంటలు అవకాశం ఇస్తున్నారు. నిన్న మీ ప్రతిపక్ష నాయకుడికి ఎన్ని గంటలు అవకాశం ఇచ్చారు? రెండున్నర గంటలు అవకాశం ఇచ్చారే? తెల్లారేలోపల ఆయనపై అవిశ్వాస తీర్మానం పెట్టారే? ఇది ఎక్కడైనా ఉందా దేశ చరిత్రలో? దేశంలో 29 రాష్ట్రాలున్నాయి. ఒకసారి తిరిగేయండి. ఎక్కడైనా ప్రభుత్వం మీద, మరుసటి రోజు స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానాలు పెట్టిన దాఖలాలు ఎక్కడైనా ఉన్నాయా? గౌరవసభ్యులు చెప్పండి. మీ ప్రతిపక్ష నాయకుడికి తెలియకపోవచ్చు. మీలో రెండుసార్లు, మూడుసార్లు శాసనసభ్యులు అయినవారు కొద్దిమంది ఉండి ఉంటారు. వారిని చెప్పమనండి, చరిత్ర ఒక్కసారి చూడమనండి. నిన్న ప్రభుత్వం మీద, ఈరోజు స్పీకర్ గారి మీద, ఏమి మాట్లాడాలో, ఏమి మాట్లాడరాదో తెలియకుండా మాట్లాడడం. (బెల్) కూతురినీ, కుమారున్ని, సంబంధం లేని వ్యక్తులను తీసుకురావడం, ప్రతిపక్ష నాయకుడికి అవగాహన లేకపోవడం.

(ఈ దశలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు మరలా అభ్యంతరాలు తెలియజేశారు)

మిస్టర్ డెప్యూటి స్పీకర్ : శ్రీనివాస రెడ్డి గారు, సభలో లేనటువంటి వ్యక్తుల గురించి మాట్లాడకండి. త్వరగా ముగించండి.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు : అధ్యక్షా, ఒక్క నిమిషం. అవిశ్వాస తీర్మానం ఇస్తారు. ఈరోజు ఇచ్చి సమయం కావాలంటారు. నిన్న కూడా అలాగే చేశారు. ఈరోజు స్పీకర్ మీద అవిశ్వాస తీర్మానం ఇచ్చారు. మరలా 14 రోజులు టైం ఉందీ అంటారు. మీరు అవిశ్వాస తీర్మానం ఇచ్చినపుడు ఈ సభకు ఉన్న రూల్స్ ప్రకారం ప్రొసీడింగ్స్ ఉంటాయి.

(ఈ దశలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు మరలా అభ్యంతరాలు తెలియజేశారు)

నోటీస్ ఇవ్వడం మీరే, మరలా సమయం కావాలనడం మీరే. ఈవిధంగా అసభ్య దూషణలు, రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ, అశ్లీలమైన నినాదాలతో వైఎస్సార్ పార్టీ వాళ్లు శాసనసభను కలుషితం చేస్తున్నారు.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు అభ్యంతరాలు తెలియజేశారు)

ఒక చరిత్ర సృష్టిస్తున్నారు. కలుషితం చేస్తున్నారు. ఎంతో పవిత్రమైన సభా స్థానాన్ని కించపరుస్తున్నారు. వాళ్లు నేర్చుకోవాలి. మొదటిసారిగా వచ్చిన శాసనసభ్యులు కూడా ఉన్నారు. స్పీకర్ బాధ్యతలు చేపట్టి ఏడాది కాకముందే అవిశ్వాసం పెడుతున్నామని చెప్పారు.

(అంతరాయం కొనసాగింపు)

మరో ఆరు నెలల తరువాత నోటీస్ ఇస్తామని చెప్పారు. ఇంకో ఆరు నెలల తరువాత ఇప్పుడు మరలా అవిశ్వాస తీర్మానమని ముందుకొచ్చారు. వచ్చిన దానికి నిలబడుతున్నారా అంటే నిలబడరు. 14 రోజులు సమయం ఉంది అంటారు.

(బెల్)

ఎందుకండీ మీకు 14 రోజులు. మీరు అవిశ్వాసం పెట్టాలనుకున్నప్పుడు. . .

(మైక్ కట్ చేయబడింది)

మిస్టర్ డెప్యూటి స్పీకర్ : కూర్చోండి. శ్రీనివాస రెడ్డి గారూ ముగించండి.

డా. గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి : అధ్యక్షా, నేను కూడా పవిత్రమైన డాక్టర్ వృత్తిలో నుంచి వచ్చాను. నేను ఎలాంటి వాడినో మా గుంటూరు జిల్లా శాసనసభ్యులందరికీ తెలుసు.

మిస్టర్ డెప్యూటి స్పీకర్: దయచేసి సభకు సంబంధించిన విషయాలు మాత్రమే మాట్లాడండి.

డా. గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి : అధ్యక్షా, నేను ఒక చిన్న ఇష్యూ చెబుతున్నాను. పోయిన నెలలో సెక్షన్ 354 మీద నన్ను ఒక నాన్ బెయిల్ కేసుపై అరెస్ట్ చేయడం జరిగింది.

(అధికారపక్ష సభ్యులు అభ్యంతరాలు తెలియజేశారు)

దీనికి కారణమేమంటే ఒక పొలంలోనుంచి ఒక సిమెంట్ రోడ్డు వేస్తున్నారు. నాలుగు ఎకరాల పొలం, అది Ex military వాళ్లకు ఎప్పుడో ప్రభుత్వం పట్టా ఇచ్చింది. వాళ్లు సాగుచేసుకుంటున్న పొలంలో నుంచి ఒక సిమెంట్ రోడ్డు వేస్తున్నారు.

(అధికారపక్ష సభ్యులచే సభకు అంతరాయం)

దీనిని శంఖుస్థాపన చేసింది స్వయాన స్పీకర్ గారు. ల్యాండ్ సర్వే జరగలేదు. సర్వేయర్ కూడా రిపోర్ట్ ఇచ్చాడు. ఈ ల్యాండ్‌కు పట్టా ఉంది, వీరికి FMB లేదని, దీనిపై నేను ఎంఆర్వో దగ్గరకు వెళ్లి అడిగితే, ఎంఆర్వో గారు, ఆర్‌డీవో గారు ఇద్దరూ ఒప్పుకొని ఇది తప్పు అని చెప్పి ఆ రోడ్డు వేయడం ఆపివేశారు. నేను ఎమ్మార్వోని దూషించానని నామీద ఆయన కేసు పెట్టించారు. ఈ స్పీకర్ కుర్చీ వల్లనే నాపై కేసు పెట్టారు. ఈ స్పీకర్ అధికార దుర్వినియోగం వల్లే నా మీద కేసు పెట్టించారు. నన్ను నాన్ బెయిల్ క్రింద అరెస్ట్ చేశారు.

(ఈ సందర్భంలో అధికారపక్ష సభ్యులు శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి తన సీట్లో నుంచి లేచి నిలబడి మైక్ లేకుండా మాట్లాడుతూ 'point of order' అని అన్నారు)

చివరకు భయపడి స్టేషన్ బెయిల్ ఇచ్చి నన్ను ఇంటికి పంపించారు.

మిస్టర్ డెప్యూటి స్పీకర్ : సమయం చాలా తీసుకుంటున్నారు. ముగించండి.

డా. గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి : అధికార దుర్వినియోగం వల్ల నా నియోజకవర్గంలో నాకు అన్యాయం జరుగుతుంది.

మిస్టర్ డెప్యూటి స్పీకర్ : శ్రావణ్ కుమార్ గారూ.

(ఈ సమయంలో శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు గారు తాను మాట్లాడడానికి మైక్ ఇవ్వాలని గౌరవ ఉప సభాపతిని కోరసాగారు)

మిస్టర్ డెప్యూటి స్పీకర్ : ప్రత్తిపాటి పుల్లారావు గారూ.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు : అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీనివాసరెడ్డి గారు వారిపై కేసుల పెట్టారని మాట్లాడుతున్నారు. అక్కడ grievance లేనిదే కేసులు పెట్టరు. వారి ప్రభుత్వంలో ఏమీ లేకుండా నాపై అనేక కేసులు పెట్టిన దాఖలాలు ఉన్నాయి. మీరు ఆవిధంగా చర్చకు వస్తే మీ పదేళ్ల పరిపాలనలో డా. గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డిగారి గురించి చెప్పడానికి ఈ సభ సమయం సరిపోదు కొన్ని గంటలు కావాలి. నామీద మీ ప్రభుత్వంలో దర్నా చేస్తే కేసు, ఇంటి దగ్గర ఉంటే కేసు, బజారులో కనబడితే కేసు, SC Act పెట్టారు. ఏరోజు జిల్లా సమావేశాలలో మాట్లాడలేదు, ఈరోజు మాత్రం శాసనసభలో స్పీకర్ గారిపై బురద జల్లడానికి ఇవన్నీ మాట్లాడుతున్నారు. దేనిపై అవిశ్వాస తీర్మానం పెట్టారో దానిని ఇప్పుడైనా, మిమ్ములను రిక్వెస్ట్ చేస్తున్నా, స్పీకర్ గారిపై బురద జల్లే కార్యక్రమం మానుకొని సభ గౌరవంగా నడిచేదానికి సహకరించాలి. ఎందుకంటే ఈరోజు అరాచక శక్తులు, నేరగాళ్లు చట్టసభల్లోకి ప్రవేశించి సభా వాతావరణాన్ని కలుషితం చేయడం శోచనీయం. ఇవన్నీ ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోమని నేను కోరుతున్నాను. ఇప్పుడైనా ఇటువంటి ఆరోపణలు మానేసి అవాస్తవాలను మాట్లాడే కార్యక్రమాలను మానుకొని, లెంపలేసుకొని అవిశ్వాస తీర్మానాన్ని వెనక్కు తీసుకోమని నేను కోరుతున్నాను.

**03.20PM (26)**

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: కంక్లూడ్ చేయండి శ్రీనివాస రెడ్డిగారూ..

డా. గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి: అధ్యక్షా, నాకన్నా ఇవి మంత్రిగారికి బాగా తెలుసు. నా నియోజకవర్గం నర్సరావుపేట నియోజకవర్గం. సత్తెనపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతి, అరాచకత్వం మీద తప్పకుండా ఎంక్వైరీ చెయ్యండి. స్పీకర్‌గారి అండదండలు చూసుకుని స్పీకర్‌గారి కుమారుడు, కూతురు చేస్తున్న అవినీతి, అరాచకత్వం ఈ అధికారపార్టీ యొక్క సర్వేలో కూడా ఉంది. వాళ్ల యొక్క ఇంటిలిజెన్స్ రిపోర్టులో కూడా ఉంది.

(అధికారపక్షసభ్యులచే అభ్యంతరం)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: కంక్లూడ్ చెయ్యండి.

డా. గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డిః తప్పకుండా దీనిమీద విచారణ జరిపించండి అని కోరుతున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః తెనాలి శ్రావణ్‌కుమార్ గారూ.

శ్రీ తెనాలి శ్రావణ్‌కుమార్ (తాడికొండ)ః ధన్యవాదాలు అధ్యక్షా, ఈరోజున గౌరవ శాసనసభాపతి మీద అవిశ్వాసాన్ని ప్రకటిస్తూ రూల్ 71 ప్రకారం నోటీసు ఇచ్చారు. దానిని వీళ్లు అయితే చాలా జోక్‌గా తీసుకున్నారు. ఎందుకంటే నిన్న ప్రభుత్వం మీద అవిశ్వాసం పెట్టారు. అది ఏమి జరిగిందో ప్రజలందరికీ తెలుసు. కానీ మళ్లీ వెంటనే స్పీకర్ గారి మీద అవిశ్వాసం పెట్టారు. ఇది ఎలాగూ నెగ్గదని వాళ్లకి తెలుసు. అయితే వీళ్లు జోక్‌గా తీసుకున్నా, మా గౌరవ స్పీకర్‌గారు సీరియస్‌గా తీసుకున్నారు. ఒక స్పీకర్ స్థానంలో ఉండి విశ్వాసాన్ని కోల్పోయామని ప్రతిపక్షం చెప్పినప్పుడు నేనెలాగూ ఈ సభను నిర్వర్తించాలి. ఖచ్చితంగా ఈ సభ విశ్వాసం పొందిన తరువాతే ఆ సీట్లో కూర్చొని ఇక్కడ ప్రొసీడింగ్స్ నిర్వహిస్తానని ప్రత్యేకంగా ఆయన విజ్ఞప్తి చెయ్యడం, అదేవిధంగా ఆయన నిర్ణయించుకోవడం మూలంగానే ఈరోజున ఇది వెంటనే జరపవలసిన అవసరం వచ్చింది. ఎందుకంటే మరి ఆ స్థానంలో కూర్చున్న వ్యక్తి రేప్పొద్దున వీళ్లు ఏదైనా అంటే నీ మీద అవిశ్వాస తీర్మానం పెట్టాం, నువ్వు ఎలాగా మాట్లాడతావు అని అనే పరిస్థితి, అలాంటి దుశ్చర్య చేసేవాళ్లు, అలాంటి దుందుడుకు వ్యక్తులు కూడా ప్రతిపక్ష స్థానంలో ఉన్నారు. అందుకోసమే ఒక నైతిక ప్రవర్తన కలిగిన వ్యక్తిగా ఒక నేపథ్యం చూడాలి. ఒక వ్యక్తిని ఈరోజున మనం జడ్జ్ చేస్తున్నామంటే, లేకపోతే ఆ వ్యక్తి గురించి మాట్లాడుతున్నామంటే, ఆ వ్యక్తి యొక్క ప్రవర్తన ఈరకంగా ఉందంటే, కారణం మొదటి నుంచి అతని బిహేవియర్. ఆ బిహేవియర్ ఎలా ఉందని తెలుసుకోవాలంటే డాక్టర్ ప్రవృత్తిలో ఉన్న వ్యక్తి రాజకీయ నాయకుడిగా ఉన్నా, ఎంఎల్ఏగా ఉన్నా, మంత్రిగా ఉన్నా, ఈరోజు స్పీకర్‌గా ఉన్నా ఖచ్చితంగా మళ్లీ హాస్పిటల్‌కి వెళ్లి అవసరమైనప్పుడు ఆయన ఆ వృత్తిని చేపట్టి ప్రజల ప్రాణాలు కాపాడడానికి ప్రయారిటీ ఇచ్చే వ్యక్తి స్పీకర్ గారు. అలాంటి స్పీకర్ గారిపై ఇలాంటి చర్యలు ఏవైతే ఉన్నాయో, వీళ్లు చెబుతున్న ఆరోపణలు ఏవైతే ఉన్నాయో ఆ ఆరోపణలకి ఆస్కారం, అవకాశం లేదు. అందుచేత నైతికత కల్గిన వ్యక్తి గనుక ఆ నైతిక ప్రవర్తనకి వ్యతిరేకంగా ఆ సీట్లో నేను కూర్చోకూడదు తిరిగి విశ్వాసం పొందిన తరువాతే ఆ సీట్లో కూర్చుంటానని ఆయన అనబట్టే ఈరోజున ఈరకమైన చర్చ వచ్చింది.

అయితే మనం కొత్తగా శాసనసభకి వచ్చాం. ముఖ్యంగా చాలామంది ఉన్నారు. ఆయన చేసిన అనేక కార్యక్రమాలని ఎందుకు మర్చిపోతున్నారు? మొట్టమొదటగా మనం శాసనసభకు వచ్చినపుడు ఈసభలో ఎలా ఎంటర్ అవ్వాలో, ఎలా లేచి మాట్లాడాలో, ఏమి మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో తెలియని పరిస్థితుల్లో మా సభ్యులందరికీ ఒక ట్రైనింగ్ ప్రోగ్రామ్ పెట్టి ఈ దేశంలోనే అత్యున్నతంగా ఉన్న లోక్‌సభ స్పీకర్‌గారిని తీసుకువచ్చి, ఆ స్పీకర్‌గారితోపాటు పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో గొప్ప స్థానంలో ఉన్న వెంకయ్యనాయుడుగారిని తీసుకువచ్చి అటు సభ్యులకి,

మా సభ్యులకి ఎన్నికైన ప్రతి ఒక్కరికి కూడా ట్రైనింగ్ ఇచ్చి, ఆ ట్రైనింగ్‌లో ఏ అంశాల మీద కొత్త సభ్యులు ఎలా మాట్లాడాలి, ఏదైనా బిల్లు పెట్టేటప్పుడు ఏమి చెయ్యాలి, ఆయన అనుభవాన్ని రంగరించి మాట్లాడిన స్పీకర్‌గారు కానీ, లోకసభ స్పీకర్‌గారు కానీ, వెంకయ్యనాయుడుగారు కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు కానీ, లోక్‌సభ సెక్రటరీ జనరల్‌గా పనిచేసిన వ్యక్తులను తీసుకువచ్చి, మా అందరికీ ట్రైనింగ్ ఇచ్చి, ఈ సభను ఎలా ఉంచాలి, ఎలా నడపాలి, మీరు కూడా ఎలా ఉండాలని ఆయన ప్రయత్నం చేస్తే ఒక స్పీకర్‌గా ఆయన చేసిన విధానం తప్పా? ఆ సెమినార్‌కు ప్రతిపక్షసభ్యులుగా మీరు రాలేదా? గౌరవ ప్రతిపక్షనాయకుడు రాలేదు. అందుకే తెలియట్లేదు ఆయనకి. ఏమి చెయ్యాలో అర్థం కావట్లేదు. అర్థం కాని ఈ పరిస్థితుల్లో ఆయన సభ్యులకి ఆయన డైరక్షన్ ఇవ్వలేకపోతున్నారు.(బెల్)

మొట్టమొదటిది as a Speaker ఆయన చేసిన మొట్టమొదటి కార్యక్రమం శాసనసభ్యులకు సెమినార్ నిర్వహించటం. అదేవిధంగా మీరు ఒకసారి చూడండి. 18 కమిటీలన్నింటినీ వేసి, ఆ 18 కమిటీలకి పూర్తి స్థాయి అవకాశాలు ఇచ్చి వారందరితో సమావేశాలు పెట్టించి ఆ సమావేశాల ద్వారా కొత్త కొత్త విషయాలన్నింటినీ, మా అందరినీ పిలిచి వీరు ఎక్కడికి వెళ్లినా ఈ సమావేశాలను నిర్వహించి డిపార్ట్‌మెంట్‌లన్నింటినీ కూడా, మరి డిపార్ట్‌మెంట్లో జరుగుతున్న విషయాలన్నింటినీ సంగ్రహించి అవకాశాలు వెంట వెంటనే కల్పించినది స్పీకర్ గారు. ఇదొకటి గుర్తుపెట్టుకోవాలి.

అంతేకాదు సి.పి.ఎ(కామన్‌వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్) మీటింగ్స్‌కి, ఆ మీటింగుకి కేమ్‌రూన్ వెళ్లి ఈ స్పీకర్స్ వ్యవస్థ యొక్క ఔన్నత్యాన్ని ఏరకంగా కాపాడాలి అని అంతర్జాతీయ స్థాయిలో ఈ అంశాలన్నిటి మీద కూడా ఆయన నేర్చుకోవడమే కాకుండా, కొత్త సభ్యులమైన మాలాంటి వాళ్లని కూడా గోవాకి తీసుకువెళ్లి చెప్పిన సంగతి మర్చిపోతున్నారా ఈ సభ్యులు. అంతేకాదు అదే సమావేశాన్ని మనకి వైజాగ్‌లో పార్లమెంట్ అండ్ మీడియా లా కాన్ఫరెన్స్ పెట్టి తేదిః 07-04-2015 నుంచి 10-04-2015 వరకూ వైజాగ్‌లో ఈ కాన్ఫరెన్స్ నిర్వహించి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం యొక్క ఔనత్యాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన స్పీకర్‌గారి గురించా వీళ్లు అవిశ్వాసం పెట్టింది? ఆలోచించాలి. ఏదో మేము మాట్లాడతాం, మా మాటలన్నింటినీ కూడా ఇక్కడ ఒప్పుకోవాలి అంటే ఎలా కుదురుతుంది? అదే నేను అడుగుతున్నా. ఇటీవల కాలంలో గౌరవసభ్యురాలు శ్రీమతి వి. అనితగారి గురించి మాట్లాడిన మాటల గురించి ఒక కమిటీ వేస్తే, ఆ కమిటీలో కూడా మనం చర్చించడం జరిగింది. అది ఒకసారి గుర్తుచేస్తున్నాను. రూల్ నెం.31 ప్రకారం సభ్యులు చదివి వినిపించమంటే వినిపిస్తాను. నా దగ్గర రూల్ బుక్ ఉంది. ఈ రూల్ నెం.31 ప్రకారం వైఎస్సార్ పార్టీకి చెందిన సభ్యుల యొక్క ప్రవర్తన ఏ ఒక్కటైనా ఉందా? నిజంగా స్పీకర్‌గారు చర్య తీసుకోవాలని ఆలోచించినట్లైతే, పక్షపాతంగా వ్యవహరించినట్లైతే, ఇంతమంది అసలు మాట్లాడడానికి గానీ, సభ్యులుగా కొనసాగడానికి గానీ అవకాశం ఉంటుందా? రూల్ నెం.31 చదివి వినిపించమంటారా? మీరు

బ్యానర్లు పెడతారు. ఎక్కడపడితే అక్కడ నిల్చుంటారు. ఇంకొక సభ్యుడికి ఎదురుగా నిల్చుని మాట్లాడతారు. స్పీకర్ స్థానానికి వెనుక తిరిగి నిల్చుంటారు. మీరు ఇచ్చే స్లోగన్స్, మీరు తీసుకువచ్చే బ్యానర్స్ ఇవన్నీ కూడా సభలో ఎలా చేయబడతాయనుకుంటున్నారా? మరి ఎందుకు పెడుతున్నారు? ఏ రకంగా కూడా ఒక నైతిక ప్రవర్తన లేకుండా నియమావళి తెలియకుండా, నియమావళి పాటించకుండా చేస్తున్నారు. అయినా కూడా కొత్తగా వచ్చారు. మీరు నేర్చుకోవాలని ఇంకా అవకాశాలు ఇస్తున్నారు. అంతేకాదు వీళ్ల గొడవ ఎక్కువైపోయి స్పీకర్‌గారు ఒక ప్రతిపాదన తీసుకువచ్చారు. ఎప్పుడూ కూడా ముందుకు వచ్చి మనం అనుకునేవాళ్లం. కొత్తగా వచ్చిన మేము ఈరోజు సభ ఇంకొక అరగంటలో అయిపోతుంది. ఖచ్చితంగా ఈయన ఇవ్వడు అని చెప్పి ఆలోచిస్తే ఆయన ఏమి చేశారు? రిఫామ్స్ తీసుకువచ్చారు. ఈరోజు ఏడవసారి సమావేశం అవుతున్న ఈసభలో సజావుగా ప్రశ్నలు వస్తున్నాయంటే, జీరో అవర్ వస్తుందంటే ఆయన ప్రపోజ్ చేసిన విధానం మూలంగానే కదా. ఈరోజు ప్రజా సమస్యలన్నింటినీ మీరు కానీ, మేము కానీ ఈ సభలో చెప్పగలుగుతున్నామంటే, ఈ సభలోకి తీసుకువచ్చి మాట్లాడగలుగుతున్నామంటే, మంత్రులతో సమాధానం చెప్పించుకోగలుగుతున్నామంటే.. ఇంతకు ముందు లేదు కదా ఈ సంప్రదాయం? ఇంతకు ముందు ఉందా? లేదు. కొత్తగా, జీరో అవర్‌లో, కొత్తగా గెలిచిన వారికి, అధికారపక్షానికి, ప్రతిపక్షానికి సమానంగా అవకాశాలు ఇస్తూ ఏ అంశాల మీద ప్రాధాన్యత ఉందో, ఆ అంశాలన్నిటి గురించి ఇంత స్పష్టంగా, చక్కగా అవకాశాలు ఇస్తున్న స్పీకర్‌గారి మీద అవిశ్వాస తీర్మానాన్ని ఏరకంగా పెట్టారో నాకు అర్థం కావడం లేదు. కాబట్టి ఇది చాలా అన్యాయం. చాలా దురదృ ష్టకరం.

తమ దృష్టికి ఆఖరుగా స్పీకర్‌గారు చేసిన నైతిక ప్రవర్తన గురించి తిరుపతిలో మీటింగు పెట్టి అందరినీ పిలిచారు. హైదరాబాదులో మీటింగు, ఆరోజు మీరు కూడా ఉన్నారు, నేనూ ఉన్నాను. అలాగే మొన్న వైజాగ్‌లో మీటింగు పెట్టారు. సభ్యులు ఏరకమైన ప్రవర్తన కలిగి ఉండాలి. గౌరవ సభ్యులు ఈ సభ యొక్క హుందాతనాన్ని పెంపొందించేలాగా ఉండాలని, ఆయన మనల్నే కాకుండా, న్యాయవ్యవస్థలో పనిచేసి రిటైర్ అయిన అనుభవజ్ఞులనే కాకుండా, నైతిక ప్రవర్తన కోసం అనేక walks of life లో ఉన్నత స్థానానికి ఎదిగిన వ్యక్తులందరినీ పిలిపించి అభిప్రాయాలు సేకరించి వీటన్నిటిపైన ఒకరోజు చర్చపెట్టాలని ఒక ఆలోచన చేస్తున్న స్పీకర్‌గారి మీద అవిశ్వాసతీర్మానం పెట్టడం దురదృష్టకరం. (బెల్) ఆ పెట్టిన తీర్మానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తూ ఈ సభ్యులందరూ కూడా ఆయన ప్రజాస్వామ్య వ్యవస్థని కాపాడడానికి చేస్తున్న ప్రతీ ఒక్క ప్రయత్నానికి మా మద్దతు ఉంటుందని చెప్పి ప్రత్యేకంగా తెలియజేసుకుంటూ, దీనిని ప్రత్యేకంగా వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేస్తూ నేను సెలవు తీసుకుంటున్నాను. ధన్యవాదాలు.

**మ.3.30 (27)**

శ్రీ పి.విష్ణుకుమార్ రాజు (విశాఖపట్నం నార్త్)ః అధ్యక్షా, మొన్న అవకాశం రాలేదు. అది కూడా ప్రతిపక్షం మూలాన. నిన్న అవకాశం రాలేదు. అది కూడా ప్రతిపక్షం మూలాన. ఇవాళ భోజనం మానివేసి స్పీకర్ గారి గురించి మాట్లాడే దానికి అవకాశం గురించి భోజనానికి కూడా వెళ్లలేదు. అంటే దానిని బట్టి మీరు ఆలోచించండి  మన స్పీకర్ గారంటే ఎంత గౌరవం ఉందో. ఇది ఒక ఉదాహరణ. లేకపోతే ఇంత పర్సనాలిటితోటి, భోజనం చేయలేదని మా మంత్రివర్యులకు కూడా చెప్పాను. ఆయన మూడు రోజుల వరకూ పరవాలేదని చెప్పారు.

ప్రతిపక్ష నేత ప్రతిపాదించిన తీర్మానం మీద ఈరోజే చర్చకు తీసుకురావడం అనేది అభినందదాయకం.

(ఆ సందర్భంలో కొంతమంది వైఎస్సార్ సీపీ సభ్యులు "అబ్బా" అని అన్నారు.)

ఈ 14రోజుల్లో ఎన్నో రూలింగ్స్ పెట్టేదానికి అవకాశం ఉంది. కానీ, రూలింగ్స్ ఏదైనా ఇస్తే, ప్రతిపక్షం  మీ మీద అవిశ్వాసం పెట్టినప్పటికి  కూడా మీరు రూలింగ్ ఇచ్చారని, అటువంటి నిందలు రాకుండా ఉండడం గురించి, స్పీకర్‌గారు నిజంగా ఈ తీర్మానాన్ని ఈరోజే తీసుకోవడం, దానిని స్వాగతించడం కూడా అభినందించవలసిన విషయం. ముందుగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిగారు ఇందాక మాట్లాడిన  మాటల్లో  డెమోక్రసీ గురించి మాట్లాడారు. డెమోక్రసి గురించి మాట్లాడినప్పుడు, ఒకసారి  పండిత జవహర్‌లాల్ నెహ్రూ గారు చెప్పినది ఒకసారి కోట్ చేస్తాను.

"Democracy does not mean simply shouting loudly, and persistently though, that might have occasionally some value freedom and democracy requires responsibility,  certain standards of behavior and self discipline".

దీనిని మనం ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన  అవసరముంది.  ప్రతిపక్షంలో ఉన్నవారికి ఒకసారి ఎక్కువగా చేసుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే అధికార పక్షంలో ఉన్నవారికి కొంతమందికి ముగ్గురు, నలుగురికి వారు కూడా ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉంది. మేము వాస్తవాలు మాట్లాడతాం. వాస్తవాలు మాట్లాడితే ప్రతిపక్షం అంటారు. ఇంకొక ప్రతిపక్షం మాట్లాడిన దానికి విమర్శిస్తే అటుపక్క అంటారు. అదే సార్ జరుగుతున్నది. ఇందాక జగన్మోహన్ రెడ్డిగారు చెప్పారు. ప్రతిపక్ష నేత మీరంతా ఒక పార్టీ అని చెప్పారు. ఏదిఏమైనప్పటికీ ఈ రోజు మనం గౌరవ స్పీకర్‌గారి మీద ఇటువంటిది చేయడం అనేది చాలా దురదృష్టం. ఎందుచేత అంటే, Conduct of Legislature  గురించి ఒకసారి మాట్లడవలసిన అవసరం ఉంది. ఇవి నా సొంత మాటలు కాదు. అంత విజ్ఞానం నాకు లేదు. ఇది కూడా జిఎంసీ బాలయోగి గారు చెప్పిన మాటలు.  ఈ సందర్భంగా మనం ప్రస్తావించవలసిన అవసరం ఎంతైనా ఉంది. వారు చెప్పింది ఏమిటంటేః

"In order to maintain high traditions in Parliamentary life, Legislators are expected to observe certain standards of Conduct, both inside the House and outside".

ఏమిటని కొంతమంది అడుగుతున్నారు. అది వారు ఇంగ్లీషులో క్లియర్‌గా అర్థమయ్యేటట్లు చెప్పారు. తెలుగులో చెప్పాలంటే, నాకు సమయం తక్కువ వస్తుంది.

(ఆ సందర్భంలో కొంతమంది వైఎస్సార్ సీపీ సభ్యులు "ఏమిటి" అని, "చెప్పండీ " అని అన్నారు)

(ఆ సందర్భంలో కొంతమంది అధికార పక్ష సభ్యులు "ముందుకు వెళ్లండీ " అని అన్నారు)

ఒకరు ముందుకు వెళ్లమని చెబుతారు. ఒకరు వెనక్కి లాగుతారు. అదీ పరిస్థితి. ఏమైనా కూడా స్పీకర్ గారు ఎంపిక సమయంలో జగన్మోహన్ రెడ్డిగారు చెప్పిన వాక్యాలు కూడా ఒకసారి ప్రస్తావించవలసిన అవసరం ఉంది. వారు ఏమి అన్నారంటే; ఇది కూడా వైఎస్ జగన్మోహన్ రెడ్డిగారు ప్రతిపక్ష నేత అన్నారు.

"అపార రాజకీయ అనుభవం, చట్ట సభల్లో వివిధ పదవుల నిర్వహణలో సుదీర్ఘ అనుభవం ఉన్న మీ లాంటి వారిని స్పీకరు పదవికి ప్రతిపాదించాలన్నప్పుడు మేము ఒక్క నిమిషం కూడా సంశయించకుండా సంతకం పెట్టి ఏకగ్రీవ ఎన్నికకు సహకరించాం. ప్రజాస్వామ్యం అనేది బండి అయితే దానికి అధికార పక్షం ఒక చక్రం, ప్రతిపక్షం మరొక చక్రం. స్పీకర్ ఇరుసు లాంటి వారు. మీరు అట్లా ఉంటారన్న విశ్వాసం మాకు ఉందని చెప్పి జూన్ 20వ తారీఖు 2014లో వారు చెప్పిన మాట".

(ఆ సందర్భంలో కొంతమంది వైఎస్సార్ సీపీ సభ్యులు "మోసపోయాం" అని, "విశ్వాసం లేదు" అని అన్నారు)

వారు చెప్పిన తరువాత జగన్మోహన్‌రెడ్డిగారు జనరల్‌గా మాట ఇస్తే తప్పము, మడమ వెనక్కి తిప్పము అని ఒక స్లోగాన్ నానుడిలో ఉంది. అవన్నీ మరిచిపోయి, ఇవాళ కేవలం ఎవరిమీదో కోపం మరేవరిమీదో చూపించే విధంగా ఉంది. వారి ఉద్దేశం ఎనిమిది మంది సభ్యుల గురించి అయితే, దానిని ఏవిధంగా roping చేయాలని చెప్పి, స్పీకర్ గారి మీద, ఇవాళ స్పీకర్‌గారిని తొలగించడం గురించి, వారు నోటీసు ఇవ్వడం జరిగింది. నిన్న ప్రభుత్వం మీద ఇచ్చారు. ఈరోజు స్పీకర్ మీద ఇచ్చారు. నాకు డౌట్ ఏమిటంటే, యనమల రామకృష్ణుడు గారు, ఆర్థిక శాఖామంత్రి మీద గారి మీద కూడా ఇస్తారేమో! ఏదైనా రూల్స్ పర్మిట్ చేస్తే ఇస్తారన్నది నా సందేహం.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: ఆర్థికశాఖామంత్రిగారూ.

శ్రీ యనమల రామకృష్ణుడు : అధ్యక్షా, వారు నా మీద గానీ, నాతోపాటు విష్ణుకుమార్ రాజుగారి పైన కూడా నోటీసు ఇస్తే, మేము ఇద్దరం తోడుగా ఉంటాం (సభలో నవ్వులు).

(ఆ సందర్భంలో కొంతమంది వైఎస్సార్ సీపీ సభ్యులు "దొందు దొందే " అని అన్నారు)

శ్రీ పి.విష్ణుకుమార్ రాజు: అధ్యక్షా, ఆయన పెద్దాయన. నేను చాలా చిన్న వాడిని. వారు ఎట్లాగో సభలో ఉండాలి. నన్ను భయటకు పంపించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఏదిఏమైనప్పటికీ ఇది ఒక అత్యున్నతమైన స్థానం. స్పీకర్ స్థానం అంటే చూసే వాళ్లకు ఎంతో గొప్పగా ఉన్నా స్పీకర్ స్థానం ఎంత కష్టమున్నది నేను అప్పుడప్పుడు అనుకుంటాను. అది ముళ్ల కిరీటం. ఒక పక్క నుంచి నార్మల్‌గా కనిపిస్తుంది. ఇందాక గౌతు శ్యాంసుందర్ శివాజి గారు చెప్పిన పరిస్థితులయితే వేరే. చాలా హుందాతనం ఉంటుంది. ఇప్పుడు ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని ఆంధ్రరాష్ట్రంలోనే కాకుండా దేశం మొత్తం మీద తెలిసిందే. ఎంతకష్టం అంటే, స్పీకర్ గారు లోపలికి వచ్చేటప్పుడు low BP Tablet వేసుకొని వస్తున్నారేమో అన్న అనుమానం నాకు వస్తుంది. ఆయన డాక్టరు గారు కాబట్టి, బీపీ తగ్గించుకొని వస్తే ఇక్కడ బీపీ raise చేసినప్పుడు ఈక్వల్ కింద వచ్చేందుకు అవకాశం ఉంటుందనే వారు ట్యాబ్‌లేట్ వేసుకొని వస్తున్నారని నాకు అనుమానం. ఏదన్నా వారిని మనం ఒకసారి టెస్ట్ చేస్తే తెలుస్తుంది. స్పీకర్ గారు నార్మల్‌గా, స్పీకర్‌గారి జీవితంలో ఎంత ఇబ్బందులు పడుతున్నప్పటికీ కూడా అక్కడ ఆయన నియోజకవర్గాల్లో మనం గర్వించవలసిన విషయం ఏమిటంటే, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సులో 88గ్రామాల్లో 20వేల టాయిలెట్స్ కట్టినందుకు ఆయననూ అభినందించవలసిన విషయం. ఈ సభలో ఉన్న వారెవరైనా ఒకరు లిమ్కా బుక్‌లో రికార్డ్స్‌లోకి ఎక్కారా అని మీ ద్వారా నేను అడుగుతున్నాను. అటువంటి వారి పైన మీరు తొలగండీ అని చెప్పడం అనేది ఎంత వివేకం అన్నది ఒకసారి మీరు ఆలోచించవలసిందిగా మీ ద్వారా ప్రతిపక్ష సభ్యులను కోరుతున్నాను.

అట్లాగే, స్పీకరుగారికి చిన్నపిల్లలు, అబ్బాయిలు, అమ్మాయిలు, స్కూల్ స్టూడెంట్స్ అంటే ఎంతో ప్రేమతోటి 392 స్కూల్స్‌లో 781 సపరేట్ టాయిలెట్ బ్లాక్స్ కట్టించిన ఘనత స్పీకర్ గారిది. అట్లాగే, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులకు సంబంధించిన విషయం 267 hand wash stations 150 స్కూల్స్‌లో ఆయన పెట్టించడం జరిగింది. ఇదికాకుండా, ఎవ్వరూ ఇక్కడ శాశ్వతం కాదని తెలిసి, కొన్ని సంవత్సరాలకు ప్రతివారు మరణించక తప్పదు కాబట్టి కనీసం పోయేటప్పుడైన ఎవరైనా సరే చాలా గౌరవంగా ఉండాలనే ఉద్దేశంతోటి 392 శ్మశానవాటికలను శుభ్రంగా తయారు చేయించిన ఘనత ఆ స్పీకరు గారిది. అటువంటి స్పీకర్ గారి మీద ప్రతిపక్షం ఎందుకు అట్లా చేస్తుందనేది చాలా బాధతో నా మనస్సు ఉంది. ఇప్పుడు డాక్టర్ కోడెల శివప్రసాద్ సార్ ఆంధ్రరాష్ట్రానికి స్పీకర్ అయినప్పుడు ఎంతో సంతోషించాం. ఇప్పుడు కూడా సంతోషిస్తున్నాం. కానీ, ఆయన ఎంతోమందికి అజాత శత్రువుగా ఉండి, అజాత శత్రువుగా

శాసనసభను నడిపిస్తూ అందరి ప్రశంసలు పొందుతున్నప్పటికీ కూడా ఆయన మీద ప్రతిపక్షం వారు ఎందుకు ఇటువంటి తీర్మానం పెట్టారో? ఏదో ఎనిమిది మంది సభ్యుల గురించి, ఎవరిమీదో దేనిమీదో కోపంతోటి దీని మీద వేయడం సభ్యత కాదని చెప్పి మీ ద్వారా ప్రతిపక్షానికి ఒక సారి తెలియజేసుకుంటున్నాను.

**మ.3.40 (28)**

అట్లాగే స్పీకర్ గారికి సుదీర్ఘకాలం శాసనసభ్యునిగా, మంత్రిగా పనిచేసిన అపారమైన అనుభవముంది. ఎవరిపైనా రాగద్వేషాలు, ప్రాధాన్యతలు లేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్న వ్యక్తి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసన సభకు స్పీకర్‌గా ఉండటం, ఆ స్థానంలో ఉంటూ ఈ శాసనసభకే ఒక గౌరవాన్ని తెచ్చేవిధంగా ఆయన వ్యవహరిస్తున్న పరిస్థితుల్లో ఆయనపై ప్రతిపక్షం వారు ఈ రోజు ఇచ్చిన తీర్మానం బాధాకరం. ఆనోటీసు ఎవరు ఎందుకిస్తున్నారన్నది ప్రజలందరికీ తెలుసు. ప్రజలందరూ గమనిస్తున్నారు. వాళ్ల పార్టీ వారు గాని, మిగిలిన వారు గాని గమనిస్తున్నారో లేదో నాకు తెలియదు గాని దేశం మొత్తం అందరూ గమనిస్తున్నారు. నేను ఈ తీర్మానం కారణంగా వారి మనసును ఏ మాత్రం బాధపడనివ్వకుండా కంట్రోల్ చేసుకోవాలని కోరుతున్నాను. నేను వారిని ముఖ్యంగా కోరేదేమంటే ఈ నోటీసు ఇచ్చిన వారికి క్రెడిబిలిటీ ఏముంది, కాండక్ట్ ఏముంది, కమిట్‌మెంట్ ఏముంది? వాటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని నేను వారిని కోరేదేమంటే వారి మనసులో ఏ మాత్రం బాధ పెట్టుకోకుండా అన్నీ మరచిపోయి వారు వచ్చి తమ స్థానంలో కూర్చొని మళ్లీ స్పీకర్‌గా వారి కార్యకలాపాలను నిర్వహించాలని నేను మీ ద్వారా స్పీకర్ గారిని కోరుతున్నాను. నాకు మాట్లాడడానికి అవకాశం కల్పించినందుకు మీకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డిః అధ్యక్షా, అటువైపున్న తెలుగుదేశం శాసనసభ్యులు, తెలుగుదేశంతో కలిసివున్న బీజేపీ శాసనసభ్యులు చాలా సుదీర్ఘంగా చెప్పారు.

అధ్యక్షా, ఇక్కడ నేను ఒక విషయం చెప్పాలి. విప్ జారీ చేసేందుకు మేం ఈ అవిశ్వాసం ఇచ్చామని వక్రీకరించే కార్యక్రమం జరుగుతోంది. నేను ఒకటి అడుగుతున్నాను. ఒక ప్రొసీజర్ కింద, ఆ ప్రొసీజర్‌లో భాగంగా విప్ జారీ చేయడం జరుగుతుంది. అటువంటి హక్కు, అలాంటి రైటును కాలరాసే పరిస్థితి కనిపిస్తుంటే అది ఎక్కడా అన్యాయంగా కనిపించడం లేదా అని నేను తెలుగుదేశం శాసనసభ్యులను, చంద్రబాబునాయుడుగారిని, స్పీకర్ గారిని అడుగుతున్నాను. స్పీకర్ గారిని ఎన్నుకున్న తరువాత ఆయన స్థానంలో కూర్చోబెట్టిననాడు నేనన్న మాటలను విష్ణుకుమార్ రాజు గారు ఉటంకించారు.

అవునధ్యక్షా. ఆనాడు స్పీకర్ గారి మీద నమ్మకంతో ఆయన పేరు ప్రస్తావనకు రాగానే ఒక నిమిషం కూడా ఆలోచన చేయకుండా అపోజ్ చేయలేదు. ఆయనను సాదరంగా అక్కడికి తీసుకుపోయి కూర్చోబెట్టాం. అంత రెస్పెక్ట్‌ఫుల్‌గా మేం చేస్తే, ఇవ్వాళ ఆయన తీరు చూస్తే నిజమైన స్పీకర్ ప్రవర్తనలా లేదు. ఆయన ఒక తెలుగుదేశం శాసనసభ్యునిగా అక్కడ కూర్చొని ఒక తెలుగుదేశం శాసనసభ్యునిలా ప్రవర్తించిన తీరు కనిపిస్తోంది.

అధ్యక్షా, నేనడుగుతున్నాను. వేరే పార్టీ బి.ఫామ్ మీద గెలిచిన వాళ్లను తెలుగుదేశం పార్టీ, చంద్రబాబునాయుడుగారు ప్రలోభాలు పెట్టి ఆయనకున్న అవినీతి సొమ్ముతో కొనుగోలు చేస్తుంటే వాళ్లను డిస్‌క్వాలిఫై చేయాల్సిన పరిస్థితిలో ఉండీ, వాళ్లను వెంటనే డిస్‌క్వాలిఫై చేయాల్సిన స్థానంలో ఉన్న వ్యక్తి డిస్‌క్వాలిఫికేషన్ జరగకుండా విప్ జారీ చేసే విషయంలో ఆ శాసనసభ్యులకు వెసులుబాటు కల్పించేవిధంగా ప్రవర్తించడం దారుణం కాదా అని అడుగుతున్నాను.

అధ్యక్షా, నిన్న కూడా అంతే. చంద్రబాబు నాయుడుగారి గవర్నమెంట్ మీద అవిశ్వాసం పెట్టాం. అవిశ్వాసం పెడితే స్పీకర్ అన్న వ్యక్తి న్యూట్రల్‌గా ఉండి ఫలానా డేట్‌లో టేకప్ చేస్తామని చెప్పాలి. ఆ డేట్‌నాడు విప్ జారీ చేస్తాం. ప్రతి ఎమ్మెల్యే వస్తాడు. వచ్చిన తరువాత డిబేట్ జరుగుతుంది. డిబేట్ జరిగిన తరువాత డివిజన్ జరుగుతుంది. డివిజన్ జరిగే సందర్భంలో ప్రతి ఎమ్మెల్యే ఓటువేస్తాడు. అప్పుడు ఓటు వెయ్యనివారెవరైనా ఉంటే డిస్‌క్వాలిఫై అవుతారు. చంద్రబాబునాయుడుగారు అభివృద్ధి అభివృద్ధి అంటున్నారు. అభివృద్ధిని చూసి ఆ పార్టీలోకి పోయారంటున్నారు. మరి నిజంగా అభివృద్ధిని చూసి, ఆ పార్టీలోకి పోయివుంటే అవిశ్వాస తీర్మానంపై జరిగే డివిజన్‌లో ఓటు ఎందుకు వెయ్యరని నేను అడుగుతున్నాను. ఓటు వేస్తే వాళ్లు డిస్‌క్వాలిఫై అవుతారు. డిస్‌క్వాలిఫై అయితే చంద్రబాబునాయుడుగారికి ప్రజల్లో కాన్ఫిడెన్స్ లేదు కాబట్టి మళ్లీ ఎన్నికలకు పోయే ధైర్యం లేదు కాబట్టే ఈ పరిస్థితి అధ్యక్షా.

అధ్యక్షా, అదేరకంగా, ఇదే శాసనసభలో మొట్టమొదటి స్పీకర్ అనుకుంటా.... ఒకసారి కాదు రెండుసార్లు కాదు, ఒకరు కాదు ఇద్దరు కాదు, ప్రతి రెండు మూడు నిమిషాలకు, ఐదు నిమిషాలకు అవతలి వాళ్లు ఇంటరప్షన్స్ చేస్తూనే వుంటారు. దానికి స్పీకర్‌గా ఉన్న వ్యక్తి పర్మిట్ చేస్తూనే ఉంటారు. నిన్న జరిగిందేంటంటే నా ప్రసంగానికి 48 సార్లు ఇంటరప్షన్స్ జరిగాయి. మొన్న జరిగిన ప్రసంగంలో కూడా అంతే. అదేమాదిరిగా జరుగుతోంది. అటువైపు వాళ్లు వాళ్లిష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నా నన్ను మాట్లాడనివ్వని పరిస్థితి. చివరికి రూల్స్‌ను అతిక్రమిస్తున్నారు. (అసెంబ్లీ రూల్స్ బుక్ చూపిస్తూ) ఈ రూల్స్ మనం చేసుకున్నవి. ఈ రూల్స్ అన్నవి సంప్రదాయంగా ఉన్నవి. (బెల్) అధ్యక్షా, రూల్స్ పొజిషన్‌పై నేను రూలింగ్ అడగబోతున్నా. కాబట్టి కచ్చితంగా వినాలి. రూల్ 340(2) ను అతిక్రమిస్తూ మీకు అధికారం లేకపోయినా ఆ రూల్‌ను అతిక్రమిస్తూ రోజమ్మను సంవత్సరం పాటు సస్పెండ్ చేశారు ఈ మొట్టమొదటి స్పీకర్.

అధ్యక్షా, ఇవ్వాళ కూడా ఏకంగా రూల్ నెంబర్ 71ను అతిక్రమించేవిధంగా, అధికారం లేకపోయినా రూల్ నెంబర్ 71ను సస్పెండ్ చేస్తూ, రూల్ నెంబర్ 358 ద్వారా మోషన్‌ను మూవ్ చేసి ఇవ్వాళ మళ్లీ హౌస్‌ను జరుపుతున్న పరిస్థితి. ఇక్కడ మనకు ఏవైతే రూల్స్ ఉన్నాయో అవన్నీ మన కాన్‌స్టిట్యూషన్‌నుంచి వచ్చినవి.

అధ్యక్షా, Article 179 ( c ) of the Constitution speaks about removal of the Speaker.

Article 179(c ) removal of Speaker కింద ఏమిచెబుతుందంటే....

Shall be moved unless at-least fourteen days notice has been given of the intention to move the resolution అని వెరీ వెరీ క్లియర్‌గా కాన్‌స్టిట్యూషన్ చెబుతోంది. ఆర్టికల్ 179 (C) నుంచే ఉత్పన్నమైనవే ఈ రూల్స్ ఆఫ్ ప్రొసీజర్స్.

Article 208 of the Constitution of India నుంచి ఈ రూల్స్ వస్తాయి. Article 208 ఏమి చెబుతుందంటే... The House of Legislature of a State may make Rules for regulating, subject to the provisions of the Constitution. అంటే ఆర్టికల్ 208 కూడా ఏం చెబుతుందంటే కాన్‌స్టిట్యూషన్‌కు లోబడే రూల్స్ ఉండాలనిచెబుతోంది. లీవ్ ఆఫ్ మోషన్ ఇచ్చిన తరువాత 14 రోజుల తరువాతనే చేయాలని కాన్‌స్టిట్యుషన్ చెబుతున్నప్పుడు ఇవ్వాళ కాన్‌స్టిట్యూషన్‌ను కూడా బ్రేక్ చేస్తూ ఏకంగా రూల్ నెంబర్ 71ను సస్పెండ్ చేసి ఈ రకంగా ఈ సభ జరుపుతున్నాం. ఈ రకంగా ఈ సభ జరుపుతున్నప్పుడు We request the Chair to give a Ruling. కాన్‌స్టిట్యూషన్‌కు లోబడి రూల్స్ ఉండాలి గాని వాటిని అధిగమించి మీరు ఏరకంగా చేయగలుగుతారన్న దాని మీద దయచేసి రూలింగ్ ఇవ్వాలని నేను కోరుతున్నాను.

అధ్యక్షా, ఇక కన్‌క్లూడ్ చేస్తూ ఒక విషయం చెప్పాలి. రాజకీయాలలో మనమంతా ఉన్నాం. మనమెలా ఉన్నాం, ఏం చేస్తున్నామన్నది భావితరాల వారు మనవైపు చూస్తుంటారు. మనం వాళ్లకు రోల్‌మోడల్‌గా ఉండాలి. ఇవ్వాళ సభలో జరిగిన తీరు చూస్తే రోల్‌మోడల్‌గా మనమున్నామా లేదా అన్నది మనం చూసుకోవాలి.

**మ.3.50 (29)**

మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం కాబట్టి దానిని పరిరక్షించవలసిన బాధ్యత మనమీద ఉంది. కాబట్టి మనం దానిని కాపాడుతున్నామా, లేదా అని చూడాలి. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని చట్ట సభలలో మనమే తెచ్చుకొన్నాం కాబట్టి దానిని మనం ఉల్లంఘిస్తున్నామా (లేదా)

మనం హేళన చేస్తున్నామా అని ఒక్క నిమిషం ఆలోచించాలి. రాజకీయాలలో ఉన్నప్పుడు మనకు రెండు గుణాలుండాలి. ఒకటి క్యారెక్టర్, రెండోది క్రెడిబిలిటీ. చంద్రబాబు నాయుడుగారి క్యారెక్టర్ గురించి ఇంతకు ముందే చెప్పాను. వారి క్రెడిబిలిటీ గురించి చెప్పాలంటే ఎన్నికల సమయంలో కుర్చీ కోసం అబద్ధాలు చెప్పి ఆ తరవాత పరిశీలనకోసం చేసే క్రెడిబిలిటీ చంద్రబాబు నాయుడు గారిది. వారి క్యారెక్టర్ గురించి ఇంతకు ముందే చెప్పాను. కుర్చీకోసం, అధికారంకోసం సొంత మామ ఎన్.టి.రామారావును వెన్నుపోటు పొడిచిన క్యారెక్టర్ ఆయనది. చంద్రబాబు నాయుడు గారి క్యారెక్టర్... (మైక్ కట్ చేయబడింది).

(ప్రధాన ప్రతిపక్ష సభ్యుల నుంచి అంతరాయం)

శ్రీ పల్లె రఘునాథరెడ్డిః అధ్యక్షా, జగన్మోహన్‌రెడ్డిగారికి క్రెడిబిలిటీ గురించి గానీ, విశ్వసనీయత గురించి కానీ మాట్లాడే నైతిక హక్కు ఏమాత్రం లేవు. కారణమేమంటే, గతాన్ని ఒకసారి గమనిస్తే వై.ఎస్.రాజశేఖరరెడ్డిగారికి దాదాపు రెండు సార్లు ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా, రెండుసార్లు ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ పార్టీ  అవకాశం కల్పించింది. అంతకు ముందు రాష్ట్ర మంత్రిగా కూడా పనిచేశారు. అదే విధంగా వీరి అమ్మకు కూడా శాసనసభ్యురాలిగా అవకాశం కల్పించారు. ఈయనకు పార్లమెంటు సభ్యునిగా అవకాశం కల్పించారు. కాంగ్రెస్ పార్టీ వీరికి, వీరి కుటుంబానికి ఎంతో విలువ, వెలుతురు, వెలుగు, జీవితాలను ఇచ్చింది. కానీ ముఖ్యమంత్రి పదవి ఇవ్వలేదనే విషయంలో ఆ పార్టీని వెన్నుపోటు పొడిచి, ఆ పార్టీకి పంగనామాలు పెట్టి, కొత్త పార్టీ పెట్టి, అనేకమంది శాసనసభ్యులను ఇతర పార్టీలనుంచి వారు తీసుకెళ్లినపుడు ఆనాడు పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం గుర్తుకు రాలేదా? కానీ ఈరోజు ఈయన నైతిక విలువల గురించి మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ రుణం తీర్చుకోలేని వ్యక్తి, ఈనాడు ఈ విధంగా నైతిక విలువల గురించి మాట్లాడుతున్నారు. వీరి నాన్న రాజశేఖరరెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ....... .... (మైక్ కట్ చేయబడింది).

SRI Y.S.JAGANMOHAN REDDY: Speaker Sir, we are pressing for division.

MR.DEPUTY SPEAKER: Pithani Satyanarayana garu.

శ్రీ పితాని సత్యనారాయణ (ఆచంట)ః అధ్యక్షా, ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత ప్రాధాన్యత కలిగిన స్థానం సభాధ్యక్ష స్థానం అయినపుడు సభాపతి గౌరవాన్ని, ఆ స్థానానికి ఉన్న ఉన్నత విలువలకు సంబంధించిన ప్రతిష్ఠాత్మకమైన చర్చ జరిగేటపుడు అవిశ్వాస తీర్మానం పెట్టడం బాధాకరమైన విషయం. అటువంటి చర్చా వేదికలో పాల్గొన్నపుడు, దానిమీద చర్చించి బాధపడే విధంగా మనం మాట్లాడుకోవడం సభా సంప్రదాయాలకు మంచిది కాదని చెప్పదలచుకున్నాను. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రతిపక్షంలో ఉండమని, తెలుగుదేశం పార్టీకి అధికారం అప్పగిస్తూ ప్రజలు తీర్పు ఇచ్చారు. అదే విధంగా డా.కోడెల శివప్రసాదరావుగారిని

అధ్యక్షస్థానానికి ప్రభుత్వం ప్రతిపాదించినా మీరు కూడా ముందుకు వచ్చి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు సహకరించారు.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిః (మైక్ లేకుండా) అధ్యక్షా, ఇంతకు ముందే రూలింగ్ కోసం అడిగాం.

శ్రీ పితాని సత్యనారాయణః అధ్యక్షా, గతంలో సభా సంప్రదాయాలు ఎంతో ఘోరంగా జరిగిన మాట వాస్తవం. అటువంటి సంప్రదాయాలను పాటిస్తూ వీరు చేస్తున్న అభియోగాలను కూడా సభ గమనించింది.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిః అధ్యక్షా, మేం రూల్ పొజిషన్ చెబుతూ రూలింగ్ ఇవ్వమని కోరుతున్నాం. మీరు రూలింగ్ ఇచ్చిన తర్వాతనే సభ జరగాలి. రూలింగ్ ఇచ్చిన తర్వాతనే సభ జరిపించండి.

శ్రీ పితాని సత్యనారాయణః అధ్యక్షా, ప్రధాన ప్రతిపక్షనాయకుడు రూలింగ్ గురించి ఇందాకే చెప్పడం జరిగింది. దాని మీద చర్చ అపుడే జరిగి ఉండవలసినది. ప్రత్యేకంగా రూల్ 171 కానీ, కౌల్ అండ్ షక్దర్ రూల్స్ గురించి గానీ ఇపుడు మాట్లాడడం భావ్యం కాదు. ప్రతిపక్ష నాయకుడు మాట్లాడవలసినది ఒకటే. ఈరోజు జరుగుతున్న చర్చలో భాగంగానే వారిచ్చిన ఆలోచనలోనే సభ జరిగింది. అదే విధంగా మేం మాట్లాడుతున్నప్పుడు వారు కూడా సహకరించాలని కోరుతున్నాను. ఇపుడు చర్చ ప్రధానంగా అవిశ్వాస తీర్మానం మీద జరుగుతుంది. ప్రభుత్వం మీద అవిశ్వాస తీర్మానం పెట్టడం వేరు, సభాపతిమీద అవిశ్వాస తీర్మానం పెట్టడం వేరు. ఈ సభలో నిన్న ప్రభుత్వం మీద అవిశ్వాస తీర్మానం పెట్టి రాత్రి 9.40 వరకు సభలో చర్చ జరిగింది. తెల్లవారగానే మరలా మధ్యాహ్నం 12.00 గంటలు కాకముందే సభాపతిగారి మీద అవిశ్వాస తీర్మానం పెట్టడం సభా సంప్రదాయాలకు గానీ, ప్రజాస్వామ్య విలువలు కానీ పాటించకుండా ఏ రకంగా వారు వారి పార్టీ సభ్యులను కాపాడుకోవాలా అని ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడవలసి వస్తే నిన్ననే ప్రభుత్వంపై పెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగి వీగిపోయింది. మరలా ప్రధాన ప్రతిపక్ష నాయకుడు తన పార్టీనుంచి వెళ్లిన 8మంది శాసనసభ్యులకోసం ఈరోజు సభాపతిగారిపై అవిశ్వాస తీర్మానం పెట్టడం మంచి సంప్రదాయం కాదు. ఆ విధంగా అవిశ్వాస తీర్మానాలు పెట్టడం ప్రజాస్వామ్య విలువలను కించపరచే విధంగా చేస్తూ, మీ పార్టీ సభ్యులను తెలుగుదేశం పార్టీలోకి వెళ్లకుండా చూసుకోవడంకోసం మాత్రమే చేస్తున్నారు. వారు మీ పార్టీని విడిచి ఎందుకు వెళుతున్నారో మీరు ఆత్మపరిశీలన చేసుకోండని మరోసారి కోరుతున్నాను.

ఇపుడే కాదు, గత ప్రభుత్వాలలో కూడా మేం ఉన్నాం. అపుడు కాంగ్రెస్ పార్టీ తరపున సభ్యులుగా ఉన్నాం. అపుడు కూడా టీఆర్ఎస్ పార్టీ సభ్యులు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకోసం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ విధంగా 2004లో జరిగింది, 2009లో కూడా జరిగింది. 2009–14 మధ్య కాలంలో కాంగ్రెస్ పార్టీ సభ్యులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు. ఆ విషయం వాస్తవమా, కాదా? అప్పుడు అధికారంలో ఉన్న పార్టీ నుంచి, ప్రధాన ప్రతిపక్ష పార్టీ నుంచి మీరు సభ్యులను తీసుకెళ్లిన మాట వాస్తవం. కానీ ఈరోజు చర్చించే ముందు మీరు వాటి గురించి కూడా ఆలోచించాలి. వారి స్వార్థం కోసం, వారి రాజకీయ ప్రలోభాలకోసం ఇతర పార్టీలలోకి వెళ్లినపుడు మీరు ఆ పార్టీకి సంబంధించిన నాయకుల మీద, ఆ పార్టీల మీద నిందలు వేయడం తగదు. సభ్యులు తీసుకొన్న నిర్ణయాన్ని మనం గౌరవించాలి. మీ పార్టీ మీద, మీ నాయకుడి మీద అభద్రతా భావం కలిగి తెలుగుదేశం పార్టీలోకి వచ్చారని నమ్మవలసిన పరిస్థితి అని మరొకసారి ఉద్ఘాటిస్తున్నాను. అటువంటి సందర్భాలలో మీరు మీ సభ్యులను కాపాడుకోవాలి తప్ప, సభా సంప్రదాయాలను, గౌరవ సభాపతిని కించపరచే విధంగా వారిమీద అవిశ్వాస తీర్మానం పెట్టడం సమంజసం కాదు. అధికార పార్టీ ఎప్పుడూ కూడా తన వంతు తాను చేయాలని ప్రయత్నం చేస్తుంది. ప్రతిపక్ష పార్టీ ఎపుడు కూడా ప్రజల వాణిని వినిపించాలని ప్రయత్నం చేస్తుంది. కానీ ఎప్పుడు పడితే అప్పుడు ఈ విధంగా అవిశ్వాస తీర్మానాలు పెట్టడం సరి కాదు. జగన్మోహన్‌రెడ్డిగారు ఈ సభకు కొత్తగా ఎన్నికయ్యారు. ప్రతిపక్ష నాయకుడు కాబట్టి ఈ సభా సంప్రదాయల గురించి వారికి అనుభవం ఉండి తీరాలి. ప్రధాన ప్రతిపక్ష నాయకుడు చేస్తున్న ప్రయత్నాల గురించి నేను రాకూడదని కోరుకోవడం లేదు, రావాలనే కోరుకుంటున్నాను. వారికి కొంత ట్రైనింగ్, పరిశీలనానుభవం కావాలి. సమయాన్ని బట్టి వారి ప్రవర్తనలో, ఈ సభలో ఎలా మెలగాలో తెలుసుకోవాలి.

నేను నైతిక విలువల సంఘంలో సభ్యుడిగా రాష్ట్రంలోని నాలుగు నగరాలలో పర్యటించాం. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలలో నిర్వహించిన సమావేశాలకు విశ్వవిద్యాలయాల ఆచార్యులు, పత్రికా విలేఖరులు, న్యాయవాదులు, ఆయా రంగాల ప్రముఖులు వచ్చి వారి వారి అభిప్రాయాలు చెప్పారు. ఆ తరవాత హైదరాబాదులో సీనియర్ పాత్రికేయులు, రిటైరైన న్యాయమూర్తులు, రాజకీయ మేధావులతో సమావేశం కూడా అయ్యాం. అందులో భాగంగా జరిపిన చర్యలో ఎపుడు కూడా సభాపతిపై చర్చ జరగలేదు. సభలో సభ్యులు ఎలా సంప్రదాయలు పాటించాలి అని చర్చించారు తప్ప సభాపతి మీద చర్చ జరగలేదు. సభా సంప్రదాయాలను గౌరవించడానికి సభ్యుల ప్రవర్తన మారాలని అనేకమంది సూచనలు చేశారు. సభాపతిగా ఉన్నవారికి పార్టీతో సంబంధం ఉండకూడదని సూచించారు.

**సా.4.00 (30)**

ఎవరైతే స్పీకర్‌గా ఉన్న వ్యక్తి, పార్టీలో సభ్యత్వానికి రాజీనామా చేస్తే మంచిదని కూడా సూచన చేశారు. కాదని మేము అనం. కొంత మంది పార్లమెంటులో స్పీకర్‌గా..... విప్‌గా కూడా చేసిన సంప్రదాయాలున్నాయి. సంప్రదాయకంగా ఆలోచన చేస్తే కచ్చితంగా గౌరవించడానికి ఆలోచన చేస్తామని నేను కూడా సభలో చెప్పదలచుకున్నాను. మీ అందర్నీ కోరేది ఒకటే. ఏవైతే హక్కులను సాధించుకోవాలని, మీ సభ్యులను సాధించుకోవాలని సభా సంప్రదాయాలను గానీ, స్పీకర్ గారి గౌరవాన్ని కించపరిచే విధంగా చేయడం కరెక్టు కాదు. ఈనాడు మీకు జరుగుతున్న ఏవైతే బాధలున్నాయో.... లౌక్యం..... ఇందాక శ్రీ నాదెండ్ల మనోహర్ గారి గురించి చెప్పారు. మనోహర్‌గారు మిత్రులు. మేమందరం తెలుగుదేశం పార్టీ, కాంగ్రెస్ పార్టీ, వైఎస్‌ఆర్ పార్టీతో కూడా కలిసి కూర్చున్న రోజులు ఉన్న మాట వాస్తవం. అటువంటి కార్యక్రమాల్లో లౌక్యంగా వ్యవహరించవలసిన అవసరం ఉంది. ఆనాడు తెలుగుదేశం పార్టీ కూడా లౌక్యంగానే వ్యవహారం చేసి సభాపతిని ఇరుకునపెట్టిన మాట వాస్తవం. ఈనాడు వైఎస్‌ఆర్ పార్టీ ఎందుకు వినియోగించుకోలేకపోతున్నది. స్పీకర్ గారి ఆలోచనలు తీసుకుని మీరు ఏరకంగా ప్రవర్తిస్తే మీకు టైము ఇస్తారో ప్రతిపక్ష పార్టీ ఆలోచించవలసిన పరిస్థితి కూడా ఉంది.

(ఈ సందర్భంలో శ్రీ యనమల రామకృష్ణుడు మాట్లాడేందుకు తమ స్థానం ముందు నిలబడ్డారు)

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి (మైకు లేకుండా) ః సార్, రూలింగ్ ఇవ్వండి. డివిజన్ ఓటింగ్ పెట్టండి.

(శ్రీ యనమల రామకృష్ణుడు తమ స్థానంలో కూర్చున్నారు)

అధ్యక్షా, ఈ సభలో సభా నాయకుడిగా ముఖ్యమంత్రి గారు 25 గంటల 22 నిమిషాలు సమయాన్ని తీసుకున్నారు. ప్రతిపక్ష నాయకులు జగన్మోహన్ రెడ్డి గారు 19 గంటల 56 నిమిషాలు తీసుకున్న విషయం వాస్తవం. ఆయనకు ఎక్కడ అన్యాయం జరిగిందో చెబుతున్నాను. వైఎస్‌ఆర్ పార్టీ గానీ, టిడిపి గానీ తీసుకున్న సమయాలు చూస్తే గత 7 సెషన్లలో వైఎస్‌ఆర్ పార్టీ 66 గంటల 8 నిమిషాలు తీసుకున్నది. టిడిపి నుంచి మంత్రులు, ముఖ్యమంత్రి గారు కలిపి 161 గంటల 57 నిమిషాలు తీసుకున్నారు. స్పీకర్ గారి ఔన్నత్యాన్ని తప్పుపట్టడానికి అవకాశం లేదు. గతంలో పార్లమెంటు స్పీకర్ మావలంకర్ గారు ఇచ్చిన ఒక స్పీచ్‌లో చూసినట్లైతే మనం శాసనసభలో చేసే చర్చలు ప్రజా శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని జరగాలి. నీతివంతంగా, నిజాయితీగా మనం ఏర్పరచుకున్న సంప్రదాయాలను పాటిస్తూ, ప్రజాస్వామిక విలువలను పరిగణనలోకి తీసుకుంటూ, ప్రజాస్వామ్యం మీద నమ్మకం పెరిగేలాగా సభ్యుల ప్రవర్తన ఉండాలి. సభ్యుల ప్రవర్తన ఈ విధంగా లేనప్పుడు స్పీకర్ గారు శాసనసభ శ్రేయస్సు దృష్ట్యా సభ్యుల మీద క్రమశిక్షణ చర్యలు తీసుకోవలసిన పరిస్థితి ఉండాలని నేను

కోరుకొంటున్నాను. అలా చేయకపోతే ప్రజాస్వామ్యం సంక్షోభంలో పడే ప్రమాదముందని మరొక్కసారి ఉద్ఘాటిస్తున్నాను. అంబేద్కర్ యొక్క సూచనలు కూడా ఈనాడు చెప్పదలచుకున్నాను. Debates and discussions are the hallmarks of the Democracy. Disruption, confrontation, disorder, if allows to continue unchecked, then it will destroy the Democracy అని అంబేద్కర్ గారు చెప్పారు. జగన్మోహన్‌రెడ్డిగారు అనేక సందర్భాల్లో పట్టుబట్టి సభ జరుగకుండా అనేక సార్లు చేసిన కార్యక్రమాలు చూసినట్లైతే సభను ఎలా నడపాలనేది ఆయన నేర్చుకోవాలని మీద్వారా ప్రత్యేకంగా జగన్మోహన్ రెడ్డి గారిని కోరుతున్నాను.

శ్రీ యనమల రామకృష్ణుడుః అధ్యక్షా, ప్రతిపక్ష నాయకులు గారు అడిగారు కాబట్టి I want to clarify two things. ఏ రూల్ కింద సభకు సస్పెండ్ చేసే అధికారం ఉందని అడిగారు. రూల్‌ని సస్పెండ్ చేసే పవర్ సభకుంటుంది. స్పీకర్ గారికి ఉండదు. ఎందుకంటే సభలో ఏదైనా అనుకున్నప్పుడు, ఏదైనా సమస్యలు, హర్డిల్స్ వచ్చినప్పుడు రూల్‌ని సస్పెండ్ చేసి ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఆ విధంగా మేము suspension of particular Rule to proceed ahead అనే దాని మీద మేము మూవ్ చేశాం. అందుకు స్పీకర్ గారు ఒప్పుకుని ఇచ్చారు. తరువాత మరలా రూలింగ్ ఇవ్వాల్సిన అవసరం లేదు. రెండవది స్పీకర్ గారిచ్చిన నిర్ణయం మీద మరలా డిప్యూటీ స్పీకర్ గారు ఇవ్వడానికి లేదు. It is very clear.

ఇందాక కానిస్టిట్యూషనల్ ప్రొవిజన్స్ గురించి చెప్పారు. 14 రోజులు అనేది నోటీసు ఇవ్వడానికి తప్ప మామూలుగా ఇష్యూ టేకప్ చేయడానికి ఏ విధమైన హర్డిల్ లేదు. మేము స్పీకర్ గారికి కూడా క్లియర్‌గా చెప్పాం. స్పీకర్ గారు కూడా చూశారు. జగన్మోహన్ రెడ్డి గారు Law చదువుకున్నారో, ఏమి చదువుకున్నారో తెలియదు. ఈ ప్రొవిజన్ మాత్రం నోటీస్ ఇవ్వడానికే నోటీసుకు కనీసం 14 రోజులుండాలి. డిబేట్‌ని వెంటనే కూడా తీసుకోవచ్చు. అందువలన మేము రిక్వెస్ట్ చేశాం, తీసుకున్నారు. అది అయిపోయింది.

మూడవ ఇష్యూ ముఖ్యమంత్రి గారి గురించి చెప్పారు. ప్రతిపక్ష నాయకులు వారి తండ్రి గారు చనిపోయినప్పుడు శవాన్ని పక్కనబెట్టుకుని ఆయన పి.ఆర్.పి.ఎంఎల్ఏలతో కాంటాక్టు పెట్టుకున్నారు. ఇంతకంటే క్యారెక్టర్ ఏముంటుంది? అందుచేత దయచేసి మీరు ఓటింగ్ తీసుకోవలసిందిగా కోరుతున్నాను.

MR. DEPUTY SPEAKER: Motion of removal of Dr. Kodela Sivaprasada Rao, Hon'ble Speaker given Notice of by Sri K. Sridhar Reddy, and other Members is before the House.

Now, the Question is:

"That the Opposition expresses No-Confidence against the Speaker"

SRI Y.S. JAGAN MOHAN REDDY: Sir, we are pressing for Division Voting.

MR. DEPUTY SPEAKER: Yes, we will decide the motion by Division Vote. I request all the Members to kindly resume their respective seats.

(The House then carried out Division Voting)

(On the instructions of Hon'ble the Deputy Speaker, immediately the Division Bells were rung by the Legislature Secretariat Officials enabling the Members in the Corridors and Lobbies of the House to enter into the Chambers to take part in the Division Vote. Then the doors were closed and the physical count was taken by the Legislature Secretariat Officials.)

(The Physical Count was taken by the Legislature Secretariat officials and the information pertaining to the same was informed by the Lefgislature Secretary to the Hon'ble Deputy Speaker)

The House was decided thus;

(1) Ayes – 57,
(2) Noes – 97,
(3) Neutrals – Nil.

The Motion was negatived and the No Confidence Motion was lost.

**4.20 PM (31)**

తలుపులు తీయవలసిందిగా కోరుతున్నాను. గౌరవ శాసనసభాపతి డా.కోడెల శివప్రసాదరావు గారిని ఈ సమావేశానికి ఆహ్వానిస్తున్నాము.

**(ఈ దశలో గౌరవ సభాపతి సభలోకి ప్రవేశించి సభ్యుల హర్షధ్వానాల మధ్య సభాపతి స్థానాన్ని అధిరోహించారు)**

మిస్టర్ స్పీకర్ : నాపై విశ్వాసం ఉంచిన సభకు నా ధన్యవాదాలను తెలియజేస్తున్నాను.

(ఈ దశలో అధికార పక్ష సభ్యులు బల్లలు చరిచారు)

అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించిన ప్రతిపక్షం, ప్రతిపక్ష నాయకుడి గారికి, మీరు అవిశ్వాసం ప్రకటించినందుకు కొంచెం బాధగా ఉన్నప్పటికీ, నేను గుర్తు పెట్టుకునేది ఒక్కటే. నేను స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎంపిక కావడానికి మీరు సహకరించిన తీరుకు  అప్పుడు ఇప్పుడు I am always thankful to that, ఈ అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించినప్పుడు ప్రతిపక్షసభ్యులు చాలా మంది నన్ను కలిసారు. ఎప్పుడు చర్చకు తీసుకుంటున్నారని అడిగినప్పుడు, నా మీద ఒక్కసారి పక్షపాతి అనే ముద్ర మీరు వేసినప్పుడు, ఎక్కువ సమయం తీసుకోకుండా త్వరగా నిర్ణయించాల్సిన అవసరం ఉంది. లేకపోతే ఆ చైర్‌లో పని చేయడం కష్టంగా ఉంటుంది. కాబట్టి ప్రభుత్వ నిర్ణయమైనప్పటికీ త్వరగా తీసుకోవాలనే కోరిక నాకుందనే అభిప్రాయాన్ని ఎక్స్‌ప్రెస్ చేయడం జరిగింది.  అప్పుడు గౌరవ సభ్యులు చెప్పారు. నాలుగు రోజులు ఆగితే మేము విత్‌డ్రా చేసుకునే ఆలోచన చేస్తామని చెప్పారు. మీరు ఏం చేసినా ఆ ప్రతిపాదన రాకముందు ఆలోచించుకోవాలని నేనన్నాను. ఒకసారి ప్రతిపాదన వచ్చిన తర్వాత విత్‌డ్రా చేసుకోవడం మీకూ మంచిది కాదు, మాకూ మంచిది కాదు. So, obey your Leader Orders అని చెప్పడం జరిగింది. ఆ విధంగా మీరు వెళ్లారు. It is good, whatever the decision. అయితే మీరు ఏ విధంగా ఏకగ్రీవంగా ఎంపిక కావడానికి సహకరించారో, అప్పటికీ ఇప్పటికీ నాకు తెలియక ఏదైనా పొరపాటు జరిగితే చెప్పలేను గానీ, Other wise as a speaker I do my duties to the fullest capabilities of mind. అందులో ఎటువంటి సందేహం లేదు. అది నా వృత్తి నా ప్రవృత్తి అని కూడా మీకు తెలియజేస్తున్నాను. దేనికంటే, ఈ సందర్భంగా నేను చెప్పదలచుకున్నదేమిటంటే  ఒక స్పీకర్ స్థానానికి రావడం అన్నది  అనుకోని అవకాశం నాకు. అయితే దీని వెనుక కొద్ది నిమిషాలు నా బ్యాక్ రికార్డ్ గురించి కూడా చెప్పాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే నా జీవితం వడ్డించిన విస్తరి కాదు. ఒడిదుడుకుల జీవితం అన్నమాట. ఒక గ్రామంలో ఒక మధ్యతరగతి కుటుంబం. ఉన్నత కుటుంబం అయినా అన్నదమ్ములంతా ఆస్తి పంచుకుంటే దిగువ మధ్యతరగతి కుటుంబంలాగా మిగిలిపోయి నేను చాలా కష్టాలను చూశాను. మా అమ్మా నాన్న పొలానికి పోయి సొంతంగా వ్యవసాయం చేసుకునే కుటుంబం అన్నమాట. మా ఊళ్లో రోడ్లు లేవు, తాగడానికి నీళ్లు లేవు, చదువుకోవడానికి బడి లేదు, కరెంటు లేదు, బస్సు లేదు, వైద్యం లేదు. అలాంటి గ్రామాన్ని నేను చూశాను. కాబట్టి ఏదైనా అవకాశం వస్తే గ్రామాలను అభివృద్ధి చేయాలనేది, చిన్నప్పుడు పడిన బాధల నుంచి పుట్టిన ఆలోచన. మేం చిన్నప్పుడు  పడిన బాధలు తర్వాత జనరేషన్స్ పడకూడదనేది నా ఆకాంక్ష. అదేవిధంగా ఆ గ్రామాల్లో వైద్యం లేక నాకు టైఫాయిడ్ వస్తే వైద్యం ఏంటంటే 30 లంఖణాలు పెట్టడం, కషాయం త్రాగించడం, నేను చూసినటువంటి వైద్యం ఇది. కాబట్టి డాక్టర్ కావాలనేది చిన్నప్పటి నుంచి నా కోరిక. దానికి బలమైన ముద్ర ఎట్లా పడిందంటే, నేను మా కుటుంబంలో పెద్ద పిల్లవాడిని, నా తర్వాత ఇద్దరు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. ఆ రోజుల్లో స్మాల్‌పాక్స్ చాలా పిడుగులాగా ఉండేది.  వ్యాక్సినేషన్ వేయడానికి టీమ్స్ ఎవరైనా మా ఊరొస్తే మేమంతా పొలాల్లోకి పోయి దాక్కునే వాళ్లం. ఎందుకంటే సక్సెస్‌ఫుల్ వ్యాక్సినేషన్ అంటే మూడు రోజులపాటు జ్వరం, నొప్పులు, బాధలు ఉంటాయి. ఆలా వెళ్లినందు వల్ల స్మాల్‌పాక్స్‌తో కేవలం

ఒక్క వారం రోజుల సమయంలో ఇద్దరు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెళ్లను నేను పోగొట్టుకున్నాను. ఇప్పటికీ ఆ దృశ్యం నా కళ్లముందు కనిపిస్తుంది. ఇద్దరు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెళ్ళు, నలుగురిని ఒక్క వారం రోజుల్లో పోగొట్టుకుంటే ఆ బాధేంటో పడినవాళ్లకే తెలుస్తుంది. అది డాక్టర్ కావాలనే ఒక ప్రగాఢమైన కోరిక నాకు బలం చేకూర్చింది. అయితే ఆ రోజుల్లో చదువుకోవాలంటే అంత తేలిక కాదు. I am talking about 1950s, చదువుకోవాలంటే రెండు ఎలిమెంటరీ స్కూల్స్‌లో రెండు చోట్ల రెండు హైస్కూల్స్‌లో రెండు చోట్ల, రెండు కళాశాలు రెండు చోట్ల, మూడు మెడికల్ కళాశాలల్లో మూడు చోట్ల చదువుకుంటే గానీ నా చదువు పూర్తి కాలేదు.

**4.30 PM (32)**

అలాంటి కష్టాలు పడ్డాను నేను. కాని ఇలాంటి అవకాశం నేను ఊహించింది కాదు, ఒక విధంగా నేను అర్హుడిని కూడా కాదు. అయితే, నేను డాక్టర్ అయిన తరువాత సొంతంగా మెడికల్ ప్రాక్టీస్ పెట్టుకుని, పేదలకు వైద్య సేవ చేయాలని చేసుకునే దాంట్లో, I was very successful. 35 సంవత్సరాల పాటు మెడికల్ ప్రాక్టీస్ చేశాను. పేరు సంపాదించుకున్నాను. తృప్తి సంపాదించుకున్నాను. డబ్బు సంపాదించుకున్నాను. కష్టపడి పనిచేశాను. ఆ విధంగా రాజకీయాల్లోకి రావడం కూడా reluctant గా వచ్చాను. నేను కోరుకుని రాజకీయాల్లోకి రాలేదు. ఆరోజున అన్న ఎన్.టి.రామారావు గారు తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పుడు నాలాంటి వారిని పట్టి పట్టి పిలిచి రాజకీయాల్లోకి చేర్చారు. నేను కోరుకున్నది కాదు. తరువాత శాసనసభ్యుడిగా 35 సంవత్సరాలు గడిచింది. ప్రారంభంలో రాజకీయల్లో కూడా అనుభవం లేకపోవడం వల్ల కావచ్చు, లేదా అక్కడ పాతుకుపోయినటువంటి ఒక ఫ్యూడల్ వ్యవస్థ కావచ్చు, పోరాటం చేయాల్సి వచ్చింది. ఎన్నో కేసులు పెట్టారు. వేధింపులకు గురి కావడం జరిగింది. అయినప్పటికి కూడా వెనక్కు తిరిగి పోకుండా పార్టీ సపోర్ట్, పెద్దల సపోర్ట్ ఉండటం వల్ల ఆరోజుల్లో రాజకీయంగా రాణించగల్గాం. First time, బహుశా హిస్టరీలో నాకు తెలిసి ఎక్కడా సంఘటన జరిగినట్టుగా లేదు. 1987వ సంవత్సరంలో ఎన్.టి.రామారావు గారు, మీకు మినిస్ట్రీ ఇస్తానని పిలిస్తే, నేను వద్దని అన్నాను. నాకు అవసరం లేదని చెప్పాను. Because, పది సంవత్సరాలు మెడిసిన్ చదివాను నేను, కనీసం పది సంవత్సరాలు కూడా ప్రాక్టీస్ చేయలేదు. కాబట్టి నన్ను వదిలిపెట్టండని, ఎమ్మెల్యే అయిందే నాకు ఎక్కువ అని చెప్పడం జరిగింది. మినిస్ట్రీ ఇస్తానని మూడు సార్లు ఎన్.టి.రామారావు గారు నన్ను పిలిస్తే, మూడవ సారి పిలిచిన కారణంగా నేను కేబినెట్‌లో చేరడం జరిగింది.

అవసరం లేకపోయినప్పటికి కూడా నేను దేని కోసం ఈ విషయాలు చెబుతున్నానంటే, just I want to express my nature and my track record. ఆ విధంగా రాజకీయాల్లో ఉంటూ అనేక పోర్ట్‌ఫోలియోస్‌ను దాదాపు పన్నెండు సంవత్సరాల పాటు చేశాను. హోం మినిష్టర్‌గా చేశాను, మిగతా పోర్ట్‌ఫోలియోస్‌ను కూడా నిర్వహించాను. ఆరోజున చంద్రబాబు

నాయుడు గారి సపోర్ట్ వల్ల కావచ్చు, తెలుగుదేశం పార్టీ ఇచ్చిన సపోర్ట్ వల్ల కావచ్చు, అందరూ ఇచ్చిన సపోర్ట్‌తో ఆయా పోర్ట్‌ఫోలియోస్‌ను నిర్వహించాను. ఆ తరువాత ఇప్పుడు స్పీకర్‌గా ఉన్నాను. స్పీకర్‌గా ఉన్న నాకు ఇప్పుడు sufficient time ఉంటుంది. నాకు యాక్చువల్‌గా చట్టాలు, నిబంధనలు, రూల్స్ గురించి పెద్దగా అనుభవం, experience లేదు. ఒక common sense. ఇరవై సంవత్సరాలకు పైగా అసెంబ్లీలో ఉన్నటువంటి experience, practices, conventions తదితరవాటితో ముందుకు వెళ్తున్నాను తప్పితే వేరే కాదు. అందుకు గాను నేను స్పీకర్‌గా ఉన్నాను కాబట్టి కావల్సినంత వెసులుబాటు, free time ఉంటుంది. అందుకనే, ఈ రాజకీయాలకంటే కూడా సామాజిక సేవ పెద్దదని చెప్పి, డెవలప్‌మెంట్ ఒక ప్రక్కన ఉంచుకుని, టాయ్‌లెట్స్ నిర్మాణ కార్యక్రమాన్ని తీసుకున్నా, లేకపోతే స్కూల్ శానిటేషన్ కార్యక్రమాన్ని తీసుకున్నా, నీరు-చెట్టు కార్యక్రమాన్ని తీసుకున్నా, burial ground ఏర్పాటు వంటి కార్యక్రమాలను ఈరోజున నిర్వహిస్తున్నప్పటికీ కూడా ఒక సేవా భావంతో ముందుకుపోవడం జరుగుతోంది and what I missed in my childhood, అది లేకుండా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో కార్యక్రమాలను చేస్తున్నాను. మీరు నా మీద No Confidence Motion మూవ్ చేసినందుకు ఏమి బాధ లేదు కానీ, it reminds me again of my duties. తప్పకుండా నాకు చేతనైనంత వరకు ఈ హౌస్‌లో నిష్పక్షపాతంగా పనిచేయడానికి ప్రయత్నం చేస్తాను. అందుకు మీరు కూడా సహకరించండి. Let us run the House to the best of our ability, to the needs of the people and to the efficient presentation of our Members issues.

Thank you, very much.

(ఆ సందర్భంలో ట్రెజరీ బెంచెస్ సభ్యుల నుంచి చప్పట్లు వినిపించాయి)

Now, Leader of the House.

శ్రీ నారా చంద్రబాబు నాయుడు (కుప్పం): అధ్యక్షా, కొంత బాధ ఉన్నా, ప్రజాస్వామ్యంలో ఇదొక ప్రక్రియ. మీ రాజకీయ జీవితం గురించి నాకు బాగా తెలుసు. నేను 1984వ సంవత్సరం నుంచి మిమ్మల్ని చూస్తున్నాను. నమ్మిన సిద్ధాంతం కోసం నిర్మొహమాటంగా మాట్లాడే వ్యక్తి మీరు.

ఆరోజుల్లో మీరు డాక్టర్‌గా మాకు పరిచయం. ఎమ్మెల్యేగా, డాక్టర్‌గా ఉంటే, మీ హాస్పిటల్‌కు కూడా మేం వచ్చాం. అదొక ప్రజా డిస్పెన్సరీ క్రింద, పేద వాళ్ల హాస్పిటల్ క్రింద, మీరు కూడా ఒక పేదవాళ్ల డాక్టర్ క్రింద, ఆరోజున మిమ్మల్ని ప్రతి ఒక్కరూ కొనియాడే పరిస్థితి ఉండేది. ఆ తరువాత కూడా మిమ్మల్ని మేం చూశాం. ఎప్పుడు కూడా రాజకీయాలనేవి ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసం ఉపయోగించాలని అనునిత్యం మీరు ప్రయత్నం చేశారు. అపోజిషన్‌లో ఉన్నప్పుడు కూడా మిమ్మల్ని మేం చూశాం. అపోజిషన్‌లో ఉన్నప్పుడు కూడా

మీరు రైతుల సమస్యల పైన రాజీలేని పోరాటం చేయడమే గాకుండా అన్ని విధాలా వారి సంక్షేమానికి ప్రయత్నం చేశారు. మీ జీవితంలో ఒకసారి వెనక్కి తిరిగి చూస్తే, ఎప్పుడు కూడా నిస్వార్థంగా ఒకట్రెండు కార్యక్రమాలే కాదు, ఇక్కడ ఆరోజున మా అత్త గారైనటువంటి ఎన్.టి.రామారావు గారి సతీమణి క్యాన్సర్ వ్యాధి కారణంగా బాధ పడి ఆమె చనిపోయినప్పుడు, ఆమెకు ఇండియాలో ట్రీట్‌మెంట్ ఇవ్వాలంటే సరైన హాస్పిటల్ లేని కారణంగా అమెరికా దేశానికి తీసుకువెళ్లిన పరిస్థితిలో మా కుటుంబానికి ఏ విధమైన బాధ కల్గిందో, ఆ విధంగా వేరే కుటుంబానికి బాధకలగడానికి వీలు లేదు, హైదరాబాద్ నగరంలో ఒక మంచి క్యాన్సర్ హాస్పిటల్ లేదు కాబట్టి ఒక హాస్పిటల్‌ను ఎస్టాబ్లిష్ చేయాల్సినటువంటి అవసరముందని మీరు మాట్లాడినప్పుడు ఆ హాస్పిటల్ ఏర్పాటును ఒక ట్రస్ట్ క్రింద ప్రపోజ్ చేస్తే, దానికి మీరు మెయిన్ బాధ్యతను తీసుకుని ఒక బ్రహ్మాండమైన బసవ తారకం క్యాన్సర్ హాస్పిటల్‌ను ఈరోజున హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఆ హాస్పిటల్ వచ్చిందంటే, అది మీ కృషి వల్లే తప్ప మరొకటి కాదు.

(ఆ సందర్భంలో ట్రెజరీ బెంచెస్‌చ్ వైపు నుంచి చప్పట్లు వినిపించాయి)

అందుకు మీరు నిస్వార్థంగా పనిచేశారు. ఆ హాస్పిటల్ ఏర్పాటు వల్ల మీకు లాభం రాలేదు గానీ కొన్ని లక్షల మంది ఎవరైతే క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారో, అటువంటి వారికి తక్కువ ఖర్చుతో ట్రీట్‌మెంట్ లభించే పరిస్థితి వచ్చింది. ఆ తరువాత మొన్న మీరు స్పీకర్ అయిన తరువాత చూశాం. ఎవరైతే రాష్ట్రంలో ఆడపిల్లలు బాధపడుతున్నారో, వారందరి కోసం మరుగుదొడ్ల నిర్మాణం కోసం మీరు చేసే ప్రయత్నం చరిత్రలో చిరస్థాయిగా మిగిలిపోతుంది. విష్ణుకుమార్ రాజు గారు ఇందాక చెప్పారు. మీరు సత్తెనపల్లి నియోజకవర్గాన్ని ఒక స్ఫూర్తిగా తీసుకున్నారు. ఆ స్ఫూర్తిని తీసుకుని అన్ని గ్రామాల్లో O.D.F. గ్రామాలుగా రాష్ట్రంలో ఇంత పెద్ద యెత్తున కార్యక్రమాలను చేపట్టిన ఒకే ఒక వ్యక్తి స్పీకర్ గారు.

(ఆ సందర్భంలో ట్రెజరీ బెంచెస్ వైపు నుంచి చప్పట్లు వినిపించాయి)

అలాంటి వినూత్నమైన కార్యక్రమాలను మీరు చేశారు. అదే విధంగా స్కూల్స్‌లో మరుగుదొడ్లు లేవని విద్యార్థులు బాధపడుతుంటే, ఆ మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని మీ నియోజకవర్గం మొత్తం చాలా బాగా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రక్క నియోజకవర్గాల్లో కూడా మీరు అటువంటి కార్యక్రమాలను నిర్వహించారు. అదే విధంగా మనుషులు చనిపోయిన తరువాత, ప్రస్తుతం అందరం, మనుషులు బతికుండగానే జీవితం గురించి ఆలోచిస్తున్నాం గానీ మనిషి చనిపోయిన తరువాత కూడా గౌరవంగా చనిపోవాలనే ఉద్దేశంతో మీరు గ్రామాల్లో స్మశాన వాటికను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. అది కూడా అన్ని మతాలకు అనుకూలంగా, ఒక కులానికి అని కాదు, హిందువులకు, ముస్లిమ్‌లకు, క్రిస్టియన్స్‌కు మొత్తం అన్ని మతాలకు కూడా మీరు స్మశాన వాటికలను ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఒక వినూత్నమైన పద్ధతిలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో స్మశాన వాటికలను ఏర్పాటు చేయాలని మీరు తీసుకున్న నిర్ణయం చరిత్రలో ఎప్పుడు కూడా చిరస్థాయిలో మిగిలిపోతుంది.

ఇదే కాదు, ఈరోజున మీరు చూస్తే "నీరు-చెట్టు" కార్యక్రమం గానీ, ఇంకో ప్రక్కన "పంట సంజీవని" క్రింద పెద్దయెత్తున ఫాం పాండ్స్ (Farm ponds) నిర్మాణం చేయడం కోసం మీరు పూనుకుని ముందుకు పోయారు. అలాంటి సమయంలో మేం కూడా ఇక్కడ హౌస్‌లో చూస్తున్నాం. ఈరోజున నేను ముఖ్యమంత్రిగా రెండు సార్లు పనిచేసి, తరువాత ప్రతిపక్షనాయకుడిగా పది సంవత్సరాల పాటు పనిచేశాను. ఆరోజున ఇక్కడున్న కొంత మంది ఎమ్మెల్యేలు రూలింగ్ పార్టీలో ఉన్నారు, కొంత మంది ఎమ్మెల్యేలు ప్రతిపక్షంలో ఉన్నారు. నాకు మైక్ రావాలంటే, మైక్ కోసం మా వాళ్లు పోరాడి, పోరాడి అలసిపోయిన తర్వాత ఇంక మాట్లాడలేని పరిస్థితి ఉంటే మాకు మైక్ వచ్చేది. అలాంటి పరిస్థితిని మేం చూశాం. కానీ, నేను ఈరోజున సభలో 25 గంటల పాటు మాట్లాడితే, ప్రతిపక్షనాయకుడికి కూడా మీరు 20 గంటల సమయాన్ని సభలో మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారు. వారికి ఎక్కడ అన్యాయం జరిగింది? ఏదైనా grouse ఉంటే మాకుంది. మీరు మాకు అన్యాయం చేస్తున్నారు, మా నోరు నొక్కేస్తున్నారని మా ఎమ్మెల్యేలు నాకు చెబితే, నేను వాళ్లకు ఒకే మాట చెప్పాను. స్పీకర్ స్థానంలో ఉండే వ్యక్తిని అటు ప్రతిపక్షం నిందలు మోపుతుంది. ఇటు అధికారపక్షం నుంచి కూడా ప్రెషర్ పెడతారు. కానీ, ఆయన చేయాల్సింది ఆ స్థానంలో కూర్చున్నంత వరకు ఇరుపక్షాలకు కూడా న్యాయం చేయాల్సి ఉంటుంది కనుక మీరు పరిస్థితికి అనుకూలంగా సర్దుకుపోవాలని చెప్పి చాలా సార్లు నేను మా ఎమ్మెల్యేలకు చెప్పాను. ఆ విధంగా మేం ముందుకు పోతున్నాం.

అలాంటి సమయంలో ఈరోజు ప్రతిపక్షం మీ పైన ఇలాంటి ఆరోపణలు చేసి, కొంత మంది సభ్యులైతే వాళ్ల నియోజకవర్గ సమస్యలను దీంట్లోకి తీసుకువస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. మీ నియోజకవర్గ సమస్యలను మీరే అక్కడ పరిష్కారం చేసుకోండి. అంతేగానీ, నియోజకవర్గ సమస్యలను కూడా స్పీకర్ గారి వద్దకు తీసుకురావడంచాలా బాధాకరం. ఏది ఏమైనా నేను మిమ్మల్ని ఒకటే కోరుకుంటున్నాను. మీరు ఆ సీట్లో కూర్చున్నంత వరకు నిర్మోహమాటంగా పనిచేయండి. చట్టబద్ధంగా పనిచేయండి. అందరికి కూడా ఆమోదయోగ్యంగా మీరొక రెఫరీగా ఉండి మీరు నిర్వర్తించాల్సిన బాధ్యతను నిర్వహించండి. మీరొక బాధ్యత కల్గిన స్పీకర్ స్థానంలో ఉన్నప్పుడు, వచ్చిన ఒక అవకాశంగా తీసుకుని మీరు ధర్మాన్ని, న్యాయాన్ని కాపాడడానికి ప్రయత్నం చేయండి. పూర్తిగా ఒక సభా నాయకుడిగా అన్ని విధాలుగా మీకు నేను సహకరిస్తానని మరొకసారి తెలియజేసుకుంటూ, ఈ రోజు జరిగిన సంఘటనను మీరు మనస్సులో పెట్టుకుని బాధ పడకండి. మీరు ఆ స్థానంలో ఉన్నారు కాబట్టి ఈ సమస్యలు వస్తుంటాయి. కాబట్టి ఎవరెవరు ఈ విషయంలో వాళ్ల వాళ్ల రోల్ ప్లే చేశారో వాళ్లకే వదిలిపెట్టి మీరు మాత్రం హుందాగా ఆ చైర్‌కు గౌరవం తెచ్చే విధంగా, రాబోయే రోజుల్లో కూడా హుందాగా ఈ హౌస్‌ను నడపడం కోసం అన్ని విధాలుగా మీరు ప్రయత్నం చేయాలని

కోరుకుంటూ, అలాంటి ప్రయత్నంలో భగవంతుడు కూడా మీకు అన్ని విధాలుగా సహకరించాలని మనస్ఫూర్తిగా ఆశిస్తూ మీకు మరొకసారి మా యొక్క సంఘీభావాన్ని తెలియజేస్తూ, సభా నాయకుడిగా మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని మరొకసారి తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

(ఆ సందర్భంలో ట్రెజరీ బెంచెస్ వైపు నుంచి చప్పట్లు వినిపించాయి)

MR SPEAKER: Thank you. Now, the House stands adjourned to meet tomorrow at 9.00 A.M.

(Then the House adjourned at 4.39 p.m. to meet tomorrow at 9.00 A.M. on 16th March, 2016)

* * *